www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఇల్లూ లేదు.. కారూ లేదు.. ఆస్తి 3.02 కోట్లు

అఫిడవిట్‌లో ప్రధాని మోదీ.. గంగా సప్తమి పర్వదినాన మూడోసారి వారాణసీ నుంచి నామినేషన్

బాబు, పవన్ సహా పలువురు నేతల హాజరు

నామినేషన్‌కు ముందు గంగా స్నానం చేసి

కాలభైరవుణ్ని దర్శించుకున్న ప్రధాని మోదీ

కాశీతో తన అనుబంధం అద్భుతమైనది, మాటల్లో చెప్పలేనిది అంటూ 'ఎక్స్'లో పోస్ట్

2



బుధవారం | 15-5-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 29

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి పూర్తి; నక్షత్రం: ఆశ్లేష మ. 3.25 తదుపరి మఖ; వర్జ్యం: తె. 4.49 మొదలు; దుర్ముహూర్తం: ఉ. 11.45-12.37; అమృతఘడియలు: మ. 1.39-3.25; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 5.46; సూర్యాస్తమయం: 6.36

హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



రుణమాఫీకి కార్పొరేషన్

రైతు సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తాం

దాని ద్వారా అప్పు తీసుకొని రుణమాఫీ చేస్తాం

రైతుల పంట ఉత్పత్తులు సేకరించి రేషన్ షాపుల ద్వారా పేదలకు సరఫరా

ఫోన్ ట్యాపింగ్‌పై అసెంబ్లీలోనే చెబుతాం

ఏపీలో ఎవరు ముఖ్యమంత్రి అయినా సత్సంబంధాలు పెట్టుకుంటాం

సమస్యలు శాశ్వతంగా పరిష్కరించుకుంటాం

కేంద్రపాలిత ప్రాంతం విఫల ప్రయోగం

మండలాలు, రెవెన్యూ డివిజన్ల హేతుబద్ధీకరణ చేశాకే జిల్లాలపై ఆలోచన

రాష్ట్రంలో 13 పార్లమెంటు స్థానాల్లో గెలుస్తాం

ఆరు సీట్లలో బీఆర్ఎస్ డిపాజిట్లు కోల్పోతుంది

మెదక్‌లో మాత్రమే ఆ పార్టీ పోటీ ఇస్తుంది

కంటోన్మెంట్‌లో 20 వేల మెజారిటీ వస్తుంది

మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

> మండలాలు, రెవెన్యూ డివిజన్ల హేతుబద్ధీకరణ చేయకుండా జిల్లాలను ఏర్పాటు చేసినా ఉపయోగం ఉండదు. ముందుగా మండలాలు, రెవెన్యూ డివిజన్ల రేషనలైజేషన్ చేపడతాం. కేసీఆర్ ఇష్టానుసారంగా జిల్లాలు ఏర్పాటు చేశారు. కోటి జనాభా ఉన్న హైదరాబాద్‌ను ఒక జిల్లా చేసి.. ఒకే నియోజకవర్గం ఉన్న వనపర్తినీ జిల్లా చేశారు.

9-13 సీట్లు పక్కా!

ఆత్మవిశ్వాసంతో అధికార కాంగ్రెస్

అసెంబ్లీతో పోలిస్తే మరో 4-5 శాతం ఓటింగ్ పెరుగుతుందని నేతల అంచనా

ముఖ్యనేతలతో సీఎం రేవంత్ సమీక్ష

హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతు సంక్షేమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆ కార్పొరేషన్ ద్వారా ఆదాయం చూపించి రుణం తీసుకుంటామని, దాని ద్వారానే రైతుల రుణమాఫీ అమలు చేస్తామని ప్రకటించారు. మంగళవారం తన నివాసంలో మీడియాతో ముఖ్యమంత్రి చిట్‌చాట్‌గా మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికలు రాష్ట్రంలో ముగిసినందున ఇక పరిపాలనపైనే వందశాతం దృష్టి పెడతామని, బుధవారం నుంచి సచివాలయానికి వెళతానని చెప్పారు. ముందుగా తడిసిన ధాన్యం కొనుగోలు చేయడంపై, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంపై ఫోకస్ చేస్తామన్నారు. వీటితో పాటు రైతు రుణమాఫీ అంశం, విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠ్యపుస్తకాలు, పాఠశాలల్లో సంస్కరణలు, హాస్టళ్లకు సన్నబియ్యం సరఫరా వంటి వాటిపైనా దృష్టి సారిస్తామన్నారు. పాలనలో భాగంగా ఆకస్మిక తనిఖీలు, పర్యటనలు కూడా ఉంటాయని చెప్పారు. రుణమాఫీకి సంబంధించి త్వరలోనే బ్యాంకర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేసి రైతులకు ఎంత మేరకు రుణాలు ఉన్నాయన్నది అంచనా వేస్తామన్నారు. రైతుల రుణాలను బ్యాంకుల నుంచి ప్రభుత్వం బదలాయించుకునేందుకు ఆర్‌బీఐ అంగీకరించబోదన్న మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలపై స్పందిస్తూ.. ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి లోబడి రుణం తీసుకుంటే ఆర్‌బీఐ ఎందుకు అంగీకరించదని

వచ్చే పదేళ్లూ రాష్ట్ర పాలనలోనే ఉంటా

మిగతా 13వ పేజీలో...





పులివర్తి నాని కారుపై పెద్ద సుత్తితో దాడి చేస్తున్న వైసీపీ మూకలు; అదే సుత్తితో గన్‌మన్‌పైనా దాడి

వైసీపీ విధ్వంసకాండ

ఏపీలో చంద్రగిరి టీడీపీ అభ్యర్థిపై హత్యాయత్నం

150 మంది వైసీపీ వర్గీయుల దాడి

గాయపడ్డ పులివర్తి నాని.. గన్‌మన్‌కు తీవ్ర గాయాలు

రబ్బర్ బుల్లెట్లతో గాల్లోకి బలగాల కాల్పులు, లాఠీచార్జి

తాడిపత్రి, పల్నాడులో రెండోరోజూ వైసీపీ గూండాగిరి

ఏజెంట్‌గా కూర్చున్నాడని ధర్మవరంలో దాడి

టీడీపీ అనుకూల వ్యాఖ్యలుచేసిన వృద్ధుడిని

శ్రీకాకుళంలో ఇంటికెళ్లి కొట్టిన స్థానిక వైసీపీ నేత

టీడీపీకి మద్దతు ఇచ్చాడని కౌలురైతుపై దాడి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఏపీలో పోలింగ్ ముగిసిన తర్వాత కూడా వైసీపీ మూకల దాడులు కొనసాగుతునే ఉన్నాయి. మంగళవారం చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై వైసీపీ శ్రేణులు హత్యాయత్నానికి పాల్పడ్డాయి. మధ్యాహ్నం 3 గంటల సమయంలో తిరుపతిలోని పద్మావతి మహిళా వర్సిటీ ఆవరణలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను సందర్శించి తిరిగి వెళుతున్న సమయంలో వైసీపీ వర్గీయులు ఆయనపై దాడి చేశారు. సుమారు 150మంది రాళ్లు, ఇనప రాడ్లు, సుత్తులు, కర్రలతో చేసిన దాడిలో నాని భుజానికి గాయమైంది. గాల్లోకి కాల్పులు జరిపి వైసీపీ శ్రేణులను అడ్డుకునేందుకు ఆయన గన్‌మన్ ధరణి ప్రయత్నించారు. వైసీపీ గూండాల దాడిలో ఆయన తలకు, కంటివద్ద తీవ్ర గాయాలయ్యాయి. ఆ దశలో.. స్ట్రాంగ్‌రూమ్ వద్ద కాపలా ఉన్న పోలీసు బలగాలు అక్కడకు చేరుకోవడంతో వైసీపీ వర్గీయులు పరారయ్యారు. స్ట్రాంగ్ రూమ్ వద్దే ఉన్న నాని భార్య సుధారెడ్డి దాడి గురించి పోలీసులకు, టీడీపీ శ్రేణులకు సమాచారమిచ్చారు. టీడీపీ మద్దతుదారులు సొమ్మసిల్లి పడిపోయిన నానీని వర్సిటీ మెయిన్ గేటు వెలుపల రోడ్డుపై పడుకోబెట్టి అక్కడే

మిగతా 12వ పేజీలో...

ఏపీలో రికార్డు బద్దలైంది!

81% పైగా పోలింగ్

సోమవారం అర్ధరాత్రికే 79.5 శాతంగా ప్రకటన

ఆ తర్వాతా కొనసాగింపు.. నేడు తుది ప్రకటన

2019లో 79.88 శాతం నమోదు

12



మృతి చెందిన శిశువు(ఫైల్)

వీధి కుక్క దాడిలో

5 నెలల చిన్నారి మృతి

భర్తకు మంచినీళ్లు ఇచ్చేందుకు వెళ్లి వచ్చే లోపు దారుణం

వికారాబాద్ జిల్లా తాండూరు మండలం గౌతాపూర్‌లో ఘటన

3

66.30%

పోస్టల్ బ్యాలెట్ సహా లోక్ సభ ఎన్నికల్లో పోలింగ్

ప్రత్యక్ష పోలింగ్ 65.67%.. 76.78%తో భువనగిరి టాప్

48.48 శాతంతో అట్టడుగున రాజధాని హైదరాబాద్

మొత్తం ఓటింగ్‌లో పాల్గొన్నది 2,20,24,806 మంది

అసెంబ్లీ స్థానాల ప్రకారం నర్సాపూర్ 84.25 ప్రథమం

జూన్ 4న 34 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు: సీఈవో వికాస్‌రాజ్

హైదరాబాద్, యాదాద్రి, మే 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ శాతం తుది గణాంకాలు వెల్లడయ్యాయి. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) వికాస్‌రాజ్ మంగళవారం ఈ వివరాలను వెల్లడించారు. 17 నియోజకవర్గాల్లో సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. ప్రత్యక్ష పోలింగ్ 65.67% నమోదైందని వికాస్‌రాజ్ తెలిపారు. గత లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే ఈసారి పోలింగ్ 3% పైగా పెరిగిందని, పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో కలిపి 66.3% దాటిందని వివరించారు. జూన్ 4వ తేదీన 34 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు చేపడతామన్నారు. కాగా, పోలింగ్‌లో భువనగిరి (76.78) ప్రథమ స్థానంలో నిలవగా, అత్యల్పంగా హైదరాబాద్‌లో 48.48% పోలింగ్

మిగతా 12వ పేజీలో...



అసెంబ్లీ జోరు లోక్‌సభకేదీ?

శాసనసభ ఎన్నికలతో పోలిస్తే 8.56 శాతం తగ్గిన పోలింగ్

నాడు ఉత్సాహంగా ఓటింగ్ 14

నేడు ఇంటింటి ప్రచారం అంతంతే

ఎండల తీవ్రత, విహారయాత్రలు, ఏపీ ఎన్నికల ప్రభావం కూడా..

2019 లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే 3.53% పెరుగుదల

నాడు ఓటు.. నేడు వేటు

12

షేక్‌పేట డివిజన్‌లో 3,942 మంది ఓట్లు గల్లంతు

'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో వెల్లడి

ఈసీ పరిశీలన లేకుండానే తీసేసినట్లు సందేహం

వారంలో నైరుతి!

ఈ నెల 19కల్లా అండమాన్‌ను తాకనున్న రుతుపవనాలు: ఐఎండీ

నేడు, రేపు రాష్ట్రంలో అక్కడక్కడ వర్షాలు

జైనాలో అత్యధికంగా 42.9 డిగ్రీలు



14

అన్నదాతకు అకాల వర్షాల దెబ్బ!

కోతల సమయంలో వానలు, వడగండ్లు

'తడిసి' మోపెడవుతున్న ఖర్చులు

ధాన్యాన్ని కాపాడుకోవడానికి తంటాలు



2

విమానాల్లో దొంగ!

మహిళలు, వృద్ధులను మాటల్లో పెట్టి బంగారు, వెండి నగలు దోచేస్తున్న వైనం

110 రోజుల్లో 200 విమాన ప్రయాణాలు

అతడికి ఢిల్లీలో గెస్ట్‌హౌస్, మొబైల్ షాపు

ఇంట్లో సోదాలు.. చోరీ సొత్తు స్వాధీనం

దోస్త్ షెడ్యూల్‌లో మార్పు

20 నుంచి వెబ్ ఆప్షన్ల నమోదు 3

మెడికోల్లో ప్రమాదకర మానసిక సమస్యలు

దేశవ్యాప్తంగా 37 వేల మందిలో..

హాస్టళ్లలో ర్యాగింగ్, పని ఒత్తిడితోనే

ఢిల్లీ ఎయిమ్స్ సైకియాట్రిస్ట్ వెల్లడి 14

ఐదేళ్లలో 130మంది మెడికోల ఆత్మహత్య

త్వరలో ఎస్ఎల్‌బీసీ సొరంగం తవ్వకం

నెలాఖరున పునఃప్రారంభిస్తామన్న నిర్మాణ సంస్థ

శ్రీశైలం వైపు నుంచి సీపేజీ కట్టడికి చర్యలు ముమ్మరం

నవంబరులో రెండు వైపులా ఏకకాలంలో టన్నెలింగ్

ప్రాజెక్టు పనుల కోసం ఇప్పటికే 50 కోట్లు విడుదల

త్వరలో సవరణ అంచనాలకు ప్రభుత్వ ఆమోదం

హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం తవ్వకం పనులను పునఃప్రారంభించేందుకు ముహూర్తం ఖరారైంది. ఈ నెలాఖరు నుంచి టన్నెల్ తవ్వకం చేపట్టనున్నట్లు నిర్మాణ సంస్థ ప్రకటించింది. తవ్వకానికి ప్రతిబంధకంగా ఉన్న సీపేజీ కట్టడికి జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) సహకారంతో పనులు చేపడుతున్నారు. సీపేజీ కొంత దూరం దాకా ఉంటుందని గుర్తించి, దానిని కట్టడి చేసే పనులు ప్రస్తుతం పూర్తిస్థాయిలో జరుగుతున్నాయి. సీపేజీ కట్టడి పూర్తికాగానే ఇన్‌లెట్ (శ్రీశైలం జలాశయం వైపు) నుంచి టన్నెల్

మిగతా 3వ పేజీలో...



3

'కడెం'పై సర్కారు దృష్టి

5 గేట్లకు మరమ్మతులు

నేడు ప్రాజెక్టు వద్దకు కీలక అధికారులు

గత రెండేళ్లూ భారీ వరదలకు వణికిన ప్రాజెక్టు

మొత్తం 18 గేట్లూ ఒకేసారి తెరుచుకోని వైనం

డీఎస్ఆర్‌పీ సూచనపై దృష్టిపెట్టని గత సర్కారు

కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం ఖాయం

రుణమాఫీ చేయకపోతే ఆగస్టు సంక్షోభం

అత్యుత్సాహంతో హామీలు, గ్యారెంటీలు అమలు చేయకపోతే ప్రజలే కాదు..

సొంత పార్టీ నేతలూ తిరగబడతారు: లక్ష్మణ్

రాష్ట్రంలో బీజేపీకి 12 సీట్లు పక్కా: ఈటల రాజేందర్

హైదరాబాద్, మే 14(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ విలీనం ఖాయమని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ లక్ష్మణ్ అన్నారు. పంద్రాగస్టులోగా రైతులకు రుణమాఫీ చేయకపోతే రేవంత్ ప్రభుత్వం సంక్షోభం ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో లక్ష్మణ్ మీడియాతో

మిగతా 13వ పేజీలో...

ఢిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ

తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ కలిసిపోయాయి

బీజేపీని గెలిపించడానికి శ్రమించిన రేవంత్ 13

ఆరేడు చోట్ల కాంగ్రెస్ తరఫున డమ్మీ అభ్యర్థులు

కేసీఆర్ బస్సుయాత్రతో రాజకీయాల్లో మలుపు

దేశంలో రెండు కూటములకూ మెజారిటీ రాదు

ప్రాంతీయ పార్టీలదే నిర్ణయాత్మక పాత్ర: కేటీఆర్



నాన్‌స్టిక్ పాత్రలతో ఆరోగ్యానికి ముప్పు!

సీతలు పడితే విష వాయువులు, రసాయనాలు

ఒక్కో గీత నుంచి 9100 మైక్రోప్లాస్టిక్ రేణువులు

2

వాటితో హార్మోనల్ సమస్యలు, క్యాన్సర్

మట్టి, గ్రానైట్ పాత్రలు ఉత్తమం: ఐసీఎంఆర్



అబ్ కీ బార్?

మోదీపై నిషేధం విధించాలన్న పిటిషన్ డిస్మిస్

న్యూఢిల్లీ, మే 14: ఎన్నికల ప్రచారంలో విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తున్న ప్రధాని మోదీపై అనర్హత వేటు వేయాలన్న పిటిషన్‌ను స్వీకరించడానికి మంగళవారం సుప్రీంకోర్టు నిరాకరించింది. మోదీ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారని, ఎన్నికల్లో పోటీ చేయకుండా ఆరేళ్ల పాటు నిషేధం విధించాలని కోరుతూ ఫాతిమా అనే మహిళ ఈ పిటిషన్ వేశారు. పరిశీలించిన ధర్మాసనం.. ఇలాంటి సమస్యల పరిష్కారానికి తొలుత సంబంధిత అధికార్లను ఆశ్రయించాల్సి ఉంటుందని తెలిపింది.

రాయ్‌బరేలీతో నాది కుటుంబ బంధం

» పాత ఫొటోలు చూస్తూ రాహుల్ భావోద్వేగం



న్యూఢిల్లీ, మే 14: రాయ్‌బరేలీ నియోజకవర్గంతో తనకు కుటుంబ బంధం ఉందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఈ నియోజకవర్గానికి రెండు దశాబ్దాల పాటు ఆయన తల్లి సోనియా గాంధీ ప్రాతినిధ్యం వహించగా, ప్రస్తుత ఎన్నికల్లో ఆయన పోటీ చేస్తున్నారు. మంగళవారం తల్లితో కలిసి పాత ఫొటోలు చూస్తూ భావోద్వేగానికి లోనయ్యారు. తన అనుభవాలను హిందీలో వివరిస్తూ ట్వీట్ చేశారు. ఆరు నిమిషాల నిడివిగల వీడియోను కూడా జత చేశారు. "రాయ్‌బరేలీ, అమేఠీ మాకు కేవలం నియోజకవర్గాలు మాత్రమే కాదు. మా కర్మభూమి. వీటి ప్రతి మూలలోనూ మా తరాల అనుభవాలు దాగి ఉన్నాయి. అమ్మతో కలిసి పాత ఫొటోలను చూస్తుంటే నాన్న, నానమ్మ గుర్తుకు వచ్చారు. సేవ చేయాలన్న సంప్రదాయాన్ని వారు ప్రారంభించారు. అమ్మ, నేను వాటిని కొనసాగిస్తున్నాం. ప్రేమ, నమ్మకం అన్న పునాదులతో నిర్మితమైన ఈ సంబంధం వందేళ్లనాటిది. ఈ బంధం మాకు అన్నీ ఇచ్చింది. అమేఠీ, రాయ్‌బరేలీ ఎప్పుడు పిలిచినా మేం అక్కడ వాలుతాం" అని రాహుల్ అందులో పేర్కొన్నారు.

భీమా-కోరేగావ్ కేసులో నౌలఖాకు బెయిల్

న్యూఢిల్లీ, మే 14 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రకు చెందిన భీమా- కోరేగావ్ కేసులో సామాజిక కార్యకర్త గౌతం నౌలఖాకు బెయిల్ మంజూరు చేస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. ఆయనకు గతంలో బాంబే హైకోర్టు బెయిల్ ఇవ్వగా, సుప్రీంకోర్టు దానిపై స్టే విధించి గృహ నిర్బంధానికి పరిమితం చేసింది. మంగళవారం ఆ స్టే ఉత్తర్వులను ఎత్తివేస్తూ జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిల ధర్మాసనం ఆదేశాలు ఇచ్చింది. అయితే గృహనిర్బంధ సమయంలో పోలీసులు భద్రత కల్పించినందున ఖర్చుల కింద రూ.20 లక్షల మొత్తాన్ని చెల్లించాలని సూచించింది. ఈ కేసు విచారణ పూర్తయ్యేందుకు ఏళ్లకు ఏళ్లు పడుతుందని ధర్మాసనం ఈ సందర్భంగా అభిప్రాయపడింది. నాలుగేళ్లుగా జైలులో ఉన్నా ఇంతవరకూ నౌలఖాపై ఆరోపణలే ఖరారు చేయలేదని గుర్తు చేసింది.

లాయర్లు 'వినియోగదార్ల చట్టం'లోకి రారు

న్యూఢిల్లీ, మే 14: న్యాయవాదులు..వినియోగదారుల పరిరక్షణ చట్టం-1986 పరిధిలోకి రారని మంగళవారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సరైన సేవలు అందించలేదంటూ వారిపై ఈ చట్టం కింద వినియోగదారుల ఫోరాల్లో కేసులు పెట్టలేరని తెలిపింది. న్యాయవాద వృత్తి నిరుపమానమైనదని, దాన్ని ఇతర వృత్తులతో పోల్చలేమని తెలిపింది. లాయర్లు కూడా వినియోగదారుల పరిరక్షణ చట్టం పరిధిలోకి వస్తారని, సరైన సేవలు అందించకపోతే ఫోరాలను ఆశ్రయించవచ్చని 2007లో జాతీయ వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ తీర్పు ఇచ్చింది. దీన్ని సవాలు చేస్తూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ఢిల్లీ హైకోర్టు బార్ అసోసియేషన్, బార్ ఆఫ్ ఇండియన్ లాయర్స్ సంస్థలు సుప్రీంకోర్టులో అప్పీలు చేశాయి.

సరిహద్దులో 49 పాక్ డ్రోన్ల కూల్చివేత

న్యూఢిల్లీ, మే 14: ఓ పక్క దేశంలో లోక్‌సభ ఎన్నికల హడావిడి కొనసాగుతుంటే... మరోపక్క సరిహద్దుల్లో పాకిస్థాన్ డ్రోన్ల అక్రమ చొరబాట్లు కలకలం రేపుతున్నాయి. ఎన్నికల కోడ్ అమలులోకొచ్చిన ఈ 60 రోజుల్లో భారత్-పాక్ అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఏకంగా 49 పాకిస్థాన్ డ్రోన్లను కూల్చివేసినట్లు బీఎస్ఎఫ్ వెల్లడించింది. వీటిలో అత్యధికంగా 47 డ్రోన్లు పంజాబ్ సరిహద్దులో పట్టుబడగా, రాజస్థాన్‌లోని శ్రీ గంగానగర్, బికనీర్ సెక్టార్లలో మిగతా 2 బీఎస్ఎఫ్‌కు చిక్కాయి. కాగా, బీఎస్ఎఫ్ నివేదిక ప్రకారం, 2022 జనవరి- మే మాసాల మధ్య కేవలం 6 పాకిస్థాన్ డ్రోన్లు పట్టుబడగా, 2023లో అదే వ్యవధిలో వాటి సంఖ్య 14కి చేరింది. ఇక 2024లో ఏకంగా 75కి చేరడం గమనార్హం.

పీవోకేలో ఆగని హింస.. కాల్పుల్లో ముగ్గురి మృతి

ఇస్లామాబాద్, మే 14: పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే) హింసతో అట్టుడుకిపోతోంది. భారీగా పెరిగిన ఆహార, విద్యుత్, నిత్యావసరాల ధరలను తగ్గించాలంటూ అవామీ యాక్షన్ కమిటీ చేపట్టిన ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. మంగళవారం భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో ముగ్గురు పౌరులు మృతి చెందగా, ఆరుగురు గాయపడ్డారు. ముజాఫరాబాద్‌లో జరుగుతున్న అల్లర్లను కట్టడి చేసేందుకు ప్రభుత్వం మిలటరీ దళాలను భారీగా మోహరించింది. మంగళవారం భద్రతా దళాల కాన్వాయ్ షోరన్‌దా నక్కా గ్రామాన్ని చేరుకోగానే ఆందోళనకారులు దానిపై రాళ్ల దాడి చేశారు. దాడిని నిరోధించేందుకు భద్రతా దళాలు కాల్పులు జరిపాయి. ఇదిలా ఉండగా, పీవోకేలో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పాకిస్థాన్ ప్రభుత్వం 2300 కోట్ల పాకిస్థానీ రూపాయలను విడుదల చేసింది.

హోర్డింగ్ కూలిన ఘటనలో 14కు పెరిగిన మృతులు

ముంబై, మే 14: ముంబైలో గాలి దుమారానికి 120 అడుగుల ఎత్తైన భారీ హోర్డింగ్(ప్రకటన బోర్డు) కూలిన ఘటనలో మృతుల సంఖ్య 14కు పెరిగింది. 75 మంది గాయపడ్డారు. బోర్డు కింద చిక్కుకున్నవారిని వెలికితీసేందుకు సహాయ కార్యక్రమాలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ భారీ హోర్డింగ్ పెట్రోల్ బంక్ మీద పడటంతో దానిలోని ఇనుప రాడ్లను కట్ చేయడానికి గ్యాస్ కట్టర్లను ఉపయోగించలేని పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా, ఈ భారీ హోర్డింగ్ ఏర్పాటుకై అనుమతులకు సంబంధించి రాజకీయ దుమారం రేగింది. బిల్‌బోర్డు ఏర్పాటుకు బృహణ్‌ముంబై మునిసిపల్ కార్పొరేషన్(బీఎంసీ) అనుమతి లేదని అధికారులు తెలిపారు. అయితే, కమిషనర్ ఆఫ్ రైల్వే పోలీస్‌కు బదులుగా ఓ ఏసీపీ(అడ్మిన్) నాలుగు బిల్‌బోర్డుల ఏర్పాటుకు అనుమతినిచ్చారని తెలిపారు. దీనిపై బీజేపీ మండిపడింది. బీఎంసీ ఇవ్వాల్సిన పర్మిషన్‌ను పోలీసులు ఎలా ఇస్తారని ప్రశ్నించింది. ఉద్ధవ్ సీఎంగా ఉన్న సమయంలోనే దీనికి పోలీసులు అనుమతినిచ్చారని ఆరోపించింది.

ఆంక్షలు విధించడానికి వెనుకాడబోం

» 'చాబహార్ ఒప్పందం'పై భారత్‌కు అమెరికా హెచ్చరిక

న్యూఢిల్లీ, మే 14: ఇరాన్‌లోని చాబహార్ పోర్టు నిర్వహణకు ఆ దేశంతో భారత్ ఒప్పందం కుదుర్చుకున్న కొన్ని గంటల్లోనే అమెరికా తీవ్రంగా స్పందించింది. ఇరాన్‌తో వ్యాపార లావాదేవీలు జరిపే దేశాలపై తాము ఆంక్షలు విధించడానికి వెనుకాడబోమని భారత్‌ను హెచ్చరించింది. అమెరికా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి వేదాంత్ పటేల్ మీడియాతో మాట్లాడుతూ ఈ ఒప్పందం అంశాన్ని ప్రస్తావించారు. ఇరాన్‌పై అమెరికా విధించిన ఆంక్షలు కొనసాగుతూనే ఉంటాయని పేర్కొంటూ ఆ దేశంతో వ్యాపార లావాదేవీలు జరిపే ఎవరైనా కూడా ఆంక్షల చట్రంలో పడే ప్రమాదం ఉందన్న విషయం గుర్తుంచుకోవాలని వ్యాఖ్యానించారు.

మోదీ ఆస్తి రూ.3.02 కోట్లు

సొంత ఇల్లు, కారు లేవు.. ఎన్నికల అఫిడవిట్‌లో ప్రధాని వెల్లడి

» వారాణసీ నుంచి నామినేషన్

» గంగా సప్తమి పర్వదినాన దాఖలు

» చంద్రబాబు, పవన్ సహా ఎన్డీయేకు చెందిన పలువురు నేతల హాజరు



వారాణసీ బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను సమర్పిస్తున్న మోదీ

వారాణసీ, మే 14: హిందువులు అత్యంత పవిత్రంగా భావించే గంగా సప్తమి పర్వదినాన.. ప్రధాని మోదీ వారాణసీ నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి నామినేషన్ వేశారు. అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్ సహా పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్ సహా పలువురు ఎన్డీయే కూటమి నేతలు తదితర అతిరథమహారథులు వెంటరాగా.. మంగళవారం ఉదయం ఆయన జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను సమర్పించారు. సార్వత్రిక ఎన్నికల ఆఖరి దశలో (జూన్ 1న) పోలింగ్ జరిగే నియోజకవర్గాల్లో వారాణసీ ఉంది. నామినేషన్ల దాఖలుకు ఆఖరు రోజు మంగళవారమే. గంగాదేవి భూమికి దిగివచ్చిన గంగా సప్తమి, పుష్యమి నక్షత్రం కలిసి రావడంతో.. మోదీ ఈరోజును ఎంచుకున్నారు. నామినేషన్ వేయడానికి ముందు ఆయన దశాశ్వమేధ ఘాట్‌లో గంగా స్నానం చేశారు. అక్కడ జరిగిన హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కాశీ క్షేత్రపాలకుడైన కాలభైరవుడి గుడికి వెళ్లి స్వామి దర్శనం చేసుకుని ప్రార్థనలు చేశారు. "కాశీతో నా అనుబంధం అద్భుతమైనది, విడదీయలేనిది, పోలిక లేనిది. మాటల్లో చెప్పలేనిది. మీ అందరి ఆప్యాయతతో పదేళ్లు ఎలా గడిచిపోయాయో కూడా గుర్తురావట్లేదు. ఈరోజు గంగమ్మ తల్లి నన్ను తన దత్తత తీసుకుంది" అని 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. నామినేషన్ అనంతరం నేరుగా.. కాశీలోని రుద్రాక్ష కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుని స్థానిక పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. పార్టీ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని వారికి దిశానిర్దేశం చేశారు. ప్రతి బూత్‌లోనూ.. గతంలో పోలైన ఓట్ల కంటే 370 ఓట్లు అధికంగా పోలయ్యేలా చూడాలని సూచించారు. ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో ఆయన ఈ సూచన చేసినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. నామినేషన్ దాఖలు చేసిన తర్వాత ప్రధాని మోదీ 'ఎక్స్'లో ఒక పోస్టు పెట్టారు. "ఈ చారిత్రక నియోజకవర్గం (వారాణసీ) నుంచి పోటీ చేసి గెలిచి ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం నాకు దక్కిన గౌరవం" అని పేర్కొన్నారు. కాశీ ప్రజలను తన కుటుంబసభ్యులుగా అభివర్ణించారు. "ప్రజల మద్దతుతో మూడోసారి కూడా గెలిచి.. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ఇనుమడించిన ఉత్సాహంతో కృషి చేస్తా. 'జై బాబా విశ్వనాథ్'" అని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

ఆ నలుగురూ..

2014, 2019 తరహాలోనే.. ఈసారి కూడా మోదీ నామినేషన్ వేయడానికి వేర్వేరు వర్గాలకు చెందిన నలుగురు ప్రపోజర్లను(లోక్‌సభ అభ్యర్థిగా బలపర్చేవారు) ఎంచుకున్నారు. ఆ నలుగురూ.. పండిత్ గణేశ్వర్ శాస్త్రి, బైజ్‌నాథ్ పటేల్, లాల్‌చంద్ కుశ్వాహ, సంజయ్ సోంకర్. వీరిలో పండిత్ గణేశ్వర్ శాస్త్రి ప్రముఖ జ్యోతిష్కుడు, వేదపండితుడు, న్యాయశాస్త్ర కోవిదుడు. అయోధ్య రామ మందిర శంకుస్థాపనకు, బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి ముహూర్తం పెట్టింది ఆయనే. 2022 ఫిబ్రవరిలో కాశీ విశ్వనాథ్ కారిడార్ నిర్మాణానికి కూడా ముహూర్తం పెట్టింది ఈయనే. గణేశ్వర్ శాస్త్రి తాతముత్తాతలు.. తమిళనాడులోని తిరువసనల్లూరు నుంచి ఎప్పుడో వారాణసీకి వచ్చి స్థిరపడ్డారు. మరో ప్రపోజర్.. వారాణసీ లోక్‌సభ నియోజకవర్గంలోని సేవాపురి ప్రాంతానికి చెందిన బైజ్‌నాథ్ పటేల్ ఆరెస్సెస్ కార్యకర్త. జనసంఘ్‌తో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన వ్యక్తి. ఇంకో ప్రపోజర్ లాల్‌చంద్ కుశ్వాహ(65).. ఓబీసీ వర్గానికి చెందిన వ్యక్తి. బీజేపీ వారాణసీ జోనల్ ఇన్‌చార్జ్. మరో ప్రపోజర్.. సంజయ్ సోంకర్ (50) దళితుడు. వారాణసీ జిల్లా విభాగం జనరల్ సెక్రటరీగా వ్యవహరిస్తున్నారు.

కాంగ్రెస్‌కు ఒక్క సీటూ రాదు

తనకు మొత్తం రూ.3.02 కోట్ల విలువ చేసే ఆస్తులు ఉన్నాయని మోదీ ప్రకటించారు. మంగళవారం నామినేషన్ దాఖలు చేసిన ఆయన.. పోల్ అఫిడవిట్‌లో తన ఆస్తులు, అప్పులు, చేతిలో ఉన్న డబ్బు వివరాలను వెల్లడించారు. ఆ అఫిడవిట్ ప్రకారం.. మోదీకి కారు లేదు. సొంత ఇల్లు లేదు. భూములుగానీ, షేర్లుగానీ లేవు. మ్యూచువల్ ఫండ్స్‌లో ఎలాంటి పెట్టుబడులూ లేవు. ఎస్‌బీఐలో ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో మాత్రం రూ.2.86 కోట్లున్నాయి. రూ.2.68 లక్షల విలువ చేసే నాలుగు బంగారు ఉంగరాలు, రూ.9.12 లక్షల విలువైన జాతీయ పొదుపు పత్రాలు ఆయన పెట్టుబడులు. ఇక, ఆయన చేతిలో ఉన్న నగదు.. 52,920 రూపాయలు. వారాణసీ, గాంధీనగర్‌లోని రెండు బ్యాంకు ఖాతాల్లో 80,304 రూపాయలు ఉన్నాయి. ప్రభుత్వం నుంచి తీసుకుంటున్న జీతాన్ని, బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వస్తున్న వడ్డీని తన ఆదాయ వనరులుగా చూపారు. 2018-19లో తన ఆదాయం రూ.11.14 లక్షలుగా చూపిన మోదీ.. 2022-23లో రూ.23.54 లక్షలుగా పేర్కొన్నారు. 2014లో మోదీ తన ఆస్తుల విలువను రూ.1.66 కోట్లు, 2019లో రూ.2.51 కోట్లుగా పేర్కొన్న సంగతి తెలిసిందే. కాగా, ఈ లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాదని మోదీ అన్నారు.

బీజేపీ కంచుకోట.. వారాణసీ

వారాణసీ నియోజకవర్గం బీజేపీకి కంచుకోట! ఇక్కడ హిందూ జనాభా 75 శాతం కాగా.. ముస్లింలు 20 శాతం దాకా ఉన్నారు. హిందువుల్లో.. 10శాతం ఎస్టీలు, 0.7 శాతం ఎస్సీలు ఉన్నారు. గ్రామీణ ఓటర్లు 65 శాతం.. అర్బన్ ఓటర్లు 35 శాతం. ఒక్క 2004 ఎన్నికల్లో మినహా.. 1991 నుంచి ఇప్పటిదాకా ఆ నియోజకవర్గాన్ని బీజేపీనే దక్కించుకుంది. 2004 ఎన్నికల్లో.. కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఆర్కే మిశ్రా అక్కడ విజయం సాధించారు. ఇక, మోదీ 2014లో 3.71 లక్షల ఓట్ల ఆధిక్యంతో (56.37 శాతం ఓట్లు).. 2019లో 4.79 లక్షల ఓట్ల ఆధిక్యంతో (63 శాతం ఓట్లతో) అద్భుత విజయాలు సాధించారు. ఇప్పుడు ముచ్చటగా మూడోసారి పాత రికార్డులను ఛేదించడమే లక్ష్యంగా బరిలోకి దిగారు. ఈసారి ఆయనకు పోటీగా కాంగ్రెస్ పార్టీ ఆ రాష్ట్ర పీసీసీ చీఫ్ అజయ్ రాయ్‌ని వరుసగా మూడోసారి రంగంలోకి దించింది.

లోకం తీరు



400 దాటేస్తాం!

» 'ఇండియాటుడే' ఇంటర్వ్యూలో మోదీ

న్యూఢిల్లీ, మే 14: లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే 400 స్థానాలకుపైగా కచ్చితంగా గెలుస్తుందని మోదీ అన్నారు. ఇది కేవలం నినాదం కాదని.. నిజరూపం దాలుస్తుందని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా మహిళలు, యువత, తొలి ఓటర్లు క్రియాశీలంగా ఓటు హక్కు వినియోగించుకుంటున్నారని తెలిపారు. తాజాగా ఆంగ్ల వార్తాచానల్ 'ఇండియాటుడే'తో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. కాంగ్రెస్ పూర్తిగా బలహీనపడిందని, కనీసం వారి కుటుంబ కంచుకోట అమేఠీలో పోటీచేసే ధైర్యం కూడా వారికి లేకపోయిందని రాహుల్‌గాంధీని ఎద్దేవాచేశారు. 'ఆ పార్టీకి చెందిన అతిపెద్ద నాయకురాలు (సోనియాగాంధీ) రాజ్యసభకు వెళ్లారు. రాహుల్ అమేఠీకి దూరమైపోయారు. రేపు రాయ్‌బరేలీలో గెలిస్తే వయనాడ్‌ను కూడా వదిలేస్తారు. ప్రజలకు సేవచేయడంపై వారికి ఆసక్తి లేదు. కుటుంబ ప్రయోజనాలు తప్ప దేశ ప్రయోజనాలు పట్టవు' అని ధ్వజమెత్తారు. 'ఓ చాయ్‌వాలా కొడుకు ప్రధానిగా ఉండడం వారు భరించలేకపోతున్నారు. నేను మూడోసారి కూడా గెలిస్తే వారి (నెహ్రూ వరుసగా మూడుసార్లు ప్రధాని అయ్యారు) రికార్డుకు గ్రహణం పడుతుందని భయపడుతున్నారు' అని చెప్పారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణంపై విపక్షాలు చేస్తున్న విమర్శలను మోదీ తీవ్రంగా ఖండించారు. తన ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావించారు. బీజేపీ 400 సీట్లతో గెలిస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తుందన్న ఆరోపణలను కూడా ఆయన ఖండించారు. బీజేపీ ఎప్పుడూ రాజ్యాంగాన్ని అగౌరవపరచలేదన్నారు. కాంగ్రెస్సే దానిని దుర్వినియోగం చేసిందన్నారు. '2019లోనే ఎన్డీయే 400 సీట్లకు పైగా సాధించింది" అని మోదీ గుర్తు చేశారు. మతప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వడానికి బీజేపీ వ్యతిరేకమన్నారు. దానిని ఎన్నటికీ అనుమతించబోమని తేల్చిచెప్పారు. ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీలకు కోటా ఇవ్వాలని అంబేడ్కర్‌తో పాటు రాజ్యాంగ సభ కూడా చెప్పిందని.. దానికే తాము కట్టుబడి ఉన్నామని ప్రధాని స్పష్టం చేశారు. కాంగ్రెస్ హయాంలో సాయుధ బలగాలు బలహీనపడ్డాయన్నారు.

లిక్కర్ స్కాం నిందితుల జాబితాలో 'ఆప్'ను చేర్చుతాం

» ఢిల్లీ హైకోర్టుకు తెలిపిన ఈడీ

న్యూఢిల్లీ, మే 14 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులోని నిందితుల జాబితాలో ఆమ్ ఆద్మీ పార్టీని కూడా చేర్చుతామని ఈడీ మంగళవారం హైకోర్టుకు తెలిపింది. త్వరలో దాఖలు చేయనున్న మరో ఛార్జిషీటులో ఈ విషయాన్ని ప్రస్తావిస్తామని పేర్కొంది. అదే జరిగితే మనీలాండరింగ్ కేసులో నిందితునిగా ఓ రాజకీయ పార్టీని పేర్కొనడం ఇదే మొదటిసారి అవుతుంది. ఈ కేసులో ఆప్ సీనియర్ నేత సిసోడియా దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈడీ తరపు న్యాయవాది జోహెబ్ హుస్సేన్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ కుంభకోణం ద్వారా లభించిన సొమ్ము అంతా ఆప్‌కు వెళ్లినట్టు చెబుతున్నా ఆ విషయాన్ని ఛార్జిషీటులో ఎందుకు పేర్కొనలేదని బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణ కాంత శర్మ ప్రశ్నించారు. ఇందుకు న్యాయవాది హుస్సేన్ సమాధానమిస్తూ రానున్న ఛార్జిషీటులో ఆ పార్టీ పేరును ప్రస్తావిస్తామని తెలిపారు. కాగా, సిసోడియా బెయిల్ పిటిషన్‌పై తీర్పును న్యాయమూర్తి రిజర్వు చేశారు.

పరప్పన జైలు నుంచి రేవణ్ణ విడుదల

బెంగళూరు, మే 14(ఆంధ్రజ్యోతి): కిడ్నాప్ కేసులో జైలుకు వెళ్లిన కర్ణాటక మాజీ మంత్రి, హాసన్ జిల్లా హొళెనరసీపుర ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణ మంగళవారం విడుదలయ్యారు. బెయిల్ సోమవారం సాయంత్రం మంజూరైనా, న్యాయపరంగా సాంకేతిక అంశాలు పూర్తి కావడం జాప్యం కావడంతో బయటకు రాలేకపోయారు. మధ్యాహ్నం 12.45 గంటలకు రేవణ్ణ బెయిల్ ప్రక్రియ పూర్తయింది. 1.30 గంటలకు పరప్పన అగ్రహార జైలు నుంచి రేవణ్ణ బయటకు వచ్చి నేరుగా ఇంటికి బయల్దేరారు. ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల పెన్‌డ్రైవ్ వివాదానికి అనుబంధంగా, ఫిర్యాదు చేసిన మహిళను కిడ్నాప్ చేశారనే కారణంగా ఈనెల 4న సిట్ అధికారులు రేవణ్ణను అరెస్టు చేశారు.

బైడెన్‌ను చంపేద్దామనుకున్నా!

వైట్‌హౌస్‌పై ట్రక్కుతో దాడి కేసులో సాయి వర్షిత్ నేరాంగీకారం



వాషింగ్టన్, మే 14: అమెరికా ప్రభుత్వాన్ని కూలదోసి, నాజీ ప్రభుత్వాన్ని నెలకొల్పే ఉద్దేశంతో వైట్‌హౌస్‌పై దాడికి పాల్పడినట్లు భారత సంతతికి చెందిన సాయి వర్షిత్ కందుల(20) అంగీకరించాడు. ఈ లక్ష్యాన్ని సాధించడానికి అవసరమైతే అధ్యక్షుడు జో బైడెన్‌ను చంపడానికి కూడా సిద్ధపడినట్లు విచారణలో వెల్లడించాడు. నిందితుడిని యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టులో హాజరుపరిచిన నేపథ్యంలో అమెరికా అటార్నీ ఈ మేరకు ప్రకటన చేసింది. కోర్టు పత్రాల ప్రకారం.. అమెరికాలో శాశ్వత నివాసం పొందిన భారత సంతతి కుటుంబానికి చెందిన సాయి వర్షిత్ మిస్సోరీలోని సెయింట్ లూయిస్‌లో నివసించేవాడు. గతేడాది మే 22న వాషింగ్టన్‌కు వెళ్లిన సాయి వర్షిత్.. అక్కడ ట్రక్కును అద్దెకు తీసుకున్నాడు. రాత్రి 9.35 గంటల ప్రాంతంలో వైట్‌హౌస్ వద్దకు చేరుకొని అక్కడ భద్రత నిమిత్తం ఏర్పాటు చేసిన బ్యారికేడ్లను వాహనంతో ఢీకొట్టాడు. ఆ తర్వాత ట్రక్కు దిగి నాజీ జెండాను పట్టుకొని నినాదాలు చేస్తున్న అతడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో సాయి వర్షిత్‌కు శిక్షను యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టు జడ్జి ఆగస్టు 23వ తేదీకి వాయిదా వేశారు.

కేజ్రీ రంగంలోకి దిగితే?

నేటి నుంచి ఢిల్లీ సీఎం ఎన్నికల ప్రచారం.. ఈ నెల 25న ఢిల్లీలో పోలింగ్

» రాజధానిలో కాంగ్రెస్‌తో ఆప్ పొత్తు.. 4చోట్ల పోటీ

» పంజాబ్‌లో అన్ని స్థానాల్లో ఒంటరిగా బరిలోకి!

(సెంట్రల్ డెస్క్)



గత ఎన్నికల్లో ఢిల్లీలో పార్టీల ఓట్ల శాతం ఇలా..	2014	2019
బీజేపీ	46.04	56
కాంగ్రెస్	15.,01	23
ఆప్	32.09	18

మద్యం విధానం కుంభకోణంలో అరెస్టయిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు ఎన్నికల ప్రచారం కోసం బెయిల్ రావడం ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది. మరీ ముఖ్యంగా ఆప్ అధికారంలో ఉన్న ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో కేజ్రీ రంగంలోకి దిగితే రాజకీయ పరిణామాలు ఎలా మారుతాయన్నది ఆసక్తికరంగా మారింది. రెండు వారాల బెయిల్ పొందిన కేజ్రీ శుక్రవారం బయటకు వచ్చారు. మరుసటి రోజే మీడియా సమావేశం ఏర్పాటు చేయగా.. పార్టీ కార్యకర్తలు, నేతలు భారీఎత్తున తరలివచ్చారు. దీంతో సమావేశం బహిరంగ సభను తలపించింది. ఆదివారం ఎమ్మెల్యేలతో సమావేశమైన కేజ్రీ మ్యానిఫెస్టోను విడుదల చేశారు. ఇండియా కూటమి పార్టీల అభ్యర్థులకు మద్దతుగా బుధవారం లఖ్‌నవూ, 16న జమ్‌షెడ్‌పూర్, 17న ముంబైలో పర్యటించడం ద్వారా నేరుగా ఎన్నికల కదన రంగంలోకి దిగనున్నారు. ఢిల్లీలో ఏడు స్థానాలకు గాను ఆప్ నాలుగుచోట్ల పోటీ చేస్తోంది. కాంగ్రెస్‌కు మూడు స్థానాలు కేటాయించింది. ఢిల్లీలో ఆరో విడతలో ఈ నెల 25న పోలింగ్ జరగనుంది. పంజాబ్‌లో మాత్రం కాంగ్రెస్, ఆప్ వేటికవే పోటీ చేస్తున్నాయి. చాలాచోట్ల ప్రధాన ప్రత్యర్థులుగా తలపడుతున్నాయి. ఈ రాష్ట్రంలో ఏడో విడతలో జూన్ 1న పోలింగ్ నిర్వహించనున్నారు.

కేజ్రీ లోటు ఢిల్లీలో స్పష్టం

ఆమ్ ఆద్మీ పార్టీకి పంజాబ్ కంటే ఢిల్లీ ఎన్నికల్లో కేజ్రీవాల్ లేని లోటు మొన్నటివరకు స్పష్టంగా కనిపించింది. గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీని స్వీప్ చేసిన బీజేపీని ఈసారి నిలువరించాలంటే కేజ్రీనే మూలస్తంభం. అయితే, సరిగ్గా ఎన్నికల సమయంలో మద్యం కుంభకోణంలో ఆయనను అరెస్టు చేసి 50 రోజులు జైల్లో ఉంచడంతో ఆప్ డీలాపడిపోయింది. మరోవైపు ఆప్‌తో పొత్తును తీవ్రంగా వ్యతిరేకిస్తూ కాంగ్రెస్‌కు చెందిన పలువురు నాయకులు రాజీనామా చేశారు. ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్విందర్ సింగ్ లవ్లీ బీజేపీలో చేరిపోయారు. క్షేత్రస్థాయిలోనూ రెండు పార్టీల శ్రేణుల మధ్య విభేదాలున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కేజ్రీ రాక.. రెండు పార్టీల మధ్య సమన్వయాన్ని పెంచుతుందని.. ఉమ్మడి ప్రత్యర్థి బీజేపీని ఎదుర్కొనేందుకు బలం ఇస్తుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. కేజ్రీవాల్ రాకతో ఆప్ కార్యకర్తల్లో నైతిక స్థైర్యం పెరిగింది. ఆప్-కాంగ్రెస్ ఎన్నికల సమన్వయ కమిటీలో చురుకుదనం వచ్చింది. అయితే, సుదీర్ఘ కాలం నుంచి ప్రత్యర్థులుగా ఉన్న పార్టీల మధ్య రెండు పార్టీల మధ్య ఓట్ల బదిలీపైనే ఆందోళన వ్యక్తం అవుతోంది.

పంజాబ్ వెళ్లకుంటేనే మేలు?

ఢిల్లీలో కేజ్రీ ప్రచారం ఆప్‌నకు ఎంత బలమో పంజాబ్‌లో అంత ఇబ్బందికరం అన్న విశ్లేషణలు వస్తున్నాయి. సీఎం భగవంత్‌సింగ్ మాన్ ఇప్పటివరకు అంతా తానే అయి నడిపిస్తున్నారు. దీంతో కేజ్రీ వచ్చినా పెద్దగా ప్రయోజనం లేదంటున్నారు. అంతేగాక, ఆయన రాక రాష్ట్రంలో ఆప్-కాంగ్రెస్ శ్రేణుల మధ్య విభేదాలను మరింత రాజేస్తుందని.. ఆ ప్రభావం ఢిల్లీపైనా పడుతుందని పేర్కొంటున్నారు. అన్నిటికిమించి కేజ్రీ రాక పంజాబ్‌లో అతివాద సిక్కు ఓటర్లు ఆప్‌నకు వ్యతిరేకం అవుతారని వివరిస్తున్నారు. ఖదూర్ సాహిబ్ నుంచి స్వతంత్రుడిగా పోటీ చేస్తున్న ఖలిస్థానీ ఉగ్రవాది అమృత్ పాల్‌సింగ్‌కు బెయిల్ రాకపోవడం, కేజ్రీవాల్‌కు ప్రచారం కోసం బెయిల్ దొరకడం ఆప్‌కు ఇబ్బందికరమవుతుందన్న భావన వ్యక్తమవుతోంది.

నాన్‌స్టిక్‌తో ఆరోగ్యానికి ముప్పు!

» గీతలు పడితే విష వాయువులు, రసాయనాలు వెలువడే ప్రమాదం

» ఒక్క గీత నుంచి 9 వేల మైక్రోప్లాస్టిక్ రేణువులు: ఐసీఎంఆర్



న్యూఢిల్లీ, మే 14: నాన్‌స్టిక్ వంటపాత్రలతో తీవ్రమైన ఆరోగ్యసమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్' (ఐసీఎమ్మార్) హెచ్చరించింది. నాన్‌స్టిక్ వంటపాత్రలపై చిన్న గీత పడినా దాని మీద ఉన్న టెఫ్లాన్ పైపూత (కోటింగ్)లో నుంచి విష వాయువులు, హానికారక రసాయనాలు వెలువడి ఆహారంలో కలుస్తాయని తెలిపింది. ఒక్క గీత నుంచి కనీసం 9,100 మైక్రోప్లాస్టిక్ రేణువులు విడుదలవుతాయని పేర్కొంది. గీతలు పడిన నాన్‌స్టిక్ వంటపాత్రల్లో 170 డిగ్రీల సెల్సియస్ కన్నా అధిక ఉష్ణోగ్రత వద్ద వంట చేసినప్పుడు ఈ ప్రమాదం ఉందని తెలిపింది. కడిగేటప్పుడు నాన్‌స్టిక్ పాత్రలపై బోలెడన్ని గీతలు పడుతుంటాయి. ఈ లెక్కన వీటి నుంచి కొన్ని లక్షల మైక్రోప్లాస్టిక్స్ విడుదలయ్యే ప్రమాదం ఉంది. వీటి వల్ల హార్మోన్లలో అసమతుల్యత, క్యాన్సర్, సంతానోత్పత్తి సమస్యలు వంటివి తలెత్తవచ్చని ఐసీఎమ్మార్ పేర్కొంది. నాన్ స్టిక్ వంటపాత్రల బదులు మట్టిపాత్రల్లో వండుకోవటం అత్యంత సురక్షితమని తెలిపింది. మరో ప్రత్యామ్నాయంగా గ్రానైట్ పాత్రలను కూడా సూచించింది. అయితే, వాటిపై ఎటువంటి రసాయన పూతలు ఉండవద్దని పేర్కొంది. ఫుడ్ గ్రేడ్ స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలు కూడా మంచివేనని తెలిపింది. 'భారతీయులకు ఆహార మార్గదర్శకాలు' పేరుతో ఐసీఎమ్మార్ ఈ సూచనలను ఇటీవల విడుదల చేసింది.

విమానాల్లో దొంగ!

110 రోజుల్లో 200సార్లు విమాన ప్రయాణం

న్యూఢిల్లీ, మే 14: అతడు 110 రోజుల్లో 200సార్లు విమానాలెక్కి దేశమంతా తిరిగాడు. కానీ, అతడు పర్యాటక ప్రేమికుడు కాదు.. రాజకీయ నేత అంతకన్నా కాదు.. అతడో దొంగ. విమాన ప్రయాణికులతో కలిసిపోతాడు. విమానాశ్రయాల్లోనే వారితో మాటలు కలిపేస్తాడు. విమానం ఎక్కాక వారి పక్కనే తాను కూర్చునేలా సిబ్బందిని బతిమాలుకుంటాడు. తర్వాత వారి లగేజీల్లోంచి బంగారు, వెండి నగలు, విలువైన వస్తువులు దోచేస్తుంటాడు. అతడి పేరు రాజేశ్ కపూర్(40). ఢిల్లీలోని పహార్‌గంజ్‌లోని నివాసంలో రాజేశ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. గతనెల హైదరాబాద్ నుంచి ఢిల్లీ వెళుతున్న ఓ ప్రయాణికురాలి హ్యాండ్‌బ్యాగ్ లోంచి రాజేశ్ రూ.7లక్షల నగలు దొంగిలించాడు. మరో విమానంలోరూ.20లక్షల ఆభరణాలు కాజేశాడు. వీటిపై పోలీసులకు ఫిర్యాదులందాయి. ప్రయాణికుల జాబితాను పరిశీలించగా రాజేశ్, ఈ రెండు ఫ్లైట్స్‌లోనూ ఉన్నాడు. దర్యాప్తులో అతడే దొంగ అని తేలింది. రాజేశ్‌కు ఢిల్లీలో 'రికీ డీలక్స్' పేరుతో ఓ గెస్ట్ హౌస్ ఉంది. అన్నట్టు.. రాజేశ్ అంతకుముందు రైళ్లలోనూ చోరీలు జరిపాడట!

త్వరలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ తవ్వకం

(మొదటి పేజీ తరువాయి)

తవ్వకం చేపడతామని నీటిపారుదల అధికారులకు నిర్మాణ సంస్థ సమాచారం ఇచ్చింది. ఇక టన్నెల్ బోరింగ్ మెషిన్‌లో బేరింగులు పాడైపోవడంతో కొత్త బేరింగులు తెప్పించారు. వీటిని బిగింపు పూర్తయ్యాక నవంబరులో ఔట్‌లెట్ వైపు (మన్నెవారిపల్లి-అచ్చంపేట) నుంచి టన్నెల్ తవ్వకం చేపట్టనున్నారు. మరోవైపు సీపేజీతోపాటు బేరింగ్‌ల కోసం నిర్మాణ సంస్థకు రూ.50 కోట్ల నిధులను ప్రభుత్వం ఇదివరకే విడుదల చేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఈఎన్‌సీ (జనరల్) జీ.అనిల్‌కుమార్ నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ.. చేసిన ప్రతిపాదన మేరకు ఈ నిధులను విడుదల చేశారు. దీంతోపాటు ప్రాజెక్టు నిర్మాణ అంచనాలను రూ.3150 కోట్ల నుంచి రూ.4468 కోట్లకు సవరించాలని ప్రభుత్వానికి కమిటీ ప్రతిపాదించిన విష యం తెలిసిందే. ఈ సవరణ ప్రతిపాదనలకు ప్రభుత్వం త్వరలోనే ఆమోదం తెలిపే



అవకాశాలున్నాయి. కాగా, రెండువైపులా నవంబరు నుంచి టన్నెల్ తవ్వకం ప్రారంభిస్తే.. నెలకు 300 మీటర్ల చొప్పున 33 నెలల్లో టన్నెల్ పూర్తి చేయగలమని నిర్మాణ సంస్థ ప్రభుత్వానికి సంకేతాలిచ్చింది. అనుకున్నవిధంగా ఈ ప్రాజెక్టు పూర్తయి.. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3లక్షల ఎకరాలకు సాగునీటితోపాటు 516 ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు తాగునీరు గ్రావిటీతో చేరనుంది.

ఇక అన్నారం, సుందిళ్లకు జస్టిస్ పినాకి చంద్రఘోష్

» వారం రోజుల తర్వాత మళ్లీ పర్యటన

హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను తదుపరి పర్యటనలో సందర్శించాలని జస్టిస్ పినాకి చంద్రఘోష్ నిర్ణయించారు. దీనికోసం తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆయన సూచించారు. ఘోష్ వారం రోజుల తర్వాత హైదరాబాద్ రానున్నారు. ఈ దఫా దాదాపు రెండు వారాల పాటు ఇక్కడే మకాం వేయనున్నారు. కాళేశ్వరం బ్యారేజీలపై ఫిర్యాదుల స్వీకరణకు అవకాశం కల్పిస్తూ కమిషన్ గతనెలలో నోటిఫికేషన్ ఇవ్వగా.. ఫిర్యాదులు సమర్పించడానికి ఈ నెల 31వ తేదీ దాకా అవకాశం ఉంది. అంతేకాకుండా విచారణ ప్రక్రియలో కమిషన్‌కు సహాయ సహకారాలు అందించడానికి వీలుగా నీటిపారుదల శాఖతో సంబంధం లేకుండా సివిల్, మెకానికల్, హైడ్రాలజీ, ప్లానింగ్, డిజైన్ వంటి విభాగాలకు చెందిన వారితో ఒక కమిటీ వేయాలని ఆయన కోరగా... కమిటీ ప్రతిపాదనలు ఇప్పటికే ప్రభుత్వానికి చేరాయి. ఘోష్ రాష్ట్ర పర్యటనకు వచ్చేలోపు కమిటీని వేయనున్నారు. ఈలోపు ఫిర్యాదుల స్వీకరణ పూర్తయితే... ఆ ఫిర్యాదుల్లోని సారాంశం ఆధారంగా నోటీసులు/సమన్లు జారీ చేయనున్నారు.

వీధి కుక్క దాడిలో ఐదునెలల చిన్నారి మృతి!

తాండూరు రూరల్, మే 14: అభం శుభం తెలియని ఓ ఐదు నెలల శిశువు వీధి కుక్క దాడిలో ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషాదకర ఘటన వికారాబాద్ జిల్లా తాండూరు మండలంలో జరిగింది. కర్ణాటక రాష్ట్రం రాయ్‌చూర్‌కు చెందిన నీలం మధు, మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తి సమీపంలోని దుప్పల్లికి చెందిన లావణ్యలకు నాలుగేళ్ల క్రితం వివాహమయింది. వీరికి సాయినాథ్ అనే ఐదు నెలల బాబు ఉన్నాడు. తాండూరు మండలం గౌతాపూర్ గ్రామం సమీపంలోని ఓ పాలిషింగ్ యూనిట్‌లో వారం క్రితమే మధు పనికి కుదిరాడు. కుటుంబంతో కలిసి గౌతాపూర్‌లో ఓ అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం లావణ్య బాబును ఇంట్లో ఉంచి పాలిషింగ్ యూనిట్‌లో పనిచేస్తున్న భర్తకు మంచినీళ్లు ఇచ్చేందుకు వెళ్లింది. ఆ సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలుడిపై ఓ కుక్క దాడి చేసింది. బాలుడు ఏడుపు విని కుటుంబీకులు లోపలికి వెళ్లేసరికి బాలుడు రక్తపు మడుగులో పడి ఉన్నాడు. ఆస్పత్రికి తరలించే లోపే చిన్నారి ప్రాణాలు కోల్పోయాడు. కన్నబిడ్డ విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. బాలుడి చావుకు కారణమయిన కుక్కను బాలుడి కుటుంబీకులు, తోటి కార్మికులు కొట్టి చంపేశారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కవిత కస్టడీ 20 వరకు పొడిగింపు

న్యూఢిల్లీ, మే 14 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జ్యూడీషియల్ కస్టడీని ఈ నెల 20 వరకు పొడిగిస్తూ రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశాలు ఇచ్చింది. గతంలో విధించిన కస్టడీ గడువు మంగళవారం ముగియడంతో ఆమెను వర్చువల్ విధానంలో ప్రత్యేక కోర్టు ముందు హాజరుపరిచారు. ఇరువైపులా వాదనలు విన్న జడ్జి కస్టడీని ఈ నెల 20 వరకు పొడిగించారు. కవితపై శుక్రవారం దాఖలు చేసిన అనుబంధ చార్జ్‌షీట్ అంశాన్ని ఈడీ న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. 8వేల పేజీలతో చార్జ్‌షీట్‌ను దాఖలు చేసినట్లు తెలిపారు. దీన్ని ఈ నెల 20న పరిశీలిస్తామని జడ్జి చెప్పారు.



అమెరికాలో గౌరవ డాక్టరేట్ స్వీకరిస్తున్న డాక్టర్ విశ్వనాథన్

వీఐటీ ఛాన్స్‌లర్‌కు.. అమెరికా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం

» విద్యా రంగంలో విశేష కృషికి దక్కిన గౌరవం

చెన్నై, మే 14 (ఆంధ్రజ్యోతి): వేలూరు వీఐటీ యూనివర్సిటీ ఛాన్స్‌లర్ డాక్టర్ కె.విశ్వనాథన్‌కు అమెరికాలోని స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ న్యూయార్క్ (బింగ్ హాంటన్ యూనివర్సిటీ) గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ నెల 10న బింగ్ హాంటన్ యూనివర్సిటీలో జరిగిన వేడుకలో వర్సిటీ ఛాన్స్‌లర్ హార్వే స్టింగర్ విశ్వనాథన్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విశ్వనాథన్‌కు ప్రత్యేక అభినందన సభ జరిగింది. ఈ కార్యక్రమంలో అక్కడి శాసన మండలి సభ్యులు డోనా ఎలుప్పాడో, సెనేట్ సభ్యులు లియావెట్, డీన్ ప్రొఫెసర్ శ్రీహరి కృష్ణస్వామి, స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ న్యూయార్క్ వైస్‌ఛాన్స్‌లర్ డాక్టర్ డొనాల్డ్ హాల్, వీఐటీ ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్, డాక్టర్ శేఖర్ విశ్వనాథన్, డాక్టర్ జీవీ సెల్వం, కాదంబరి విశ్వనాథన్, వీఐటీ ఇంటర్నేషనల్ రిలేషన్స్ డైరెక్టర్ శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా వాషింగ్టన్‌లోనూ విశ్వనాథన్‌కు ప్రత్యేక అభినందన సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సెనేట్ సభ్యుడు కన్నన్ శ్రీనివాసన్, అమెరికాలోని భారత రాయబార కార్యాలయ విద్యా విభాగాధిపతి డాక్టర్ బి.కరుణాకరన్, వీఐటీ నార్త్ అమెరికన్ అలుమ్నీ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్‌లు, తదితరులు హాజరై విశ్వనాథన్‌ను అభినందించారు. చిన్న వయసులోనే రాజకీయ ప్రవేశం చేసి పలు పదవుల ద్వారా వివిధ బాధ్యతలు నిర్వర్తించిన విశ్వనాథన్.. విద్యారంగంలో చేస్తున్న విశేష కృషిని గుర్తించిన అమెరికా యూనివర్సిటీ ఈ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది..

20 నుంచి 'దోస్త్' వెబ్ ఆప్షన్ల నమోదు

హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ ప్రవేశాలకు సంబంధించిన దోస్త్ షెడ్యూల్‌లో మార్పులు చేసినట్టు రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రకటించింది. వెబ్ ఆప్షన్లను మే 20 నుంచి 30 వరకు నమోదు చేసుకునేలా షెడ్యూల్‌లో అధికారులు మార్పులు చేశారు. కాగా, సీపీజెట్ నోటిఫికేషన్ బుధవారం విడుదల కానుంది.

'కడెం'పై సర్కారు దృష్టి

ఐదు గేట్లకు శరవేగంగా మరమ్మతులు.. నేడు ప్రాజెక్టు వద్దకు కీలక అధికారులు

- గత రెండేళ్లూ భారీ వరదలకు వణికిన ప్రాజెక్టు
- 2 గేట్ల రోప్‌లు తెగిపోవడం, మరో రెండింటి కౌంటర్ వెయిట్‌లు కొట్టుకుపోవడంతో సమస్య
- మొత్తం 18 గేట్లూ ఒకేసారి తెరుచుకోని వైనం
- డీఎస్ఆర్‌పీ సూచనపై దృష్టిపెట్టని గత సర్కారు
- యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని కొత్త ప్రభుత్వం నిర్ణయం.. ఉత్తర్వుల జారీ



హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): గోదావరి బేసిన్‌లో ఏటా వరదలతో నిండే ప్రాజెక్టుల్లో ఒకటైన కడెం నారాయణ రెడ్డి ప్రాజెక్టుపై ప్రభుత్వం దృష్టి సారించింది. గత రెండేళ్లూ భారీ వరదలతో ప్రాజెక్టు చిగురుటాకులా వణికిన విషయం విదితమే. స్పిల్‌వే (నీరు విడుదలయ్యే భాగం) సామర్థ్యం కన్నా అధికంగా వరద రావడంతో గత ఏడాది 18 గేట్లకు గాను 14 గేట్లు మాత్రమే పైకి లేచాయి. రెండు గేట్ల రోప్‌లు తెగిపోగా... మరో రెండు గేట్ల కౌంటర్‌వెయిట్‌లు కొట్టుకుపోయాయి. దాంతో వరద.. గేట్ల పైనుంచి కిందికి దూకింది. గత రెండేళ్ల అనుభవాల దృష్ట్యా ప్రాజెక్టు 18 గేట్లను ఏకకాలంలో ఎత్తడానికి వీలుగా 5 గేట్లలో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. ఇటీవలే వీటి మరమ్మతులకు ఉత్తర్వులు ఇవ్వగా ఎన్నికల సంఘం కూడా ప్రత్యేకంగా అనుమతి ఇచ్చింది. వానాకాలంలోపు ఈ మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా బుధవారం నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ (జనరల్) జి.అనిల్‌కుమార్ నేతృత్వంలోని అధికారుల బృందం కడెం ప్రాజెక్టును సందర్శించనుంది. గేట్ల మరమ్మతులపై అక్కడే సమీక్ష చేపట్టి, అవసరమైన ఆదేశాలు ఇవ్వనున్నారు. కాగా, ఈ ప్రాజెక్టుకు ఒక ప్రత్యేకత ఉంది. 18 గేట్లలో 9 జర్మనీ నుంచి తెప్పించుకున్నవి. మరో 9 మన దేశంలోనే తయారుచేసినవి. 1906లోనే నిజాం హయాంలో ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించి.. మధ్యలో ఆపేశారు. హైదరాబాద్ సంస్థానం పోలీసు చర్య అనంతరం ఇండియన్ యూనియన్‌లో విలీనం అయ్యాకా పూర్తి చేశారు. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో 1.30 లక్షల క్యూసెక్కుల వరద విడుదలయ్యేలా స్పిల్ వే డిజైన్ చేశారు. అయితే 1958 ఆగస్టు 31న ప్రాజెక్టుకు 3 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. దాంతో అంతకుముందు అమర్చిన జర్మనీ గేట్లకు అదనంగా మరో 9 గేట్లు పెట్టి, స్పిల్ వే సామర్థ్యం 3 లక్షల క్యూసెక్కులకు పెంచారు. రెండేళ్ల కిందట ప్రాజెక్టుకు ఏకంగా 5 లక్షల క్యూసెక్కుల వరద రాగా గత ఏడాది దాదాపు 4 లక్షల క్యూసెక్కుల దాకా వచ్చింది. జర్మనీ గేట్లు నిక్షేపంగా పనిచేస్తుండగా భారతదేశంలో తయారుచేసినవి నిరంతరం మొరాయిస్తున్నాయి. ఈ ప్రాజెక్టును డీఎస్ఆర్‌పీ తనిఖీ చేసి.. అదనంగా 5 గేట్లతో కొత్తగా ఒక స్పిల్ వే కట్టాలని నివేదిక ఇచ్చింది. ఏడాదిన్నర కిందటే డీఎస్ఆర్‌పీ నివేదిక ఇవ్వగా గత ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టలేదు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం వెనువెంటనే మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించి, ఇటీవలే నిధులు కూడా మంజూరు చేసింది. స్పిల్ వే కట్టాలంటే ఏడాది పాటు ప్రాజెక్టు కింద క్రాప్ హాలీడే ప్రకటించాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి తాత్కాలిక ప్రాతిపదికన గేట్లకు మరమ్మతులు చేసి, గేట్ల ఆపరేషనల్ మ్యాన్యువల్‌లో మార్పులకు ఉపక్రమించారు. ప్రాజెక్టు క్యాచ్‌మెంట్ ఏరియా అంతా దట్టమైన అడవుల్లో ఉంది. దీంతో అడవుల్లో రెయిన్ గేజ్ స్టేషన్లు ఏర్పాటు చేసి, వాటిని ప్రాజెక్టు వద్ద ఉన్న స్కాడా కేంద్రానికి అనుసంధానం చేశారు. వరద సమాచారం అందుకోగానే గేట్లను ఏకకాలంలో తెరవనున్నారు. అడవుల్లో వర్షాలు కురిసిన తర్వాత ప్రాజెక్టుకు వరద చేరడానికి 9 గంటలు పడుతుందని అంచనా వేశారు. ఆ సమయానికి ముందే 18 గేట్లను ఎత్తేసి ప్రాజెక్టును ఖాళీ చేయాలని నిర్ణయించారు. దీని వల్ల రిజర్వాయర్‌పై ఒత్తిడి తగ్గి ప్రమాదం నుంచి కడెం ప్రాజెక్టు బయటపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

మండుతున్న పచ్చిమిర్చి ధరలు.. కిలో రూ.120



ఖమ్మం మార్కెట్ మే 14: పచ్చిమిర్చి ధరలు మండు తున్నాయి. వారం క్రితం వరకు కిలో రూ.50-రూ.60 పలికిన ధర ఇటీవల భారీగా పెరిగింది. బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం కిలో రూ.120 వరకు పలుకుతోంది. సూపర్‌మార్కెట్లు, ఆన్‌లైన్ యాప్స్‌లో ఈ ధరలు మరింత అధికంగా ఉన్నాయి. ఖమ్మం రైతు బజారులో మంగళ వారం కిలో రూ.110కు విక్రయించారు. వేసవి ప్రభావంతో పచ్చిమిర్చి సాగు తగ్గడమే ధర పెరుగుదలకు కారణం.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అసంపూర్ణ న్యాయం

ప్రముఖ హేతువాది, మహారాష్ట్ర అంధశ్రద్ధ నిర్మూలన సమితి వ్యవస్థాపకుడు నరేంద్ర దభోల్కర్ హత్యకేసులో పుణే కోర్టు మొన్న శుక్రవారం ఇద్దరు నిందితులకు జీవితఖైదు విధించింది, మరో ముగ్గురిని సాక్ష్యాలు లేవన్న కారణంతో నిర్దోషులని ప్రకటించి, వదిలేసింది. హత్యజరిగి పదకొండేళ్ళయిన తరువాత వెలువడిన ఈ తీర్పులో, దభోల్కర్ మీద కాల్పులు జరిపిన ఇద్దరికీ కఠినశిక్ష పడినప్పటికీ, ప్రధాన కుట్రదారుడిని వదిలివేయడం బాధాకరం. సీబీఐ వైఫల్యంతో అత్యంత కీలకమైన వ్యక్తి తప్పించుకోగలిగాడు.

2013 ఆగస్టు 20న ఉదయపు నడకలో ఉన్న ఆయనమీద కొందరు దుండగులు కాల్పులు జరిపారు, ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఆయన ప్రాణం కోల్పోయారు. ఆరంభంలో పుణే పోలీసులు ఈ కేసు దర్యాప్తుచేసినప్పటికీ, తర్వాత అది సీబీఐకి బదిలీ అయింది. శరద్ కలస్కర్, సచిన్ అందూరేలు దభోల్కర్‌ను కాల్చినట్టు విచారణలో తేలడంతో కోర్టు వీరికి జీవిత ఖైదుతో పాటు ఐదులక్షలరూపాయల జరిమానా కూడా విధించింది. కానీ, అభియోగాలను నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైనందున వీరేంద్రసింగ్ తావ్డే, సంజీవ్ పునలేకర్, విక్రమ్ భావేలను కోర్టు వదిలేసింది. పుణేకోర్టు తీర్పును స్వాగతిస్తూనే, ఈ ముగ్గురినీ వదిలేసినందుకు దభోల్కర్ కుటుంబీకులు, అభిమానులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేస్తున్నారు.

హత్యతో సంబంధం ఉన్నవారందరికీ శిక్ష పడేట్టుగా చేయలేకపోవడం పెద్ద వైఫల్యం. ప్రధాన కుట్రదారు అని సీబీఐ పేర్కొన్న తావ్డే సహా మిగతా ఇద్దరు ఆధారాలు లేని కారణంగా నిర్దోషులుగా బయటపడిపోవడం విచిత్రం. 'సనాతన సంస్థ'కు చెందిన వీరంతా దభోల్కర్ హత్యలో సూత్రధారులు, పాత్రధారులని సీబీఐ చాలా గట్టిగా వాదించింది. కానీ, ఈ ముగ్గురి విషయంలో దర్యాప్తు సంస్థ నేరాన్ని రుజువుచేయలేకపోయింది. సీబీఐ, మహారాష్ట్ర పోలీసులను ఉద్దేశించి కోర్టు తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. ఈ ముగ్గురూ కుట్రలో భాగస్వాములు కాదని, వారి పాత్ర ఏమీ లేదని తాను భావించడం లేదని స్పష్టంచేసింది. వారు అమాయకులని నమ్మి తాను వదిలిపెట్టడం లేదనీ, దర్యాప్తు సంస్థలు తమ విధిని నిర్వహించడంలో విఫలమైనందున తాను ఈ ముగ్గురినీ విడిచిపెట్టాల్సి వస్తున్నదని వ్యాఖ్యానించింది. మహారాష్ట్ర అధికారులను సైతం న్యాయస్థానం తీవ్రంగా విమర్శించింది. దభోల్కర్ హత్యకు సంబంధించిన వ్యవహారంలో సమస్త వ్యవస్థలు అలసత్వాన్ని కనబరిచాయని వ్యాఖ్యానించింది. దేశాన్ని తీవ్రంగా కుదిపేసిన ఈ హత్య ఘటనలో కేసును ఉద్దేశపూర్వకంగానే బలహీనపరిచారన్నది న్యాయస్థానం అభిప్రాయం కావచ్చు. కుట్ర జరిగిందని, హత్యకు కొందరు ప్రేరేపించారని న్యాయస్థానం నమ్మింది. ఈ ముగ్గురి పాత్ర విషయంలో అనుమానపడాల్సినంత ఉన్నదని కూడా వ్యాఖ్యానించింది. కానీ, వారి భాగస్వామ్యాన్ని రుజువుచేయడంలో ప్రాసిక్యూషన్ ఎందుకు విఫలమైందో తనకు అర్థంకావడం లేదన్నది. డిఫెన్స్ లాయర్ల వాదనలతీరుమీదా, ప్రవర్తనమీదా కూడా న్యాయస్థానం కొన్ని వ్యాఖ్యలు చేసింది. దభోల్కర్‌ను హిందూవ్యతిరేకిగా ముద్రవేయడం ద్వారా అతని హత్యను సమర్థించే ప్రయత్నం జరిగినట్టు కనిపిస్తోందన్నది.

మూఢవిశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న క్రమంలో దభోల్కర్‌కు చాలా బెదిరింపులు వచ్చాయి. ప్రాణాలకు వెరవకుండా ఆయన తనపనితాను చేసుకుంటూపోయాడు. ఆయనను భౌతికంగా నిర్మూలించడం వెనుక ఆయన సిద్ధాంతాలను ఆశయాలను అంతంచేయాలన్న విశేషమైన ప్రయత్నం ఉన్నదని కోర్టు గుర్తుచేసింది. ఈ కేసును కేవలం ఒక వ్యక్తి హత్యగా కాక మరింత విస్తృతంగా చూడాల్సి ఉంటుందని కూడా న్యాయమూర్తి గుర్తుచేశారు. దభోల్కర్ హత్య తరువాత మహారాష్ట్ర, కర్ణాటకల్లో ఈ తరహా ఆదర్శాలు, భావజాలం ఉన్న గోవింద్ పన్సారే, ఎంఎం కల్బుర్గీ, గౌరీ లంకేశ్ వంటివారి హత్యలు జరిగిన విషయం తెలిసిందే. ఈ హత్యల చుట్టూ సాగిన రాజకీయాలు, దర్యాప్తుపై ఆయా రాష్ట్రాల్లో అప్పట్లో ఉన్న ప్రభుత్వాల ప్రభావాల గురించి ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. మరో ఐదేళ్ళకు జరిగిన గౌరీ లంకేశ్ హత్య తరువాత కానీ వీరిని అరెస్టుచేయకపోవడం మరో విశేషం. దభోల్కర్ కేసులో ఇప్పుడు జీవితఖైదు పడిన శరద్ కలస్కర్, సచిన్ అందూరేలతో పాటు వీరేంద్రసింగ్ తావ్డే కూడా పన్సారే కేసులో నిందితుడు. గౌరీలంకేశ్ హత్యకేసులో కలస్కర్ నిందితుడు. ఆయుధంపట్టినవారితో పాటు, తెరవెనుక కుట్రదారులను కూడా శిక్షించగలిగినప్పుడే ఈ తరహా హత్యల కేసుల్లో ఎంతోకొంత న్యాయం జరిగినట్టు.

గత సాధారణ ఎన్నికల ప్రచారాస్త్రాలలో వాట్సప్ ముఖ్యభూమిక పోషించగా ఈ సారి యూట్యూబ్ తన వంతు పాత్ర పోషిస్తోంది. క్షేత్రస్థాయిలో ప్రతిపక్షాలు నిర్వర్తించవల్సిన కర్తవ్యాన్ని అస్తిత్వం లేని యూట్యూబ్ చానళ్ళు నిర్వహిస్తున్నాయి. ప్రధాన ప్రసార మాధ్యమాలకు దీటుగా నిమిషాల వ్యవధిలో లక్షల ప్రేక్షకులు రవీష్ కుమార్, ధృవ్ రాఠీల వీడియోలను ఆదరిస్తున్నారంటే ప్రజా చైతన్యంలో వచ్చిన మార్పుగా భావించవచ్చా? నిజంగా అది అలాంటి మార్పు అయితే ప్రజా తీర్పులో కూడా అది ప్రతిబింబిస్తుందా?

ఇవి యూట్యూబ్ ఎన్నికలు

సార్వత్రిక ఎన్నికల ప్రచారం ప్రజాస్వామ్య విలువలకు తూట్లు పొడుస్తూ సాగుతోంది. ప్రజాస్వామ్య పండుగ అయిన ఎన్నికల ప్రక్రియలో ఇంతవరకు భారతవని ఓటర్లలో ఇంచుమించు సగం మందికి పైగా గుంభనంగా తమ తీర్పునిచ్చారు. రాజకీయ పార్టీలు ఏ రకమైన ప్రచారం చేసినప్పటికీ ఓటరు మాత్రం వారి పని తీరును అంచనా వేసి, విధానాలను గమనించి ఓటు వేస్తాడు. అందుకు అందుబాటులో ఉన్న అన్ని వినూత్న పద్ధతులను రాజకీయ పార్టీలు ఉపయోగించుకుంటాయి. రాత పూర్వక సందేశాలు ఇప్పటి వరకు విద్యావంతులకు మాత్రమే పరిమితం కాగా నిరక్షరాస్యులకు ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాలలో ఉన్న మహిళలకు సైతం సునాయాసంగా తమ వాదనలను చేరవేయడానికి ఇప్పుడు యూట్యూబ్ అమితంగా ఉపకరిస్తోంది. ప్రస్తుత ఎన్నికల ప్రచార పర్వంలో యూట్యూబ్ ప్రసార వేదిక కీలక పాత్ర పోషిస్తోంది.

ప్రాంతీయ పార్టీల మొదలు జాతీయ పార్టీల వరకు ప్రతి పార్టీ కూడా డిజిటల్ ప్రచారానికి ప్రత్యేకించి యూట్యూబ్‌పై భారీగా వెచ్చించి ప్రచారం చేస్తున్నాయి. నాటి గోడ రాతల నుండి నేటి యూట్యూబ్ వరకు అన్ని రాజకీయ పార్టీలలో బీజేపీది అగ్రస్థానం. ఫేస్ బుక్, ట్విటర్, వాట్సప్‌లలో బీజేపీతో దేశంలోని ఏ ఇతర రాజకీయ పక్షం పోటీపడజాలదు. కాషాయ విజయ వ్యూహాలలో ఈ అత్యాధునిక సామాజిక మాధ్యమాల పాత్ర కీలకం. వీటిని సద్వినియోగం చేసుకుని సమర్థంగా తిప్పికొట్టలేకపోయిన ప్రతిపక్షాలన్నీ చివరకు బీజేపీని 'వాట్సప్ విశ్వవిద్యాలయం' అని విమర్శించే అచేతన స్థితికి చేరుకున్నాయి. ప్రధాన స్రవంతి మీడియా తమను పట్టించుకోవడం లేదని నిత్యం వాపోయే రాహుల్ గాంధీ యూట్యూబ్‌తో సహా డిజిటల్ మీడియాలో కనీసం తన ఉనికిని కూడా చాటుకోలేకపోతున్నారు.! ట్విటర్ తరహా సంస్థలు రాహుల్ గాంధీ లేదా కాంగ్రెస్ పార్టీ ఖాతాలకు అవరోధం కల్పించడానికి బీజేపీ ఒత్తిడితో పాటు అవి అనుసరించే సాధారణ మార్కెట్ సూత్రాలు కూడా ఒక కారణం కావచ్చు.

గల్ఫ్ లేఖ

రెండు దశాబ్దాల క్రితం బీజేపీ అగ్రనేత లాల్‌కృష్ణ అడ్వాణీ ఫేస్ బుక్‌ను వినియోగించే సమయానికి కాంగ్రెస్ పార్టీ అధునాతన సామాజిక మాధ్యమాల దరిదాపులకు కూడ చేరలేదు. ఇప్పటికీ అది ప్రాంతీయ పార్టీ అయిన ఆమ్ ఆద్మీ పార్టీ కంటే చాలా వెనుకబడి ఉన్నది. ఇదే యూట్యూబ్‌ను తెలంగాణలో రేవంత్ రెడ్డి సమర్థంగా వినియోగించుకుని తన వ్యక్తిగత ప్రతిష్ఠను పెంచుకోవడంతో పాటు బీఆర్ఎస్‌ను దెబ్బతీశారు. యూట్యూబ్ చానళ్ళ కారణాన ఓడిపోయామనే కె.టి.ఆర్ ఆక్రోశానికి ఇది కూడా ఒక కారణం కావచ్చు. తమ ప్రచార సమరాలకు బీఆర్ఎస్ కూడా భారీగా ఖర్చు చేసి సినిమాల తరహా విడియోలను నిర్మించి విడుదల చేసినా జనాలు పట్టించుకోలేదనేది వేరే విషయం.



ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలలో యూట్యూబ్ ప్రచారానికి ప్రాధాన్యం పెరిగింది. గత సాధారణ ఎన్నికల ప్రచారాస్త్రాలలో వాట్సప్ ముఖ్యభూమిక పోషించగా ఈ సారి యూట్యూబ్ తన వంతు పాత్ర పోషిస్తోంది. క్షేత్రస్థానంలో ప్రతిపక్షాలు నిర్వర్తించవల్సిన కర్తవ్యాన్ని అస్తిత్వం లేని యూట్యూబ్ చానళ్ళు నిర్వహిస్తున్నాయి.

రాహుల్ గాంధీతో సహా యావత్తు ప్రతిపక్షాలు కలిసికట్టుగా చేయలేని పనిని కేవలం ఇద్దరు ముగ్గురు వ్యక్తులు తమ విడియోల ద్వారా చేస్తూ శక్తిమంతమైన బీజేపీపై పదునైన విమర్శనాస్త్రాలు సంధిస్తూ ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. స్వతంత్రంగా, నిష్పాక్షికంగా కొందరు వ్యక్తులు ప్రసారం చేస్తున్న దృశ్య సందేశాలు ప్రత్యేకించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విధానాలను ప్రశ్నిస్తుండగా వాటికి యూట్యూబ్‌లో ప్రజలు నీరాజనం పడుతుండడం ఆశ్చర్యంతో పాటు ఆసక్తి కల్గిస్తోంది. ఎన్నికల వేళ, ఈ దిశగా ఒక ప్రముఖ టెలివిజన్ చానల్‌లో ఉద్యోగానికి రాజీనామా చేసిన రవిష్ కుమార్, ప్రవాస భారతీయుడు ధృవ్ రాఠీలు అనతికాలంలో మోదీ వ్యతిరేక వైఖరితో యూట్యూబ్ వారధిగా అశేష జనవాహినికి చేరువ అయిన తీరు ఆసక్తికరం. ఈ ఇరువురు అచితూచి చట్టపరిధిలో ఉండడంతో సర్కారు ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండడం ఇక్కడ అంతకంటే ఆసక్తికరం. సాధారణ వార్తలు, ఇతర వర్తమాన అంశాలకు కాకుండా కేవలం మోదీ వ్యతిరేక వార్తలే లక్ష్యంగా వారు పని చేయడం కూడ ఇక్కడ గమనార్హం.

ప్రధాన స్రవంతిలోని సంప్రదాయ సమాచార, ప్రసార సాధనాల పట్ల సామాన్యులలో సన్నగిల్లుతున్న విశ్వసనీయత కారణాన యూట్యూబ్ లోకంలో అవిష్కృతమవుతున్న ఈ రకమైన నూతన వార్తా వ్యవస్థలకు ఆదరణ లభిస్తోంది. జైలు నుంచి విడుదలయిన మరుసటి రోజు ఉదయం ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చేసిన సంధించిన విమర్శలను ప్రధాన స్రవంతి మీడియా అలక్ష్యం చేసినా చిన్నచితకా యూట్యూబ్ చానళ్ళు మాత్రం జనాలకు చేరవేసాయి. నవీన సామాజిక మాధ్యమాలలో ఇప్పటి వరకు బీజేపీ చెప్పిందే వేదంగా నడిచింది కానీ ఇప్పుడు మోదీ విధానాలకు వ్యతిరేకంగా యూట్యూబ్‌లో లభిస్తున్న ఆదరణను అర్థం చేసుకోవల్సిన అవశ్యకత ఉంది.

పాత్రికేయ విలువలకు కట్టుబడి నిష్పాక్షికంగా వ్యవహరిస్తూ ప్రజల మన్ననలను అందుకొంటున్న యూట్యూబ్ చానళ్ళు కొన్ని ఉన్నా వీటి ముసుగులో సమాజాన్ని పట్టిపీడిస్తున్న వారి సంఖ్య అధికంగా ఉండడం బాధాకరం. అయితే ఇది వేరే విషయం. ప్రధాన ప్రసార మాధ్యమాలకు దీటుగా నిమిషాల వ్యవధిలో లక్షల ప్రేక్షకులు రవీష్, రాఠీల విడియోలను ఆదరిస్తున్నారంటే ప్రజా చైతన్యంలో వచ్చిన మార్పుగా భావించవచ్చా? నిజంగా అది అలాంటి మార్పు అయితే ప్రజా తీర్పులో కూడా అది ప్రతిబింబిస్తుందా?

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

సైద్ధాంతిక పోరుగా సార్వత్రిక సమరం



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

ప్రధానమంత్రి నరేంద్రమోదీ మూడోసారి అధికారంలోకి వస్తారా లేదా అన్న ప్రశ్నతో నిమిత్తం లేకుండా ఈ ఎన్నికలతో భారత రాజకీయాలు ఒక నిర్ణాయక ఘట్టంలో ప్రవేశించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఎన్నికలలో భారతదేశ ప్రజలు ఏమి కోరుకుంటున్నారు అన్న ప్రశ్నకు త్వరలో సమాధానం లభించనుంది. 1952 నుంచి వరుసగా మూడుసార్లు జరిగిన ఎన్నికలు వేరు. అప్పుడు కాంగ్రెస్‌కు పెద్ద పోటీ లేదు. కాని 2014, 2019, 2024 ఎన్నికలు వేరు. దేశ రాజకీయ, సామాజిక, ఆర్థిక విధానాలు ఏ దిశన ఉండాలో ప్రజలు కోరుకుంటున్నారో సూచించే ఎన్నికలు ఇవి. గతంలో ఎన్నడూ లేనంతగా దేశంలో రెండు వాదాలు ఈ ఎన్నికల్లో హోరా హోరీ పోరాడుతున్నాయి. తెలిసో, తెలియకో, ఆలోచించో, అన్యమనస్కంగానో ప్రజలు రెండు శిబిరాల్లో ఏదో ఒక శిబిరంలో చేరారు. రెండు దశాబ్దాల క్రితం నిలదొక్కుకునేందుకు నానా అగచాట్లు పడిన ఒక పార్టీ ఇవాళ దేశంలోనే ప్రబల శక్తిగా మారింది. ఆ శక్తిని ఢీకొనేందుకు ఇప్పుడు ఇతర వర్గాలన్నీ తమ అంతర్వైరుధ్యాలన్నీ మరిచి ఏకం కావల్సిన చారిత్రక ఆవశ్యకతను గ్రహించాయి. వారితో పాటు మేధావులు, ప్రజాస్వామిక వాదులు, సమాజం ఫలానా విధంగా ఉండాలని కోరుకుంటున్న బుద్ధిజీవులు కూడా విడిపోయారు. అందువల్ల స్పష్టంగా ఆలోచనల మధ్య సమరం జరుగుతున్న ఎన్నికలు ఇవి.

నాలుగోదశ ఎన్నికలు జరిగి దేశంలో 379 స్థానాలకు ఎన్నికలు పూర్తయిన తర్వాత కూడా ప్రధానమంత్రి నరేంద్రమోదీ అంతే సమధికోత్సాహంతో ఎన్డీఏకు 400 సీట్లు రావడం ఖాయం అని ఆత్మస్థైర్యంతో ప్రకటించారు. కాంగ్రెస్‌కు 50 సీట్లు కూడా రావని ప్రతిపక్ష హోదా కూడా లభించదని ఆయన స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మరోసారి ప్రధాని అవుతారని, మూడో టర్మ్ మొత్తం ఆయనే పాలిస్తారని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించారు. సూర్జిత్ భల్లా వంటి ఆర్థికవేత్తలు కూడా బీజేపీ 350 సీట్లు గెలుస్తోందని చెబుతుంటే, మోదీ ఉధృతి పెరుగుతుందే కాని తగ్గడం లేదని బీజేపీ అనుకూల మేధావులు వాదిస్తున్నారు.

2014లో కాంగ్రెస్ వ్యతిరేక పవనాలు వీస్తే, 2019లో పుల్వామా, బాలాకోట్ ఘటనలు ఫలితాలను ప్రభావితం చేశాయి. ఈ సారి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఒక వ్యక్తిగా దేశంలోని మొత్తం ప్రతిపక్ష పార్టీలనన్నిటినీ ఢీకొనేందుకు సిద్ధపడ్డారు. మోదీ వర్సెస్ ఇతరులు అన్నట్లుగా ప్రచార సరళిని తీర్చిదిద్దారు. ప్రతి నియోజకవర్గంలోనూ మోదీయే పోటీ చేస్తున్నారు అన్న భావన ముఖ్యంగా ఉత్తరాదిన కల్పించారు. నిజంగా ఇది ప్రతిపక్షాలకు మాత్రమే కాదు, ఒక భావజాలాన్ని వ్యతిరేకిస్తున్న, ముఖ్యంగా మోదీని ద్వేషిస్తున్న వారందరికీ సవాల్.

మరో వైపు ప్రతిపక్షాలు కూడా ఈ ఎన్నికలు నిర్ణాయకంగా మారనున్నాయని అంగీకరిస్తున్నాయి. ప్రతి దశలోనూ పోలింగ్ పూర్తయిన కొద్దీ ప్రతిపక్షాల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతోంది. బీజేపీ గ్రాఫ్ పడిపోతుందని, మోదీ చేస్తున్న ప్రసంగాలు, వ్యాఖ్యలే ఆయనలో భయాందోళనలను ప్రతిఫలిస్తున్నాయని వారు విశ్వసిస్తున్నారు. మోదీ కీ గ్యారంటీ అన్న నినాదాన్ని కూడా పక్కన పెట్టి ప్రతిపక్షాలపై దాడులు ప్రారంభించారని, కాంగ్రెస్ మేనిఫెస్టోను సైతం వక్రీకరిస్తున్నారని వారు ఎత్తిచూపుతున్నారు. కార్పొరేట్ ఎజెండాకు అనుకూలంగా మోదీ పనిచేస్తుంటే తాము సామాజిక న్యాయ ఎజెండాతో ముందుకు వెళుతున్నామని చెప్పుకుంటున్నారు. ఈ రకంగా కూడా రెండు విధానాల మధ్య ఘర్షణ జరుగుతోందని ప్రతిపక్షాలు కూడా స్పష్టీకరిస్తున్నాయి.

అయితే ఎన్నికల సమయంలో నేతలు ఏ రకంగా ప్రచారం చేసినా, ఎన్ని వ్యాఖ్యలు చేసినా కేవలం వాటి ద్వారానే ప్రజలు ప్రభావితం అవుతారని, ముందుగా తాము ఏర్పర్చుకున్న నిశ్చితాభిప్రాయానికి భిన్నంగా ఆలోచిస్తారని భావించడం అమాయకత్వమే. కొంత అనిశ్చిత పరిస్థితుల్లో ఉన్న ఓటర్లు మాత్రమే ఎన్నికల సమయంలో జరిగే ప్రచారాలకు, పరిణామాలకు ప్రభావితమవుతారు. 1991లో రాజీవ్ గాంధీ హత్య జరిగినప్పుడు తొలి దశ ఫలితాలకు, మలిదశ ఫలితాలకూ మధ్య వ్యత్యాసం స్పష్టంగా కనపడింది. ఇప్పుడా పరిస్థితులేమీ లేవు. నిజానికి దేశంలో చాలా చోట్ల ప్రజలు తాము ఎవరికి ఓటు వేయాలో ఎన్నికలకు చాలా ముందే నిర్ణయించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ లాంటి చోట్ల ఇలాంటి పరిస్థితులు చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయి.

దేశంలో మూడు వాదనలు ఇప్పుడు ఎదురవుతున్నాయి. మోదీపై జనాదరణ ఏ మాత్రం తగ్గలేదని ఆయన మళ్లీ భారీ మెజారిటీతో అధికారంలోకి వస్తారని ఒక వర్గం చెబుతోంది. ఉత్తరప్రదేశ్ లాంటి చోట్ల బీజేపీకి సీట్లు పెరుగుతాయే కాని తగ్గే అవకాశాలులేవని వారు వాదిస్తున్నారు. మోదీకి కనీసం 70 నుంచి వంద సీట్లు తగ్గుతాయని, ఆయన మళ్లీ ప్రధానమంత్రి కావడం కష్టమని ఇంకో వర్గం చెబుతోంది. 2004లో వాజపేయికి తిరుగులేదని అందరూ భావించారని, భారతదేశం వెలిగిపోతుందన్న ప్రచారాన్ని ఆర్భాటంగా జరిపారని, అయినప్పటికీ ప్రజలు బీజేపీని తిరస్కరించి యూపీఏను అధికారంలోకి తీసుకువచ్చారని వారు గుర్తు చేస్తున్నారు. అందువల్ల ఈ ఎన్నికలను 2004లో జరిగిన ఎన్నికలతో పోల్చవచ్చని వారు వాదిస్తున్నారు. ఇక మూడోవర్గం మోదీ, బీజేపీ చెప్పుకుంటున్నట్లు ఎన్డీఏకు 400 సీట్లు రాకపోయినా అధికారంలోకి రావడం ఖాయమని వాదిస్తోంది. 2019కీ, ఇప్పటికీ పరిస్థితుల్లో తేడా లేదని, కాకపోతే కొన్ని రాష్ట్రాల్లో సీట్లు తగ్గినా ఎన్డీఏ ప్రభుత్వంలోకి రావడం ఖాయమని వారు వాదిస్తున్నారు. ఏదో గొప్ప పరిణామం జరిగి బీజేపీ 200 సీట్ల కంటే తక్కువకు పడిపోతుందన్న విషయం వారు ఏ మాత్రం అంగీకరించడం లేదు.

అయితే బీజేపీ ఈ దేశంలో మెజారిటీ వాద పార్టీగా అవతరిస్తుందని మోదీ సమర్థకులు, వ్యతిరేకులు ఇరువురూ అంగీకరిస్తున్నారు. 2014లో కాంగ్రెస్, మిత్రపక్షాలు ఎదుర్కొంటున్న వ్యతిరేక పవనాలు బీజేపీ ఇప్పుడు ఎదుర్కోవడంలేదని వారే చెబుతున్నారు. ఉచిత రేషన్, కశ్మీర్‌లో 370 రద్దు, రామమందిర నిర్మాణం, విదేశాల్లో దేశ ఆత్మగౌరవాన్ని కాపాడడం వంటి నాలుగు అంశాలే ప్రజలు తమకు చెబుతున్నారని, బీజేపీ పట్ల వారి ఆదరణకు ఇదే కారణమని యోగేంద్ర యాదవ్, సుధీంద్ర కులకర్ణి వంటి రాజకీయ విశ్లేషకులు కూడా అంగీకరిస్తున్నారు. అయితే ధరల పెరుగుదల, నిరుద్యోగం, రైతుల సమస్యలు, దైనందిన జీవన సమస్యల విషయంలో మోదీ హయాంలో ఏమీ మార్పులేదని గ్రహించినందువల్ల బీజేపీకి సీట్లు తగ్గే అవకాశాలున్నాయని వారు వాదిస్తున్నారు. 2019లో మోదీకి ఓటు వేసిన వారిలో అనేకమంది ఇప్పుడు పునరాలోచనలో పడ్డారని వారి అభిప్రాయం. కర్ణాటకలో 10 సీట్లు, మహారాష్ట్రలో 20 సీట్లు, రాజస్థాన్, గుజరాత్‌లలో 10 సీట్లు, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్‌లలో 10 సీట్లు, హర్యానా, ఢిల్లీ, పంజాబ్, హిమాచల్ లలో 10 సీట్లు, ఉత్తరప్రదేశ్, బిహార్‌లలో 30 సీట్లు, పశ్చిమ బెంగాల్, అస్సాం, ఇతర ఈశాన్య రాష్ట్రాలు, కేంద్ర ప్రాంత పాలిత రాష్ట్రాల్లో 10 సీట్లు కనీసం తగ్గిపోతాయని యోగేంద్ర యాదవ్ ఇటీవల ఒక టీవీ ఇంటర్వ్యూలో చెప్పారు. అయితే ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, తెలంగాణ రాష్ట్రాల్లో ఎన్డీఏకు సీట్లు పెరుగుతాయని ఆయన అన్నారు. ఈ వాదనను చాలా మంది బీజేపీ యేతర వర్గాలు ప్రచారం చేస్తున్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీజేపీ 210–240 సీట్లు దాటదని తొలుత ప్రకటించారు. ఎన్డీఏ 400 సీట్లు సాధించాలంటే పాకిస్థాన్‌ను గెలవాల్సి ఉంటుందని చమత్కరించారు. శరద్ పవార్ కూడా ఈ వాదనను సమర్థించారు. బీజేపీ 220 సీట్లు దాటదని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అంటే, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా కమలనాథులకు 200 కూడా దాటవని చెబుతున్నారు. ఇక రాహుల్ గాంధీ అందరికంటే ఒకడుగు ముందుకు వేసి బీజేపీకి 150 సీట్లు మించవని చెబుతున్నారు. అంటే దేశంలో బీజేపీయేతర వర్గాలన్నీ ఒకే వాదన వినిపిస్తున్నాయని అర్థమవుతోంది. అసలు తమకెన్ని వస్తాయో చెప్పకుండా బీజేపీ కెన్ని వస్తాయో వారు అంచనా వేయడమే ఆశ్చర్యకరం. బీజేపీ నష్టమే తమకు లాభమని వారు భావిస్తున్నారు.

ఎన్డీఏ 400 సీట్లు, బీజేపీ 370 సీట్లు సాధించాలన్న లక్ష్యంతో మోదీ జనవరిలోనే తన ప్రచారాన్ని ప్రారంభించారు. 1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో నెహ్రూ సాధించిన 364 సీట్ల రికార్డును అధిగమించాలని, కశ్మీర్‌లో 370 అధికరణ రద్దును ప్రేరణగా తీసుకొని పనిచేయాలని ఆయన భారత మండపంలో పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. రాను రానూ సంక్లిష్టంగా మారిన పరిస్థితుల్లో మోదీ ఈ లక్ష్యం సాధించడం కష్టమని బీజేపీ నేతలే అనేకమంది అంగీకరిస్తున్నారు. భారీ లక్ష్యం విధిస్తే కార్యకర్తలు ఉత్సాహంతో పనిచేస్తారన్న ఉద్దేశంతోనే మోదీ ఈ ప్రకటన చేశారని వారు అభిప్రాయపడుతున్నారు. ఉత్తర ప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ, బిహార్‌లో ఆర్జేడీ, వామపక్షాలు, ఢిల్లీలో ఆప్, మహారాష్ట్రలో ఎన్సీపీ, శివసేన వర్గాలతో కాంగ్రెస్ చేతులు కలిపి, సామాజిక న్యాయాన్ని ఎజెండాగా మార్చి 2019 ఎన్నికల్లో కంటే ఈ సారి మరింత సంఘటితంగా రంగంలోకి దిగడంతో ఈ రాజకీయ పోరు క్రమంగా సైద్ధాంతిక పోరుగా పరిణమించింది. దీనికి తోడు దేశంలో మోదీని వ్యతిరేకిస్తున్న శక్తులన్నీ ఏకమై ఈ పోరును మరింత దట్టంగా మార్చాయి. దేశంలో అలముకున్న ఈ దట్టమైన కారుమేఘాలు జూన్ 4న చెదిరిపోయి ఒక స్పష్టత ఏర్పడినప్పుడు దేశం ఎటుపోతుందో చెప్పడం సాధ్యం.

(ఆంధ్రజ్యోతి డిల్లీ ప్రతినిధి)




గతంలో ఎన్నడూ లేనంతగా దేశంలో రెండు వాదాలు ఈ ఎన్నికల్లో హోరా హోరీ పోరాడుతున్నాయి. తెలిసో, తెలియకో, ఆలోచించో, అన్యమనస్కంగానో ప్రజలు రెండు శిబిరాల్లో ఏదో ఒక శిబిరంలో చేరారు. రెండు దశాబ్దాల క్రితం నిలదొక్కుకునేందుకు నానా అగచాట్లు పడిన ఒక పార్టీ ఇవాళ దేశంలోనే ప్రబల శక్తిగా మారింది. ఆ శక్తిని ఢీకొనేందుకు ఇప్పుడు ఇతర వర్గాలన్నీ తమ అంతర్వైరుధ్యాలన్నీ మరిచి ఏకం కావల్సిన చారిత్రక ఆవశ్యకతను గ్రహించాయి. మేధావులు, ప్రజాస్వామిక వాదులు, సమాజం ఫలానా విధంగా ఉండాలని కోరుకుంటున్న బుద్ధి జీవులు సైతం విడిపోయారు. అందువల్ల స్పష్టంగా ఆలోచనల మధ్య సమరం జరుగుతున్న ఎన్నికలు ఇవి.

విమర్శలో విశిష్ట తరంగం

తెలుగు సాహిత్యంలో మార్క్సిస్టు సాహిత్య విమర్శకు ఉత్తమమైన సంప్రదాయం ఉంది. అనేకమంది మార్క్సిస్టు విమర్శకులు తెలుగు సాహిత్య వికాసాన్ని అందులో అభివ్యక్తమైన రకరకాల సాహిత్య సామాజిక అంశాలను విశ్లేషించడానికి కృషి చేశారు. అభ్యుదయ సాహిత్య కాలంలో జీవీ కృష్ణారావు, తర్వాత మద్దుకూరి చంద్రశేఖర రావు, కొడవటిగంటి, కెవిఆర్, రారా, వెల్చేరు, చేకూరి రామారావు, బాలగోపాల్ లాంటివాళ్ళు తెలుగు మార్క్సిస్టు విమర్శకు కలిగించిన దోహదం ఎంతో విలువైనది.

పలువురు మార్క్సిస్టు విమర్శకులు ఆధునిక సాహిత్యానికి మాత్రమే పరిమితమైన కాలంలో సంప్రదాయ సాహిత్యాన్ని అధ్యయనం చేయాల్సిన అవసరాన్ని గుర్తించడంలో, అందుకు ఉపకరించే మార్గాలను అన్వేషించడంలో కేకేఆర్ చూపిన శ్రద్ధ అత్యంత ప్రశంసనీయమైంది. అంతేకాదు, భారతీయ లాక్షణిక గ్రంథాలను సైతం అధ్యయనం చేసే మార్గాన్ని ప్రవేశపెట్టడంలో వారి కృషి ఎంతో విలువైనది. ప్రాచీన సాహిత్య అధ్యయనానికి చరిత్రలో గాఢమైన అధ్యయనం, చరిత్ర పరిశోధన పట్ల గౌరవం ఉంటే తప్ప సాహిత్యానికి అనువర్తింపజేయడంలో సరియైన అవగాహన రూపొందదు. చారిత్రక అవగాహనకు సాహిత్యం ఎంతగా ఉపకరిస్తుందో, సాహిత్య అవగాహనకు చరిత్ర అంతగా దోహదపడుతుంది.



ఆధునిక సాహిత్యాన్ని అర్థం చేసుకోవాలంటే ఆధునిక సమాజ లక్షణాలు అర్థం కావాలని కేకేఆర్ చెబుతారు. ఆధునికత అనేది కాలవాచి కాదని, జీవన విధానంలోను సామాజిక సంబంధాల్లోను వచ్చే మార్పులను అర్థం చేసుకోగలిగితే సామాజిక స్వరూపాన్ని, ఆ సమాజంలో వచ్చే సాహిత్యాన్ని అర్థం చేసుకోగలమని కేకేఆర్ భావన.

భారతీయ చారిత్రక అంశాలను అధ్యయనం చేసిన పలువురు చరిత్రకారులు మార్క్సిస్టు సిద్ధాంతాన్ని ప్రధాన దృక్పథంగా స్వీకరించినా వారిలో చాలామంది ఏ పార్టీకి అనుబంధం కలిగిన వారు కాదు. అంతే కాదు, వారి రచనల్లో పదేపదే మార్క్స్ కొటేషన్స్ కూడా కనబడవు. అది చాలా తెలివిడిగా ఆయా చరిత్రకారులు అనుసరించిన పద్ధతిగా తదనంతర విశ్లేషకులు భావించారు. తమ సాహిత్య అవగాహనకు ఆయా చరిత్రకారుల రచనలను ఆకరంగా స్వీకరించిన కేకేఆర్ చరిత్రకారుల స్ఫూర్తిని స్వీకరించినట్లుగా మనం గుర్తించవచ్చు. కేకేఆర్ రచనల్లో సహితం పదేపదే ఆయా మూల రచయితల కొటేషన్స్ గానీ, చరిత్రకారుల ఉద్ధరణలు గాని అధికంగా కనిపించవు. కేకేఆర్ చారిత్రక అవగాహనను డిడి కోశాంబి, సాహిత్య అవగాహనను రెమెండ్ విలియమ్స్ లాంటి వారు ప్రభావితం చేశారు.

నన్నయ తెలుగు సాహిత్యంపై గాఢమైన ప్రభావాన్ని వేయడానికి కేవలం మహాభారతాన్ని అనువదించడం వల్ల కాక, తమ కాలం నాటికి అవసరమైన ఎన్నో మార్పులను కావ్య రచనలో ప్రవేశపెట్టారని కొన్ని సామాజిక అంశాల్లో సమకాలీన వైదిక ఆధిపత్యానికి సంబంధించిన భావనలను చాలా బలంగా ప్రతిపాదించారని, అందువల్లనే వైదిక సంప్రదాయాన్ని అనుసరించిన అనేకమంది కవులకు నన్నయ ఆదర్శమయ్యారని నన్నయ చారిత్రక భూమికలో చాలా విపులంగా విశ్లేషించారు కేకేఆర్. అలాగే తెలుగు సాహిత్యం మరో చూపు, తెలుగులో తొలి సమాజ కవులు అనే గ్రంథాలకు కేకేఆర్ వేసిన ప్రణాళిక కూడా చాలా విలక్షణమైనది.

ఆస్థాన సాహిత్యానికి, ఆస్థానేతర సాహిత్యానికి, ప్రజా సాహిత్యానికి మధ్య అనేక అంతరాలు ఉంటాయని, ఆయా కవులు ఏ సామాజిక రాజకీయ నేపథ్యం నుంచి తమ సాహిత్యాన్ని వెలువరించారో ప్రత్యేకంగా విశ్లేషించడం ద్వారానే వారి రచనలకున్న ప్రాసంగికతను అర్థం చేసుకోవడానికి వీలవుతుందని కేకేఆర్ ఆ గ్రంథాల్లో విపులంగా చర్చించారు. భారతీయ సాహిత్యాన్ని అధ్యయనం చేసే సమయంలో భక్తి సాహిత్యాన్ని గురించి ఎంతో విశేషమైన సమాచారం ఉంది కానీ తెలుగులో చాలా పరిమితంగా మాత్రమే అధ్యయనాలు జరిగాయి. అందుకు ప్రధాన కారణం తెలుగులో అదొక ప్రధాన స్రవంతి కాకపోవడం. అయినా అది అందించిన చైతన్యాన్ని గూర్చి అధ్యయనం చేయాల్సిన అవసరాన్ని ఈ పుస్తకాలలో చాలా వివరంగా చర్చించి, భక్తి భావనకున్న సాహిత్య సామాజిక నేపథ్యాన్ని ప్రామాణికంగా నిరూపించగలిగారు.

కేకేఆర్ చాలా విలువైన వ్యాసాల్లో 'భాష, సాహిత్యం, కవిత్వంలో అలంకారాలు' అనేది ఒకటి. భారతీయ అలంకార శాస్త్రం పట్ల మార్క్సిస్టు విమర్శకులలో చాలా పరిమితమైన అవగాహన ఉంది. తెలుగు వారిలో ఒకరకంగా దాని పట్ల తీవ్ర అసహిష్ణుత కూడా ఉంది. కానీ కేకేఆర్ భారతీయ అలంకార శాస్త్రాన్ని చాలా సానుకూల దృక్పథంతో అధ్యయనం చేయాల్సిన పద్ధతిని గూర్చి ఎంతో వివరంగా ఈ వ్యాసంలో చర్చించారు. రసం, ధ్వని, అలంకారం, వక్రోక్తి, ప్రతీకాత్మక అంశాలను పాశ్చాత్యులు ప్రతిపాదించిన రకరకాల సిద్ధాంతాలతో సమన్వయం చేస్తూ జరిపిన అధ్యయనం కేకేఆర్‌కి ప్రాచీన సాహిత్యం పట్ల ఉన్న గాఢమైన అభినివేశానికి తార్కాణంగా నిలుస్తుంది.

ఆధునిక సాహిత్యాన్ని అర్థం చేసుకోవాలంటే ఆధునిక సమాజ లక్షణాలు అర్థం కావాలని కేకేఆర్ చెబుతారు. ఆధునికత అనేది కాలవాచి కాదని, జీవన విధానంలోను సామాజిక సంబంధాల్లోను వచ్చే మార్పులను అర్థం చేసుకోగలిగితే సామాజిక స్వరూపాన్ని, ఆ సమాజంలో వచ్చే సాహిత్యాన్ని అర్థం చేసుకోగలమని కేకేఆర్ భావన. ఆధునిక భావజాలానికి, ఉత్తమ రచనా సంప్రదాయానికి గురజాడ ప్రవేశపెట్టిన పద్ధతి ఎంతగానో దోహద పడిందని కేకేఆర్ అభిప్రాయం. గురజాడ కన్యాశుల్కంలో స్వీకరించిన వస్తువు, ఉపయోగించిన భాష, కథల్లో ఆయన చర్చించిన సామాజిక విషయాలు ఆధునికతకు బలీయమైన పునాదులు వేశాయని అభిప్రాయపడ్డారు. అలాగే గిడుగు రామ్మూర్తి పంతులు వ్యవహారిక భాషావాద అవసరాన్ని గుర్తింపచేయడంలో, ఎన్నో భాషా శాస్త్ర సిద్ధాంతాలను అధ్యయనం చేసి ఆధునిక వ్యవహార రూపాన్ని అందించడానికి దోహదపడ్డారని 'నూరేళ్ల తెలుగునాడు'లో చర్చించారు.

ఏ రచయిత జీవితాన్ని గూర్చి విడిగా రాసినా ఆ వ్యక్తి ఏ భావాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడో వాటి మీద మాత్రమే కేకేఆర్ దృష్టి ఉండేది. ఆ వ్యక్తికి సంబంధించిన వ్యక్తిగత అంశాలను, వివాదాస్పద విషయాలను స్పృశించడం ఆయనకు అంతగా ఇష్టం ఉండేది కాదు. అందుకే అనవసర చర్చల కంటే విస్తృత ప్రజానీకానికి ఉపకరించే భావనలను మాత్రమే అధికంగా చర్చించడం చూస్తాం. ఆధునిక కాలంలో ఎంతో వివాదాస్పదంగా ఉన్న సంబంధాలను సుకుమారంగా స్పృశించి వదిలి వేసేవారు. వాటికంటే మరింత విలువైన విషయాలు చర్చించడం సాహితీ ప్రియులకు ఉపయోగమని భావించేవారు.


దిగంబరకవులతో వ్యక్తిగతంగా కేకేఆర్ గారికి చాలా సాన్నిహిత్యం ఉండేది. ఆ కవిత్వం వస్తున్న సమయంలోనే దాన్ని తూర్పారబట్టిన రారా లాంటి సుప్రసిద్ధ విమర్శకులు ఉన్నారు, ఈసడించుకున్న కవులూ ఉన్నారు. కానీ ఏ సామాజిక సాహిత్య ప్రయోజనం కోసమై యువ రచయితలు సమాజంలో ఆ కవిత్వాన్ని రచించారో తెలపడానికి ఎంతో సంయమనంతో పరిశీలించినవారు వెల్చేరు నారాయణరావు, కేకేఆర్ లే.

కేకేఆర్ సంపాదకత్వం వహించిన 'ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు' అనే గ్రంథం కలిగించిన సంచలనం సాధారణమైనది కాదు. ఆధునిక సాహిత్యంలోని ఎన్నో వాదాలను గూర్చిన చర్చ ఆనాటి పరిశోధకులకు, విద్యార్థులకు ఎంతగానో ఉపకరించింది. ఈనాటికి అధ్యయన అధ్యాపనాల్లో అది సజీవంగా కొనసాగుతూనే ఉంది. అటువంటి ప్రామాణికమైన పుస్తకాలను రూపొందించడంలోనూ, ఎన్నో విలువైన వ్యాసాలను రాయడంలోనూ కేకేఆర్ ప్రదర్శించిన ప్రజ్ఞ ఈనాటికీ ఆశ్చర్యాన్ని ఎంతో ఆనందాన్ని కలగజేస్తాయి. వారి రచనలన్నీ తెలుగు మార్క్సిస్టు సాహిత్య విమర్శ గాఢతను పట్టి చూపుతాయి.

■ ఆచార్య పిల్లలమర్రి రాములు
(నేడు కేకేఆర్ తృతీయ వర్ధంతి)


నోట్లు, తిట్ల ఐపీఎల్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఆటగాళ్ళపై కోట్లకు కోట్లు కుమ్మరించిన ఓనర్లు ఇప్పుడు ఆటగాళ్ళ స్థాయిని, వ్యక్తిత్వాన్ని సైతం ప్రశ్నిస్తున్న దృశ్యాలు చూస్తున్నాం. డ్రెస్సింగ్ రూమ్‌లో కనిపించాల్సినవన్నీ మైదానంలోనే కనిపిస్తుండటం ఆటగాళ్ళకు ఓనర్లు ఇస్తున్న 'విలువ' ఏంటో చెప్పకనే చెబుతున్నాయి. ఆటగాళ్ళను అమితంగా ఆరాధించే భారత క్రికెట్ ఫ్యాన్స్‌కు గత బుధవారం కనిపించిన దృశ్యం మింగుడుపడటం లేదు. సన్‌రైజర్స్ చేతిలో ఓటమి తర్వాత కేఎల్ రాహుల్ లాంటి ఆటగాడిని సంజీవ్ గోయంకా ఒక అనామకుడిని నిలదీసినట్టు, తిడుతున్నట్టు కనిపించింది. అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు ఎన్నో మ్యాచ్‌లు ఆడిన క్రికెటర్ ఇదే టీమ్‌ను ప్రతి సీజన్‌లో ప్లే ఆఫ్స్‌కు తీసుకెళ్ళిన కెప్టెన్... 2022లో లక్నో సూపర్ జెయింట్స్ ఏర్పడినప్పటినుంచి అదే జట్టుతో ఉన్నాడు. 7వేల 90 కోట్ల రూపాయల బిడ్‌తో ఈ ఫ్రాంచైజీని సంజీవ్ గోయెంకా ఆధ్వర్యంలోని ఆర్‌పీఎస్‌జీ గ్రూప్ దక్కించుకుంది. 2022లో టాప్ -3లో నిలిచిన ఎలఎస్‌జీ ఎప్పుడూ ఫైనల్‌కు చేరుకోలేదు. కానీ అదే జట్టుతో కలిసి అదే ఏడాది తెరమీదకు వచ్చిన గుజరాత్ టైటాన్స్ మాత్రం ఒకసారి చాంపియన్‌గా, మరోసారి ఫైనలిస్టుగా రికార్డు సొంతం చేసుకుంది. ఏదైనా అసంతృప్తి ఉంటే డ్రెసింగ్ రూమ్‌లోనో, మరోచోటనో ఆటగాళ్ళతో మాట్లాడాలి. కానీ ఇలా చేయడం ద్వారా ఏం చెప్పదల్చుకున్నారు? క్రికెట్‌ను వ్యాపారం చేసి, క్రికెటర్లను సరుకుగా చూస్తామనా? సన్‌రైజర్స్‌పై రాహుల్ ఆడిన ఇన్నింగ్స్ బాలేదు. అతను సెల్ఫిష్ ప్లేయర్ అనే విమర్శలూ ఉండొచ్చు. బంతిని 30 యార్డ్ దాటించడానికి కష్టపడిన ఇదే రాహుల్ ఒకప్పుడు 14 బంతుల్లో 50 పరుగులు కొట్టిన విషయం తెలియదా? ఇదే రాహుల్ ఒకప్పుడు బూమ్రాకు చుక్కలు చూపించలేదా? అతడు పేలవంగా ఆడి ఉండొచ్చు. కానీ ఎవరూ చెత్తగా ఆడాలని కోరుకోరు. మరి ఇదే సీజన్‌లో 260 రన్స్ కొట్టి ఓడిన తర్వాత కేకేఆర్ ప్లేయర్స్‌తో షారుక్ ఓ రోజు మాట్లాడలేదు. తర్వాతి రోజు కూడా బౌలర్లతో 'సెపరేట్' సెషన్ పెట్టుకున్నాడు. 2025 సీజన్‌కు ఈ ఏడాదే ఆటగాళ్ళ వేలం జరగనుంది. సంజీవ్ గోయెంకా గురించి తెలిసినవాళ్ళు కచ్చితంగా ఈసారి ఈ జట్టు రాహుల్‌ను వదిలేసుకుంటుందని అంచనా వేస్తున్నారు. 2017లో ఇదే సంజీవ్ గోయెంకా రైజింగ్ పుణె సూపర్ జెయింట్ ఓనర్. అప్పట్లో పుణె టీమ్ కెప్టెన్‌గా ఉన్న ధోనీని తీసివేసి, స్మిత్‌కు కెప్టెన్సీ ఇచ్చాడు. అలాంటి గోయెంకా ఇప్పుడు రాహుల్‌ను తప్పించినా ఆశ్చర్యం లేదు. అటు ముంబై ఇండియన్స్‌ను రోహిత్ వదిలేస్తాడనే వార్తలు కూడా ఉన్నాయి. ఈ టోర్నీ ప్రారంభ దశలో మ్యాచ్‌ల ఫలితాల కంటే రోహిత్ వర్సెస్ హార్దిక్ పాండ్యా వర్సెస్ నీతూ అంబానీ వివాదమే పెద్ద వార్త అయిపోయింది. చివరి దశకు వచ్చేసరికి ముంబై ఇండియన్స్‌ను వదిలేయడానికే సిద్ధమైనట్టు రోహిత్ వ్యాఖ్యానించాడనే వార్త వైరల్ అయింది. ఈ వివాదాలతోపాటు అసలు ఐపీఎల్‌లో క్రికెట్ స్ఫూర్తి, మజా ఏ మాత్రం కనిపించలేదు. అంపైర్ల పుణ్యమా అని ఈ ఐపీఎల్ కళ కోల్పోయింది. అలాగే ఆటగాళ్ళు -కామెంటేటర్ల వివాదం కూడా తొలిసారిగా తెరపైకి వచ్చింది. అలాగే ఆటగాళ్ళపై ఓనర్లు నోరు పారేసుకోవడమూ సాధారణమైపోయింది. చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మినహా మిగిలిన జట్లకు ఎలాంటి పర్మినెంట్ ఫ్యాన్ బేస్ లేదు. ఈ మూడు జట్లకు అలా మాస్ ఫ్యాన్స్ ఉన్నారంటే అందుకు ఓనర్లు, -క్రికెటర్ల మధ్య ఉన్న సత్సంబంధాలు, వాళ్ళను మేనేజ్‌మెంట్ చూసుకునే విధానం కూడా కూడా కారణం.



ఇప్పటికే చూసేవాడికి ఆడేవాడు లోకువయ్యాడు. వీటికితోడు నట్టింట కూర్చుని చూసే వాళ్ళు ఆటగాడి గురించి నెట్టింట బూతులు. ఇప్పుడు వీరికితోడు ఓనర్లు తయారయ్యారు. పండుగలాంటి క్రికెట్, గల్లీ-సిల్లీ గేమ్‌గా మారడం ఎంతో దూరంలో లేదు. ఇలాంటి వాతావరణం ఇలాగే కొనసాగితే క్రికెట్ సూపర్ స్టార్లు అవతరించరు. జంటిల్‌మాన్ గేమ్‌ను అమ్మేసిన ఐపీఎల్‌లో నికార్సయిన క్రీడా స్ఫూర్తిని ఆశించడం కూడా వృథాయేమో!.

– కేవీఎస్ తేజ

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి


మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 37.2 కనిష్ఠం 27.3

ఎవరి లెక్కలు వారివే!

పోలింగ్‌పై పార్టీలు, అభ్యర్థుల పోస్టుమార్టం

- ఏ వర్గం ఎవరికి అండగా నిలిచిందని ఆరా
- ప్రాంతాల వారీగా బలాలు, ప్రతికూలతల పరిశీలన
- అసెంబ్లీ ఎన్నికల్లో ఓ పార్టీకి, ఇప్పుడు మరో పార్టీకి..
- మనసు మార్చుకున్న ముస్లిం మైనార్టీ ఓటర్లు
- గెలుపోటములపై ప్రభావం
- సికింద్రాబాద్, మల్కాజిగిరిలో భిన్నమైన వాతావరణం
- పోలింగ్ రోజున తారుమారైన పరిస్థితులు

పార్లమెంట్ ఎన్నికల సమరం ముగిసింది. అభ్యర్థుల భవితవ్యం స్ట్రాంగ్ రూముల్లోని ఈవీఎంల్లో నిక్షిప్తమైంది. గెలుపోటములపై పార్టీలు, అభ్యర్థులు ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలు, అందుబాటులో ఉన్న పోలింగ్ కేంద్రాల వారీగా ఎక్కడ ఎన్ని ఓట్లు పడే అవకాశముందని అంచనా వేసుకుంటున్నారు. ఏ ప్రాంతంలో బలంగా ఉన్నాం..? ఎక్కడ పార్టీకి ప్రతికూల పరిస్థితులున్నాయన్న దానిపై ఇప్పటికే అవగాహన ఉన్న పార్టీల నేతలు.. ఆయా ప్రాంతాల్లో ఎంత పోలింగ్ నమోదైంది..? అది ఎవరికి లాభం..? ఎవరికి నష్టం అన్నది బేరీజు వేసుకుంటున్నారు.

హైదరాబాద్ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ పూర్తి కావడంతో ఎక్కడ ఏ పార్టీకి మొగ్గు ఉందనే అంశంపై ప్రధాన పార్టీల అభ్యర్థులు ఆరా తీస్తున్నారు. పార్టీ సీనియర్ నాయకులు, పోలింగ్ ఏజెంట్లతో కొందరు అభ్యర్థులు మంగళవారం సమావేశమయ్యారు. ట్రెండ్ ఎలా ఉంది, మీ ప్రాంతాల్లో ఏ పార్టీకి ఎన్ని ఓట్లు పడ్డాయి, మన పరిస్థితేంటని ఆరా తీశారు. ఏ వర్గం ఓట్లు ఎవరికి పడ్డాయి? బస్తీలు, మురికివాడల్లో పోలింగ్ నమోదు ఎలా ఉంది? గేటెడ్ కమ్యూనిటీ ఓటర్లు గడప దాటారా..? అన్నది తెలుసుకుంటున్నారు.

సికింద్రా'బాద్‌షా' ఎవరు?

సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో పోలింగ్‌రోజు క్షేత్రస్థాయి పరిస్థితులు పూర్తి భిన్నంగా ఉన్నాయన్న అభిప్రాయం వ్యక్తమైంది. రెండు పార్టీల మధ్య హోరాహోరీ పోరు ఉందని భావించగా, పరిస్థితులు తారుమారయ్యాయని పలువురు పేర్కొంటున్నారు. పార్లమెంట్ పరిధిలో 21 లక్షల మంది ఓటర్లు ఉండగా, 10 లక్షలకు పైగా (49.48) ఓట్లు పోలయ్యాయి. లోక్‌సభ లోని ఏడు నియోజకవర్గాల్లో 5 లక్షల వరకు ముస్లిం మైనార్టీ ఓటర్లుండగా, 2.50 లక్షల వరకు పోలయ్యాయని అంచనా. ఇందులో ఏ పార్టీకి ఎన్ని ఓట్లు పడ్డాయన్నది కీలకంగా మారనుంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓ పార్టీ వెంట ఉన్న వారు పార్లమెంట్ ఎన్నికలకు వచ్చే సరికి మరో పార్టీ వైపు మొగ్గు చూపారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో మెజార్టీ ఓట్లు మాత్రం ఓ జాతీయ స్థాయి పార్టీకి పడ్డాయన్న అభిప్రాయం క్షేత్రస్థాయి పరిశీలనలో తేలింది. ఇన్నాళ్లు మైనార్టీలు మా వెంటే ఉన్నారనుకున్న మరో పార్టీకి కొంత మేర నష్టమే అని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ ఎన్నికలను జాతీయ పార్టీల మధ్య పోరుగా మాత్రమే భావించడం ఇందుకు కారణంగా తెలుస్తోంది. మైనార్టీ ఓట్లలో మెజార్టీ ఒకే పార్టీకి వేసిన

మిగతా 6వ పేజీలో..



మల్కాజిగిరి.. మొగ్గు ఎవరికి..?

దేశంలోని అతి పెద్దదైన మల్కాజిగిరి నియోజకవర్గంపైనా మూడు ప్రధాన పార్టీలు ప్రత్యేక దృష్టి సారించాయి. అందుకనుగుణంగా అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం చేశారు. అగ్ర నేతలూ పలు ప్రాంతాల్లో జరిగిన ప్రచారంలో పాల్గొన్నారు. ఈ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ సిటింగ్ స్థానం. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 2019 ఎన్నికల్లో ఇక్కడి నుంచి దాదాపు 11 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. దీంతో ఎలాగైనా ఇక్కడ గెలిచేందుకు కాంగ్రెస్ సర్వశక్తులు ఒడ్డింది. సుదీర్ఘ రాజకీయ అనుభవం, ప్రత్యర్థులను అన్ని విధాలుగా ఎదుర్కొనే సమర్థత ఉన్న పట్నం కుటుంబానికి చెందిన సునీతారెడ్డిని బరిలో నిలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు ఉన్న ఈటల రాజేందర్ బీజేపీ తరఫున పోటీ చేశారు. ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డిని బీఆర్ఎస్ పోటీలో నిలిపింది. పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాలను 2023 శాసనసభా ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుచుకుంది. అదే పరిస్థితి ప్రస్తుతం ఉందా అంటే ఆ పార్టీ నేతలూ ఔనని చెప్పలేని పరిస్థితి నెలకొంది. కేంద్ర ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించిన ఎన్నికలు కావడం.. ఇతరత్రా అంశాల నేపథ్యంలో ఓటర్లు భిన్నంగా ఆలోచించారన్న

మిగతా 6వ పేజీలో..

హైదరాబాద్‌లో భారీ మెజారిటీపై
మజ్లిస్ ధీమా


6

చేవెళ్ల విజేత ఎవరో..?!



48.91 జిల్లాలో పెరిగిన పోలింగ్ శాతం

- 2019తో పోలిస్తే నాలుగు శాతం, 2023 అసెంబ్లీతో పోలిస్తే 3 శాతం అదనం
- ఓటరు అవగాహన కార్యక్రమాలతో పెరుగుదల
- 5.41 లక్షల ఓటర్ల తొలగింపూ కారణం



హైదరాబాద్ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌పై స్పష్టత వచ్చింది. నియోజకవర్గాల వారీగా పోలింగ్ వివరాలను జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రోస్ మంగళవారం వెల్లడించారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో 48.48, సికింద్రాబాద్‌లో 49.04, మల్కాజిగిరిలో 50.78, చేవెళ్లలో 56.40 శాతం పోలింగ్ నమోదైంది. సోమవారం రాత్రి వరకు పోలింగ్ కొనసాగడంతో మొత్తం వివరాల వెల్లడికి సమయం పట్టిందని అధికారులు తెలిపారు. కాగా, 2019 పార్లమెంట్, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే మహానగరంలో పోలింగ్ శాతం స్వల్పంగా పెరిగింది. కొన్ని ప్రాంతాల ఓటర్లు స్వస్థలాలకు వెళ్లినా

మిగతా 6వ పేజీలో..

నియోజకవర్గం	2019 (పార్లమెంట్)	2023 (అసెంబ్లీ)	2024 (పార్లమెంట్)
హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం			
మలక్‌పేట	37.40	41.53	42.76
కార్వాన్	48.44	48.91	51.23
గోషామహల్	53.51	54.78	54.72
చార్మినార్	45.90	43.38	48.53
చాంద్రాయణగుట్ట	45.63	45.51	49.15
యాకుత్‌పురా	37.52	39.77	43.34
బహదూర్‌పురా	47.54	45.39	50.70
మొత్తం	44.75	45.61 (సగటు)	48.48
సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం			
ముషీరాబాద్	48.42	50.76	49.09
అంబర్‌పేట	52.70	52.86	51.65
జూబ్లీహిల్స్	49.53	47.58	45.59
ఖైరతాబాద్	39.80	52.33	50.25
సనత్‌నగర్	47.97	51.05	49.45
సికింద్రాబాద్	38.77	53.76	52.48
నాంపల్లి	50.56	45.76	46.59
మొత్తం	46.26	50.58	49.04
కంటోన్మెంట్	47.85	49.65	51.61
జిల్లా మొత్తం	45.65	47.88	48.91

నోట్ : అంకెలన్నీ శాతాల్లో

ఈదురుగాలులకు స్తంభాలపైకి బ్యానర్లు, కవర్లు..

విద్యుత్ సరఫరాలో కోతలు

హైదరాబాద్ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): హోర్డింగులకు కడుతున్న బ్యానర్లు, భవన నిర్మాణ సమయంలో కట్టే ప్లాస్టిక్ కవర్లు ఈదురుగాలులకు విద్యుత్‌తీగలపై పడి సరఫరాలో అంతరాయాలకు కారణం అవుతున్నాయి. వారం రోజుల క్రితం నగరంలో ఈదురుగాలులు, భారీ వర్షం కారణంగా హోర్డింగులకు కట్టిన బ్యానర్లు, కవర్లు తెగి పలు ప్రాంతాల్లో విద్యుత్‌తీగలపై పడటంతో గంటలకొద్దీ సరఫరా నిలిచిపోయింది. ఒక్క 33 కేవీ ఫీడర్ నిలిచిపోతే దాని ప్రభావంతో 4-5 సబ్‌స్టేషన్లలో సరఫరా నిలిచిపోయి ఆయా ప్రాంతాల్లో సమస్యలు తలెత్తాయి. సైబర్‌సిటీ, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, మేడ్చల్ శివారు సర్కిళ్లలో 33 కేవీ విద్యుత్ లైన్లలోనే ఈ తరహా సమస్యలు ఎక్కువగా ఏర్పడుతున్నాయి. బ్యానర్లు విద్యుత్‌లైన్లపై పడటంతో వారం రోజుల్లో 40కి పైగా 11 కేవీ ఫీడర్లు ట్రిప్పయ్యాయి. 15 ప్రాంతాల్లో 33 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడ్డాయి. 11 కేవీ లైన్లు తక్కువ ఎత్తులో ఉండటం వల్ల వాటిపై పడ్డ బ్యానర్లను వెంటనే తొలగిస్తున్నామని, 33 కేవీ ఫీడర్లు బాగా ఎత్తులో ఉండటం వల్ల క్రేన్ సహాయంతో తొలగించాల్సి వస్తోందని, అందువల్ల ఫీడర్ల పునరుద్ధరణలో జాప్యం జరుగుతున్నదని ఉన్నతాధికారులు చెబుతున్నారు.


ఈదురుగాలులకు విద్యుత్ తీగలపై పడిన బ్యానర్లు, కవర్లు

కమలనాథుల కదనోత్సాహం





ఓటింగ్ సరళిపై సంతృప్తి
సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్లలో గెలుపుపై ధీమా

హైదరాబాద్ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ఓటింగ్ సరళి తమకు అనుకూలంగా ఉందని, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల నియోజకవర్గాల్లో గెలుపు అవకాశాలు ఉన్నాయని బీజేపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మంచి మెజార్టీతో సీట్లు కైవసం చేసుకుంటామని, హైదరాబాద్ నియోజకవర్గంలో ఓటింగ్ శాతం పెరుగుతుందని భావిస్తున్నారు. ఈసారి ప్రధాని మోదీ హవా బాగా కనిపించిందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యర్థులకు ఓటు వేసిన వారు లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి వేశారని నాయకులు పేర్కొంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్‌లో తక్కువ స్థానాలు రావడంతో లోక్‌సభ ఎన్నికలను బీజేపీ నాయకులు సవాల్‌గా తీసుకున్నారు. గ్రేటర్ పరిధిలోని నాలుగు స్థానాల్లో గట్టి అభ్యర్థులను నిలబెట్టారు. సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్లలో హేమాహేమీలను బరిలోకి దింపడంతో విజయం ఖాయమనే నిర్ణయానికి వచ్చారు.

సికింద్రాబాద్‌లో కమలమేనా..!!

సిట్టింగ్ స్థానమైన సికింద్రాబాద్‌ను మరోసారి కైవసం చేసుకుంటామనే ధీమాతో ఉన్నారు. 1991, 98, 99, 2014, 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడ పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. కిషన్ రెడ్డి రెండో సారి మంచి మెజార్టీతో విజయం సాధిస్తారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ నుంచి గట్టి పోటీ ఉన్నా మోదీ హవా కలిసి వచ్చిందని అంటున్నారు. మరో వైపు బీఆర్ఎస్ ఓటింగ్ కూడా బీజేపీకి పడినట్లు అంచనా వేస్తున్నారు.

మల్కాజిగిరిలో గెలుపుపై ఆశ

మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గంలో ఈటల రాజేందర్ గెలుపు తథ్యమని పార్టీ వర్గాలు గట్టి నమ్మకంతో ఉన్నాయి. మొదటి నుంచి మల్కాజిగిరి స్థానంపై బీజేపీ ఆశలు పెట్టుకుంది. పోలింగ్ సరళి చాలా ప్రాంతాల్లో బీజేపీకి అనుకూలంగా ఉన్నట్లు భావిస్తున్నారు. విద్యాధికులు, కాలనీ ఓటర్లపై బీజేపీ ఆశలు పెట్టుకుంది. మరో వైపు ఈటల రాజేందర్ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటనలు చేయడం పార్టీకి కలిసి వచ్చినట్లు భావిస్తున్నారు.

హైదరాబాద్‌లో సత్తా చూపుతుందా..!!

ప్రతి ఎన్నికలో పాతబస్తీలో కమలం సత్తా నిరూపించుకునేందుకు ప్రయత్నం చేసింది. జనసంఘ్‌గా ఉన్నప్పటి నుంచి హైదరాబాద్ స్థానం నుంచి పోటీ చేస్తున్నది. ఈసారి ఇక్కడి నుంచి బీజేపీ తరఫున మాధవీలత పోటీలో ఉన్నారు. గతంలో కంటే ఎక్కువ ఓట్లు బీజేపీకి వస్తాయని ఆశతో ఉన్నారు. పది వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తానని అభ్యర్థి మాధవీలత ధీమా వ్యక్తం చేస్తున్నారు. పార్టీకి పట్టున్న గోషామహల్, కార్వాన్‌లో ఓటింగ్ సరళి తమకు అనుకూలంగా ఉందని పార్టీ అంచనా వేస్తున్నది. చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురాలో కూడా బీజేపీకి ఓట్లు అధికంగానే పడ్డాయని అంచనా వేస్తున్నారు. గతంలో వచ్చిన ఓట్ల కంటే ఈసారి ఎక్కువగా వస్తాయని అంచనా వేస్తున్నారు. ఈసారి హైదరాబాద్‌లో పోలింగ్ శాతం ఎక్కువ నమోదు కావడం తమకు లాభిస్తుందని బీజేపీ వర్గాలు భావిస్తున్నాయి.


ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో స్ట్రాంగ్ రూమ్ వద్ద సెక్యూరిటీ బందోబస్తు

'స్ట్రాంగ్'గా భద్రత

- స్ట్రాంగ్‌రూంల వద్ద కేంద్ర, రాష్ట్ర బలగాలు
- బందోబస్తును పర్యవేక్షిస్తున్న సీపీలు

హైదరాబాద్ సిటీ, మే14 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గంతో పాటు.. హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికలు సోమవారం ముగిశాయి. ట్రై కమిషనరేట్స్ పరిధిలో 29 వేల మంది కేంద్ర, రాష్ట్ర పోలీస్ బలగాలతో బందోబస్తు నిర్వహించి ప్రశాంతంగా ఎన్నికలు పూర్తయ్యేలా చేశారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను పటిష్టమైన భద్రత మధ్య స్ట్రాంగ్‌రూమ్‌లకు చేర్చారు. అక్కడ మూడంచెల భద్రత ఏర్పాటు చేసి సీపీలు బందోబస్తును స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. స్ట్రాంగ్‌రూమ్ ఆవరణ లోపల కేంద్ర సాయుధ బలగాలు, బయట రాష్ట్ర పోలీస్ బలగాలను భారీగా మోహరించారు. అక్కడి బందోబస్తును ఉన్నతాధికారులు పర్యవేక్షించేలా సీసీటీవీలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశారు.


ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి ఆధ్వర్యంలో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని స్ట్రాంగ్‌రూమ్‌కు సీలు వేస్తున్న అధికారులు

సీల్ వేసిన అధికారులు

మేడ్చల్ మే 14(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గంలో వినియోగించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం)లను కీసర, భోగారంలోని హోలీమేరీ కాలేజీ, సరూర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియం, వెస్లీకాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచారు. నియోజకవర్గ అబ్జర్వర్ డాక్టర్ ప్రియాంక శుక్లా, జిల్లా రిటర్నింగ్ అధికారి గౌతమ్, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్‌లకు సీల్ వేశారు.

చేవెళ్ల పార్లమెంట్ పరిధి గొల్లపల్లి గ్రామంలోని బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లకు అభ్యర్థులు వారి ఏజెంట్ల సమక్షంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేందర్‌కుమార్ కటారియా సీల్ వేశారు. చేవెళ్ల నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక, వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు.

కునుకు లేకుండా పహారా

- శక్తివంచన లేకుండా పనిచేసిన పోలీసులు



హైదరాబాద్ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి పోలీస్ సిబ్బంది విధి నిర్వహణలో నిమగ్నమయ్యారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే పార్లమెంట్ ఎన్నికలను సైతం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలీసులు శక్తివంచన లేకుండా పనిచేసినట్లు పోలీస్ ఉన్నతాధికారులు తెలిపారు. ఒకవైపు బందోబస్తులు, మరోవైపు ఏసీపీ నుంచి సీపీల

మిగతా 6వ పేజీలో..


సొంతూరిలో ఓటుహక్కు వినియోగించుకొని నగరానికి చేరుకుంటున్న జనం

తిరుగు ప్రయాణాలతో
రద్దీగా బస్టాండ్లు

- జిల్లాల నుంచి స్పెషల్ సర్వీసులు

హైదరాబాద్ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): ఓటు వేసేందుకు సొంతూళ్ల బాట పట్టిన నగరజనం తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటున్నారు. దీంతో ఎంజీబీఎస్, జేబీఎస్ తిరుగు ప్రయాణికులతో మంగళవారం రద్దీగా మారాయి. ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాలకు గ్రేటర్ నుంచి రెగ్యులర్ సర్వీసులతో పాటు 10, 11, 12 తేదీల్లో 1,145 ప్రత్యేక సర్వీసులను టీఎస్ ఆర్టీసీ నడిపింది. తిరుగు ప్రయాణికుల కోసం తెలంగాణ, ఏపీ జిల్లాల నుంచి రద్దీకి అనుగుణంగా బస్సులు నడుపుతున్నామని అధికారులు చెబుతున్నారు.

సీబీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో 'ఆక్స్‌ఫర్డ్' విజయదుందుభి

● పదేళ్లుగా 100 శాతం ఉత్తీర్ణత
● ఏ-1 గ్రేడ్ సాధించిన విద్యార్థులు ఏడుగురు

హైదరాబాద్ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ ఫలితాల్లో హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ 100 శాతం ఉత్తీర్ణత సాధించిందని కరస్పాండెంట్ కట్టా ప్రభాకర్ తెలిపారు. పదేళ్లుగా తమ పాఠశాల విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణులవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యాయుల అంకితభావం, యాజమాన్య మార్గదర్శకత్వం కారణంగా ఇటువంటి ఫలితాలు సాధ్యమయ్యాయని వెల్లడించారు. పదోతరగతి పూర్తి చేసిన వారిలో ఏడుగురికి ఏ-1 గ్రేడ్ లభించిందని, వద్దాని అనన్య 97 శాతం, సయ్యద్ ఫహీద్ జంగ్ 96.5 శాతం, చన్నా విశ్వేష్ 95.7 శాతం మార్కులతో తొలి మూడు స్థానాల్లో నిలిచారని పేర్కొన్నారు. 100 శాతం ఫలితాల సాధనకు కృషి చేసిన వైస్‌చైర్ పర్సన్ మణికొండ ప్రార్థనకు, పాఠశాల ఉపాధ్యాయులకు కరస్పాండెంట్ కట్టా ప్రభాకర్ అభినందనలు తెలిపారు.


ఏ-1 గ్రేడ్ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న వైస్ చైర్‌పర్సన్ మణికొండ ప్రార్థన

హైదరాబాద్‌లో భారీ మెజారిటీపై మజ్లిస్ ధీమా

● పోలింగ్ శాతం తగ్గినా.. గెలుపుపై భరోసా ● పోల్ మేనేజ్‌మెంట్‌తో ప్రత్యర్థులను చిత్తు చేసిన మజ్లిస్

హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ లోక్‌సభ స్థానం మజ్లి‌స్‌కు కంచుకోటగా మరోసారి రుజువు చేసుకుంటుందని ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సరళిని విశ్లేషించిన మజ్లిస్ పార్టీ వర్గాలు 2019 నాటి ఎన్నికల కంటే మరింత మెజారిటీతో అసదుద్దీన్ ఒవైసీ విజయం సాధించి తీరుతారని ఆ పార్టీ నేతలు విశ్వాసంతో ఉన్నారు. 1984లో మొదటిసారిగా హైదరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకున్న మజ్లిస్ ప్రతీసారి ఎన్నికల్లో విజయం సాధిస్తూ వచ్చింది. 1984 నుంచి 1999 వరకు ఆరుసార్లు జరిగిన లోకసభ ఎన్నికల్లో సుల్తాన్ సలాఉద్దీన్ ఒవైసీ విజయం సాధించగా, ఆ తర్వాత 2004 నుంచి 2019 వరకు నాలుగుసార్లు జరిగిన ఎన్నికల్లో మజ్లిస్ అభ్యర్థిగా అసదుద్దీన్ ఒవైసీ భారీ మెజారిటీతో గెలిచారు. 2024లో సైతం మరింత మెజారిటీతో విజయం సాధిస్తామనే ధీమాతో ఉన్నారు. జాతీయ రాజకీయాల్లో ముస్లిం మైనారిటీల గొంతుకగా నిలిచిన అసదుద్దీన్ ఒవైసీ హైదరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని సుస్థిరం చేసుకుని కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. బీజేపీ విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఆలిండియా మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్(మజ్లిస్)ను ఈసారి ఓడించేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరించి మాధవీలతను ఆయనపై పోటీకి నిలబెట్టింది. మజ్లిస్‌కు చెక్‌పెట్టడానికే తాను రంగంలోకి దిగానని కొన్ని నెలలుగా మాధవీలత సోషల్ మీడియాలో భారీ ఎత్తున ప్రచారం చేసుకున్నప్పటికీ స్థానిక బీజేపీ యంత్రాంగాన్ని ఆశించిన స్థాయిలో వినియోగించుకోలేపోయినట్లు విమర్శలు వెల్లువెత్తాయి. పోలింగ్ బూత్‌లలో పార్టీ తరఫున ఏజెంట్‌లను నియమించుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కొన్నిప్రాంతాల్లో ఏకపక్షంగా పోలింగ్ జరిగినట్లు స్పష్టమవుతోంది. రాష్ట్రం మొత్తంలో హైదరాబాద్ పార్లమెంట్‌లోనే అత్యల్పంగా 48.48 శాతం ఓట్లు పోల్‌అయ్యాయి. అయినప్పటికీ పోల్ అయిన ఓట్లలో 60 నుంచి 70 శాతం వరకు మజ్లిస్‌కే పడినట్లు ఆ పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆరు మజ్లిస్ ఆధిపత్యంలో కొనసాగుతున్నాయి. గోషామహల్‌లో బీజేపీ నుంచి రాజాసింగ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మాధవీలతపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు బీఆర్‌ఎస్‌కు కొంత సానుకూలంగా ఉన్నట్టు తెలిసింది. అయినప్పటికీ గోషామహల్‌లో ముస్లిం మైనారిటీల ఓట్లన్నీ గంపగుత్తగా మజ్లిస్‌కు వస్తాయని ఆ పార్టీ నేతలు భరోసాతో ఉన్నారు. గోషామహల్‌లో 1,50,207 ఓట్లు పోల్ అయినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఇక కార్వాన్‌లో పోల్ అయిన 1,85,681 ఓట్లలో లక్షా 5వేలకు పైగా మజ్లిస్‌కు వస్తాయని స్థానిక నాయకులు అంచనా వేస్తున్నారు. మలక్‌పేట్‌లో పోల్ అయిన 1,35,807 ఓట్లలో 80వేలకు పైగా అసదుద్దీన్ ఒవైసీకి అనుకూలంగా వస్తాయని మజ్లిస్ నేతలు విశ్వాసంతో ఉన్నారు. ఇక్కడ ముస్లిం మైనారిటీలే కాకుండా మైనారిటీయేతరులు సైతం మజ్లిస్‌కు మద్దతుగా నిలిచినట్లు ప్రచారం జరిగింది. ఇక చార్మినార్‌లో పోల్ అయిన 1,11,761 ఓట్లలో 80 శాతానికి పైగా మజ్లిస్‌కు వస్తాయని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. ఇక్కడ ప్రత్యర్థి పార్టీలకు ఆశించిన స్థాయిలో ఓటర్ల మద్దతు లభించలేదు. కాగా, బహదూర్‌పురాలో పోలైన 1,63,204 ఓట్లలో లక్షకు పైగా ఓటర్లు మజ్లిస్‌కు మద్దతుగా నిలిచినట్లు స్పష్టమవుతోంది. ఇక్కడ బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులు నామమాత్రం. చాంద్రాయణగుట్టలో 1,71,826 ఓట్లలో లక్షా 25వేలకు పైగా మజ్లిస్‌కు అనుకూలంగా పోల్ అయినట్లు సమాచారం. ఇక్కడ మధ్యాహ్నం వరకు ఒకవర్గానికి అనుకూలం కన్పించగా సాయంత్రం వేళ ఓటింగ్‌కు రాని వారిని గుర్తించి మజ్లిస్ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను తీసుకువచ్చి ఓట్లు వేయించుకోవడంతో భారీ మెజారిటీ వస్తుందని ఆశిస్తున్నారు. యాకుత్‌పురాలో మజ్లిస్‌కు ధీటుగా ప్రత్యర్థి పార్టీలున్నప్పటికీ లోకసభ ఎన్నికల్లో సీన్‌మారింది. ఇక్కడ పోల్‌అయిన 1,56,341 ఓట్లలో లక్షకు పైగా ఓట్లు మజ్లిస్‌కు వస్తాయని ఆ పార్టీ నేతలు విశ్లేషిస్తున్నారు. హైదరాబాద్ పార్లమెంట్ స్థానంలో 2019లో మజ్లిస్ అభ్యర్థి అసదుద్దీన్ 5,17,100 ఓట్లతో సమీప బీజేపీ అభ్యర్థిపై 2.82 లక్షల మెజారిటీ సాధించారు. సోమవారం జరిగిన పోలింగ్‌లో 65 శాతానికి పైగా ఓట్లతో మరింత మెజారిటీ సాధించే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు సంపూర్ణ విశ్వాసంతో ఉన్నాయి.

చేవెళ్ల విజేత ఎవరో..?!

● పోలైన ఓట్లు.. అనుకూల ప్రతికూల ఓట్లపైన ఆరా
● కూడికలు, తీసివేతలతో గెలుపుపై ధీమాలో ఎవరికి వారే

రంగారెడ్డి అర్బన్/ పరిగి, మే 14 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల ఎంపీ స్థానంలో గెలుపు ఎవరిదనేది హాట్‌టాపిక్‌గా మారింది. ఇక్కడి నుంచి 43 మంది బరిలో ఉన్నప్పటికీ కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్‌ల మధ్యే ప్రధాన పోటీ జరిగింది. విజయం మాత్రం బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్యే ఉంటుందని తెలుస్తోంది. ఈక్రమంలో నాయకులు ఏ గ్రామంలో ఏ పార్టీకి ఎన్ని ఓట్లు పడ్డాయో తెలుసుకుంటున్నారు. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తప్పక గెలుస్తారని ఆయన వర్గీయులు చెబుతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుస్తారని ఆ పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. తన విజయం ఖాయమని బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ధీమాగా ఉన్నారు. గ్రామాల్లో హోటళ్లు, పాన్ షాప్‌లు, దుకాణాలు ఎక్కడ చూసినా పోలింగ్ సరళిపైనే చర్చలు సాగుతున్నాయి.

ఎవరి లెక్కలు వారివే!

(5వ పేజీ తరువాయి) పక్షంలో, ముస్లిమేతర ఓట్లలో ఏ పార్టీకి ఎంత శాతం వచ్చాయన్నది గెలుపోటములను నిర్ణయించనుంది. సిటింగ్ సీటు కావడంతో బీజేపీ ఈ స్థానంపై ప్రత్యేక దృష్టి సారించింది. గెలుపు అవకాశాలు తమకే ఉన్నాయని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ కూడా అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే మా పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరిగింది, విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తోంది. తమ అభ్యర్థికి 20 వేల మెజార్టీ వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలోని ఆరు స్థానాలు గెలుచుకున్నాం.. ఈ ఎన్నికల్లోనూ ప్రజాతీర్పు అలానే ఉండబోతుందని బీఆర్‌ఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఓట్ల చీలిక ఊహించని స్థాయిలో ఉండడం.. ఏ పార్టీకి లాభిస్తుందో..? ఎవరికి నష్టం కలుగుతుందో..? జూన్ 4న ఫలితాల వెల్లడి అనంతరం తేలనుంది.

మల్కాజిగిరి.. మొగ్గు ఎవరికి..?

(5వ పేజీ తరువాయి)

అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్‌కు అసెంబ్లీ ఎన్నికల స్థాయిలో ఓట్లు పడ్డాయా, ఇతర పార్టీలకు మళ్లాయా..? అదే జరిగితే ఏ పార్టీకి పోలయ్యాయి..? అన్నది కీలకంగా మారనుంది. ఈ లోక్‌సభ పరిధిలోని 5 లక్షల నుంచి 6 లక్షల వరకు ముస్లిం ఓటర్లు ఉంటారని చెబుతున్నారు. వారి మద్దతు ఎవరికి దక్కింది..? అన్నది ఆసక్తికరంగా మారింది. గెలుపోటములపై ఇది ప్రభావం చూపుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సిటింగ్ స్థానం, అధికారంలో ఉండడం మరింతగా కలిసి వస్తుందని, ఈ స్థానం ఎలాగైనా గెలుస్తామని కాంగ్రెస్ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈటల రాజేందర్‌కు ఉన్న పరిచయాలు, పార్టీ బలం, మోదీ మానియాతో మల్కాజిగిరిలో కాషాయ జెండా ఎగురవేస్తున్నామని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. 'రాష్ట్ర ఏర్పాటు అనంతరం శివారు నియోజకవర్గాల్లో ప్రభంజనం సృష్టిస్తున్నాం.. ఇప్పుడూ అదే పునరావృతమవుతుంది. గెలుపు మాదే' అని బీఆర్‌ఎస్ నేతలు పేర్కొంటున్నారు. 38 లక్షలకుపైగా ఓటర్లు ఉన్న మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో 50 శాతానికిపైగా పోలింగ్ నమోదైంది. 19 లక్షల ఓట్లలో ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చాయి..? ఏ వర్గం ఏ పార్టీని ఆదరించిందన్నది తేలాల్సి ఉంది.


భగీరథకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఘనంగా భగీరథ జయంతి

వివేకానందనగర్‌కాలనీ, మే 14 (ఆంధ్రజ్యోతి): జగద్గిరిగుట్టలో సగర సంఘం ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. భగీరథ విగ్రహానికి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భగీరథ మహనీయుడని కొనియాడారు. అనంతరం నిర్వహించిన శోభాయాత్ర, బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో మాధవరం రంగారావు, సంజీవరెడ్డి, కొండయ్యసాగర్, శ్రీనివాస్, రాజేష్, వెంకటస్వామి, రవి, ఆవుల వెంకటరాములు, రామస్వామిసాగర్ తదితరులు పాల్గొన్నారు.

● వాహనదారులకు షర్బత్ పంపిణీ


ఎండ నుంచి ఉపశమనం కలిగించేందుకు నారాయణగూడ ఫ్లైఓవర్ వద్ద వాహనదారులకు మంగళవారం కొందరు మహిళలు షర్బత్ పంపిణీ చేశారు. దీంతో వాహనదారులు వారికి కృతజ్ఞతలు తెలిపారు

ఫొటోలు: స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

కునుకు లేకుండా పహారా

(5వ పేజీ తరువాయి)

వరకు ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలతో సిబ్బంది ఉక్కిరిబిక్కిరి అయ్యారు.

మూడు షిఫ్టులు..

క్షేత్రస్థాయిలో ఎస్‌ఐ స్థాయి నుంచి సీపీ వరకు సిబ్బంది మొత్తం మూడు షిఫ్టుల్లో 24/7 పనిచేశారు. కొన్నిరోజులుగా పగలు, రాత్రి తేడా లేకుండా, కంటి నిండా నిద్రలేకుండా విధులు నిర్వహించారు. ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో ముగియడంతో ఊపిరి పీల్చుకున్నారు. ట్రై కమిషనరేట్ పరిధిలోని నియోజకవర్గాల్లో.. ఎన్నికల సంఘం అధికారులు గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు ఉన్న ప్రాంతాల్లో కేంద్ర సాయుధ బలగాలతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించి ప్రజల్లో ధైర్యాన్ని నింపారు. ముఖ్యంగా హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని పలు సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రతా దళాలను మోహరించి ప్రజలు స్వచ్ఛందంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు.

48.91
జిల్లాలో పెరిగిన పోలింగ్ శాతం

(5వ పేజీ తరువాయి)

నగరంలో 50 శాతం వరకు పోలింగ్ నమోదవడం గమనార్హం. లోక్‌సభ ఎన్నికలు అయినా.. ప్రధాన పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా భావించాయి. విస్తృతంగా ప్రచారం నిర్వహించిన అభ్యర్థులు ఓటు వేయాలని పౌరులను అభ్యర్థించారు. బూత్‌ల వారీగా పోల్ మేనేజ్‌మెంట్‌పైనా ప్రత్యేక దృష్టి సారించారు. ఓటుహక్కు వినియోగంపై జీహెచ్‌ఎంసీ అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. 2కే, 5కే రన్‌లు, ర్యాలీలు నిర్వహించడంతో పాటు ప్రౌడ్ టు బీ ఓటరు అనే సందేశంతో ప్రచారం నిర్వహించారు. ఆస్తిపన్ను చెల్లింపుదారుల మొబైల్ నంబర్లకు ఓటుహక్కు వినియోగించుకోవాలనే సందేశాలు పంపారు. కేంద్ర ఎన్నికల సంఘం నుంచీ ఓటు మీ స్వరం.. తప్పకుండా వినిపించాలనే మెసేజ్‌లు వచ్చాయి. పోలింగ్ కేంద్రాల చిరునామా, అక్కడ క్యూ ఎంత ఉందనేది మొబైల్ యాప్ ద్వారా తెల్సుకునే అవకాశం ఉండడమూ ఓటర్లు గడప దాటేందుకు దోహదపడిందని ఎన్నికల విభాగం అధికారొకరు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించిన ఎన్నికలు కావడం.. ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో గతంలో ఓటు వేయని వారూ పోలింగ్ కేంద్రాలకు వచ్చారు. హైదరాబాద్ జిల్లా పరిధిలోని సికింద్రాబాద్, హైదరాబాద్ పార్లమెంట్‌ల పరిధిలో ఓటింగ్‌లో పెరుగుదల కనిపిస్తోంది. సెప్టెంబర్ 2022 నుంచి మార్చి 2024 వరకు పార్టీల ఫిర్యాదులతో క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి ఓట్లు తొలగించారు. జిల్లాలో 5.41 లక్షల బోగస్, మరణించిన, చిరునామా మారిన ఓటర్లను తొలగించడమూ పోలింగ్ శాతం పెరగడానికి ఒక కారణంగా చెబుతున్నారు.

గతంతో పోలిస్తే..

2019 పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం పోలింగ్ శాతం పెరిగింది. గతంలో హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో 45.08 శాతం కాగా, ఇప్పుడు 48.48గా నమోదైంది. 3 శాతానికిపైగా ఓటింగ్ ఎక్కువగా జరిగింది. సికింద్రాబాద్ పార్లమెంట్‌కు సంబంధించి గత పార్లమెంట్ ఎన్నికల్లో 48.09 శాతం కాగా.. ప్రస్తుతం 49.04 శాతంగా ఉంది. ఇక్కడ మాత్రం స్వల్ప పెరుగుదల కనిపిస్తోంది. మల్కాజ్‌గిరిలో 2019లో 53.04 శాతం పోలింగ్ నమోదు కాగా.. ఇప్పుడు 50.78కి తగ్గింది. చేవేళ్లలో గతంలో 56.09 శాతం పోలింగ్ జరగగా.. ప్రస్తుతం 56.40గా నమోదైంది. ఇక్కడ స్వల్ప పెరుగుదల కనిపిస్తోంది. ఇక అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే సికింద్రాబాద్‌లో ఒక శాతం పోలింగ్ తగ్గింది. హైదరాబాద్‌లో మాత్రం 3 శాతం పెరుగుదల కనిపిస్తోంది. మల్కాజ్‌గిరిలో 3 శాతం, చేవేళ్లలో ఒక శాతం తక్కువగా పోలింగ్ నమోదైంది. హైదరాబాద్ జిల్లాలోనూ గత పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పోలింగ్ శాతం పెరగడం గమనార్హం.

బహదూర్‌పురాలో మజ్లిస్‌దే ఆధిపత్యం?

- మొత్తం ఓటర్లు 3,21,904
- ఓటేసినది 1,63,204 మంది
- దాదాపు 50.7 శాతం

మదీన/ చాంద్రాయణగుట్ట, మే 14 (ఆంధ్రజ్యోతి) : సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికలు పాతబస్తీలో ప్రశాంతంగా ముగిశాయి. బహదూర్‌పురా నియోజకవర్గంలో గతంలో ఎన్నడూలేని విధంగా మందకొడిగా సాగింది. ఈ పరిణామం ఏ పార్టీకి అనుకూలంగా మారనుందో అంతుబట్టని స్థితి నెలకొంది. బహదూర్‌పురా నియోజకవర్గంలో 263 పోలింగ్ బూత్‌లలో 3,21,904 మంది ఓటర్లు ఉండగా, వారిలో 1,63,204 మంది ఓటర్లు ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. దాదాపు 50.7 శాతం పోలింగ్ నమోదైంది.

మందకొడిగా సాగిన పోలింగ్

మజ్లిస్‌కు బలమైన ఓటు బ్యాంకు ఉన్న నియోజకవర్గం బహదూర్‌పురా. ఈ నియోజకవర్గంలో దాదాపు 85 శాతం ఓటర్లు ముస్లింలే. వారంతా మజ్లిస్ సానుభూతిపరులే ఉంటారు. సోమవారం జరిగిన ఎన్నికలు ప్రజల్లో ఏమాత్రం ఆసక్తి లేనట్లుగా కనిపించింది. మధ్యాహ్నం ఒంటి గంట వరకు కేవలం 19.5 శాతం ఓటర్లు పోలింగ్ బూత్‌లకు వచ్చి ఓటేశారు. సాయంత్రం 4 గంటల వరకు 30 శాతం పోలింగ్ కూడా నమోదు కాలేదు. చివరి రెండు గంటల్లో ప్రజలు పోలింగ్ బూత్‌లకు చేరుకోవడం సుమారు 50 శాతం పోలింగ్ నమోదైంది.

జాడలేని ప్రధాన పార్టీలు

ప్రధాన పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు పాతబస్తీలో పర్యటించిన దాఖలాలు స్వల్పం. బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ అభ్యర్థి సమీర్ వలీఉల్లాఖాన్, బీజేపీ అభ్యర్థి మాధవీలత కనీస ప్రచారం నిర్వహించడంలేదు. కేవలం స్థానిక నాయకులు మాత్రమే కరపత్రాలు పంచుతూ నామమాత్రంగా ప్రచారం చేశారు. బహదూర్‌పురా నియోజకవర్గంలో ఎక్కడా ప్రధాన పార్టీల తరఫున పోలింగ్ ఏజెంట్లు కనిపించలేదు. అంతేకాకుండా

ఎవరికి అనుకూలం



ఆరునెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీకి 89,451 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్‌కు 22,426 ఓట్లు, కాంగ్రెస్ పార్టీకి 14,448 ఓట్లు, బీజేపీకి 11,621 ఓట్లు వచ్చాయి. ఆరు నెలల తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఆయా పార్టీలు అదే స్థాయిలో ఓట్లను సాధిస్తాయా లేదా జాతీయ అంశా

తెలంగాణలో అన్ని శాఖల్లో 2,67,316 పోస్టులు ఖాళీ

ప్రత్యేక రాష్ట్రంలోనూ నియామకాలు పూర్తి కాలేదు: బక్క జడ్సన్

పంజాగుట్ట, మే 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. శాఖల వారీగా ఎన్ని ఖాళీలు ఉన్నాయో కూడా నేటికి గుర్తించలేదని వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థి బక్క జడ్సన్ ఆరోపించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులు పృథ్వీరాజ్, విఠల్, తదితరులతో కలిసి 2023 డిసెంబర్ 31 నాటికి తెలంగాణలో వివిధ ప్రభుత్వ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాల పోస్టరును ఆయన ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీళ్ళు, నిధులు, నియామకాల పేరుతో ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో నేటికి అవి ఏవీ పూర్తి కాలేదని, గత ప్రభుత్వం కూడా పట్టించు కోలేదని అన్నారు. 1969లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమం మొదలైందన్న ఆయన, 2014లో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డా... నీళ్ళు, నిధులు, నియామకాల్లో తెలంగాణ వెనుక పడ్డదనేది వాస్తవం అన్నారు. గత పది సంవత్సరాల్లో జరిగిన గత ప్రభుత్వ తప్పిదాలను ప్రజలు తెలుసుకొని కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారని అన్నారు. గత సంవత్సరం నవంబర్ 25న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన సభలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తర్వాత యువతకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని, జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. శాఖల వారీగా ఎన్ని ఖాళీలు ఉన్నాయో కూడా నేటికి గుర్తించలేదని అన్నారు. డిసెంబర్ 2023 నాటికి అన్ని శాఖల్లో 2,67,316 పోస్టులు ఖాళీగా ఉన్నట్టుగా తాము గుర్తించామని అన్నారు. తాను వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా గెలిచిన తర్వాత ఖాళీలు భర్తీ అయ్యేంతవరకు పోరాటం చేస్తామని అన్నారు.



ఖాళీగా పోస్టుల వివరాల పోస్టరును ఆవిష్కరిస్తున్న వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి బక్క జడ్సన్, పృథ్వీరాజ్ విఠల్

24 గంటలు అలర్ట్‌గా ఉండాలి

హైదరాబాద్ సిటీ, మే 14(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయి విధుల్లో ఉండే ఇంజనీర్లు, సిబ్బంది 24 గంటలు అలర్ట్‌గా ఉండాలని, ఎక్కడా విద్యుత్‌సరఫరాలో 5 నిమిషాలు నిలిచినా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని మెట్రోజోన్ సీజీ ఎం నరసింహస్వామి అధికారులకు సూచించారు. హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ సైఫాబాద్ డివిజన్, బంజారాహిల్స్ సర్కిల్ పరిధిలోని పలు సబ్‌స్టేషన్లు, ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్లను మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు తనిఖీ చేయడంతో పాటు వర్షాలు పడినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వచ్చిన వెంటనే ఎఫ్ఓసీ సిబ్బంది నిమిషాల్లో సంఘటన స్థలంలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎండలు మరో 15రోజులు ఉండటంతో వేసవికాలం పూర్తయ్యే వరకు పెరుగుతు న్న విద్యుత్‌డిమాండ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఈలకు సూచించారు.



సైఫాబాద్ డివిజన్ సబ్‌స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ చేసిన మెట్రోజోన్ సీజీఎం నరసింహస్వామి

తెలంగాణ ఉద్యమ నాయకుడికి పరామర్శ

- వైద్య ఖర్చులు భరిస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

రామంతాపూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ మలిదశ తొలి ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పాల్వాయి మధుసూదన్‌రెడ్డిని మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చులను తానే భరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గంధం నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



మధుసూదన్‌రెడ్డిని పరామర్శిస్తున్న లక్ష్మారెడ్డి

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ఢీకొని ఇద్దరు మృతి

అబ్దుల్లాపూర్‌మెట్, మే 14 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాటసింగారం శివారు చాచా దాబా సమీపంలో విజయవాడ జాతీయ రహదారిపై గుర్తుతెలియని వ్యక్తి సోమవారం అర్ధరాత్రి రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వేగంగా వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అతడిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి శరీరంపై నీలం రంగు చొక్కా, డార్క్ బ్లూకలర్ ప్యాంటు ఉన్నాయన్నారు. మృతుడి వివరాలు తెలియరాలేదు.



మనుమళ్లతో ఆడుకుంటున్న గడ్డం శ్రీనివాస్ యాదవ్

ఆటవిడుపులో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి 'గడ్డం'

అఫ్జల్‌గంజ్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఎంపీ ఎన్నికలు సోమవారం ముగియడంతో పోటీ చేసిన అభ్యర్థులు కొంత సేదతీరారు. రెండు రోజుల కిందటి వరకూ ప్రచారం చేసి అలసిపోయని వారు ఇళ్లలో హాయిగా గడిపారు. బీఆర్ఎస్ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ గౌలిగూడలోని తన నివాసంలో మనుమళ్లు ఆహాన్ యాదవ్, విశ్రుత్ యాదవ్‌తో కలిసి సరదాగా ఆడుకున్నారు. ఈ సందర్భంగా గడ్డం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ 47 రోజుల పాటు కుటుంబ సభ్యులను పక్కనబెట్టి ప్రచారం చేశామని, కొన్ని సందర్భాల్లో రాత్రి 3 గంటల వరకు బయటే గడపాల్సి వచ్చిందన్నారు. హైదరాబాద్ పార్లమెంట్‌లో తనకు ఓటు వేసిన ఓటర్లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

వాల్మీకీ బోయ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

చాంద్రాయణగుట్ట, మే 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని మంగళవారం కాంగ్రెస్ పార్టీ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఇన్‌చార్జి బోయ నగేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ లోక్‌సభ ఎన్నికల సరళిని వేం నరేందర్ రెడ్డికి వివరించి, ఆయనను సన్మానించారు. అనంతరం బోయ నగేశ్ మాట్లాడుతూ, వాల్మీకీ బోయ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.



వేం నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న బోయ నగేశ్



మందులను పంపిణీ చేస్తున్న పెరమోని నరేష్ యాదవ్

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- బడంగ్‌పేట ఓబీసీ మోర్చా అధ్యక్షుడు నరేష్‌యాదవ్

పహాడిషరీఫ్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బడంగ్‌పేట్ కార్పొరేషన్ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు పెరమోని నరేష్‌యాదవ్ అన్నారు. మంగళవారం మామిడిపల్లిలో సొంత డబ్బుతో ఉచిత వైద్య శిబిరం ఆయన ఏర్పాటు చేశారు. బ్రైట్ హాస్పిటల్, తేజస్విని డయాగ్నొస్టిక్ సెంటర్, షాలిని కంటి ఆస్పత్రి, తలసేమియా బ్లడ్‌బ్యాంక్‌తో కలసి ఉచిత వైద్య రాన్ని ప్రారంభించారు. 150 మందికి బీపీ పరీక్షలు, 110 మందికి షుగర్ పరీక్షలు చేశారు. 51 మంది యువకులు రక్త దానం చేశారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరేష్ యాదవ్ మాట్లాడుతూ.. కంటి పరీక్షలు చేయించుకున్న వారికీ తన స్వంత ఖర్చులతో కంటి ఆపరేషన్‌కు సహాయం చేస్తానన్నారు. స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సేవకులు ముందుకు వచ్చి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వివిధ ఆస్పత్రుల వైద్యులు, సిబంది, మాజీ కార్పొరేటర్ ఇరంకి వేణు గౌడ్, గణేష్‌గౌడ్, ఎండీ నయీమ్, రంగనాథ్, ఎల్ కృష్ణా, ఆమెతి, సందీప్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

సత్కారం



ఢిల్లీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన దేవేంద్ర యాదవ్‌ను మంగళవారం టీపీసీసీ కార్యదర్శి ఎం.నిర్మల్ కుమార్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అఫ్జల్‌గంజ్, మే 14 (ఆంధ్రజ్యోతి)

టెట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు

టీ-సాట్ మెలకువలు

హైదరాబాద్ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం టీఎస్పీఎస్సీ ఆధ్వర్యంలో మే 20 నుంచి జూన్ 3వ తేదీ వరకు నిర్వహించే టెట్ (టీచర్స్ ఎలిజబిలిటీ టెస్ట్)కు హాజరయ్యే అభ్యర్థులకు మెలకువలు తెలియచేసేందుకు టీ-సాట్ ప్రత్యేక ప్రసార కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని టీసాట్-సాఫ్ట్ నెట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మే 15వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు అనుభవం కల్గిన ఉపాధ్యాయులచే ఐదు సబ్జెక్టులపై ప్రత్యేక లైవ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. టీ-సాట్ నిపుణ చానల్‌లో ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ప్రత్యేక ప్రసారాల ద్వారా అభ్యర్థులకు పరీక్ష రాసే విధానంలో మెళకువలతోపాటు సలహాలు-సూచనలు అందించనున్నామని తెలిపారు. 15వ తేదీన సైకాలజీ, 16న టీచింగ్ మెథడ్స్, 17న తెలుగు, 18న ఫిజికల్ సైన్స్, మాథ్స్ సబ్జెక్టులపై నిపుణ చానల్‌తోపాటు, టీ-సాట్ విద్యా చానల్‌లో మరుసటి రోజు సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు పునఃప్రసారమవుతుందన్నారు. ఇప్పటికే టెట్ అభ్యర్థుల కోసం సుమారు 200 ఎపిసోడ్స్ టి-సాట్ డొమైన్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. అభ్యర్థులు తమ సందేహాలు- సమాధానాల కోసం 040-3540326/726, టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 4039 నెంబర్లకు కాల్ చేయవచ్చన్నారు.

24న బొబ్బిలి భాస్కరరెడ్డి స్వర్ణోత్సవం

చిక్కడపల్లి, మే 14(ఆంధ్రజ్యోతి): ప్రముఖ గాయకుడు, సంగీత దర్శకుడు బొబ్బిలి భాస్కరరెడ్డి స్వర్ణోత్సవ వేడుకలు ఈనెల 24న సాయంత్రం త్యాగరాయగానసభలో జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్‌వారు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత పురస్కారాన్ని భాస్కరరెడ్డికి ప్రదానం చేస్తామని సంస్థ ఛైర్మన్ గుదిబండి వెంకటరెడ్డి తెలిపారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రమణాచారి, మెదక్ జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ ఎంఎల్ కాంతారావు అతిథులుగా పాల్గొంటారని తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 14 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లో గుర్తుతెలియని మృతదేహన్ని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ పండరీ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పార్శిల్ కార్యాలయం వద్ద ఓ వ్యక్తి మృతదేహం ఉందని స్థానికుల ద్వారా సమాచారం అందింది. రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని కానిస్టేబుల్ తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

కవాడిగూడ, మే 14 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడు ఆత్మహత్య చేసుకొన్నాడు. ఈ ఘటన గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బన్సీలాల్‌పేట బండమైసమ్మనగర్‌లో నివాసం ఉంటున్న అబ్దుల్ రజాక్ ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు అబ్దుల్ షోహెబ్(20)కు రెండేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కిడ్నీలు ఫెయిల్ అయ్యాయి. అప్పటిని నుంచి అబ్దుల్ షోహెబ్ అనారోగ్యంతో ఇంట్లోనే ఉంటున్నాడు. జీవితంపై విరక్తి చెందిన అతడు మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు అబ్దుల్ షోహెబ్ ఫ్యాన్‌కు వేలాడు కనిపించడంతో గాంధీ నగర్ పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు ఘటనా స్థలానికి చేరుకుని షోహెబ్‌ను కిందకు దించి గాంధీ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు.

ఓటేయడానికి వెళ్లిన వృద్ధురాలి అదశ్యం

కవాడిగూడ, మే 14 (ఆంధ్రజ్యోతి): ఓటు వేయడానికి వెళ్లిన వృద్ధురాలు అదృశ్యమైంది. ఈ ఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ నాగరాజురెడ్డి తెలిపిన వివరాల ప్రకారం డిజె బుల్ హోంలో ఉన్న పదిమంది సోమవారం గుజారాతీ భవన్‌లో పోలింగ్ కేంద్రంలో ఓటే వేయడానికి వెళ్లారు. వారితోపాటు వృద్ధురాలు లలిత(60) కూడా వెళ్లింది. ఓటు వేసిన తరువాత తిరిగి రాలేదు.

బొట్టుబిళ్లలతో జై శ్రీరాం బోర్డు

- మూడు బాషల్లో తీర్చిదిద్దిన డబ్ల్యూఏఏ



జైశ్రీరామ్ బోర్డును అవిష్కరిస్తున్న ఉమెన్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ సభ్యులు

పంజాగుట్ట, మే 14 (ఆంధ్రజ్యోతి): జంటనగరాలకు చెందిన మహిళా కళాకారులు ఉమెన్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్(డబ్ల్యూఏఏ)గా ఏర్పడ్డారు. తమలో ఉన్న ప్రతిభను ప్రదర్శించడానికి ఏమైనా చేద్దామని అనుకున్నారు. అయోధ్యలో రామాలయం ప్రారంభం కావడంతో ఓ కళాఖండాన్ని తయారు చేసి మ్యూజియంకు ఇద్దామని భావించారు. వారంతా వినూత్నంగా బొట్టుబిళ్లలతో తెలుగు, ఇంగిష్, హిందీ బాషల్లో జై శ్రీరామ్ బోర్డును అందంగా తీర్చిదిద్దారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బొట్టు బిళ్లలతో తాము రూపొందించిన జైశ్రీరామ్ బోర్డును ప్రదర్శించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 10లోని కాసుల పద్మావతి చిత్రకళా అకాడమీ నిర్వాహకురాలు కాసుల పద్మావతి, కొండాపూర్‌కు చెందిన ఆర్ట్ టీచర్ సూర్యకుమారి, బేగంపేట హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఆర్ట్ టీచర్లు యోగలక్ష్మి, ప్రతిభా దల్, తిరుమలగిరికి చెందిన డ్రాయింగ్ టీచర్ రజని మంచికంటి, సదాశివపేటకు చెందిన ఆర్ట్ టీచర్, రచయిత కోమలి ఒక బృందంగా ఏర్పడ్డారు. తమ ప్రాజెక్టుకు అయోధ్య అని పేరు పెట్టారు. గత నెల 19న 30 ఇంటూ 40 అంగుళాల బోర్డుపై తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో బొట్టు బిళ్లలు ఉపయోగించి జై శ్రీరామ్ అని అందంగా రాశారు. 12 రోజుల పాటు రోజుకు ఐదు గంటల సమయాన్ని(60 గంటలు) వెచ్చించి పూర్తి చేశారు. ఇందుకు 32,970 బొట్టుబిల్లలు వినియోగించారు. 16,314 నారింజ, 3,192 బ్లూ, 13,464 ఆకుపచ్చ బొట్టుబిల్లలతో అద్భుతంగా తీర్చిదిద్దారు. ప్రతి రూప కళాకారుడు డి.నాగేశ్వరరావు నుంచి ప్రేరణ పొంది దీనిని రూపొందించామని వారు తెలిపారు. అయోధ్యలో రామాలయం ప్రారంభమై సంవత్సరం పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈ సంవత్సరం డిసెంబర్‌లో అయోధ్యకు వెళ్లి రామాలయం మ్యూజియంకు కళాకాండాన్ని అందజేస్తామని వారు తెలిపారు. ఇప్పటి వరకు తాను 220 రికార్డులు సాధించానని కాసుల పద్మావతి తెలిపారు.

తీసుకున్న డబ్బు ఇమ్మన్నందుకు కత్తితో దాడి

అమీర్‌పేట, మే 14(ఆంధ్రజ్యోతి): తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వమన్నందుకు ఓ వ్యక్తి కత్తితో దాడికి పాల్పడిన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సనత్‌నగర్, అశోక్‌కాలనీకి చెందిన మహ్మద్ అహ్మద్‌ఖాన్ ప్రింటింగ్ ప్రెస్ నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి 11:30గంటల ప్రాంతంలో ఖలీమ్, సయ్యద్, జాహిద్‌తో కలిసి అమీర్‌పేటకు టీ తాగేందుకు వెళ్లారు. తిరిగి వస్తూ మార్గమధ్యలో బీకేగూడ వద్ద కూరగాయాల సంతలో నిమ్మకాయల వ్యాపారం చేస్తున్న అమీన్‌ను కలిశారు. గతంలో తీసుకున్న రూ.5 వేలు ఇవ్వాలని ఖలీమ్ అడగడంతో ఘర్షణ జరిగింది. అహ్మద్‌ఖాన్, ఖలీమ్, జాహిద్ బైక్‌పై వెళ్లబోగా అమీన్ కత్తి తీసుకుని వారిపై దాడి చేయగా అహ్మద్‌ఖాన్‌కు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు అమీన్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

బీజేపీ నాయకుడిపై కేసు

యూసఫ్‌గూడ, మే 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నింబంధనలను ఉల్లంఘించి పోలింగ్ కేంద్రంలోనే ఓటర్లను బీజేపీకి ఓటు వేయమని అడిగిన ఆ పార్టీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ విజిత్‌వర్మపై మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. సోమవారం జరిగిన ఎన్నికల్లో వెంగళరావునగర్‌లోని ఓ పోలింగ్ కేంద్రం వద్దకు వెళ్లి ఆయన ఓటర్లను బీజేపీకి ఓటు వేయమని అడిగినట్టు అక్కడ విధుల్లో ఉన్న ఓ కానిస్టేబుల్ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశామని మధురానగర్ పోలీసులు మంగళవారం తెలిపారు.

రద్దీ లేని వేళల్లో రాయితీ ఎందుకు..?

- కాంటాక్ట్ లెస్ కార్డ్స్‌పై ప్రయాణికుల పెదవి విరుపు
- నాన్ పీక్ అవర్స్‌లో ఆఫర్‌ను అమలు చేయడంపై విమర్శలు
- 10 శాతం మంది కూడా వినియోగించుకోలేని పరిస్థితి



హైదరాబాద్ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మెట్రో రైళ్లలో రాయితీలను నామమాత్రంగానే అమలు చేస్తున్నారు. పేరుకోసం కొన్ని డిస్కౌంట్లను ప్రకటిస్తున్నప్పటికీ అవి అందరికీ ఉపయోగపడని పరిస్థితి. అన్ని వేళల్లో కొనసాగించాల్సిన రాయితీలను.. కొన్ని గంటల వరకే పరిమితం చేయడంపై ఎల్ అండ్‌టీ అధికారుల తీరుపై ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు.

నగరంలోని మెట్రో రైళ్లలో ప్రయాణికుల సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతోంది. మూడు నెలల క్రితం రోజుకు 4.50 లక్షల మంది ప్రయాణించగా.. నెలన్నర రోజులుగా 4.80 లక్షల నుంచి 5.10 లక్షల మంది గరిష్ఠంగా రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో రైల్వేస్టేషన్లు, రైళ్లలో రద్దీ కనిపిస్తోంది. రద్దీకి అనుగుణంగా అధికారులు 3 నిమిషాలకోసారి రైళ్లను పంపిస్తున్నారు. మెట్రోలో ప్యాసింజర్ల సంఖ్య క్రమేపీ పెరుగుతున్నప్పటికీ.. వీలైనన్నీ ఎక్కువ ఆఫర్లను అందుబాటులోకి తీసుకురావాల్సిన ఎల్ అండ్ టీ.. ఉన్న వాటిని కూడా పూర్తిస్థాయిలో అందించకపోతుండడంతో నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

ఉపయోగపడని కాంటాక్ట్ లెస్ కార్డ్స్..

పెరుగుతున్న ప్రయాణికులను ఆకట్టుకునేందుకు ఎల్ అండ్ టీ సంస్థ వినూత్న రకాల ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగా స్మార్ట్ కార్డు, సూపర్ సేవర్ ఆఫర్(ఎస్ఎస్ఓ)- 59 డిస్కౌంట్, కాంటాక్ట్‌లెస్ కార్డ్స్ (సీఎస్‌సీ)లను ప్రవేశపెట్టింది. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, రాత్రి 8 నుంచి 11 గంటల వరకు (నాన్ పీక్ అవర్స్‌లో) కాంటాక్ట్ లెస్ కార్డుల ద్వారా చేసే బుకింగ్స్‌పై 10శాతం రాయితీ అందిస్తున్నారు. ఈ ఆఫర్‌ను కేవలం 10 శాతం మంది మాత్రమే వినియోగిస్తుండగా.. మిగతా 90శాతం మంది దూరంగా ఉంటున్న పరిస్థితి. పీక్ అవర్స్ (ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, సాయంత్రం 4 నుంచి 9 గంటల వరకు)లో కాంటాక్ట్ లెస్ కార్డులను అమలుచేస్తే అందరికీ ప్రయోజనం ఉంటుందని, రద్దీలేని సమయంలో రాయితీ ఇవ్వడం ద్వారా ఎవరికి ఉపయోగం ఉండదని ప్రయాణికులు వాపోతున్నారు.

పీక్ అవర్స్‌లోనూ కొనసాగించాలి..

పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని పీక్ అవర్స్‌లోనూ ఆఫర్లను కొనసాగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రధానంగా 10శాతం రాయితీతో కూడిన కాంటాక్ట్ లెస్ కార్డులను అన్నివేళల్లో అమలు చేయడం ద్వారా చాలామంది వినియోగించుకుంటారని చెబుతున్నారు. ఇదిలా ఉండగా, ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి సూపర్ సేవర్-59, స్మార్ట్‌కార్డు, కాంటాక్ట్‌లెస్ కార్డుపై 10 శాతం, డిజిటల్ క్యూఆర్ టికెట్స్‌పై ఉన్న 10శాతం రాయితీ ఎత్తివేయడంతో ప్రయాణికుల నుంచి నిరసనలు వెల్లువెత్తాయి. దీంతో మరుసటి రోజు మే 1 నుంచి ఆయా ఆఫర్లను యధావిధిగా కొనసాగిస్తామని అధికారులు ప్రకటించడం గమనార్హం.



సుశీల్‌కుమార్ మోదీ మృతికి
గవర్నర్ దత్తాత్రేయ సంతాపం

హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నేత, బిహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి, రాజ్యసభ సభ్యులు సుశీల్ కుమార్ మోదీ మృతికి హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సుశీల్‌కుమార్ మోదీ తనకు అత్యంత సన్నిహితులని, నీతి నిజాయితీతో ఆదర్శంగా జీవించిన వ్యక్తి అని గుర్తు చేసుకున్నారు. వెనకబడ్డ వర్గాల అభ్యున్నతికి ఆయన నిరంతరం కృషి చేశారన్నారు. సుశీల్‌కుమార్ మోదీ మరణంతో బిహార్ ఒక గొప్ప రాజకీయ నాయకుడ్ని కోల్పోయిందని గవర్నర్ దత్తాత్రేయ తన సంతాపంలో పేర్కొన్నారు.



గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌తో దత్తాత్రేయ భేటీ

తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌తో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ భేటీ అయ్యారు. హైదరాబాద్ పర్యటనలో ఉన్న దత్తాత్రేయ రాజ్‌భవన్‌లో మంగళవారం గవర్నర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు గవర్నర్లు పలు అంశాలపై చర్చించారు. గవర్నర్ రాధాకృష్ణన్ జార్ఖండ్ గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

జూపార్కులో వైట్ టైగర్ అభిమన్యు మృతి

మదీన, మే 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జవహర్‌లాల్ నెహ్రూ జూపార్కులో మంగళవారం మధ్యాహ్నం వైట్ టైగర్ మృతిచెందింది. 2016 మే నెలలో బద్రి, సమీర అనే వైట్ టైగర్లకు పుట్టిన మగ టైగర్ అభిమన్యు. దాని వయసు ప్రస్తుతం ఎనిమిదేళ్లు. ఏడాది కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు జూ అధికారులు తెలిపారు. జూ వైద్య బృందం చికిత్సలు అందజేస్తోంది. పరిస్థితి విషమించడంతో మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో మృతిచెందింది. వెటర్నరీ వైద్యుల బృందం పోస్టుమార్టం నిర్వహించింది. కిడ్నీ ఫెయిల్ కావడంతోనే మృతిచెందినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. అయితే, జూపార్కులో జంతువులకు కిడ్నీ వ్యాధుల బారిన పడడానికి మీరాలం చెరువులోని కలుషిత నీరే కారణమని అధికారులు అభిప్రాయపడుతున్నారు.



అభిమన్యు (ఫైల్)

నారాయణఖేడ్ ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధులకు హాజరైన ఉపాధ్యాయులకు నిబంధనల ప్రకారం టీఏ, డీఏ చెల్లించాలని అడిగినందుకు పోలీసులతో లాఠీచార్జీ చేయించిన నారాయణఖేడ్ ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజారావు, శ్యాంసుందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకే పార్లమెంట్ నియోజకవర్గంలో పనిచేసిన ఉద్యోగులకు ఇచ్చే రెమ్యూనరేషన్ చెల్లింపులో తేడా ఎందుకని ప్రశ్నించిన టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డితోపాటు ఇతర ఉపాధ్యాయులపై పోలీసులు విచక్షణా రహితంగా లాఠీచార్జి చేశారని చెప్పారు. నిబంధనలను పాటించకుండా, ప్రశ్నించిన ఉపాధ్యాయులపై దౌర్జన్యం చేసిన ఆర్డీఓ, పోలీసులపై చర్య తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

నత్తనడకన ముందుకు..



పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేసేందుకు తెలంగాణ, ఏపీ జిల్లాలకు తరలిన ప్రజలు తిరిగి మంగళవారం నగరానికి చేరుకోవడంతో ట్రాఫిక్ రద్దీ పెరిగింది. గచ్చిబౌలి ప్రాంతంలో ఇలా ట్రాఫిక్‌జామ్ అయి వాహనాలు నత్తనడకన ముందుకుసాగాయి. - ఫొటో : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్

హత్య కేసులో నిందితుడి రిమాండ్

కుషాయిగూడ, మే 14 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని యువకుడి అనుమానాస్పదమృతి కేసును చర్లపల్లి పోలీసులు ఛేదించారు. మద్యం కోసం సెల్‌ఫోన్‌ను తాకట్టు పెడతానని ఇవ్వకపోవడంతో ఆగ్రహించి తలపై సిమెంట్ ఇటుకతో బాది హత్య చేసినట్లు పోలీసులు తేల్చారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా, కప్పలవారి పాలెం గ్రామానికి చెందిన పుట్టా శ్రీనివాస్‌రెడ్డి మద్యానికి బానిసై కుటుంబానికి దూరంగా ఉంటున్నాడు. మేస్త్రీగా పనిచేస్తూ గుంటూరు, హైదరాబాద్‌ల మధ్య తిరుగుతూ రైల్వే స్టేషన్‌లలో పడుకునేవాడు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 28న శ్రీనివాస్‌రెడ్డికి ఒరిస్సా నుంచి వలస వచ్చి చర్లపల్లి రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనుల్లో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న బాలానస్‌బాగ్ అనే యువకుడు పరిచయమయ్యాడు. తనకు మద్యం కావాలని, అవసరమైతే తన సెల్‌ఫోన్‌ను తాకట్టు పెడతానని బాలానస్ చెప్పగా, శ్రీనివాస్ రెడ్డి తనవద్ద ఉన్న డబ్బులతో మద్యం తాగించాడు. ముందుగా చెప్పిన మేరకు బాలానస్ ఫోన్‌ను ఇవ్వక పోవడంతో శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహించాడు. ఆ తర్వాత రైల్వేస్టేషన్ సమీపంలోని ఏటీఎం వద్ద మద్యం మత్తులో పడుకున్న బాలానస్ తలపై సిమెంటు ఇటుకతో బలంగా కొట్టడంతో మృతి చెందాడు. మృతుడి జేబులో నుంచి సెల్‌ఫోన్‌ను తీసుకొని పారిపోయిన శ్రీనివాస్‌రెడ్డిని అదే ఫోన్ నంబర్, ఇతర సాంకేతిక ఆధారాలతో పోలీసులు వలవేసి పట్టుకున్నారు. మంగళవారం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.



పుట్టా శ్రీనివాస్‌రెడ్డి

బుల్లెట్ పెట్రోల్ ట్యాంక్ పేలుడు ఘటనలో..
మరో క్షతగాత్రుడి మృతి

- ఏఆర్ కానిస్టేబుల్ పరిస్థితి విషమం

చార్మినార్, మే 14(ఆంధ్రజ్యోతి): బుల్లెట్ బైక్‌కు మంటలు అంటుకుని పెట్రోల్ ట్యాంక్ పేలిన ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న వారిలో మంగళవారం మరొకరు మృతిచెందారు. దీంతో మృతుల సంఖ్య రెండుకు చేరింది. భవానీనగర్ పీఎస్ ఎస్ఐ లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం సాయంత్రం మొఘల్‌పురాలో నాజర్ ఫంక్షన్‌హాల్ వద్ద అబ్దుల్ రహీమ్ బుల్లెట్ బైక్‌పై వెళుతుండగా అకస్మాత్తుగా మంటలు అంటుకున్నాయి. స్థానికులు బైక్‌పై నీళ్లు చల్లుతూ, గోనె సంచులు వేసి మంటలు ఆర్పడానికి ప్రయత్నం చేస్తుండగా పెట్రోల్ ట్యాంకు పేలి పదిమంది గాయపడ్డారు. వెంటనే వీరిని పలు ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే తీవ్రంగా గాయపడిన నదీమ్ సోమవారం మృతిచెందగా.. మంగళవారం ఫలక్‌నుమాకి చెందిన మహమ్మద్ షౌకత్ (28) మృతి చెందాడు. అతని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఇదిలా ఉండగా, బుల్లెట్ బైక్‌కు అంటుకున్న మంటలను ఆర్పే ప్రయత్నంలో తీవ్రంగా గాయపడిన ఏఆర్ కానిస్టేబుల్ సందీప్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.



షౌకత్ అలీ (ఫైల్)

రూ.36కోట్లతో జేఎన్టీయూలో
ఐకానిక్ బిల్డింగ్

- సీఎం రేవంత్‌రెడ్డితో ప్రారంభానికి కసరత్తు
- అనుమతులు కోరుతూ ఎన్నికల సంఘానికి జేఎన్‌టీయూ లేఖలు



హైదరాబాద్ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీకి ఆర్ట్స్ కాలేజీ భవనం మాదిరిగా.. జేఎన్టీయూ హైదరాబాద్‌కు మరో ఐకానిక్ బిల్డింగ్ అందుబాట్లోకి రానుంది. జేఎన్‌టీయూ ఏర్పడి 50ఏళ్లు (గోల్డెన్ జూబ్లీ) పూర్తయిన సందర్భంగా యూనివర్సిటీలో మౌలిక సదుపాయాల అభివృద్ధి నిమిత్తం రూ.36కోట్లతో చేపట్టిన ఐకానిక్ బిల్డింగ్ నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఈ భవనంలోని ఒక్కో అంతస్తులో 17వేల చదరపు అడుగుల చొప్పున మొత్తం ఎనిమిది అంతస్తుల్లో కలిపి 1.36లక్షల చదరపు అడుగుల స్పేస్ అందుబాటులోకి రానుంది. ఐకానిక్ భవనాన్ని తొలుత.. ఇంటర్ డిసిప్లినరీ అకడమిక్ రీసెర్చ్ అవసరాలకు వినియోగించాలని అధికారులు భావించారు. అయితే.. ఇందులోనే ఆదానీ కోనెక్స్ సంస్థ రూ.5కోట్లతో అతిపెద్ద డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు జేఎన్‌టీయూతో ఒప్పందం చేసుకుంది. ఈ క్రమంలో డేటా సెంటర్ ఏర్పాటుకు ఒక అంతస్తును కేటాయించనున్నారు. అలాగే, భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) సౌజన్యంతో బీటెక్ స్పేస్ టెక్నాలజీ కోర్సును జేఎన్‌టీయూ నిర్వహించాలని భావిస్తోంది. ఈ మేరకు మరొక అంతస్తును ఇస్రోకు కేటాయించాలని ఇటీవల జేఎన్‌టీయూ అధికారులు సూత్రప్రాయంగా అంగీకారానికి వచ్చారు. మిగిలిన ఆరు అంతస్తులను ఏవిధంగా వినియోగంలోకి తేవాలనే అంశంపై వర్సిటీ ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఎన్నికల సంఘం అనుమతి కోసం ఎదురుచూపులు

రాష్ట్రంలో ఎన్నికల నియమావళి అమలులో ఉండడం, సోమవారం ఎన్నికలు ముగియడంతో జేఎన్‌టీయూలో ఐకానిక్ బిల్డింగ్ ప్రారంభోత్సవానికి అనుమతులు కోరుతూ వర్సిటీ ఉన్నతాధికారులు ఎన్నికల సంఘానికి లేఖలు రాశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఈ భవనాన్ని ప్రారంభింపజేయాలని ఉన్నతాధికారులు భావిస్తుండడంతో ఎన్నికల సంఘం నుంచి అనుమతి వస్తుందో, లేదోనని సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల సంఘం అనుమతిస్తే ఐకానిక్ బిల్డింగ్‌ను ప్రారంభించాలని నిర్ణయించారు.

అలాగే, ఈనెల 21న జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ కట్టా నర్సింహారెడ్డి పదవీకాలం ముగుస్తుండడంతో యూనివర్సిటీలోని కెమిస్ట్రీ విభాగంలో రూ.1.5కోట్లతో ఏర్పాటు చేసిన యూరోపియన్ ల్యాబొరేటరీ, ఈఈఈ భవనంలో కొత్తగా రూ.50 లక్షలతో నిర్మించిన సెమినార్ హాల్‌ను ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కొత్త భవనాల ప్రారంభోత్సవం జరిగితే యూనివర్సిటీ విద్యార్థులకు మరిన్ని మౌలిక వసతులు సమకూరుతాయని వర్సిటీ ఆచార్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పరిశోధనలకు అవకాశమేదీ..?

- జేఎన్‌టీయూలో పీహెచ్‌డీ అడ్మిషన్లపై నీలినీడలు
- దరఖాస్తు గడువు ముగిసి మూడు నెలలవుతున్నా.. పూర్తికాని పరిశీలన

హైదరాబాద్ సిటీ, మే14 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ(పీహెచ్‌డీ) అడ్మిషన్లపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఈ ఏడాది జనవరిలో నోటిఫికేషన్ ఇచ్చిన అధికారులు ఫిబ్రవరి 23వరకు దరఖాస్తులు స్వీకరించారు. వివిధ సబ్జెక్టులకు సంబంధించి దాదాపు వెయ్యికి పైగా దరఖాస్తులు వచ్చాయి. గడువు ముగిసి మూడు నెలలు అవుతున్నా, ఇప్పటివరకు పరిశీలన(స్క్రూటినీ) ప్రక్రియను అధికారులు పూర్తి చేయకపోవడంపై అభ్యర్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరిశోధనల పట్ల ఎంతో ఆసక్తితో తాము దరఖాస్తులు సమర్పిస్తే అడ్మిషన్ల విభాగం అధికారులు ఎడతెగని జాప్యం చేస్తున్నారని మండిపడుతున్నారు. ఓవైపు ప్రైవేట్ యూనివర్సిటీలు పీహెచ్‌డీ నోటిఫికేషన్లు ఇచ్చిన నెలరోజుల్లో.. అర్హత కలిగిన అభ్యర్థులకు పరీక్షలు, ఇంటర్వ్యూలు పూర్తిచేసి ప్రవేశాలు కల్పిస్తుండగా, జేఎన్‌టీయూ అడ్మిషన్ల విభాగం అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అడ్మిషన్ల విభాగానికి ప్రస్తుతం డైరెక్టర్‌గా ఉన్న డాక్టర్ జి.వెంకటరామిరెడ్డి ఈ నెలాఖరుకు రిటైర్ అవుతుండడంతో, పీహెచ్‌డీ ప్రక్రియ వేగంగా ముందుకు పోవడం లేదంటున్నారు. అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్ ఇటీవల ఆదేశించినప్పటికీ, అడ్మిషన్ల విభాగం డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ నిర్లిప్తంగా వ్యవహరిస్తుండడం పట్ల సిబ్బంది సైతం విచారం వ్యక్తం చేస్తున్నారు. పీహెచ్‌డీ ప్రవేశపరీక్ష, ఇంటర్వ్యూ తేదీలను వెంటనే ప్రకటించేలా డైరెక్టర్‌ను ఆదేశించాలని వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్‌లను అభ్యర్థులు కోరుతున్నారు.

వేసవి సెలవుల కారణంగానే స్క్రూటినీ ఆలస్యం: డైరెక్టర్

పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియలో నెలకొన్న జాప్యంపై అడ్మిషన్ల విభాగం డైరెక్టర్ డాక్టర్ వెంకటరామిరెడ్డిని వివరణ కోరగా, యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీకి వేసవి సెలవులు రావడంతోనే దరఖాస్తుల స్క్రూటినీ ప్రక్రియ ఆలస్యమవుతోందని చెప్పారు. అభ్యర్థులు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించే నిమిత్తం వివిధ విభాగాల అధిపతులకు, బోర్డ్ ఆఫ్ స్టడీస్(బీఓఎస్)లకు గత నెలలోనే లేఖలు రాశామన్నారు. అయితే.. కొందరు విభాగాధిపతులు, బీఓఎస్‌లు ఎఫ్ఎఫ్‌సీ తనిఖీలకు వెళ్లడం, మరికొందరు సమ్మర్ వెకేషన్‌లో ఉండడంతో పరిశీలన ప్రక్రియలో జాప్యం ఏర్పడిందని, స్క్రూటినీ పూర్తయితేనే ప్రవేశ పరీక్ష నిర్వహించేందుకు వీలవుతుందని తెలిపారు. ఈ వారాంతంలోగా స్క్రూటినీని పూర్తిచేయాలని రిజిస్ట్రార్ ఆదేశించారని, తదనుగుణంగా ప్రవేశ పరీక్ష, ఇంటర్వ్యూ తేదీలను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

ఓడిపోతున్నాం.. డబ్బులు పంచుడెందుకు?

- ఆ పార్టీ వాళ్లు పంచట్లేదు.. మనం ఇచ్చుడెందుకు?
- హైదరాబాద్‌లో మొహం చాటేసిన ప్రధాన పార్టీలు
- బూత్‌ల వైపు తొంగి చూడని పలువురు కార్పొరేటర్లు
- ఎవరికి వారు డబ్బులు మిగుల్చుకున్నట్టుగా ఆరోపణలు
- పోలింగ్ బూత్‌ల్లో ఏజెంట్లకు రూ.2వేలదాకా చెల్లింపు



హైదరాబాద్ సిటీ, మే14 (ఆంధ్రజ్యోతి): ఎలాగూ ఓడిపోతున్నాం.. ఇక ఓటర్లకు డబ్బులు పంచుడెందుకు?.. ఆ పార్టీ వాళ్లే పంచట్లేదు.. మనం ఇచ్చుడెందుకు? ఇలా.. పలు ప్రధాన పార్టీల నాయకులు డబ్బులు పంచకుండా మొహం చాటేసినట్లు తెలిసింది. హైదరాబాద్‌లోని పలు డివిజన్ల కార్పొరేటర్లు, నేతలు ఆదివారం రాత్రే చేతులెత్తేసినట్లు సమాచారం. ఈ మేరకు సదరు పార్టీ లేదా అభ్యర్థి నుంచి వచ్చిన ఫండ్‌ను ఎక్కడికక్కడే మిగుల్చుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తూ పోల్ మేనేజ్‌మెంట్ చేపట్టాల్సిన ఎమ్మెల్యేలు, ఆయా పార్టీల నియోజకవర్గ ఇన్‌చార్జిలు కూడా ఓటేసి ఇంటికి పరిమితమయ్యారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి నియోజకవర్గాల్లో ఓ పార్టీ తరఫున వారం రోజులుగా ఎన్నికల ప్రచార సరళిని పరిశీలించిన నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, కొందరు కార్పొరేటర్లు, డివిజన్ స్థాయి నేతలు ఎన్నికల్లో గెలువడం కష్టమనే నిర్ణయానికి వచ్చేశారు. ఈ మేరకు ఓటర్లకు పంపిణీ చేయాల్సిన డబ్బును కూడా కట్టడి చేసినట్లు సమాచారం. సికింద్రాబాద్‌లో ఓటర్లకు పంచేందుకు బూత్‌కు రూ.50వేల చొప్పున ఒక్కో డివిజన్‌కు రూ.20లక్షల దాకా చేరవేసినట్లు సమాచారం. కానీ, బూత్ స్థాయిలో ప్రత్యర్థి పార్టీ నేతలు డబ్బులు పంచకపోవడంతో.. వీళ్లు కూడా గప్‌చుప్‌గా ఉండిపోయారు. డివిజన్ స్థాయి నేతలు, కార్పొరేటర్లు.. ఆ డబ్బును మిగుల్చుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మల్కాజ్‌గిరి పరిధిలోని రెండు నియోజకవర్గాల్లోనూ పోల్ మేనేజ్‌మెంట్ బాధ్యతల నుంచి ముఖ్య నేతలు వైదొలిగినట్లు సమాచారం. ఈ విషయమై తాము ఆరా తీసిన సందర్భంలోనూ.. 'ఓడిపోతున్నామనే డబ్బులు పంచలేదు. మీ వరకు వ్యక్తిగతంగా చూసుకుంటాం" అని డివిజన్ స్థాయి నేతలు చెప్పినట్లు ఓ ఏజెంట్ తెలిపారు. ఇక, సికింద్రాబాద్ లోక్‌సభ పరిధి ముషీరాబాద్‌లో పోలింగ్ ఏజెంట్‌తోపాటు పోలింగ్ కేంద్రం బయట టేబుల్ వేసుకొని పోల్ చిట్టీలు రాసేందుకు ముగ్గురు నుంచి నలుగురిని ఓ పార్టీ నియమించింది. వారికి మాత్రమే ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి విందు ఏర్పాటు చేయడంతోపాటు రూ.2వేల చొప్పున చెల్లించినట్లు తెలిసింది.



దక్షిణ డిస్కంలో డైరెక్టర్ పోస్టులకు
ఆశావహుల ప్రయత్నాలు

- ఇన్‌చార్జి డైరెక్టర్ల బాధ్యతలపై విమర్శలు
- సీనియర్ సీజీఎంలకు బాధ్యతలిస్తే ప్రయోజనం

హైదరాబాద్ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): దక్షిణ తెలంగాణ విద్యుత్‌పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్)లో డైరెక్టర్ పోస్టులకు ఆశావహులు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇప్పటికే డైరెక్టర్ పోస్టుల కోసం పలువురు సీనియర్ అధికారులు దరఖాస్తులు చేస్తున్నారు. ఎన్నికల కోడ్ కారణంగా వాయిదాపడిన డైరెక్టర్ నియామకాలు కోడ్ ముగియగానే పూర్తిచేస్తారనే సమాచారంతో కొంతమంది సీనియర్ ఇంజనీర్లు పోస్టులు పొందేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. జూన్ 5వ తేదీతో ఎన్నికల కోడ్ ముగుస్తుండటంతో దానికంటే ముందే డైరెక్టర్ పోస్టుకు లైన్ క్లియర్ చేసుకోవాలని పలువురు భావిస్తున్నారు. ఇప్పటికే కొంతమంది ప్రభుత్వంలో తమకు అనుకూలంగా ఉన్న పెద్దలను కలిసి డైరెక్టర్ పోస్టులు ఇప్పించాలని కోరినట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో పదేళ్లపాటు కొంతమంది డైరెక్టర్ పోస్టుల్లో కొనసాగడంతో పలు విమర్శలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం విమర్శలకు తావివ్వకుండా డైరెక్టర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి దరఖాస్తులు ఆహ్వానించింది. విద్యుత్ సంస్థల్లో ఏళ్ల తరబడి అనుభవం, తెలంగాణ రాష్ట్రంపై పూర్తి అవగాహన కలిగిన సీజీఎంలకు డైరెక్టర్ పోస్టుల్లో అవకాశం కల్పించాలని పలు అసోసియేషన్ల నేతలు కోరుతున్నారు. విద్యుత్‌శాఖ నేరుగా నియామకమైన ఎలక్ట్రికల్ ఇంజనీర్లకు డైరెక్టర్ పోస్టుల్లో మొదటి ప్రాధాన్యం కల్పించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

ఇన్‌చార్జి డైరెక్టర్ల బాధ్యతలపై విమర్శలు

విద్యుత్ సంస్థల్లో డైరెక్టర్లను తొలగించిన తర్వాత ఇన్‌చార్జి డైరెక్టర్లను విద్యుత్‌సంస్థ నియమించింది. తాత్కాలిక డైరెక్టర్ల నియామకంలో సీనియర్ సీజీఎంలను పక్కన పెట్టి జూనియర్ సీజీఎంలకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారనే విమర్శలు వ్యక్తమయ్యాయి. గ్రేటర్‌జోన్‌తో పాటు డిస్కంపై పూర్తి పట్టులేక పోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయనే విమర్శలున్నాయి.

సగర ఫెడరేషన్‌ను కార్పొరేషన్‌గా మార్చాలి..

- ఎంపీ ఆర్. కృష్ణయ్య

రాంనగర్, మే 14 (ఆంధ్రజ్యోతి) : సగర ఫెడరేషన్‌ను కార్పొరేషన్‌గా మార్చి రూ. 500 కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రతి సగర కుటుంబానికి రూ.20లక్షలు కేటాయించాలన్నారు. మంగళవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో సగర (ఉప్పర) హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీరడి భూపేష్‌సాగర్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణల ఆధ్వర్యంలో భగీరథ జయంతి ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్. కృష్ణయ్య భగీరథ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. సగరులను బీసీ డీ గ్రూపు నుంచి బీసీ ఏ గ్రూపనకు మార్చాలని డిమాండ్ చేశారు. భగీరథ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం సగరులను భవన నిర్మాణ కార్మికులుగా గుర్తించాలని, ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. భద్రాచలం దేవస్థానానికి పాలకమండలిని నియమించి.. సగరులనే చైర్మన్‌గా నియమించాలని ఆర్.కృష్ణయ్య సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయేంద్రసాగర్, హనుమంతుసాగర్, పార్థసారథిసాగర్, కోలా జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.



భగీరథ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఆర్. కృష్ణయ్య, భూపేష్‌సాగర్, గుజ్జ కృష్ణ తదితరులు

సగరలు అన్ని రంగాల్లో రాణించాలి

భగీరథ మహారుషి చేసిన యజ్ఞాన్ని స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రంలో సగర కులస్థులు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలలో రాణించాలని బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ పిలుపునిచ్చారు. గ్రేటర్ హైదరాబాద్ సగర సంఘం అధ్యక్షుడు ఎం.రవి సగర ఆధ్వర్యంలో భగీరథ మహారుషి జయంతి వేడుకలు మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సగరుల డిమాండ్లను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. బీసీ సంక్షేమం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ చట్టసభల్లో ఎమ్మెల్యే, ఎంపీ లేని ఈ కులానికి నామినేటెడ్, ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర మాట్లాడుతూ అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న సగరులను బీసీ డి గ్రూప్ నుంచి ఏ గ్రూపులోకి చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సగర సంఘం నగర ప్రధాన కార్యదర్శి ఆవుల వెంకట్రామ్, కోశాధికారి రామస్వామి, గౌరవ అధ్యక్షుడు వెంకటస్వామి, రాష్ట్ర నాయకులు ఆంజనేయులు, హరికిషన్, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా సగర సంఘం సంక్షేమానికి కృషి చేసిన గోపాల్ సగర, చందు సగర, లావణ్య సగర, నరేందర్ సగర, బాలకృష్ణ సగరలను సంఘం రాష్ట్ర కమిటీ తరఫున వారిని రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర సత్కరించారు.



గోపాల్ సగరను సన్మానిస్తున్న వకుళా భరణం కృష్ణమోహన్ తదితరులు

ఎంఆర్‌డీసీఎల్ ఎస్ఈగా దత్తు పంత్

హైదరాబాద్ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ సౌత్‌జోన్ ఎస్ఈగా ఉన్న దత్తుపంత్‌ను మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్) ఎస్ఈగా బదిలీ చేస్తూ మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.





ఉపాధి శిక్షణా కోర్సు ప్రారంభం సందర్భంగా చర్లపల్లి సీపెట్, ఎన్‌టీపీసీ అధికార సిబ్బందితో విద్యార్థులు

యువతలో ఉపాధి నైపుణ్యం పెంచుతున్నాం

- ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్‌పాండు
- 'సీపెట్'లో ప్రారంభమైన శిక్షణా కోర్సు

కుషాయిగూడ, మే 14 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ యువతలో వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడం, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తాము శిక్షణా కోర్సులను నిర్వహిస్తున్నట్లు నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు తెలిపారు. చర్లపల్లిలోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ అండ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ (సీపెట్)లో మంగళవారం ఉచిత ఉపాధి శిక్షణా కోర్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ పథకం కింద ఇప్పటికే మూడు బ్యాచ్‌లు పూర్తి చేసుకొని, ప్రస్తుతం మరో 40మంది అభ్యర్థులకు ఈ ఉపాధి శిక్షణా కోర్సును అందజేస్తున్నామని వెల్లడించారు. సీపెట్ చీఫ్ మేనేజర్ (టెక్నికల్) డాక్టర్ వి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ శిక్షణా కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యంతో పాటు స్టడీ మెటీరియల్ కూడా అందజేస్తున్నట్లు వివరించారు. ఎన్టీపీసీ అధికారులు విజయ్‌కుమార్ సిక్దర్, యోగేందర్‌రావు, సుందర్, సీపెట్ అధికారులు మేనేజర్ ఆంజనేయశర్మ, బి.శ్రీకర్, ఆర్. మణికందన్, ఎస్.గోవింద తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు, విద్యుత్ డిమాండ్‌పై అప్రమత్తంగా ఉండాలి

- ఆకస్మిక తనిఖీలో సీఎండీ ముషారఫ్ ఫరూకి



సుభాష్‌నగర్ సబ్‌స్టేషన్, ఎఫ్ఓసీ సెంబర్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ముషారఫ్ ఫరూకి తదితరులు

హైదరాబాద్ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు పడినా, విద్యుత్ డిమాండ్ పెరిగినా సిబ్బంది, అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకి అధికారులను ఆదేశించారు. మేడ్చల్ సుభాష్‌నగర్, పటాన్‌చెరు, సికింద్రాబాద్ జింఖానా, గన్‌రాక్ వంటి ప్రాంతాల్లో ఫ్యూజ్ ఆఫ్‌కాల్ సెంటర్లు (ఎఫ్ఓసీ), విద్యుత్ సబ్‌స్టేషన్లను సీఎండీ రెండురోజులుగా ఆకస్మికంగా తనిఖీలు చేస్తున్నారు. వినియోగదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందినా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీసుకోవడంతో పాటు పనిచేసే అధికారులు, సిబ్బందికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. మేడ్చల్ సుభాష్‌నగర్‌లో నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో సీజీఎం మోహన్, సికింద్రాబాద్ సర్కిల్‌లో ఎస్ఈ రవికుమార్‌తోపాటు డివిజన్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

పర్యవేక్షణ బాధ్యతల నుంచి ఉద్యోగులు వెనక్కి

భారీ విద్యుత్ డిమాండ్ నేపథ్యంలో అకౌంట్స్ విభాగం అధికారులతో పాటు కార్పొరేట్ కార్యాలయంలో పనిచేస్తున్న పలు విభాగాల అధికారులకు డివిజన్లు, సెక్షన్లు, సర్కిళ్ల వారీగా పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు.

ఎండల తీవ్రత కొంతమేర తగ్గడం, ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో పర్యవేక్షణ బాధ్యతల్లో భాగంగా ఆయా కార్యాలయాలకు వెళ్లిన అధికారులందరూ తిరిగి తమ పాతస్థానాల్లోకి రావాలంటూ ఉన్నతాధికారులు మంగళవారం ఆదేశాలు జారీచేశారు.



ఉండాలా? వద్దా?

పిల్లలు యుక్తవయస్సు వచ్చిన తర్వాత బయటకు వెళ్లి స్వతంత్రంగా జీవిస్తే మంచిదా? తల్లితండ్రుల వద్దే ఉండి వారి సాయం తీసుకుంటే మంచిదా? ఈ విషయంలో అనేక సార్లు చర్చ జరుగుతూనే ఉంటుంది. పాశ్చాత్య దేశాల్లో టీనేజ్ వచ్చిన తర్వాత పిల్లలు బయటకు వెళ్లి సంపాదించుకొని స్వతంత్రంగా జీవిస్తూ ఉంటారు. మన దేశంలో మాత్రం పిల్లలు తల్లితండ్రుల వద్దే ఉంటారు. తాజాగా ప్రముఖ బాలీవుడ్ నటి ఆలియా భట్ తన కుమార్తె రాహను 20 ఏళ్లు దాటిన తర్వాత కూడా బయటకు వెళ్లనివ్వనని పేర్కొనటంతో ఇంటర్నెట్ ప్రపంచంలో ఒక పెద్ద చర్చ ప్రారంభమయింది. తనకు 23 ఏళ్లు ఉండగా బయటకు వచ్చేశానని.. ఎప్పుడూ షూటింగ్‌లతో బిజీగా ఉండే దానినని.. తాను ఎక్కడున్నానో తల్లితండ్రులకు తెలియదని.. తన కుమార్తెకు అలాంటి పరిస్థితి రాకూడదని భావిస్తున్నానని ఆలియా పేర్కొన్నారు. కొందరు మానసిక నిపుణులు ఆలియాతో ఏకీభవిస్తున్నారు. వారేమంటున్నారో చూద్దాం..

ఎమోషనల్ సపోర్ట్

సుమారు 21 ఏళ్లకు చదువు పూర్తవుతుంది. పిల్లలు తమ కెరీర్‌ను ప్రారంభిస్తారు. అదే సమయంలో వారు తమ వ్యక్తిగత జీవితంపై కూడా దృష్టి పెడతారు. ఈ సమయంలో వారికి ఎదురయ్యే వృత్తిపరమైన, వ్యక్తిగతమైన సవాళ్లను ఎదుర్కోవటానికి తల్లితండ్రుల మద్దతు ఉంటే మంచిది. తల్లితండ్రులు, కుటుంబంలోని ఇతర సభ్యులు వారిని ఎప్పటికప్పుడు వారిని మోటివేట్ చేయటానికి వీలవుతుంది.

బాధ్యతల బరువు

చిన్నప్పుడే బయటకు వచ్చేసి కుటుంబ బాధ్యతలను అందుకోగలిగితే మంచిదే! కానీ కొందరికి బాధ్యతలు చేపట్టే పరిణితి ఉండదు. వారికి బాధ్యతలు చాలా బరువుగా అనిపిస్తాయి. అలాంటి వారికి కుటుంబ మద్దతు అవసరం.

కుటుంబ విలువలు

ఒక వ్యక్తి కుటుంబంతో కలిసి జీవిస్తుంటే- కుటుంబ విలువలు, ఆచార సాంప్రదాయాలు అర్థమవుతాయి. ఉదాహరణకు ఒక పండగ వచ్చినప్పుడు ఒంటరిగా ఉండటానికి కుటుంబంతో కలిసి ఉండటానికి మధ్య చాలా తేడా ఉంటుంది. కుటుంబంతో కలిసి ఉంటే ఆచార వ్యవహారాలు తెలుసుకోవటానికి వీలుంటుంది.

జీవిత సలహాలు

20లలో చాలా మంది రకరకాల భావోద్వేగాలతో కొట్టుకుపోతూ ఉంటారు. కొందరు మంచి, చెడులను బేరీజు వేసుకోలేని స్థితిలో ఉంటారు. అలాంటి సమయాలలో కుటుంబ వ్యవస్థ మద్దతు ఇస్తుంది. వారు జీవితంలో ఎదిగేలా చేస్తుంది.

అనన్య సామర్థ్యం



ఒక సాధారణ అమ్మాయిలా కెరీర్ ప్రారంభించారు. కానీ... అనతికాలంలోనే బడా కంపెనీల అత్యున్నత స్థానాన్ని అధిరోహించారు. ఉన్నత చదువు... వ్యాపారాన్ని పరుగులు పెట్టించే అసాధారణ ప్రతిభా పాటవాలు... ఇవే ఆమె విజయానికి సోపానాలు అయ్యాయి. 'ఫోర్బ్స్ ఇండియా' మ్యాగజైన్ 'సెల్ఫ్‌మేడ్ ఉమెన్-2024' జాబితాలో స్థానం దక్కించుకున్న ప్రముఖ రియల్‌ఎస్టేట్ కంపెనీ 'బ్రూక్ ఫీల్డ్' మేనేజింగ్ డైరెక్టర్ అనన్యా త్రిపాఠి జైత్ర యాత్ర ఇది.

భారత సైన్యంలో పని చేసే అధికారి కూతురు కావడంతో దేశంలోని చాలా ప్రాంతాలు తిరిగారు అనన్యా త్రిపాఠి. తండ్రికి బదిలీ అయినప్పుడల్లా ఆమె స్కూలు కూడా మారిపోయేది. అయితే దాన్ని అసౌకర్యంగానో... తన చదువుకు ప్రతిబంధకంగానో అనన్య ఎప్పుడూ భావించలేదు. పైగా 'అలా పలు ప్రాంతాల్లోని పాఠశాలల్లో చదవడంవల్లే... భిన్న పరిస్థితులను ఆకళింపు చేసుకోవడం, విభిన్న సంస్కృతులపై అవగాహన చిన్న వయసులోనే కలిగాయి. ఎదిగాక ఆ అంశాలే నా కెరీర్‌కు పునాదులయ్యాయి' అంటారు ఆమె.

2005లో కేరళ కొజికోడ్ 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) నుంచి ఎంబీయే పట్టా అందుకున్న అనన్యా... అదే ఏడాది బెంగళూరు టీసీఎస్‌లో చేరారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఏడాది పాటు అందులో పని చేశారు. అదే సమయంలో కొంతమంది ఐఐఎం విద్యార్థులను ప్రతిష్ఠాత్మక 'మెక్‌కిన్సే అండ్ కంపెనీ' తమ ముంబయి కార్యాలయానికి ఆహ్వానించింది. ఆ ఏడాది కొజికోడ్ ఐఐఎం నుంచి ఒక్కరికే ఆ అవకాశం దక్కింది. ఆ ఒక్కరూ... అనన్య త్రిపాఠి. జూనియర్ అసోసియేట్ మేనేజర్‌గా అందులో ఉద్యోగం మొదలుపెట్టిన ఆమె... అసోసియేట్ పార్ట్‌నర్‌గా పదోన్నతి పొందారు. ఆరున్నర ఏళ్ల పాటు వివిధ హోదాల్లో పని చేశారు.

కోడర్‌గానే ఉండాలనుకోలేదు...

'జీవితమంతా కోడర్‌గానే ఉండలేననే విషయం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా కెరీర్ మొదలుపెట్టిన కొద్ది రోజులకే అర్థమైంది. ఇక అప్పటి నుంచి నా మనసు కుదురుగా లేదు. వ్యాపార రంగంపై సమగ్ర అవగాహన అవసరం అనుకున్నాను. ఆ దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టిన సమయంలో 'మెక్‌కిన్సే'లో అవకాశం లభించింది' అని నాటి రోజులు గుర్తు చేసుకున్నారు అనన్యా. అందులో కొలువు ఆమె ఎదుగుదలకు ఎంతో దోహదపడింది. అద్భుతమైన మార్గదర్శకులు అక్కడ లభించారు. వారి మార్గదర్శనంలో కంపెనీ నిర్వహణ, వ్యాపార అభివృద్ధికి సంబంధించి అనేక కీలక విషయాలు ఆకళింపు చేసుకున్నారు.

ఊహించని మలుపు...

"చెప్పాలంటే ఒక విధంగా ఆ కంపెనీలో నేను దూసుకుపోతున్నా. ఉన్నత హోదాలో కొనసాగుతున్నా. ఆ సమయంలో 'మింత్రా' నుంచి వచ్చిన కాల్ నా వృత్తిగత జీవితాన్ని ఊహించని మలుపు తిప్పింది. నాటికి ఇ-కామర్స్ రంగం భవిష్యత్తుపై ఎవరికీ సరైన అంచనాలు కానీ, భరోసా కానీ లేవు. అలాంటి పరిస్థితుల్లో మంచి ఉద్యోగం వదులుకొని అటువైపు వెళ్లడం అవసరమా అనిపించింది. అలాగని వెనకడుగు వేయదలుచుకోలేదు. అందివచ్చిన అవకాశాన్ని వదులుకోవాలని అనుకోలేదు. అందుకే ఓకే చెప్పాను. చీఫ్ స్ట్రేటజీ ఆఫీసర్‌గా 'మింత్రా'లో విధులు ప్రారంభించాను. ఆ నిర్ణయమే నా భవిష్యత్తును నిర్ణయిస్తుందని కొన్నాళ్లకు అర్థమైంది" అంటారు అనన్యా. ఆమె బాధ్యతలు చేపట్టాక ఆ కంపెనీ స్థూల వాణిజ్య విలువ 250 డాలర్ల నుంచి 1.7 బిలియన్ డాలర్లకు ఎగబాకింది.



మరో మెట్టు పైకి...


ఆరేళ్ల కిందట 'వాల్‌మార్ట్' సంస్థ 'ఫ్లిప్‌కార్ట్'ను సొంతం చేసుకున్న సమయంలో తమ కంపెనీ వదలవద్దని అనన్యాకు 'మింత్రా' భారీ ఆఫర్ ఇచ్చింది. కానీ ఆమె దాన్ని వదులుకుని... ముంబయి 'కేకేఆర్ క్యాప్‌స్టోన్ ఇండియా' నుంచి వచ్చిన ఆహ్వానాన్ని అందుకున్నారు. అందుకు కారణం... కెరీర్‌లో మరో మెట్టు ఎక్కే అరుదైన అవకాశం లభించడం. 'కేకేఆర్'లో మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అక్కడ 'మ్యాక్స్ హెల్త్‌కేర్, విని కాస్మోటిక్స్' వంటి కంపెనీలతో కలిసి పని చేసే అవకాశం దక్కింది. అంతేకాదు, సదరు కంపెనీల మార్కెట్‌ను రెట్టింపు చేయడంలో కూడా ఆమె కీలక పాత్ర పోషించారు. దీంతోపాటు మరికొన్ని కంపెనీలకు బోర్డ్ మెంబర్‌గా వ్యవహరించారు.

మరో అరుదైన అవకాశం...

నాలుగున్నరేళ్లు 'కేకేఆర్'లో పని చేసిన అనన్యా త్రిపాఠి... ఆ తరువాత 'బైజూస్'కు చెందిన 'వైట్‌హ్యాట్ జూనియర్'కు సీఈఓగా వెళ్లారు. గర్భవతిగా ఉన్న ఆమె తొమ్మిది నెలలు పూర్తిగా విశ్రాంతి తీసుకున్నారు. బిడ్డకు జన్మనిచ్చాక తిరిగి విధుల్లో చేరారు. ఆ సమయంలోనే ప్రముఖ రియల్‌ఎస్టేట్ కంపెనీ బెంగళూరులోని 'బ్రూక్ ఫీల్డ్' నుంచి పిలుపు వచ్చింది. తాను మెటర్నిటీ లీవ్‌లో ఉన్నాని ఆమె చెప్పారు. అయితే సెలవు ముగిసేవరకు వేచివుంటామని సంస్థ తెలిపింది. దాంతో 'వైట్‌హ్యాట్'కు రాజీనామా చేసి 'బ్రూక్‌ఫీల్డ్'కు ఓకే చెప్పారు అనన్యా. ఈ ఏడాది జనవరిలో ఆ కంపెనీ ఆసియా పసిఫిక్ ప్రాంత మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. 'అప్పుడే బిడ్డకు జన్మనిచ్చిన తల్లిగా నా అవసరాలు, బాధ్యతలను కంపెనీ అర్థం చేసుకుంది. నా కోసం వేచివుండేందుకు సిద్ధపడింది. ఇది నన్ను ఆకట్టుకుంది. అందుకే వారి ఆఫర్‌ను కాదనలేకపోయాను' అంటారు అనన్యా త్రిపాఠి.

బాధ్యత పెద్దది...

ఆఫీస్ స్పేస్‌కు సంబంధించి మెగా వెంచర్లు నడిపించే సదరు కంపెనీని ముందుకు నడిపించడం అంత సులువు కాదు. తనపై ఉన్నది ఎంతో పెద్ద బాధ్యత అంటారు అనన్య. దేశంలోని ఏడు నగరాల్లో సంస్థ కార్యకలాపాలు సాగుతున్నాయి. రియల్‌ఎస్టేట్ రంగంలో వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో సాగుతున్న భారీ కంపెనీ బాధ్యతను అనన్య భారంగా భావించడంలేదు. ఒత్తిడికి లోనుకావడంలేదు. సంస్థకు లాభాలు ఆర్జించిపెట్టడంతో పాటు, సంస్థను నమ్మి పెట్టుబడి పెట్టినవారికి కూడా అది ఒక మంచి ఆదాయ మార్గంగా నిలిచేలా ప్రణాళికలు రచిస్తున్నారు. అదేవిధంగా సరికొత్త ఆదాయ వనరులను అన్వేషిస్తున్నారు. ఇవే ఆమెను 'ఫోర్బ్స్ ఇండియా' మ్యాగజైన్ 'సెల్ఫ్‌మేడ్ ఉమెన్-2024' జాబితాలో ఏడో స్థానంలో నిలిపాయి. మరికొన్ని ప్రతిష్ఠాత్మక అవార్డులనూ తెచ్చిపెట్టాయి.



ముఖంపై చారలు కనిపించకుండా..

ఎక్కువ సేపు ఒక వైపు పడుక్కొంటే- ముఖంపై చారలు పడతాయి. ఉదయాన్నే లేచి బయటకు వెళ్లాలంటే ఈ చారలు ఇబ్బందిగా అనిపిస్తాయి. వీటిని చిన్న చిన్న చిట్కాల ద్వారా ఎలా నివారించవచ్చో చూద్దాం

- వెల్లకిలా కాకుండా నడుం పరువువైపు ఉండేలా పడుకోవడం అలవాటు చేసుకోవాలి. దీని వల్ల తరగడాపై ముఖం ఒత్తుకుపోదు. దీని వల్ల ముఖంపై చారలు పడవు.
- చాలా మంది కాటన్ గలీబులను వాడతారు. కాటన్ కాకుండా శాటిన్, సిల్క్, మెత్తటి సిల్క్ కాటన్ గలీబులను వాడితే మంచిది.
- ప్రతి రోజు పడుక్కొనే ముందు మాయిశ్చరైజర్ రాయాలి. దీని వల్ల చర్మం మృదువుగా తయారవుతుంది. ముఖంపై చారలు పడినా అవి వెంటనే తొలగిపోతాయి.
- ఈ మధ్యకాలంలో రకరకాల షేపుల్లో ఉన్న తలగడాలు వస్తున్నాయి. వీటిని ఉపయోగించటం వల్ల ఒత్తిడి తగ్గుతుంది.
- నిగనిగలాడే చర్మం కావాలంటే ఆరోగ్యవంతమైన ఆహారం తీసుకోవాలి. అప్పుడే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. ముఖంపై చారలు ఎక్కువగా కనిపించవు.

కిస్మిస్ నీళ్లతో ప్రయోజనాలెన్నో!

కొందరు ఉదయాన్నే లేచిన వెంటనే గోరువెచ్చని నిమ్మకాయ నీళ్లు తాగుతారు. మరికొందరు మెంతులు నానపెట్టిన నీళ్లు తాగుతారు. ఈ మధ్యకాలంలో కిస్మిస్‌లను నానపెట్టి వాటిని తాగే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది.

ఎలా తయారుచేయాలి?

ఒక పది కిస్‌మిస్‌లను తీసుకోవాలి. వాటిని ఒక గ్లాసు నీళ్లలో వేసి నానబెట్టాలి. ఆ నీళ్లను ఉదయాన్నే లేచి ఎటువంటి ఆహారం తీసుకోకుండా తాగాలి.

ప్రయోజనాలేమిటి?

- ఈ నీళ్లలో ఫైబర్ ఉంటుంది. దీని వల్ల అజీర్తి



తొలగిపోతుంది.
- దీనిలో ఉండే ఐరన్, పోటాషియం, యాంటీ ఆక్సిడెంట్స్ శరీరంలోని కణాలకు ఎంతో ఉపకరిస్తాయి.
- పొటాషియం వల్ల రక్తపోటు నియంత్రణ జరుగుతుంది. హృద్రోగ సమస్యలు తొలగిపోతాయి.
- ఈ నీళ్లలో ఉండే యాంటీ రాడికల్స్ వల్ల కణాలు ఆరోగ్యంగా తయారవుతాయి
- కిస్‌మిస్‌లలో సహజసిద్ధమైన సుగర్ ఉంటుంది. కార్బోహైడ్రేడ్స్ కూడా ఉంటాయి. వీటి వల్ల శరీరానికి తక్షణమే శక్తి కలుగుతుంది.
- ఉదయాన్నే ఈ నీళ్లు తాగటం వల్ల ఆకలి తగ్గుతుంది. దీని వల్ల తినే ఆహార పరిమాణం తగ్గుతుంది. బరువు తగ్గటానికి వీలవుతుంది.

డిన్నర్ తర్వాత కాఫీ తాగద్దు!

డిన్నర్ చేసిన తర్వాత కాఫీ తాగటం పాశ్చాత్యుల పద్ధతి. ఈ మధ్యకాలంలో మన దేశంలో కూడా డిన్నర్ తర్వాత కాఫీ లేదా టీ తాగే వారి సంఖ్య పెరుగుతోంది. అయితే ఇలా తాగటం వల్ల అనారోగ్యం కలుగుతుందని ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) హెచ్చరిస్తోంది.

ఐసీఎంఆర్ శాస్త్రవేత్తల అధ్యయనం ప్రకారం- కాఫీ లేదా టీలో ఉండే కెఫైన్ మన శరీరంలోని



నాడీ వ్యవస్థపై ప్రభావం చూపిస్తుంది. 150 మిల్లీలీటర్ల కాఫీలో 80 నుంచి 120 మిల్లీగ్రాముల కెఫైన్ ఉంటుంది. 150 మిల్లీలీటర్ల ఇన్‌స్టెంట్ కాఫీలో 50 నుంచి 65 మిల్లీగ్రాముల కెఫైన్ ఉంటుంది. 150 మిల్లీలీటర్ల టీలో 30 నుంచి 65 మిల్లీగ్రాముల కెఫైన్ ఉంటుంది. శాస్త్రవేత్తల లెక్కల ప్రకారం- ప్రతి రోజు ఒక ఆరోగ్యవంతుడైన వ్యక్తి 300 మిల్లీగ్రాముల కెఫైన్ తీసుకోవచ్చు. అంత కన్నా ఎక్కువ

అయితే అనేక రకాల సమస్యలు ఏర్పడతాయి. అంతే కాకుండా కాఫీ లేదా టీలలో టేనిన్ అనే ఒక రసాయనం ఉంటుంది. ఇది మన శరీరంలోకి ఐరెన్ వెళ్లకుండా అడ్డుపడుతుంది. మన శరీరంలో హిమోగ్లోబిన్ తయారీలో ఐరెన్‌ది ప్రధానమైన పాత్ర. హిమోగ్లోబిన్ తగ్గితే శరీరంలో కణాలు శక్తిమంతంగా పనిచేయలేవు. ఆహారం తిన్న గంట సేపులోపులో టీ లేదా కాఫీ తాగితే టేనిన్ ప్రభావం మన శరీరంపై పడుతుంది. అందువల్ల ఆహారం తిన్న గంట సేపు తర్వాత మాత్రమే కాఫీ లేదా టీని తాగమని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.



లీలమ్మ డ్యాన్స్... వేరే లెవెల్

మూడు వారాల క్రితం సాధారణ గృహిణిగా ఉన్న ఆమె రాత్రికి రాత్రి సెలబ్రిటీ అయిపోయారు.
ఒక పెళ్ళిలో ఆమె చేసిన నృత్యం రెండ్రోజుల్లోనే దాదాపు అరవై లక్షల మంది వీక్షించారు.
ఇలాంటి గుర్తింపును ఊహించలేదంటున్నారు అరవై నాలుగేళ్ళ లీలమ్మ.
ప్రముఖుల ప్రశంసలందుకుంటున్న ఈ కేరళ బామ్మను సినిమా అవకాశాలు కూడా వెతుక్కుంటూ వస్తున్నాయ్.

"నా పిల్లలు 'వైరల్ అవుతోంది' అని మాట్లాడుకుంటూ ఉంటే ఆ మాటకు అర్థం తెలిసేది కాదు. ఇప్పుడు అదేంటో బాగా అర్థమైపోయింది" అని నవ్వుతూ అన్నారు లీలమ్మ. ఇరుగు పొరుగువారు, బంధువుల పలకరింపులతో, అభినందనలతో ఆమెకు తీరిక దొరకడం లేదు. మరోవైపు ఇంటర్వ్యూల కోసం మీడియా ప్రతినిధుల హడావిడి. లీలమ్మ కోసం పెద్ద సంఖ్యలో వస్తున్న ఫోన్ కాల్స్‌ను ఆమె పిల్లలు అటెండ్ అవుతున్నారు. కాల్ చేస్తున్నవారిలో సినీ, రాజకీయ ప్రముఖులు కూడా ఉన్నారు. "ఒక కాల్‌లో మాట్లాడమని మా అబ్బాయి సంతోష్ ఫోన్ నా చేతికి ఇచ్చాడు. "అమ్మా! నా పేరు శివన్ కుట్టి. నేను కేరళ విద్యాశాఖ మంత్రిని. మీరు డ్యాన్స్ అదరగొట్టారు. అభిరుచికి వయసుతో పని లేదని నిరూపించారు. కంగ్రాట్స్" అంటూ అవతల వ్యక్తి మాట్లాడినప్పుడు... ఎలా స్పందించాలో తెలియలేదు. ఉద్వేగంతో గొంతు పూడుకుపోయింది. "మీ అభిమానానికి థ్యాంక్స్" అని మాత్రం అనగలిగాను. ఎందుకో... పరిచయం లేని వాళ్ళతో... మనిషి ఎదురుగా లేకుండా మాట్లాడడం నాకు కాస్త ఇబ్బందిగా ఉంటుంది" అంటారామె.

'వాళ్ళ మధ్యలో నేనెందుకు?' అనుకున్నా..

లీలమ్మ కేరళ రాష్ట్రం ఎర్నాకుళంలోని పల్లిక్కరలో తన కుమారుడు అవ్వై సంతోష్, కోడలు, ఇద్దరు మనుమలతో కలిసి ఉంటున్నారు. ఆమె కుమార్తెల్లో ఒకరైన మినీ జాయ్ డ్యాన్స్ టీచర్. కాగా మరో కుమార్తె సినీ సుధీర్ విదేశాల్లో ఉంటున్నారు. "చిన్నప్పుడు స్కూల్ ఫంక్షన్లలో డ్యాన్స్ చేసే దాన్ని. ఆ తరువాత, పెళ్ళి, కుటుంబ బాధ్యతలు... అయినా నాట్యం అంటే ఆసక్తి పోలేదు. నా భర్త జాన్ కె. పల్లిక్కర రంగస్థల కళాకారుడు. దీంతో కళలకు అనువైన వాతావరణం మా ఇంట్లో ఎప్పుడూ ఉంటుంది. ఆయన అడుగుజాడల్లో మా అబ్బాయి సంతోష్ టీవీ నటుడయ్యాడు. డ్యాన్సర్ కావాలని మా అమ్మాయి మినీని నేనే ప్రోత్సహించాను" అని చెప్పారు లీలమ్మ. "నాట్యాన్ని నేను ఎక్కడా నేర్చుకోలేదు. కానీ మంచి సంగీతం వినిపిస్తే నా కాళ్ళు వాటంతటవే కదుల్తాయి. వంట వండుతూ డ్యాన్స్ చేస్తుంటా. నాకు పాత పాటలంటే ఇష్టం. బంధువులు, స్నేహితుల ఇళ్ళలో ఏవైనా ఫంక్షన్లు జరిగితే... నాట్యం చెయ్యడానికి సంకోచించను" అంటారు లీలమ్మ. కిందటి నెల మూడో వారంలో పట్టాంబిలోని బంధువుల ఇంట్లో పెళ్ళికి కుటుంబంతో సహా ఆమె వెళ్ళారు. "అక్కడ పిల్లలందరూ స్టేజి మీద డ్యాన్స్ చేస్తున్నారు. నాకూ చెయ్యాలని ఉంది. కానీ పిల్లల మధ్యలో నేనేందుకు? అనుకున్నాను. ఇంతలో మా అబ్బాయి నన్ను స్టేజి మీదకు పిలిచాడు. "నువ్వూ డ్యాన్స్ చెయ్యమ్మా! సరదాగా ఉంటుంది" అంటూ ప్రోత్సహించాడు. నలభయ్యేళ్ళ నాటి 'కనమరయతు' (మళయాళం) సినిమాలోని 'ఒరు మధురకినవిన్' అనే పాట పెట్టారు. నాకు చాలా ఇష్టమైన ఆ పాటలోని డ్యాన్స్ అంతా నా కళ్ళ ముందు కదిలింది. స్టేజి మీదకు వెళ్ళాక... నన్ను నేను మరచిపోయాను. నన్ను చూసి పిల్లలు కూడా ఉత్సాహంగా నాతో కలిశారు" అని గుర్తు చేసుకున్నారు లీలమ్మ.



అప్పుడు కుదరలేదు, కానీ...

ఆమె నృత్యాన్ని సంతోష్ వీడియో తీశారు. "మా అమ్మకు డ్యాన్సంటే చాలా ఇష్టం. ఎక్కడ ఏ వేడుక జరిగినా ఆమెను నాట్యం చెయ్యాలని ప్రోత్సహిస్తూ ఉంటాం. ప్రత్యేకంగా నేర్చుకోకపోయినా... ఏమాత్రం తడబడదు. మాతో కలిసి కూడా అమ్మ డ్యాన్స్ చేస్తూ ఉంటుంది. ఈసారి ఆమె నృత్యం మరింత ప్రత్యేకంగా కనిపించింది. అందుకే ఫేస్‌బుక్‌లో పెట్టాను. రెండు రోజుల్లోనే అరవై లక్షలకు పైగా వ్యూస్ వచ్చాయి. ఇంకా పెరుగుతూనే ఉన్నాయి ఇంత స్పందన వస్తుందని అనుకోలేదు. మా నాన్న జీవించి ఉంటే ఎంతో సంబరపడేవారు. రంగస్థల నటుడిగా ఆయనకూ, టీవీ నటుడిగా నాకూ రానంత ఫేమ్ ఒక్క వీడియోతో అమ్మ కొట్టేసింది" అంటున్నారు సంతోష్. లీలమ్మ వీడియో వైరల్ కాగానే... కుంచకో బోబన్, రహమాన్, సితారా కృష్ణకుమార్‌తో సహా అనేక మంది మలయాళ సెలబ్రిటీలు... ఆమెను అభినందిస్తూ... ఆ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. రాష్ట్ర మంత్రి శివన్‌కుట్టి స్వయంగా ఆమెతో మాట్లాడారు. మరోవైపు ఆమెకు మూడు సినిమాల్లో ఆఫర్లు కూడా వచ్చాయి. వాటిలో మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ సినిమా ఒకటి. "ఇదంతా ఆ దేవుడి దయ. "నాటకాల్లో నేను నటించవచ్చా?" అని నా భర్తను అడిగే దాన్ని. ఆయనకు ఇష్టమే అయినా... పలు కారణాల వల్ల అది కుదరలేదు. ఇప్పుడు సినిమా ఆఫర్లతో ఆ కల నిజం కాబోతోంది. ఒక్క నాటకంలోనైనా, సినిమాలోనైనా ఇంకా నటించకుండానే నాకు పేరొచ్చింది. ఇంతకన్నా ఇంకే కావాలి?" అంటున్నారు లీలమ్మ.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
బుధవారం • 15 మే 2024
cinema@andhrajyothy.com

వర్క్ పూర్తి చేసుకున్న తలైవా



తమిళ చిత్రరంగ సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న 'వేట్టయాన్' చిత్రం షూటింగ్ దాదాపు పూర్తి కావొచ్చింది. ఈ సినిమా తెలుగు టైటిల్ ఏవిటన్నది ఇంకా వెల్లడించలేదు. 'జై భీమ్' సినిమాకు దర్శకత్వం వహించిన టీజే జ్ఞానవేల్ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్ బేనరుపై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. అమితాబ్ బచ్చన్, ఫహద్ ఫాసిల్, రానా, మంజు వారియర్ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. తన పాత్రకు సంబంధించిన వర్క్‌ను రజనీకాంత్ పూర్తి చేసుకోవడంతో చిత్ర యూనిట్ ఆయనకు వీడ్కోలు పలికింది. భారీ స్థాయిలో అంచనాలు కలిగిన ఈ సినిమాను అక్టోబర్‌లో విడుదల చేయనున్నట్లు నిర్మాత ప్రకటించారు. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతాన్ని అందిస్తుండగా, ఎస్.ఆర్.కతీర్ సినిమాటోగ్రాఫర్‌గా పని చేస్తున్నారు.


ఎదురుచూపులు ఫలించేలా



'హరిహర వీరమల్లు' సినిమా రిలీజ్ కోసం పవన్ అభిమానులే కాదు నేను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని నిధి అగర్వాల్ అన్నారు. ఆకట్టుకునే అందంతో కుర్రకారు హృదయాలను కొల్లగొడుతున్నారు ఈ ఇస్మార్ట్ బ్యూటీ. కెరీర్ ఆరంభంలోనే వరుస అపజయాలు చవిచూసినా తన అందాల ఆరబోతతో అవకాశాలను దక్కించుకుంటున్నారు. 'ఇస్మార్ట్ శంకర్' లాంటి సూపర్ హిట్ తర్వాత వరుసగా సినిమాలు చేసినా, ఓ మంచి విజయం మాత్రం ఈ అమ్మడుకి అందలేదు. అయితే పవన్ కల్యాణ్ సరసన నటిస్తున్న 'హరిహర వీరమల్లు' తనకు ఆ లోటు తీరుస్తుందంటున్నారు నిధి. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించడం తన కెరీర్‌కు ఊపు తెస్తుందని ఆమె చెబుతున్నారు. ఈ సినిమా రిలీజైన తర్వాత మరిన్ని మంచి పాత్రలు తనను వెతుక్కుంటూ వస్తాయనే నమ్మకం ఉందన్నారు నిధి.

భారీ సెట్‌లో నాని పోరాటాలు

ఇంతకుముందెన్నడూ పోషించని పవర్ ప్యాక్డ్ పాత్రలో నాని నటిస్తున్న 'సరిపోదా శనివారం' షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ శివార్లలో ఉన్న అల్యూమినియం ఫ్యాక్టరీలో జరుగుతోంది, హై బడ్జెట్‌తో రూపొందిస్తున్న ఈ సినిమాకు వివేక్ ఆత్రేయ దర్శకుడు. ప్రస్తుతం చిత్రీకరిస్తున్న పతాక సన్నివేశాల కోసం ఓ భారీ సెట్ వేశారు. ప్రియాంక మోహన్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాలో ఎస్ జె సూర్య కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆగస్టు 29న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు నిర్మాతలు డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి చెప్పారు.




లవ్ బడ్డీ



'ఊర్వశివో రాక్షసివో' చిత్రం తర్వాత అల్లు శిరీష్ నటిస్తున్న చిత్రం 'బడ్డీ'. యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకుంది. శామ్ ఆంటోన్ దర్శకత్వంలో జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలోని తొలి పాట 'ఆ పిల్ల కనులే..'ను బుధవారం విడుదల చేస్తున్నారు. హిప్ హాప్ తమిళ స్వరపరిచిన పాట ఇది. గాయత్రి భరద్వాజ్ కథానాయికగా నటించిన ఈ చిత్రం విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తామని నిర్మాత చెప్పారు.

మన సినిమాలకంటే కొరియన్ ఫిల్మ్స్ బెస్ట్



భారతీయ సినిమాల మీద తనకున్న అసంతృప్తిని, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు నటుడు నసీరుద్దీన్ షా. 'మన సినిమాకంటే కొరియన్ ఫిల్మ్స్ బెస్ట్' అని కూడా ఆయన కామెంట్ చేశారు. ఇటీవల ముంబైలో జరిగిన ఓ వేడుకలో నసీరుద్దీన్ షా మాట్లాడుతూ 'ఎందుకనో 'బాలీవుడ్' అనే పదమే నాకు నచ్చదు. భారతీయ ఫుడ్‌కు ప్రపంచ వ్యాప్తంగా పేరు ఉన్నట్లే గత వైభవాన్ని గౌరవిస్తూ మన సినిమాలను కూడా ఇప్పటికీ ప్రపంచ ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. నిజానికి మన చిత్రాలకంటే దక్షిణ కొరియా చిత్రాలు, థాయ్ సినిమాలు బాగుంటున్నాయి. ఆ సినిమాల నుంచి స్ఫూర్తి పొంది మన వాళ్లు సినిమాలు తీస్తున్నారని చెప్పడానికి సిగ్గు పడనక్కర్లేదు. అయితే ఇకనైనా జాగ్రత్త పడకపోతే ఏదో ఒక రోజు మన సినిమాలకు ఉన్న ఫేమ్ గాలి బుడగలా పేలిపోవచ్చు' అని ఆయన హెచ్చరించారు. ప్రస్తుతం నసీరుద్దీన్ షా సినిమాలు ఏమీ చేయడం లేదు. వెబ్ సిరీస్‌లో మాత్రం అప్పుడప్పుడు కనిపిస్తున్నారు.

రియలిస్టిక్ ఎంటర్‌టైనర్



పాపులర్ కమెడియన్ గెటప్ శీను లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'రాజు యాదవ్'. కృష్ణమాచారి దర్శకత్వం వహించారు. కె.ప్రశాంత్ రెడ్డి, రాజేశ్ కల్లేపల్లి సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 17న 'రాజు యాదవ్' విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు కృష్ణమాచారి మీడియాతో చిత్ర విశేషాలను పంచుకున్నారు.

"దాదాపు 90 శాతం మంది మనుషుల్లో ఏదో ఒక చిన్న లోపం ఉంటుంది. ఇండియన్ మాజీ క్రికెటర్ లక్ష్మీపతి బాలాజీకి చిన్నప్పుడు ఏదో సర్జరీ జరిగింది. దాని కారణంగా ఆయన ఎప్పుడూ నవ్వుతున్నట్లే కనిపిస్తారు. ఈ స్ఫూర్తితో కథ రాసుకుంటే బాగుంటుంది అనిపించింది. నాకు సహజత్వం అంటే ఇష్టం. అందుకే ఈ సినిమాను ఓ రియలిస్టిక్ ఎంటర్‌టైనర్‌లా తెరకెక్కించాను. ఈ పాత్రకు జీవం పోసే నటుల కోసం వెతికే క్రమంలో గెటప్ శీను ఈ రోల్‌కు యాప్ట్ అనిపించింది. ఆయన చాలా ప్రతిభావంతుడు. ఈ సినిమా ఆయనకు గుర్తుండిపోయే సినిమా అవుతుంది. హర్షవర్ధన్ రామేశ్వర్ కంపోజ్ చేసిన పాటలు, సురేశ్ బొబ్బిలి నేపథ్య సంగీతం ఈ సినిమాకు స్పెషల్ అట్రాక్షన్. ఈ సినిమాలో ప్రేక్షకులు ఆశించిన దాని కంటే ఎక్కువ వినోదం, భావోద్వేగం కూడిన సన్నివేశాలు ఉంటాయి" అని చెప్పారు.

కోటి రూపాయల విరాళం అందించిన ధనుశ్



తమిళ నటుడు ధనుశ్ తన సహృదయాన్ని చాటుకున్నారు. సౌత్ ఇండియన్ ఆర్టిస్ట్ అసోసియేషన్ నూతన భవన నిర్మాణం కోసం కోటి రూపాయల విరాళం అందించారు. నడిగర్ సంఘానికి అధ్యక్షుడైన నాజర్ ఈ కోటి రూపాయల చెక్‌ను అందుకున్నారు. ధనుశ్‌కు కృతజ్ఞతతో అసోసియేషన్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ అసోసియేషన్‌లో నటుడు విశాల్ ప్రధాన కార్యదర్శి కాగా, నటుడు కార్తి కోశాధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కాగా, ఈ అసోసియేషన్‌కు ఇప్పటికే పలువురు కోలీవుడ్ స్టార్స్ భారీ విరాళాలు ఇచ్చారు. కమల్ హాసన్, విజయ్ కోటి రూపాయల విరాళం అందివ్వగా, శివ కార్తికేయన్ 50 లక్షలు ఇచ్చారు.



రూ.835 కోట్లతో రామాయణ

ప్రస్తుతం అందరి దృష్టి బాలీవుడ్‌లో రూపొందుతున్న భారీ పౌరాణిక చిత్రం 'రామాయణ' మీదే ఉంది. రణబీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ కొనసాగుతోంది. చరిత్రలో నిలిచిపోయే విధంగా ఈ సినిమాను రూపొందించడానికి దర్శకుడు నితీశ్ తివారి కృషి చేస్తున్నారు. రెండు భాగాలుగా తయారవుతున్న ఈ సినిమా బడ్జెట్ ఎంతో తెలుసా? రూ. 835 కోట్లు. అది కూడా కేవలం తొలి భాగం కోసమే. నిర్మాణ పరంగా ఎక్కడా రాజీ పడకుండా నిర్మాత నమిత్ మల్హోత్రా ఖర్చు పెడుతూ, భారతీయ భాషలన్నింటిలోకి సినిమాను విడుదల చేయాలనే ప్లాన్‌లో ఉన్నారు. సినిమా షూటింగ్ ఒక ఎత్తు అయితే, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా ఎంతో కీలకం. అందుకే 600 రోజులు కేవలం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కోసం కేటాయించనున్నారు. విమర్శలకు ఎక్కడా తావు లేకుండా, భారతీయ సినిమా ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా మరోసారి చాటే విధంగా 'రామాయణ' నిర్మాణం జరుగుతోంది. మరి ఈ పినిమా విడుదల ఎప్పుడు? ఆ విషయంలో కూడా క్లారిటీ ఇచ్చారు ట్రేడ్ ఎనలిస్ట్ సుమిత్ కడెల్. ' 2027 అక్టోబర్‌లో 'రామాయణ' చిత్రం తొలి భాగం విడుదలవుతుంది' అంటూ ఎక్స్ ఖాతా ద్వారా ఆయన వెల్లడించారు.

యాక్షన్ రోల్‌లో...



'కేజీఎఫ్' సిరీస్‌తో దేశవ్యాప్తంగా రాఖీ భాయ్‌గా పాపులరయిన కన్నడ నటుడు యశ్ నటిస్తున్న తాజా చిత్రం 'టాక్సిక్'. 'ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' అనేది ఉపశీర్షిక. మలయాళ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. కె. వెంకట్ నారాయణ నిర్మిస్తున్న ఈ సినిమాను రెండు వెర్షన్స్‌లో తెరకెక్కిస్తున్నారు. ఒకటి పాన్ ఇండియా వెర్షన్ కాగా, ఇంకోటి ఇంటర్నేషనల్ వెర్షన్. తాజాగా ఈ సినిమాలో బాలీవుడ్ కథానాయిక హ్యూమా ఖురేషి మరో కీలక పాత్రను పోషిస్తున్నారని తెలిసింది. ఆమె పోషించే పాత్ర పూర్తి యాక్షన్ కోణంలో సాగుతుందని సమాచారం. ఈ సినిమాను వచ్చే ఏడాది ఏప్రిల్ 10న విడుదల చేయడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.

విడిపోవడమే మా ఇద్దరికీ మంచిది

తమిళ సంగీత దర్శకుడు, హీరో జీవీ ప్రకాశ్ కుమార్, గాయని సైంధవి దంపతులు తమ వైవాహిక బంధానికి ముగింపు పలికారు. విడాకులు తీసుకొన్నట్లు తెలిపారు. ఈ మేరకు వారిద్దరూ సోషల్ మీడియాలో ఓ ప్రకటన విడుదల చేశారు. 'మేమిద్దరం ఎంతో ఆలోచించిన మీదటనే విడిపోవాలనే నిర్ణయం తీసుకున్నాం. ఇది మా ఇద్దరికీ మంచిదని నమ్ముతున్నాం. ఇకపై ప్రశాంతంగా జీవితాన్ని కొనసాగిస్తాం. మా కెరీర్‌లో మరింత రాణించేందుకు ఈ మార్పు దోహదం చేస్తుందనుకుంటున్నాం. మా నిర్ణయాన్ని అందరూ అర్థం చేసుకుంటారని భావిస్తున్నాం' అని జీవీ, సైంధవి ప్రకటనలో పేర్కొన్నారు. వారిద్దరూ 2013లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి కూతురు అన్వీ ఉంది. ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్‌కు జీవీ మేనల్లుడు అవుతాడు. 'అసురన్, సూరారైపొట్రు, రాజారాణి, ఒంగోలు గిత్త' తదితర చిత్రాలకు జీవీ సంగీతం అందించారు. హీరోగానూ పలు చిత్రాల్లో నటించారు.



జీవీ ప్రకాశ్ కుమార్

హాలీవుడ్ సిరీస్‌లో



వయసు పెరుగుతున్నా వన్నె తరగని అందంతో అభిమానుల హృదయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని పదిలపరుచుకున్నారు టబు. హీరోయిన్‌గానే కాకుండా కథాబలం ఉన్న చిత్రాల్లో సైతం ప్రాధాన్యమున్న పాత్రలు పోషిస్తూ అభిమానులను అలరిస్తున్నారు. ఇటీవలే 'ది క్రూ' చిత్రంతో ఘన విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ఇప్పుడు ఆమె మరో అరుదైన అవకాశాన్ని అందుకున్నారు. ప్రముఖ హాలీవుడ్ వెబ్‌సిరీస్‌లో టబు చాన్స్ దక్కించుకున్నారు. 'డ్యూన్: ప్రాఫెసీ' సిరీస్‌లో ఆమె కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇందులో సిస్టర్ ఫ్రాన్సెస్కా అనే పాత్రలో టబు కనిపించనున్నారు. ఓ హాలీవుడ్ మీడియా సంస్థ ఈ విషయాన్ని తెలిపింది. ఈ సిరీస్‌లో టబు పాత్ర చాలా కీలకంగా ఉండబోతోందని తెలుస్తోంది. అతీంద్రియ శక్తుల నేపథ్యంలో సాగే ఈ సిరీస్‌కు సంబంధించిన ఇతర వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.

ఆ మాస్క్ కథ ఏమిటి?



'ప్రేమిస్తే' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు. తమిళ నటుడు భరత్ నటించిన 'విరల్' సినిమా ఈ నెల 17న విడుదల కానుంది. వాణి భోజన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రానికి ఎం.శక్తివేల్ దర్శకత్వం వహించారు. సీహెచ్ సతీశ్‌కుమార్ నిర్మించారు. ఇటీవల విడుదల చేసిన ట్రైలర్ అందరినీ భయపెట్టింది. తాజాగా రిలీజ్ డేట్ వెల్లడిస్తూ ఓ పోస్టర్ విడుదల చేశారు. ట్రైలర్‌లో ఓ వింత మాస్క్ హైలైట్ అయింది. పోస్టర్‌లోనూ ఆ మాస్క్ కనిపించింది. ఆ మాస్క్ కథ ఏమిటన్నది చిత్రం చూస్తే కానీ తెలియదని దర్శకుడు అంటున్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఎస్.ఎన్.ప్రసాద్, సినిమాటోగ్రాఫర్: సురేశ్ బాలా, సమర్పణ: జగన్మోహిని, ఢిల్లీ బాబు.

థియేటర్లు పెంచుతున్నాం



గుంట మల్లేశం కథానాయకుడిగా నటించిన చిత్రం 'బ్రహ్మచారి'. నర్సింగ్ దర్శకత్వం వహించగా, రామ్‌భూపాల్ రెడ్డి నిర్మించారు. తెలంగాణ యాసలో సాగే కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన 'బ్రహ్మచారి' ఈ నెల 10న విడుదలై మంచి టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా నిర్మాత మీడియాతో మాట్లాడారు. "ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాను రూపొందించాం. రిలీజైన ప్రతీ చోటా విశేష ప్రేక్షకాదరణ దక్కుతోంది. పాజిటివ్ టాక్ వస్తుండడంతో ఈ సినిమాకు థియేటర్లు పెంచుతున్నాం. పెళ్లి కాని బ్రహ్మచారులు ఎదుర్కొనే సమస్యలను ఇందులో వినోదాత్మకంగా చూపించాము" అని చెప్పారు.

ప్రేమ, కుటుంబ బాంధవ్యాలతో...

నిఖిల్ విజయేంద్రసింహా, తేజు అశ్విని జంటగా నటిస్తున్న చిత్రం 'సంగీత్'. సాద్ ఖాన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని నవీన్ మనోహరన్, మాజ్ ఖాన్ నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ చిత్రాన్ని ప్రారంభించారు. నిహారిక కొణిదెల చిత్ర బృందానికి స్క్రిప్ట్ అందించగా, శౌర్య కెమెరా స్విచ్చాన్ చేశారు. ముహూర్తపు షాట్‌కు ఎస్.ఎస్.కార్తికేయ క్లాప్ కొట్టారు. ఈ సందర్భంగా దర్శకుడు సాద్ ఖాన్ మాట్లాడుతూ "ప్రేమ, కుటుంబ బాంధవ్యాలతో సాగే కథ ఇది. ఓ పెళ్లి వేడుకలో జరిగే సంఘటనలను వినోదభరితంగా తెరకెక్కిస్తున్నాము" అని అన్నారు. హీరో నిఖిల్ విజయేంద్ర మాట్లాడుతూ "ఈ సినిమా కథ నా హృదయానికి దగ్గరగా ఉంది. ఇందులో కథానాయకుడు సమర్థ్ పాత్రలో నేను, స్వర పాత్రలో తేజు అశ్విని నటిస్తున్నారు" అని చెప్పారు.



బిజినెస్

హైదరాబాద్ ● బుధవారం 15 మే 2024

పీఎస్‌బీల లాభాలు అదుర్స్

2023-24లో రూ.1.41 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) ఆర్థిక పరిస్థితి గణనీయంగా మెరుగుపడింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో దేశంలోని 12 పీఎస్‌బీలు రూ.1,41,203 కోట్ల నికర లాభం ఆర్జించాయి. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం (2022-23) సాధించిన రూ.1,04,609 కోట్లతో పోలిస్తే ఇది 35 శాతం ఎక్కువ. 2016-21 మధ్య కాలంలో ప్రభుత్వం సమకూర్చిన రూ.3,10,997 కోట్ల ఆర్థిక సాయంతో ఈ బ్యాంకుల ఆర్థిక పరిస్థితి గణనీయంగా మెరుగుపడింది. దీనికి తోడు పీఎస్‌బీల పనితీరు మెరుగు పరిచేందుకు ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు, పారదర్శకంగా మొండి బకాయిలు (ఎన్‌పీఏ) గుర్తించి వాటి వసూలుకు చర్యలు తీసుకోవడం కూడా ఇందుకు దోహదం చేసింది. గత ఆర్థిక సంవత్సరం పీఎస్‌బీలు నమోదు చేసిన రూ.1,41,203 కోట్ల లాభాల్లో 40 శాతం (రూ.71,077 కోట్లు) వాటా ఎస్‌బీఐదే కావటం విశేషం.

టోకు ద్రవ్యోల్బణం 13 నెలల గరిష్ఠం

న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) ఏప్రిల్‌లో 13 నెలల గరిష్ఠ స్థాయి 1.26 శాతంగా నమోదైంది. ఆహార వస్తువుల ధరలు ప్రత్యేకించి కూరగాయల ధరలు పెరగడం ఇందుకు కారణం. వరుసగా రెండు నెలలుగా డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం పెరుగుతూ వస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇది 0.20 శాతం ఉండగా మార్చిలో 0.53 శాతానికి పెరిగింది. కాగా గత ఏడాది ఏప్రిల్‌లో 0.79 శాతంగా ఉంది. గత ఏడాది మార్చిలో 1.41 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం తిరిగి 1.26 శాతానికి చేరడం ఇదే ప్రథమం.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,820 ▼	66,750 ▼	90,700 ▲
ముంబై	72,335 ▲	66,259 ▲	84,080 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



15వ తేదీ			
హైదరాబాద్	545	విజయవాడ	540
వరంగల్	547	గోదావరి	540
చిత్తూరు	618	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	137	గోదావరి	147
వరంగల్	137	విజయవాడ	147
కరీంనగర్	137	గుంటూరు	147
మహబూబ్‌నగర్	137	ఒంగోలు	147
కర్నూలు	137	చిత్తూరు	152
విశాఖపట్నం	139		

ఎఫ్ అండ్ ఓ పెట్టుబడులపై జాగ్రత్త!

రిటైల్ ఇన్వెస్టర్లను హెచ్చరించిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



ముంబై: ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) విభాగంలో రిటైల్ మదుపరుల పెట్టుబడులు పెరుగుతుండటంపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆందోళన వ్యక్తం చేశారు. "ఎఫ్ అండ్ ఓ విభాగంలో రిటైల్ మదుపరుల పెట్టుబడులు పోటెత్తితే మార్కెట్‌తో పాటు ఇన్వెస్టర్ల సెంటిమెంట్, గృహ ఆర్థిక వ్యవస్థకు భవిష్యత్‌లో సవాళ్లు ఏర్పడే ప్రమాదం ఉంద"ని మంగళవారం బీఎస్ఈలో నిర్వహించిన 'వికసిత్ భారత్ 2047' కార్యక్రమంలో సీతారామన్ హెచ్చరించారు. కుటుంబాల పొదుపులో గణనీయ మార్పులు చోటు చేసుకున్నాయని, ఈక్విటీల్లోకి వచ్చే పొదుపు సొమ్ము గడిచిన కొన్నేళ్లలో అనూహ్యంగా పెరిగిందని, మన స్టాక్ మార్కెట్‌పైన నమ్మకానికిది ప్రతీక అని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. స్టాక్ మార్కెట్లో కొంత రిస్క్ ఉన్నప్పటికీ, మెరుగైన రిటర్నులు లభించే అవకాశాలుండటంతో మధ్యతరగతి ప్రజలు తమ పొదుపు సొమ్మును షేర్లలో పెట్టుబడిగా పెడుతున్నారని అన్నారు. వారికి మార్కెట్‌పై ఉన్న నమ్మకాన్ని పరిరక్షిస్తామన్నారు. కొన్ని నెలల క్రితం క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఓ అధ్యయాన్ని చేపట్టింది. ఎఫ్ అండ్ ఓ మార్కెట్లో పెట్టుబడులు పెట్టిన ప్రతి 10 మందిలో 9 మంది నష్టపోయారని ఆ అధ్యయన నివేదిక వెల్లడించింది. అప్పటి నుంచి డెరివేటివ్ కాంట్రాక్టుల్లో రిటైల్ ఇన్వెస్టర్ల ట్రేడింగ్‌పై సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ సహా చాలా మంది ఆందోళన వ్యక్తం చేశారు.

ఇన్వెస్టర్లలో నమ్మకాన్ని పెంచాలి..

ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పోస్టాఫీస్ పథకాల్లోకి మళ్లే పొదుపు సొమ్ము తగ్గిందని, అదే సొమ్ము క్యాపిటల్ మార్కెట్లోకి వచ్చి చేరుతోందని ఆర్థిక మంత్రి అన్నారు. కఠిన నిబంధనలు, పటిష్ఠమైన నియంత్రణ ప్రమాణాల ద్వారా ఇన్వెస్టర్ల నమ్మకాన్ని పెంపొందించేందుకు సెబీతో కలిసి పనిచేయాలని బీఎస్ఈకి మంత్రి విజ్ఞప్తి చేశారు. స్టాక్ ఎక్స్ఛేంజీలైన బీఎస్ఈ, ఎన్ఎస్ఈ వ్యవస్థాగత ముప్పులను సమర్థవంతంగా ఎదుర్కోవడంతో పాటు మార్కెట్ స్థిరత్వాన్ని కాపాడాలన్నారు.

మూడోసారీ మోదీనే..

ఎన్నికల ఫలితాలపై అనిశ్చితి కారణంగా స్టాక్ మార్కెట్ సూచీలు గత కొన్ని రోజుల్లో తీవ్ర ఊగిసలాటలకు లోనవడంపై సీతారామన్ స్పందించారు. మూడోసారీ మోదీ ప్రభుత్వమే వస్తుందని, ఈసారీ స్థిరమైన ప్రభుత్వం ఏర్పాటవుతుందన్నారు. అంతేకాదు, ఈసారి తమ ప్రభుత్వం కనీస అధికారం..గరిష్ఠ పాలనపై దృష్టి సారించనున్నట్లు మంత్రి సంకేతాలిచ్చారు.

బ్లాక్‌స్టోన్ గూటికి హల్దీరామ్స్?

- ఏడీఐఏ, జీఐసీతో కలిసి కొనుగోలుకు ప్రపంచ పీఈ దిగ్గజం ప్రయత్నాలు
- రూ.66,400-70,500 కోట్ల స్థాయిలో హల్దీరామ్స్ మార్కెట్ విలువ!
- 76% వరకు వాటా కొనుగోలుకు చాన్స్

న్యూఢిల్లీ: ప్రపంచంలో అతిపెద్ద ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) కంపెనీ బ్లాక్‌స్టోన్. భారత్‌కు చెందిన ప్రముఖ స్నాక్స్ తయారీ కంపెనీ హల్దీరామ్స్ స్నాక్స్ అండ్ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ (హెచ్ఎస్ఎఫ్‌పీఎల్)ను చేజిక్కించుకునే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలిసింది. 87 ఏళ్ల చరిత్ర కలిగిన హల్దీరామ్స్‌లో మెజారిటీ (74-76 శాతం) వాటా కొనుగోలు చేసే అవకాశం ఉందని, ఇందులో భాగంగా కంపెనీ మార్కెట్ విలువను 800-850 కోట్ల డాలర్ల (రూ.66,400-70,500 కోట్లు) స్థాయిలో లెక్కగట్టవచ్చని సమాచారం. అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ), జీఐసీ సింగపూర్‌తో కన్సార్షియంగా ఏర్పడి బ్లాక్‌స్టోన్ ఈ కొనుగోలు జరపనుందని, హల్దీరామ్స్ ప్రమోటర్లకు ఇప్పటికే ఆఫర్ సమర్పించినట్లు తెలిసింది. ఈ ఒప్పందం ఖరారైతే గనుక భారత్‌లో పీఈ కంపెనీలు జరిపిన అతి పెద్ద కొనుగోళ్లలో ఒకటిగా నిలవనుంది.

87 ఏళ్ల చరిత్ర కలిగిన హల్దీరామ్స్ దేశంలోనే అతిపెద్ద ప్యాకేజ్డ్ స్నాక్ బ్రాండ్. 500 రకాల ప్యాకేజ్డ్ స్నాక్స్ ఇతర ఆహార ఉత్పత్తులను తయారీ చేయడంతోపాటు పంపిణీ చేస్తోంది. కంపెనీ ఉత్పత్తుల్లో నమ్‌కీన్, భుజియా, బిస్కెట్లు, స్వీట్లు, రెడీ టు ఈట్ మీల్స్ పాస్తా, నాన్ కార్బొనేటెడ్ బెవరేజెస్ ప్రముఖమైనవి. కంపెనీ భారత్‌లోనే కాకుండా 100 దేశాలకు తన ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ స్నాక్స్ వ్యాపార విక్రయాలు రూ.14,500 కోట్లుగా ఉన్నాయి.

మూడో రోజూ లాభాలొచ్చాయ్..

సెన్సెక్స్ 328 పాయింట్లు అప్

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు మూడో రోజూ లాభపడ్డాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు కొన్ని బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు మంగళవారం సూచీలను మరింత ముందుకు నడిపించాయి. గత నెలలో రిటైల్ ధరల ఆధారిత ద్రవ్యోల్బణం 11 నెలల కనిష్ఠ స్థాయికి తగ్గడం కూడా మార్కెట్‌కు కలిసివచ్చింది. ఒక దశలో 510 పాయింట్ల వరకు ఎగిసిన సెన్సెక్స్. చివరికి 328.48 పాయింట్ల లాభంతో 73,104.61 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 113.80 పాయింట్ల వృద్ధితో 22,217.85 వద్ద క్లోజైంది.

అమెరికాలో ఐపీఓకు నోవెలిస్: హిందాల్కో ఇండస్ట్రీస్ అనుబంధ విభాగమైన నోవెలిస్ అమెరికాలో పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) కోసం అక్కడి క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ)కు దరఖాస్తు చేసుకుంది. ఐపీఓ అనంతరం నోవెలిస్ షేర్లను న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజీలో నమోదు చేయనుంది.

అల్లైడ్ బ్లెండర్స్ ఐపీఓకు సెబీ ఆమోదం: ఆఫీసర్స్ చాయిస్ విస్కీ తయారీ సంస్థ అల్లైడ్ బ్లెండర్స్ రూ.1,500 కోట్ల ఐపీఓకు సెబీ ఆమోదం తెలిపింది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.1,000 కోట్ల తాజా ఈక్విటీ జారీతోపాటు ప్రమోటర్ల వాటాకు చెందిన రూ.500 కోట్ల విలువైన షేర్లను ఓఎఫ్ఎస్ పద్ధతిన విక్రయించనుంది.

ఈ ఏడాది చివరికి జొన్నగిరి గనుల్లో పసిడి ఉత్పత్తి షురూ

దక్కన్ గోల్డ్ మైన్స్ వెల్లడి

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా జొన్నగిరి గనుల్లో ఈ ఏడాది చివరికల్లా పూర్తి స్థాయిలో పసిడి ఉత్పత్తి ప్రారంభం కానుంది. దక్కన్ గోల్డ్ మైన్స్ కంపెనీ ఈ గనుల్ని అభివృద్ధి చేస్తోంది. కంపెనీ ఇప్పటికే ఈ గనుల నుంచి ప్రయోగాత్మకంగా నెలకు కిలో చొప్పున బంగారం ఉత్పత్తి చేస్తోంది. పూర్తి స్థాయిలో ఉత్పత్తి ప్రారంభమైతే ఏటా 750 కిలోల వరకు ఈ గనుల నుంచి పసిడి వెలికి తీయవచ్చని అంచనా. దేశంలో ఒక ప్రైవేట్ కంపెనీ ఇంత పెద్ద మొత్తంలో పసిడి కోసం గనుల్ని అభివృద్ధి చేయడం ఇదే మొదటిసారి. జొన్నగిరితో పాటు ఆఫ్రికాలోని మొజాంబిక్ దేశంలోనూ దక్కన్ గోల్డ్ మైన్స్ అరుదైన లోహాల ఉత్పత్తికి సిద్ధమైంది. ఇందుకోసం అక్కడి ఒక కంపెనీతో జాయింట్ వెంచర్ (జేవీ) ఏర్పాటు చేసింది. ఈ జేవీలో దక్కన్ గోల్డ్ మైన్స్‌కి 51 శాతం వాటా ఉంది.

ఈ వారమే బిడ్డింగ్

రాజస్థాన్‌లోని రెండు పసిడి గనుల కోసం ఈ వారం బిడ్డింగ్ జరగనుంది. ఇప్పటికే వేదాంత గ్రూప్ కంపెనీ హిందుస్థాన్ జింక్, జిందాల్ పవర్, జేకే సిమెంట్‌తో సహా ఐదు కంపెనీలు ఇందు కోసం టెక్నికల్ బిడ్స్ సమర్పించాయి. ఈ ఐదు కంపెనీల టెక్నికల్ బిడ్స్‌ను అధికారులు ఆమోదించారు. ఈ వారం జరిగే వేలంలో ఈ ఐదు కంపెనీలు ఫైనాన్షియల్ బిడ్స్ సమర్పించాలి.

సాగర్ సిమెంట్ ఆదాయం రూ.752 కోట్లు

క్యూ4 లాభం రూ.11 కోట్లు

ఒక్కో షేరుకు 35% డివిడెండ్

హైదరాబాద్: గడిచిన ఆర్థిక సంవత్సరం (2023-24) మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో సాగర్ సిమెంట్ కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.752.45 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.11.58 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం (2022-23) ఇదే కాలంలో కంపెనీ రూ.802.58 కోట్ల ఆదాయంపై రూ.8.79 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ రూ.2,558.73 కోట్ల ఆదాయంపై రూ.52.05 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రూ.2,452.24 కోట్ల ఆదాయంపై రూ.9.61 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. కాగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు 35 శాతం (రూ.0.70) డివిడెండ్‌ను కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

రూ.470 కోట్ల పెట్టుబడులు: కార్యకలాపాల విస్తరణ కోసం 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాల్లో మొత్తం రూ.470 కోట్లు పెట్టుబడిగా పెట్టనున్నట్లు సాగర్ సిమెంట్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఇందులో రూ.255 కోట్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడులుగా పెట్టనుండగా మిగిలిన మొత్తాలను వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఇన్వెస్ట్ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇన్‌ఫ్రా ప్రాజెక్టులు, పట్టణ రియల్ ఎస్టేట్ నుంచి ఆశించిన స్థాయిలో సిమెంట్‌కు డిమాండ్ ఉన్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ అంతగా లేదని పేర్కొన్నారు. కాగా, ఆంధ్రప్రదేశ్‌లోని గుడిపాడు, జీరాబాద్ సిమెంట్ ప్లాంట్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని 2025-26 ఆర్థిక సంవత్సరం నాటికి 0.25 మిలియన్ టన్నులు, 0.50 మిలియన్ టన్నులకు పెంచుతున్నట్లు ఆయన తెలిపారు. అలాగే దాచేపల్లి ప్లాంట్‌లో క్లింకర్ సామర్థ్యాన్ని 1.85 మిలియన్ టన్నుల నుంచి 2.31 మిలియన్ టన్నులకు, సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 2.25 మిలియన్ టన్నుల నుంచి 3 మిలియన్ టన్నులకు పెంచుతున్నట్లు శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు.

ఎయిర్‌టెల్ లాభంలో క్షీణత

న్యూఢిల్లీ: మార్చితో ముగిసిన త్రైమాసికంలో భారతి ఎయిర్‌టెల్ నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన 31 శాతం క్షీణించి రూ.2,072 కోట్లకు దిగజారింది. నైజీరియాకు చెందిన నైరా విలువ తగ్గింపే ఇందుకు ప్రధాన కారణం. అంతకు ముందు ఏడాది ఇదే కాలంలో కంపెనీ లాభం రూ.3,005.6 కోట్లుంది. కాగా కంపెనీ కన్సాలిడేటెడ్ ఆదాయం మాత్రం 4.4 శాతం పెరిగి రూ.37,599.1 కోట్లుగా నమోదైంది. "ఈ త్రైమాసికంలో మేం 78 లక్షల స్మార్ట్‌ఫోన్ కస్టమర్లను సాధించాం. పరిశ్రమలోనే అధిక ఆర్పూ (ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం) సాధించాం. అయితే నైజీరియా నైరా విలువ తగ్గింపు మా ఫలితాలను ప్రభావితం చేసింది. దాని ప్రభావం వల్ల రూ.2,544.4 కోట్ల ఫారెక్స్ నష్టాలను భరించాల్సి వచ్చింది" అని ఎయిర్‌టెల్ మేనేజింగ్ డైరెక్టర్ గోపాల్ విఠల్ చెప్పారు. మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి కూడా భారతి ఎయిర్‌టెల్ లాభం 10.5 శాతం క్షీణించి రూ.7,467 కోట్లకు పరిమితం అయింది. అయితే ఆదాయం మాత్రం 7.7 శాతం వృద్ధితో రూ.1,39,144.8 కోట్ల నుంచి రూ.1,49,982.4 కోట్లకు పెరిగింది. భారత్‌లో వ్యాపారం మాత్రం గత ఏడాదితో పోల్చితే ఆదాయం 12.9 శాతం పెరిగి రూ.28,513 కోట్లుగా నమోదైంది.

మార్కెట్లోకి సరికొత్త టీవీఎస్ ఐక్యూబ్

ప్రారంభ ధర రూ.94,999



టీవీఎస్ మోటార్ తన ఎలక్ట్రిక్ స్కూటర్ టీవీఎస్ ఐక్యూబ్ పోర్టుఫోలియోలో సరికొత్త శ్రేణి స్కూటర్లను విడుదల చేసింది. ఈ కొత్త శ్రేణి ఎలక్ట్రిక్ స్కూటర్ల ప్రారంభ ధర రూ.94,999 (ఎక్స్‌షోరూమ్). మూడు బ్యాటరీ ఆప్షన్స్. 2.2 కేడబ్ల్యూహెచ్, 3.4 కేడబ్ల్యూహెచ్, 5.1 కేడబ్ల్యూహెచ్‌తో ఐక్యూబ్ అందుబాటులో ఉండనున్నాయి.

స్పోర్ట్స్

నోటిఫికేషన్ వచ్చేసింది

టీమిండియా కోచ్ పదవికి దరఖాస్తుల ఆహ్వానం

న్యూఢిల్లీ: మరో నెలన్నరలో కోచ్ ద్రవిడ్ పదవి ముగియనుంది. ఈనేపథ్యంలో టీమిండియా ప్రధాన కోచ్ పదవికి బీసీసీఐ దరఖాస్తులు ఆహ్వానించింది. మూడున్నర సంవత్సరాల పదవీకాలం కలిగిన ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకొనేందుకు ఈనెల 27 తుది గడువు. అప్లికేషన్లను పరిశీలించిన తర్వాత వ్యక్తిగత ఇంటర్వ్యూలు నిర్వహించి ఆపై అభ్యర్థిని ఎంపిక చేస్తారు. ఎంపికైనవారు జూలై 1న బాధ్యతలు చేపట్టి 2027 వన్డే వరల్డ్ కప్ ముగిసే వరకు పదవిలో కొనసాగుతారని బోర్డు తెలిపింది. ఇక దరఖాస్తు చేసుకొనే వారి వయస్సు 60లోపు ఉండాలి. కనీసం 30 టెస్ట్‌లు లేదా 50 వన్డేలు ఆడి ఉండాలి. లేదా టెస్ట్‌లు ఆడుతున్న జట్టుకు కనీసం రెండేళ్లు ప్రధాన కోచ్‌గా వ్యవహరించి ఉండాలి. ఐసీసీ అనుబంధ దేశ/ఐపీఎల్/అందుకు సమానమైన ఇంటర్నేషనల్ లీగ్/ఫస్ట్‌క్లాస్/జాతీయ 'ఏ' జట్లకు కనీసం మూడు సంవత్సరాలు హెడ్ కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించి ఉండాలి. అనుభవం ఆధారంగా/చర్చల ద్వారా వేతనం ఉంటుందని పేర్కొంది. మూడు ఫార్మాట్లలో భారత జట్టు ప్రదర్శన, నిర్వహణ హెడ్ కోచ్‌దేనని స్పష్టంజేసింది. అతడికింద 14 నుంచి 16 మంది సహాయ సిబ్బంది పని చేస్తారని పేర్కొంది.

రేసులో లక్ష్మణ్?

లాంగర్, గంభీర్ కూడా !

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)





టీమిండియా కోచ్ పదవి మరోసారి చేపట్టేందుకు ద్రవిడ్ సుముఖంగా లేకపోతే..అతడి వారసుడు ఎవరన్న చర్చ బయల్దేరింది. అందులో ప్రముఖంగా వినిపిస్తున్న పేరు వీవీఎస్ లక్ష్మణ్. అలాగే గౌతమ్ గంభీర్, ఆసీస్ మాజీ కోచ్ జస్టిన్ లాంగర్ పేర్లు ప్రస్తావనకు వస్తున్నాయి. లక్ష్మణ్ కనుక దరఖాస్తు చేసుకొంటే..హాట్ ఫేవరెట్ అతడే అనొచ్చు. 49 ఏళ్ల లక్ష్మణ్ జాతీయ క్రికెట్ అకాడమీ చీఫ్‌గా మూడున్నరేళ్లుగా ఇండియా 'ఏ', అండర్-19 జట్ల రూపకల్పనలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాడు. ద్రవిడ్ విశ్రాంతి తీసుకున్న సమయాల్లో భారత జట్టు కోచింగ్ బాధ్యతలు నిర్వర్తించాడు. లక్ష్మణ్ కోచ్‌గా ఆసియా క్రీడలు, ఆసీస్‌తో మనదేశంలో, ఇంగ్లండ్‌తో ఆ దేశంలో, న్యూజిలాండ్, ఐర్లాండ్‌లలో ఆయా దేశాలలో ద్వైపాక్షిక టీ20 సిరీస్‌లలో భారత్ తలపడింది.

గంభీర్: *కెప్టెన్‌గా కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు రెండు ఐపీఎల్ టైటిళ్లు అందించడంతో పాటు లఖ్‌నవూ మెంటార్‌గా ఆ జట్టును తొలి రెండేళ్లు ప్లేఆఫ్స్‌కు చేర్చడంలో గంభీర్‌ది కీలక పాత్ర. పైగా.. గంభీర్‌కు మేనేజ్‌మెంట్ నైపుణ్యాలు అమోఘమన్న పేరుంది. ఈ ఐపీఎల్‌లో గంభీర్ మార్గదర్శనంలో కోల్‌కతా ఇప్పటికే ప్లేఆఫ్స్‌కు చేరింది కూడా. అయితే గంభీర్ వ్యక్తిత్వపరంగా చూస్తే.. బీసీసీఐ పెద్దలు అడగకుండా తనంతట తాను కోచ్ పదవికి అతడు దరఖాస్తు చేస్తాడా అన్నది డౌటే. కోల్‌కతా యజమాని షారుక్‌ఖాన్‌తో గంభీర్‌కున్న గాఢ అనుబంధం దృష్ట్యా..కోచ్ పదవికి గంభీర్ దరఖాస్తు చేయడనే మరో వాదన కూడా ఉంది. ఇంకా..తన పదవి విషయంలో గంభీర్ పూర్తి స్వేచ్ఛను కోరుకొనే మనస్తత్వం. మరోవైపు రాబోయే రెండేళ్లు విరాట్ కోహ్లీ జట్టులో ఉండడం ఖాయం. మరి..గంభీర్, కోహ్లీ గత సంబంధాల కోణంలో చూస్తే..గంభీర్ కోచ్‌గా వెళతాడా అనేది మరో ముఖ్యమైన అంశం. అయితే ప్రస్తుత కెప్టెన్ రోహిత్, గంభీర్ మధ్య చక్కటి అనుబంధం ఉండడం విశేషం.*

లాంగర్: *ఆస్ట్రేలియాకు యాషెస్, టీ20 వరల్డ్ కప్ అందించిన కోచ్ జస్టిన్ లాంగర్‌కు తిరుగులేని వ్యూహాత్మక నిపుణుడిగా పేరుంది. టీమిండియా కోచ్ పదవిని చేపట్టే అవకాశాన్ని పరిశీలిస్తానని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో కూడా లాంగర్ చెప్పడం గమనార్హం.*

మనిక@24



న్యూఢిల్లీ: భారత టేబుల్ టెన్నిస్ స్టార్ మనికా బాత్రా కెరీర్‌లో అత్యుత్తమ ర్యాంక్‌కు చేరుకుంది. సింగిల్స్‌లో మనిక 24వ ర్యాంక్‌తో టాప్-25 ర్యాంకింగ్స్ జాబితాలో స్థానం సంపాదించిన తొలి భారత మహిళ ప్యాడ్లర్‌గా ఘనత సాధించింది. సౌదీలో ఇటీవల జరిగిన టోర్నీలో అద్భుత ప్రదర్శన కనబర్చిన మనిక ఏకంగా 15 స్థానాలు ఎగబాకింది.

గోయెంకా దిద్దుబాటు చర్యలు

- రాహుల్‌తో ప్రత్యేక విందు



న్యూఢిల్లీ: కెప్టెన్ కేఎల్ రాహుల్‌పై బహిరంగంగా ఆగ్రహం వ్యక్తం జేసి వివాదంలో కూరుకుపోయిన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ యజమాని సంజీవ్ గోయెంకా దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఈక్రమంలో సోమవారం రాత్రి కేఎల్ రాహుల్‌ను ఆయన ప్రత్యేకంగా విందుకు ఆహ్వానించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గత బుధవారం సన్‌రైజర్స్ చేతిలో లఖ్‌నవూ 10 వికెట్లతో ఓడిన అనంతరం గ్రౌండ్‌లోకి వచ్చిన సంజీవ్ గోయెంకా కెప్టెన్ రాహుల్‌పై ఆగ్రహం వ్యక్తంజేయడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.

లఖ్‌నవూకు కష్టమే!

- చివరి మ్యాచ్‌లో గెలిచిన ఢిల్లీ
- చెలరేగిన పోరెల్, స్టబ్స్
- ఈ ఫలితంతో ప్లేఆఫ్స్‌కు రాజస్థాన్



న్యూఢిల్లీ: గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో నిరాశపరిచిన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ప్లేఆఫ్స్ ఆశలను దాదాపుగా దూరం చేసుకుంది. అటు తమ చివరి లీగ్ మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఆల్‌రౌండ్‌షోతో మురిపించింది. అభిషేక్ పోరెల్ (33 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 58), ట్రిస్టన్ స్టబ్స్ (25 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 57 నాటౌట్) మెరుపు అర్ధసెంచరీలతో ఆకట్టుకోగా, మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 19 పరుగులతో లఖ్‌నవూపై గెలిచింది. దీంతో 14 పాయింట్లతో ఐదో స్థానానికి చేరిన ఢిల్లీ సాంకేతికంగా రేసులో ఉన్నా.. నెట్‌రన్‌రేట్‌లో ఇతర జట్లకన్నా వెనుకంజలో ఉంది. అటు లఖ్‌నవూ తమ ఆఖరి మ్యాచ్ గెలిచి 14 పాయింట్లు సాధించినా ముందుకెళ్లడం దాదాపు అసాధ్యమే. ఇక ఢిల్లీ గెలుపుతో రాజస్థాన్ రాయల్స్ (16) ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా ఢిల్లీ 20 ఓవర్లలో 4 వికెట్లకు 208 పరుగులు చేసింది. హోప్ (38), కెప్టెన్ పంత్ (33) ఫర్వాలేదనిపించారు. నవీనుల్‌కు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో లఖ్‌నవూ 20 ఓవర్లలో 9 వికెట్లకు 189 రన్స్ చేసి ఓడింది. నికోలస్ పూరన్ (27 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సర్లతో 61), అర్షద్ ఖాన్ (33 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్లతో 58 నాటౌట్) వేగంగా ఆడారు. 3 వికెట్లు తీసిన ఇషాంత్ శర్మ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

పూరన్, అర్షద్ పోరాటం: ఓ మాదిరి ఛేదనలో లఖ్‌నవూ తొలి ఓవర్ నుంచే తడబడింది. పూరన్, ఎనిమిదో నెంబర్ బ్యాటర్ అర్షద్ ఖాన్ పోరాటం ఆకట్టుకున్నా ఫలితం లేకపోయింది. ఇషాంత్ పదునైన బంతులకు రాహుల్ (5), డికాక్ (12), హుడా (0) వికెట్లను కోల్పోయింది. ఇక స్టొయినిస్ (5)ను అక్షర్ అవుట్ చేశాడు. 44 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన వేళ పూరన్ మాత్రం ఢిల్లీ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నాడు. నాలుగో ఓవర్‌లోనే అతను 4,6,4,6తో 20 రన్స్ రాబట్టాడు. ఆరో ఓవర్‌లోనూ 6,4 బాదడంతో జట్టు పవర్‌ప్లేలో 59/4తో నిలిచింది. ఆ తర్వాతా ఎడాపెడా బౌండరీలతో పూరన్ 20 బంతుల్లోనే ఫిఫ్టీ చేసినా.. మరోఎండ్‌లో అతడికి సహకారం అందలేదు. చివరకు 12వ ఓవర్‌లో నికోలస్‌ను ముకేశ్ అవుట్ చేశాడు. బదోని (6), క్రునాల్ (18) నిరాశపర్చగా, అర్షద్ గెలుపుపై ఆశలు రేపాడు. 16వ ఓవర్‌లో యుధ్‌వీర్ (14) 4,6తో ఆకట్టుకోగా.. తర్వాతి ఓవర్‌లో అర్షద్ 6,6,4తో 18 రన్స్ అందించాడు. అదే ఓవర్‌లో యుధ్ వీర్ నిష్క్రమించినా, అర్షద్ ఓ సిక్సర్‌తో 25 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. కానీ ఆఖరి ఓవర్‌లో 23 రన్స్ అవసరమవగా రసిఖ్ 3 పరుగులే ఇచ్చి లఖ్‌నవూకు ఓటమి రుచి చూపించాడు.

ఆరంభంలో అభిషేక్.. ఆఖర్లో స్టబ్స్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ జోరంతా పవర్‌ప్లే.. డెత్ ఓవర్లలోనే సాగింది. ఓపెనర్ అభిషేక్ పోరెల్ దనాధన్ బ్యాటింగ్‌తో చెలరేగాడు. ఆ తర్వాత మధ్య ఓవర్లలో స్పిన్నర్లను ఎదుర్కోవడంలో జట్టు తడబాటుకు లోనైంది. కానీ ఆఖర్లో స్టబ్స్ ఇన్నింగ్స్‌తో కాస్త పుంజుకున్న ఢిల్లీ ఆశించిన స్కోరు చేయగలిగింది. తొలి ఓవర్‌లోనే ఫ్రేజర్‌ను పేసర్ అర్షద్ డకౌట్ చేసి ఢిల్లీకి గట్టి షాకిచ్చాడు. కానీ పోరెల్ మాత్రం అతడి లోటును భర్తీ చేస్తూ చెలరేగాడు. మూడో ఓవర్‌లో 4,4,6,4తో 21 పరుగులు రాబట్టాడు. తర్వాతి ఓవర్‌లోనే హోప్ సైతం 4,4,6తో 16 రన్స్ అందించడంతో జట్టు కుదురుకుంది. ఇక ఆరో ఓవర్‌లో పోరెల్ 6,6,4తో పవర్‌ప్లేలో జట్టు 73/1 పరుగులతో పటిష్ఠంగానే కనిపించింది. కానీ ఆ తర్వాత స్పిన్నర్లు బిష్ణోయ్, క్రునాల్ ఢిల్లీని కట్టడి చేశారు. దీంతో దూకుడు మీదున్న పోరెల్ సైతం రన్స్ చేసేందుకు ఇబ్బందిపడ్డాడు. 21 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేసిన పోరెల్ ఆ తర్వాత మరో 8 రన్స్ చేసేందుకు 12 బంతులు తీసుకున్నాడు. హోప్‌ను బిష్ణోయ్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 92 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే పేసర్ నవీనుల్.. పోరెల్‌ను వెనక్కిపంపాడు. ఈ దశలో కెప్టెన్ పంత్, స్టబ్స్ నాలుగో వికెట్‌కు 47 పరుగులు జత చేశారు. స్టబ్స్ డెత్ ఓవర్లలో మరింత చెలరేగాడు. 16వ ఓవర్‌లో 6,4,4తో 18 రన్స్. 19వ ఓవర్‌లో 4,6,6తో 21 రన్స్ అందించి స్కోరు బోర్డును పరిగెత్తించడంతో పాటు 22 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. అలాగే ఆఖరి ఓవర్‌లో స్టబ్స్, అక్షర్ (14 నాటౌట్) ఇచ్చిన క్యాచ్‌లను బిష్ణోయ్ వదిలేయగా డీసీ స్కోరు 200 దాటింది.

నేటి మ్యాచ్

రాత్రి 7.30 గం. వేదిక: గువాహటి

రాజస్థాన్ X పంజాబ్

స్కోరుబోర్డు

ఢిల్లీ: ఫ్రేజర్ (సి) నవీనుల్ (బి) అర్షద్ 0, అభిషేక్ పోరెల్ (సి) పూరన్ (బి) నవీనుల్ 58, హోప్ (సి) రాహుల్ (బి) బిష్ణోయ్ 38, పంత్ (సి) హుడా (బి) నవీనుల్ 33, స్టబ్స్ (నాటౌట్) 57, అక్షర్ (నాటౌట్) 14, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 208/4; వికెట్ల పతనం:** 1-2, 2-94, 3-111, 4-158; **బౌలింగ్:** అర్షద్ 3-0-45-1, మొహిసిన్ 4-0-29-0, యుధ్‌వీర్ 2-0-28-0, నవీనుల్ 4-0-51-2, బిష్ణోయ్ 4-0-26-1, క్రునాల్ 2-0-20-0, దీపక్ హుడా 1-0-9-0.

లఖ్‌నవూ: డికాక్ (సి) ముకేశ్ (బి) ఇషాంత్ 12, రాహుల్ (సి) ముకేశ్ (బి) ఇషాంత్ 5, స్టొయినిస్ (స్టంప్డ్) పంత్ (బి) అక్షర్ 5, దీపక్ హుడా (ఎల్బీ) ఇషాంత్ 0, పూరన్ (సి) అక్షర్ (బి) ముకేశ్ 61, బదోని (సి) గుల్బదిన్ (బి) స్టబ్స్ 6, క్రునాల్ (స్టంప్డ్) పంత్ (బి) కుల్దీప్ 18, అర్షద్ (నాటౌట్) 58, యుధ్‌వీర్ (సి) హోప్ (బి) ఖలీల్ 14, బిష్ణోయ్ (రనౌట్) 2, నవీనుల్ (నాటౌట్) 2, **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 20 ఓవర్లలో 189/9; వికెట్ల పతనం:** 1-7, 2-24, 3-24, 4-44, 5-71, 6-101, 7-134, 8-167, 9-183; **బౌలింగ్:** ఇషాంత్ 4-0-34-3, ఖలీల్ 2-0-22-1, అక్షర్ 1-0-20-1, ముకేశ్ 4-0-33-1, కుల్దీప్ 4-0-33-1, స్టబ్స్ 1-0-4-1, గుల్బదిన్ 1-0-12-0, రసిఖ్ 3-0-30-0.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
కోల్‌కతా	13	9	3	1	19	1.428
రాజస్థాన్	12	8	4	0	16	0.349
చెన్నై	13	7	6	0	14	0.528
హైదరాబాద్	12	7	5	0	14	0.406
ఢిల్లీ	14	7	7	0	14	-0.377
బెంగళూరు	13	6	7	0	12	0.387
లఖ్‌నవూ	13	6	7	0	12	-0.787
గుజరాత్	13	5	7	1	11	-1.063
ముంబై	13	4	9	0	8	-0.271
పంజాబ్	12	4	8	0	8	-0.423

గౌరవ్‌కు పతకం ఖాయం

అస్తానా (కజకిస్థాన్): ఎలోర్దా కప్ టోర్నీలో భారత బాక్సర్ గౌరవ్ చౌహాన్ (+92 కిలోలు) సెమీఫైనల్ చేరి కనీసం కాంస్య పతకం ఖరారు చేసుకున్నాడు. మంగళవారం జరిగిన బౌట్‌లో గౌరవ్ 3-2తో స్థానిక బాక్సర్ డానియల్‌పై నెగ్గాడు. ఇక, వెటరన్ స్టార్ శివ థాపా (63.5 కి) ఆరంభ బౌట్‌లో 1-4తో కజకిస్థాన్‌కే చెందిన అబ్దులి అల్మత్ చేతిలో చిత్తయ్యాడు.

షార్జా చెస్‌లో అర్జున్ శుభారంభం

షార్జా: తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేసి అర్జున్ షార్జా మాస్టర్స్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో శుభారంభం చేశాడు. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో ఎల్తాజ్ (అజర్‌బైజాన్)పై అర్జున్ 45వ ఎత్తుల్లో గెలిచాడు. ద్రోణవల్లి హారిక తొలి గేమ్‌ను డ్రా చేసుకోగా, ప్రణవ్ ఓటమి పాలయ్యాడు.

బంగ్లా వరల్డ్ కప్ జట్టులో టస్కిన్

ఢాకా: టీ20 ప్రపంచకప్‌లో పాల్గొనే బంగ్లాదేశ్ జట్టును మంగళవారం ప్రకటించారు. ప్రస్తుతం గాయంతో బాధపడుతున్న పేసర్ టస్కిన్ అహ్మద్‌ను జట్టుకు ఎంపిక చేయడం గమనార్హం. జట్టు కెప్టెన్‌గా నజ్ముల్ హొస్సేన్ షంటో వ్యవహరిస్తాడు. 2007 నుంచి ప్రతీ వరల్డ్‌కప్ ఆడుతున్న వెటరన్ షకీబ్ సైతం జట్టులో ఉన్నాడు.

సెమీస్‌కొస్తే.. భారత్ ఆడేది గయానాలో

టీ20 ప్రపంచ కప్

న్యూఢిల్లీ: అమెరికా, వెస్టిండీస్ సంయుక్తంగా ఆతిథ్యమిచ్చే టీ20 వరల్డ్ కప్ 'ప్లేయింగ్ కండీషన్స్'ను ఐసీసీ మంగళవారం విడుదలజేసింది. టీమిండియా కనుక నాకౌట్‌కు చేరితే రెండో సెమీఫైనల్ ఆడుతుంది. జూన్ 27న గయానాలో రెండో సెమీస్ జరుగుతుంది. కాగా, జూన్ 29న బార్బడోస్‌లో జరిగే ఫైనల్‌కు రిజర్వ్ డే (జూన్ 30)ను ఏర్పాటు చేశారు. ట్రినిడాడ్, గయానా సమయాలను ఆధారం చేసుకొని భారత్ రెండో సెమీఫైనల్ ఆడేలా ఐసీసీ నిర్ణయించింది. తొలి సెమీఫైనల్ జూన్ 26న ట్రినిడాడ్ సమయం ప్రకారం రాత్రి 8.30కి ప్రారంభమవుతుంది. అంటే జూన్ 27న భారత సమయం ప్రకారం ఉదయం 6.30కి ఈ మ్యాచ్ మొదలవుతుంది. ఇక గయానాలో నిర్వహించే రెండో సెమీస్ వారి సమయం ప్రకారం ఉదయం 10.30కి మొదలవుతుంది. అంటే..భారత కాలమానం ప్రకారం రాత్రి 8గం.కు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. భారత క్రికెట్ ఫ్యాన్స్‌కు సౌకర్యంగా ఉండేలా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఐసీసీ వివరించింది. వాతావరణ అవరోధాలను అధిగమించేందుకు.. రెండు సెమీఫైనల్స్‌కు 250 నిమిషాల చొప్పున అదనపు సమయం కేటాయించారు.

ఏపీలో లెక్క తేలుతోంది!

భారీ పోలింగ్‌పై టీడీపీలో సంతృప్తి

- ప్రభుత్వ వ్యతిరేకత ప్రతిఫలించిందని విశ్లేషణ
- సీట్లు, మెజారిటీపైనే ప్రధాన చర్చ
- అందరిలోనూ ప్రభుత్వం మారాలన్న ఆకాంక్ష
- సర్వే సంస్థల ప్రతినిధుల వెల్లడి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో భారీ పోలింగ్ జరగడంపై తెలుగుదేశం పార్టీలో సంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రజల్లో జగన్ ప్రభుత్వంపై నెలకొన్న తీవ్ర వ్యతిరేకత ఓటింగ్‌లో ప్రతిఫలించిందని, అందుకే ఓట్ల సునామీ వచ్చిందని ఆ పార్టీ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఎన్నికల కమిషన్ నుంచి తుది గణాంకాలు మంగళవారం సాయంత్రం వరకూ విడుదల కానప్పటికీ.. మొత్తంగా 81 శాతం వరకూ ఓటింగ్ జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నాయి. 2019 ఎన్నికల్లో 79 శాతం పోలింగ్ జరిగింది. 'గత ఎన్నికల సమయానికి టీడీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత బలంగా ఉండడం వల్లే అంత పోలింగ్ జరిగిందని అప్పట్లో విశ్లేషణలు వెలువడ్డాయి. ఇప్పుడు వ్యతిరేకత దానిని మించి ఉంది. అందుకే పోలింగ్ ఇంకా పెరిగింది' అని టీడీపీ ముఖ్యుడొకరు పేర్కొన్నారు. పొరుగున ఉన్న తెలంగాణలో కూడా అసెంబ్లీ ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఇదే మాదిరి పోలింగ్ జరిగిందని, అక్కడ బీఆర్ఎస్ చిత్తుగా ఓడిపోయిందని టీడీపీ వర్గాలు ప్రస్తావిస్తున్నాయి. 'ఆంధ్రలో అత్యధిక నియోజకవర్గాల్లో గత ఎన్నికల కంటే ఈసారి పోలింగ్ బాగా పెరిగింది. ప్రత్యేకించి బయటి రాష్ట్రాల్లో ఉంటున్నవారు పెద్ద సంఖ్యలో తరలిరావడం అనేక నియోజకవర్గాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచింది. యువత, మహిళలు భారీగా పాల్గొనడం వారిలో ప్రభుత్వ వ్యతిరేకత ఎక్కువగా ఉందన్న విషయాన్ని ధ్రువీకరించింది' అని ఆ వర్గాలు చెబుతున్నాయి. పోలింగ్ సమయంలో ఓటర్ల నాడిపై ఎగ్జిట్ పోల్ నిర్వహించిన కొన్ని సర్వే సంస్థల ప్రతినిధులు కొన్ని ఆసక్తికరమైన అంశాలు చెప్పారు. తాము తీసిన ఎగ్జిట్ పోల్‌లో పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల అభిప్రాయం ఒకే మాదిరిగా వ్యక్తమైందని ఒక ప్రతినిధి తెలిపారు. 'పట్టణాల్లో ప్రభుత్వ వ్యతిరేకత ఎక్కువగా ఉందని, గ్రామాల్లో తక్కువగా ఉందని అంతకుముందు కొంత మంది అనేవారు. కానీ మేం తీసిన ఎగ్జిట్ పోల్‌లో రెండుచోట్లా ఒకే మాదిరి ఫలితాలు వచ్చాయి. అలాగే పేద వర్గాల మహిళల్లో ప్రభుత్వ అనుకూలత ఎక్కువగా ఉందని, పథకాలు నేరుగా వారికి అందడం వల్ల వారు వైసీపీ వైపు మొగ్గుతో ఉన్నారని ఒక వాదన గతంలో వినిపించేది. కానీ అది నిజం కాదని తేలింది. మెజారిటీ ప్రాంతాల్లో పురుషులు, మహిళల్లో ఒకే తరహా అభిప్రాయం వ్యక్తమైంది. అన్ని వర్గాలూ ప్రభుత్వం మారాలని కోరుకున్నాయి' అని ఆయన వివరించారు. విజయం ఖాయమని గట్టి నమ్మకంతో ఉన్న టీడీపీ వర్గాలు.. తమకు లభించే సీట్ల సంఖ్య ఎంత ఉండొచ్చో కూడా అంతర్గతంగా అంచనాలు వేస్తున్నాయి. 'గత ఎన్నికల్లో వైసీపీకి 49 % ఓట్లు లభిస్తే 151 అసెంబ్లీ సీట్లు లభించాయి. ఈసారి కూటమికి 50 శాతానికి మించి ఓట్లు వస్తాయని ఒక అంచనా. ఆ లెక్కన అంతకుమించిన సీట్లు మాకు రావాలి. ఏం జరుగుతుందో చూడాలి' అని ఒక మాజీ మంత్రి పేర్కొన్నారు. టీడీపీ నేతల్లో ఇప్పుడు విజయం వస్తుందా రాదా అన్న అంశంపై కంటే ఎన్ని సీట్లు వస్తాయి అన్న చర్చలు ఎక్కువగా జరుగుతున్నాయి.

రికార్డు బద్దలైంది!

- ఏపీలో 81% పైగా పోలింగ్

అమరావతి, మే 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల చరిత్రలో సంచలన రికార్డు నమోదైంది. పోటెత్తిన ఓటర్లతో బ్యాలెట్లేకాదు.. రికార్డులు సైతం బద్దలయ్యాయి. సార్వత్రిక ఎన్నికల చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ఓట్లు పోలయ్యాయి. మంగళవారం అర్ధరాత్రి సమయానికి 'ఓటర్ టర్నవుట్ యాప్'లో సీఈవో కార్యాలయం వెల్లడించిన వివరాల మేరకు గతంలో ఎన్నడూ లేని రీతిలో 81.17 శాతం పోలింగ్ నమోదైంది. దీనిలో సాధారణ ఓటింగ్ 80.07 శాతం కాగా, పోస్టల్ బ్యాలెట్ 1.1 శాతంగా ఉంది. 2019లో నమోదైన పోలింగ్ 79.88 శాతంతో పోలిస్తే తాజా ఎన్నికల్లో పోలింగ్ శాతం తారాజువ్వలా దూసుకుపోయింది. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా పోలింగ్ శాతం చరిత్ర సృష్టించినట్టయింది. సోమవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ప్రక్రియ రాష్ట్రంలో సాయంత్రం 6 గంటలకే ముగిసినా.. దాదాపు 47 పోలింగ్ కేంద్రాల్లో అర్ధరాత్రి వరకు కొనసాగింది. వీటిలో 34 కేంద్రాల్లో అర్ధరాత్రి దాటిన తర్వాత మంగళవారం తెల్లవారుజామున 2 గంటల వరకు కూడా కొనసాగడం గమనార్హం. ఫలితంగా పోలింగ్ శాతం అంచనాలకు మించి నమోదైంది. మరోవైపు, 1957 నుంచి 2009 వరకు ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లోనూ, 2014, 2019లో విభజిత ఏపీలో జరిగిన ఎన్నికల్లోనూ ఈ స్థాయిలో పోలింగ్ నమోదు కాకపోవడం గమనార్హం. ఇక, పథకాలు పొందిన వారితోపాటు ఏపీ ఎన్నికల్లో ఓటేసేందుకు పొరుగు రాష్ట్రాల(తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు తదితర) నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా ఓటర్లు తరలి వచ్చారు. అదేవిధంగా కొత్తగా హక్కు పొందిన యువత కూడా పోలింగ్ బూతులకు పోటెత్తారు. ఈ కారణంగానే పోలింగ్ శాతం అంచనాలకుమించి నమోదైనట్టు తెలుస్తోంది.



పల్నాడు జిల్లాలో వైసీపీ మూకలు నిప్పుపెట్టడంతో దగ్ధమవుతున్న కారు


తాడిపత్రిలో టీడీపీ నేతల ఇళ్లపై రాకెట్లతో వైసీపీ దౌర్జన్యకారుల దాడి

వైసీపీ విధ్వంసకాండ

(మొదటిపేజీ తరువాయి)

బైఠాయించారు. మరికొందరు.. మహిళా వర్సిటీ ప్రాంగణానికి చేరుకుని ప్రతిదాడికి దిగారు. వారిని చెదరగొట్టేందుకు పోలీసులు చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో బీఎస్ఎఫ్ జవాన్లు రబ్బర్ బుల్లెట్లతో గాల్లోకి కాల్పులు జరిపారు. అయినా వెనక్కి తగ్గక పోవడంతో కేంద్ర బలగాలను, టియర్ గ్యాస్ వాహనాలను రప్పించారు. వారు లాఠీచార్జి జరిపి టీడీపీ వర్గీయులను చెదరగొట్టారు. లాఠీచార్జిలో ఐదుగురు టీడీపీ కార్యకర్తలతో పాటు ఐదుగురు మీడియా ప్రతినిధులు గాయపడ్డారు. కాగా.. పులివర్తి నానీపై దాడికి పాల్పడింది వైసీపీ ఎంపీటీసీ భాను, అతని అనుచరులుగా పోలీసులు గుర్తించారు. గాయపడిన నానీని స్విమ్స్ ఆస్పత్రికి తరలించగా గన్‌మన్ ధరణి రుయాలో చికిత్స పొందుతున్నారు. నాని క్షేమంగా ఉన్నారని పోలీసులు తెలిపారు. మరోవైపు.. అనంతపురం జిల్లా తాడిపత్రిలో వరుసగా రెండోరోజూ వైసీపీ మూకల హింసాకాండ కొనసాగింది. టీడీపీ సీనియర్ నాయకుడు సూర్యముని ఇంటిపై వైసీపీ అల్లరి మూకలు మంగళవారం మధ్యాహ్నం రాళ్ల వర్షం కురిపించాయి. దీంతో తెలుగుదేశం శ్రేణులు భారీగా అక్కడికి చేరుకున్నారు. ఇరువర్గాలూ రాళ్లు రువ్వుకోవడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. పోలీసులు వారిని చెదరగొట్టేందుకు ప్రయత్నించినా పరిస్థితి అదుపులోకి రాలేదు. వైసీపీ రాళ్లదాడిలో పట్టణ సీఐ మురళీకృష్ణ తలకు గాయమైంది. సీఐ, ఎస్ఐల వాహనాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు భాష్పవాయువును ప్రయోగించగా కొద్దిసేపటికి పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఆ తర్వాత మళ్లీ.. జేసీ ప్రభాకర్‌రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇళ్ల మధ్య జూనియర్ కళాశాల మైదానంలో ఇరువర్గాలు మోహరించి గంటలపాటు రాళ్లు రువ్వుకున్నాయి. పరిస్థితి అదుపుతప్పడంతో పోలీసులు మరోసారి భాష్పవాయువు ప్రయోగించారు. రాత్రి 9 గంటలైనా దాడులు కొనసాగుతూనే ఉండటంతో పోలీసులు దాదాపు ఐదు గంటలపాటు శ్రమించినా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో పోలీసులు చేతులెత్తేశారు. ఎంతో సమస్యాత్మకమైన తాడిపత్రిలో పోలీసు అధికారుల ముందస్తు ప్రణాళిక లేకపోవడంతోనే పరిస్థితి ఇలా తయారైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



కారంపూడిలో వైసీపీ శ్రేణులు ధ్వంసం చేసిన టీడీపీ కార్యాలయం

పల్నాడు రక్తసిక్తం..

పల్నాడులోనూ వైసీపీ గూండాలు వరుసగా రెండో రోజు హింసాకాండకు పాల్పడ్డారు. ఎమ్మెల్యే పిన్నెలి సోదరుడు వెంకట్రామిరెడ్డి నేతృత్వంలో ఆ పార్టీ మూకలు కారంపూడిలో కొన్ని గంటలపాటు వీరంగం చేశాయి. టీడీపీ కార్యాలయంలోని ఫర్నీచర్‌ను, సమీపంలో ఉన్న వాహనాలను ధ్వంసం చేశాయి. రోడ్డు పక్కన నిలిపిన తెలుగుదేశం నేత జానీబాషా వాహనానికి నిప్పు పెట్టాయి. టీడీపీ సానుభూతిపరుల ఇళ్లు, వ్యాపార దుకాణాలపై రాళ్లు పడ్డాయి. దాడులను ఆపేందుకు ప్రయత్నించిన కారంపూడి సీఐ నారాయణస్వామిపై కూడా వైసీపీ గూండాలు విరుచుకుపడ్డారు. ఈ దాడిలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి.

- నరసరావుపేట నియోజకవర్గంలోని రొంపిచర్ల మండలం సంతగుడిపాడులో బీసీ వర్గీయులపై వైసీపీ శ్రేణులు దాడి చేశాయి. తమ పార్టీకి అనుకూలంగా ఓటు వేయలేదనే కక్షతో వారి రక్తం కళ్ల చూశారు. సత్తెనపల్లి నియోజకవర్గం ముప్పాళ్ల మండలం మాదలలో టీడీపీ నేతకు చెందిన ద్విచక్ర వాహనానికి నిప్పుపెట్టారు.
- శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ తరఫున ఏజెంట్లుగా కూర్చున్నవారిని లక్ష్యంగా చేసుకుని వైసీపీ మూకలు విరుచుకుపడ్డాయి. ఈ దాడుల్లో పలువురు గాయపడ్డారు. వారందరినీ ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు.
- విజయనగరం జిల్లా కొత్తవలస మండలం గొల్లలపాలెం గ్రామంలో టీడీపీలో చురుగ్గా పనిచేస్తున్నాడంటూ కడుపుట్ల గంగాధర్‌పై వైసీపీ మూకలు దాడిచేసి కొట్టాయి. శ్రీకాకుళం జిల్లా పలాస-కాశీబుగ్గమునిసిపాలిటీ పరిధి చిన్నబడాంలో టీడీపీ పోలింగ్ ఏజెంటు శ్రీనివాసరావు, ఆయన కుమారుడు సాయిచరణ్‌పై వైసీపీ నాయకులు సోమవారం అర్ధరాత్రి 1 గంట సమయంలో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు.
- విజయనగరంలో కౌలు రైతు మన్మథరావు టీడీపీకి ఓటేశారని తెలుసుకుని.. సోమవారం అర్ధరాత్రి దాటాక ఆయన ఇంటికి తాళాలు వేసి వైసీపీ మూకలు వీరంగం సృష్టించాయి.
- పలాస మండలం అమలుకుడియా గ్రామానికి చెందిన బూర్ల అప్పలస్వామి అనే వృద్ధుడు.. పోలింగ్ కేంద్రంలో టీడీపీ అనుకూల వ్యాఖ్యలు చేశారంటూ ఓ వైసీపీ కార్యకర్త ఆయన తలపై బలంగా క్రికెట్ క్రర్రతో కొట్టి గాయపరిచాడు.

ఏదో తేడా కొడుతోంది!

- ఒక్క పూటలోనే వైసీపీ మాట మారింది!!
- మహిళలు తమకే ఓటేశారన్న సజ్జల
- తెల్లవారేసరికి టీడీపీపై రిగ్గింగ్ ఆరోపణలు
- ఈసీ ఏకపక్షంగా వ్యవహరించిందని విమర్శ
- ఇంకోవైపు ఊళ్లలో టీడీపీపై దాడులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మళ్లీ మేమే గెలుస్తున్నామన్నారు.. మహిళలు, వృద్ధులు, యువత పెద్దఎత్తున ఓట్లేశారని.. ఇవి మాకే పడ్డాయన్నారు.. సోమవారం పోలింగ్ ముగిసీ ముగియగానే.. వరుసగా రెండోసారీ అధికారంలోకి వచ్చేస్తున్నామని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ప్రకటించారు. ఏపీ సీఎం జగన్‌ను యువతకు ఐకాన్‌గా ఆకాశానికెత్తేశారు. కానీ మంగళవారం ఉదయానికి మాట మారిపోయింది. టీడీపీ రిగ్గింగ్‌కు పాల్పడిందంటూ కొత్త పల్లవి అందుకున్నారు. దీంతో వారి మాటల్లో ఏదో తేడా కొడుతోందని రాజకీయ వర్గాలు అంటున్నాయి. గెలుపుపై ధీమా సడలిందా అన్న అనుమానాలూ వ్యక్తం చేస్తున్నాయి. పోలింగ్ ముగిసి 24 గంటలు ముగియక ముందే.. తాడేపల్లి ప్యాలెస్‌లో కీలక నేత అయిన సజ్జలతో పాటు కొందరు మంత్రులు, మాజీ మంత్రులు, సీనియర్ నేతలు, అభ్యర్థులు మంగళవారం నాడు ఎన్నికల కమిషన్‌పై దుమ్మెత్తిపోశారు. పోలీసులపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు వ్యవస్థను చెప్పుచేతల్లో పెట్టుకున్న వైసీపీ పెద్దలు.. టీడీపీ రిగ్గింగ్ చేసిందని ఆక్రోశించడంలోని మర్మమేమిటా అని రాజకీయ వర్గాలు ఆరా తీస్తున్నాయి. భారీపోలింగ్‌తో సీఎం జగన్ అండ్ కో గుండెలు జారిపోయాయా.. కీడు శంకిస్తున్నారా అని ప్రశ్నిస్తున్నాయి. లేక సోమవారం పోలింగ్ సందర్భంగా తాము చేసిన అరాచకాలను కప్పిపుచ్చుకునేందుకు ఇలా స్వరం మార్చారా అన్న సందేహం కూడా వ్యక్తంచేస్తున్నాయి. టీడీపీ నేతలు తనను కొట్టి చంపేశాలా ఉన్నారంటూ జమ్మలమడుగు వైసీపీ అభ్యర్థి సుధీర్‌రెడ్డి.. తమను కొట్టి తరిమేశారని.. అరాచకం చేశారంటూ నరసరావుపేట ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్, గురజాల అసెంబ్లీ అభ్యర్థి కాసు మహేశ్‌రెడ్డి.. తనను గృహనిర్బంధం చేశారని తాడిపత్రి అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డి.. సత్తెనపల్లిలో పెద్ద ఎత్తున రిగ్గింగ్ జరిగిందని అక్కడి అభ్యర్థి, మంత్రి అంబటి రాంబాబు హాహాకారాలు చేశారు. ఎన్నికల సంఘం వైసీపీకి వ్యతిరేకంగా పనిచేసిందని, ఏకపక్షంగా వ్యవహరించిందని సజ్జల ఆరోపించారు. కానీ సోమవారం పోలింగ్ సందర్భంగా వీరే దాడులకు పాల్పడ్డారు. మంగళవారం ఓవైపు ఇలా ఆరోపణలు చేస్తూనే ఊళ్లపై పడి టీడీపీ నేతలపై దాడులకు తెగబడ్డారు. కాసు మహేశ్‌రెడ్డి, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరులు, అనిల్‌కుమార్ యాదవ్ అనుచరులతో కలసి వీరంగం సృష్టించడం గమనార్హం.

'పిన్నెల్లి'కి వీరనారిలా ఎదురు నిలిచి..



- అరాచకాలపై ఎదురుతిరిగిన ఎమ్మెల్యే బంధువు మంజుల
- కోపంతో రెచ్చిపోయి వేట కొడవళ్లతో దాడి చేసిన వైసీపీ మూకలు
- నుదుటిపై తీవ్ర గాయమైనా బెదరకుండా బూత్‌లోనే విధులు

గుంటూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మాచర్లలో వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరాచకానికి అడ్డూ ఆపు ఉండదు! ఎన్నికల్లో ఎలాగైనా గెలిచే ఉద్దేశంతో ఆయన అనుచరులు ప్రత్యర్థులను బెదిరించడం, దాడులకు తెగబడి భయభ్రాంతులకు గురిచేయడం చేస్తుంటారు. దీంతో.. ఇక్కడ టీడీపీ తరఫున ఏజెంట్‌గా ఉండేందుకు ఎవరూ ముందుకు రారు. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా టీడీపీకి ఇదే పరిస్థితి ఎదురైంది. అయితే.. ఈ సారి ఓ మహిళ వీరనారిలా ముందుకొచ్చి పిన్నెల్లికి ఎదురు నిలిచారు. ఏజెంట్లుగా ఉండేందుకు పురుషులు తటపటాయిస్తున్న చోట ఏజెంట్‌గా కూర్చున్నారు. ఇది సహించలేక వైసీపీ మూకలు ఆమెపై వేటకొడవళ్లతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. నుదిటిపై పెద్ద గాయమై రక్తమోడుతున్నప్పటికీ ఆమె పోలింగ్ బూత్‌లోనే కూర్చున్నారు. ఆమె పేరు చేరెడ్డి మంజుల. ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి వరసకు మరదలు. మాచర్ల నియోజకవర్గంలోని రెంటచింతల మండలం రెంటాల గ్రామ వాసి. మంజుల భర్త వెంకటేశ్వరరెడ్డి గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. మొన్నటి వరకు వైసీపీలోనే కొనసాగారు. మాచర్ల నియోజకవర్గంలో పిన్నెల్లి సోదరుల దౌర్జన్యాలను, అరాచకాలను తట్టుకోలేక మార్చి 15న టీడీపీలోకి చేరారు. ఎన్నికలు సమీపించిన తరుణంలో రెంటాల పోలింగ్ బూత్‌లో టీడీపీ తరఫున ఏజెంట్లుగా ఉండేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ఆ నేపథ్యంలో మంజుల పోలింగ్ ఏజెంట్‌గా వున్నారు. సోమవారం ఉదయం పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కాకముందే వైసీపీ మూకలు రెచ్చిపోయి దాడులకు తెగబడ్డారు. మంజుల, ఆమె భర్త వెంకటేశ్వర రెడ్డిపై వేట కొడవళ్లతో దాడులు చేశారు. తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర రెడ్డిని గురజాల ఆస్పత్రికి తరలించారు. మంజుల నుదిటిపై తీవ్ర గాయమై రక్తం ధారగా కారుతున్నప్పటికీ బూత్‌లో ఏజెంట్‌గా తన కర్తవ్యం నిర్వర్తించారు. చివరకు పార్టీ నేతలు సర్దిచెప్పి మంజులను గురజాల ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం మంజుల, ఆమె భర్త గుంటూరులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా మంజుల చూపించిన సాహసం ఉమ్మడి గుంటూరు జిల్లాలో చర్చనీయాంశమైంది.

అసెంబ్లీకి ఓటు.. లోక్‌సభకు వేటు

జూబ్లీహిల్స్ షేక్‌పేట డివిజన్‌లో 3,942 మంది హక్కు గల్లంతు..

చిరునామాల్లో ఎలాంటి మార్పు లేకున్నా ఓటు మాయం

ఈసీ పరిశీలన లేకుండానే తీసివేసినట్లుగా అనుమానం.. 'ఆంధ్రజ్యోతి' పరిశీలన.. నేడు ఈసీకి బీజేపీ ఫిర్యాదు



ఈమె పేరు దుంపల యాదమ్మ. సికింద్రాబాద్ లోక్‌సభ పరిధి జూబ్లీహిల్స్ నియోజకవర్గం షేక్‌పేట మారుతీనగర్ నివాసి. ఈమె భర్త, ఇద్దరు కుమారులు, కోడలు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేశారు. లోక్‌సభకు వచ్చేసరికి యాదమ్మ ఒక్కరి ఓటే మిగిలింది.



ఈయన పేరు పూస సురేష్. షేక్‌పేటలో ఉంటారు. కుటుంబంలో మొత్తం 9 మంది ఓట్లుండగా.. అందరివీ తొలగించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వీరందరూ ఓటేసినవారే కావడం గమనార్హం.


వీరంతా షేక్‌పేట మారుతీనగర్ వాసులు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేశారు. ఐదు రోజుల క్రితం పోలింగ్ కేంద్రం వివరాలతో చీటీలు అందించినా, ఓటు మాత్రం లేదు. షేక్‌పేట డివిజన్‌లో ఇలా వీరే కాదు.. 3,942 మంది ఓట్లు తొలగింపునకు గురయ్యాయి.

వీరంతా అసెంబ్లీ ఎన్నికల్లో హక్కు వినియోగించుకున్నవారే. ఈ వైనంపై ఫిర్యాదులు రావడంతో 'ఆంధ్రజ్యోతి' మంగళవారం షేక్‌పేట ప్రాంతంలో పరిశీలన చేపట్టింది. 40 మందితో మాట్లాడింది. ఇంటి చిరునామా సహా ఎలాంటి మార్పులు లేకున్నా ఈ ఎన్నికల్లో తమ ఓట్లు గల్లంతయ్యాయని చాలామంది వాపోయారు. ఎన్నికల సంఘం యాప్‌లోనూ డిలీటెడ్ అని చూపుతోంది. వీరంతా ఐదు రోజుల కిందట ఓటరు స్లిప్పులను పొందడం గమనార్హం. కాగా, షేక్‌పేట డివిజన్‌లో భారీగా ఓట్లు మాయం కావడంపై కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నారు. మరోవైపు ప్రతి ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితా సవరణ ఉంటుంది. 18 ఏళ్లు నిండినవారు కొత్తగా పేర్లను నమోదు చేసుకోవడం, మృతులు, ఇతర ప్రాంతాలకు వెళ్లినవారి ఓట్లను తొలగించే ప్రక్రియను ఎన్నికల సంఘం చేపడుతుంది. ఈసారి లోక్‌సభ ఎన్నికల ఓటర్ల జాబితా పరిశీలన మాత్రం అడ్డగోలుగా చేసిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఓట్లను తొలగించే ముందు బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్‌వో) ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను పరిశీలించాలి. అనంతరమే.. మృతులు, అక్కడి నుంచి వెళ్లిపోయినవారి పేర్లను తీసివేయాలి. బీఎల్వోలు ప్రతిపాదించినప్పటికీ.. ఎన్నికల సంఘం మరోసారి పరిశీలించిన తర్వాతే తొలగించాలి. కానీ, ఈసారి నేరుగా బీఎల్వోలు పేర్కొన్నవారి పేర్లను ఎత్తివేశారని తెలుస్తోంది. కాగా, రాష్ట్రంలో రెండేళ్లలో మొత్తం 32.08 లక్షల ఓట్లను తొలగించినట్లు ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ ఏప్రిల్‌లో వెల్లడించారు.

బాధ్యులపై చర్యలేవి? సాంకేతికత ఏమైంది..?

ప్రతి ఎన్నికల్లో భారీగా ఓట్లను తొలగించడం సాధారణంగా మారిపోయింది. గత రెండు అసెంబ్లీ ఎన్నికలతో పాటు లోక్‌సభ ఎన్నికల్లోనూ ఇలాంటి ఘటనలు వెలుగులోకి వచ్చాయి. వీటి వెనక కారణాలను గుర్తించడంలో ఈసీ విఫలమవుతోంది. ముఖ్యంగా ఓట్ల తొలగింపులో కీలకంగా ఉన్న అధికారులపై చర్యలు తీసుకోకపోవడంతో క్షేత్రస్థాయి సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. షేక్‌పేట డివిజన్ ఉదంతంపై స్థానిక బీజేపీ నేతలు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోలేదు. ఓటు కోసం మళ్లీ దరఖాస్తు చేసుకోవాలంటూ జీహెచ్ఎంసీ అధికారులు సలహా ఇచ్చి వెళ్లారు. కాగా, ఒకే వ్యక్తి పేరిట రెండు చోట్ల పేరుంటే ఒకటి దానంతటదే తొలగిపోతుందని, దీనికోసం ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని ఎన్నికల సంఘం ఉన్నతాధికారులు పలుసార్లు చెప్పుకొన్నారు. ప్రస్తుత పరిస్థితి చూస్తే అసలు టెక్నాలజీని వినియోగిస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకే నియోజకవర్గం పరిధిలో రెండు ఓట్లు ఉంటే తొలగిస్తుండగా.. ఒకే వ్యక్తికి వేర్వేరు నియోజకవర్గాల్లో ఉంటే గుర్తించి తీసేయడంలో ఈసీ విఫలమైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాల నుంచి వచ్చి హైదరాబాద్‌లో ఉంటున్న అనేకమందికి రెండుచోట్ల ఓట్లున్నాయి. పోలింగ్ రోజు వీరు వెళ్లిపోతున్నారు. నగరంలో పోలింగ్ శాతం తక్కువగా నమోదు కావడానికి ఇదీ ఓ ప్రధాన కారణమని తెలుస్తోంది.

-ఆంధ్రజ్యోతి,హైదరాబాద్



66.30%

(మొదటిపేజీ తరువాయి)

జరిగిందని పేర్కొన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా చూస్తే నర్సాపూర్‌లో అత్యధికంగా 84.25 శాతం, మలక్‌పేటలో అత్యల్పంగా 42.76 శాతం నమోదైందన్నారు. కాగా, రాష్ట్రంలో 3,32,16,348 మంది ఓటర్లకు గాను, 2,20,24,806 మంది ఓటు వేసినట్లు పేర్కొన్నారు. 35,809 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 2,18,14,035 (65.67 శాతం) మంది, పోస్టల్ బ్యాలెట్‌లో 2,10,771 మంది హక్కు వినియోగించుకున్నారని వెల్లడించారు. పోలింగ్ శాతం పెంపునకు క్షేత్రస్థాయి యంత్రాంగం చేసిన కృషికి తగిన ఫలితం దక్కిందన్నారు. అన్ని పోలింగ్ స్టేషన్ల నుంచి ఈవీఎంలను భద్రతా బలగాల సహకారంతో స్ట్రాంగ్ రూముల్లో చేర్చినట్లు వికాస్‌రాజ్ చెప్పారు. 44 స్ట్రాంగ్‌రూములకు నలువైపులా సీసీ కెమెరాలు, కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల వారీగా పోలింగ్ శాతం చూస్తే.. ఆదిలాబాద్ 74.03, భువనగిరి 76.78, చేవెళ్ల 56.50, హైదరాబాద్ 48.48, కరీంనగర్ 72.54, ఖమ్మం 76.09, మహబూబాబాద్ 71.85, మహబూబ్‌నగర్ 72.43, మల్కాజిగిరి 50.78, మెదక్ 76.09, నాగర్‌కర్నూల్ 69.46, నల్లగొండ 74.02, నిజామాబాద్ 71.92, పెద్దపల్లి 67.87, సికింద్రాబాద్ 49.04, వరంగల్ 68.86, జహీరాబాద్ 74.63 శాతం పోలింగ్ నమోదైంది.

భువనగిరిలోనూ మునుగోడు టాప్

భువనగిరిలో గత ఎన్నికల కంటే 2.36 శాతం పోలింగ్ అధికంగా జరిగింది. ఈ లోక్‌సభ స్థానం పరిధిలో అత్యధికంగా మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గంలో 83.71 శాతం, ఇబ్రహీంపట్నంలో అత్యల్పంగా 66.83 శాతం ఓటింగ్ నమోదైంది. పట్టణ ప్రాంత ఓటర్లు అధికంగా ఉన్న ఇబ్రహీంపట్నం కంటే.. పల్లెలు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో పోలింగ్ బాగా జరిగింది.

రైళ్ల నిండా ఓటెత్తిన చైతన్యమే!

ఏపీ నుంచి నగరవాసుల తిరుగుముఖం.. కిటకిటలాడిన రైళ్లు

- ఆవైపు నుంచి హైదరాబాద్‌వైపు రోడ్లూ రద్దీ



హైదరాబాద్ సిటీ, చౌటుప్పల్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఓటేసేందుకు మొన్న ఉప్పెనలా ఏపీకి కదిలిన జనం, హైదరాబాద్‌కు తిరుగుముఖం పట్టారు. ఫలితంగా మంగళవారం ఉదయం నుంచి హైదరాబాద్ వైపు వచ్చిన రైళ్లన్నీ ప్రయాణికులతో కిటకిటలాడాయి. పోలింగ్ రోజైన సోమవారం ఖాళీగా కనిపించిన ప్రధాన స్టేషన్లు, ఒక్కసారిగా రద్దీగా కనిపించాయి. ఏపీలోని విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి, కర్నూలు, కడప నుంచి సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి, లింగంపల్లి స్టేషన్లకు వచ్చేందుకు ప్రయాణికులు రెగ్యులర్, ప్రత్యేక రైళ్లలో రిజర్వేషన్ దొరికే పరిస్థితి కనిపించడం లేదు. ఫలితంగా తమ ప్రయాణానికి ఒకరోజు ముందుగా విడుదల చేసే తత్కాల్ టికెట్ల కోసం స్థానిక రిజర్వేషన్ కౌంటర్ల వద్దకు క్యూ కడుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు తత్కాల్ కోటాలో కూడా టికెట్లు కూడా దొరకని వారు వెయిటింగ్ లిస్ట్ టికెట్లతోనే అందుబాటులో ఉన్న రైళ్లను ఎక్కేసి నగరానికి చేరుకునేందుకు సన్నద్ధమయ్యారు. కాగా విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి గుంటూరు, విజయవాడ నగరాల మీదుగా హైదరాబాద్‌కు వచ్చే కోణార్క్, జన్మభూమి, ఈస్ట్‌కోస్ట్, ఫలక్‌నుమా, గోదావరి, దురంతో, గరీబ్‌రథ్, విశాఖ ఎక్స్‌ప్రెస్‌లు, గుంటూరు, తిరుపతి వైపు వెళ్లే కృష్ణా, శబరి, నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లు, కడప, అనంతపురం, కర్నూలు నుంచి కాచిగూడ వైపు వెళ్లే వెంకటాద్రి, రామేశ్వరం..తదితర ఎక్స్‌ప్రెస్‌ల స్లీపర్‌క్లాస్, సెకండక్లాస్ రిజర్వేషన్‌లో వందల సంఖ్యలో వెయిటింగ్ లిస్ట్ కనిపిస్తోంది. ఖరీదైన ఏసీ తరగతుల్లోనూ బెర్తులు దొరికే పరిస్థితి లేదు. దీంతో రిజర్వేషన్ దొరకని వారిలో కొందరు వారాంతం వరకు వేచి ఉండాలని భావిస్తున్నట్లు తెలిసింది. మరోవైపు దక్షిణమధ్య రైల్వే నడుపుతున్న ప్రత్యేకరైళ్లలోనూ రిజర్వేషన్ దొరికే పరిస్థితి లేదని ఏపీలో ఉన్న నగరవాసులు వాపోతున్నారు. ఏపీ నుంచి వచ్చే రైళ్లలో ప్రయాణికుల రద్దీ విషయమై దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో రాకేశ్ స్పందించారు. పోలింగ్ తేదీ నుంచి ఈ వారంతం వరకు మరో 30 ప్రత్యేకరైళ్లను నడుపుతున్నామని చెప్పారు. కాగా రాష్ట్రంలోని జిల్లాల నుంచి, ఏపీ వైపు నుంచి హైదరాబాద్ వైపు రోడ్లన్నీ వాహనాలతో రద్దీగా మారాయి. ఐదురోజుల్లో 2.5 లక్షల వాహనాలు రాకపోకలు సాగించాయి. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కోర్లపహాడ్ టోల్‌గేట్ రద్దీగా మారింది.

మెట్రోలో 5 గంటల్లోనే లక్షమంది

హైదరాబాద్‌లోని మెట్రో రైళ్లు మంగళవారం కిటకిటలాడాయి. 4 రోజుల క్రితం లక్షల మంది తమ స్వగ్రామాలకు తరలి వెళ్లారు. ఈ మేరకు మంగళవారం రైళ్లు, బస్సుల ద్వారా నగరానికి చేరుకున్న వారు తమ ఇళ్లకు చేరుకునేందుకు మెట్రోను ఆశ్రయించడంతో ఉదయం పూట విపరీతమైన రద్దీ నెలకొంది. ఎల్బీనగర్-మియాపూర్ మార్గంలో ఉదయం 6 నుంచి 11 గంటల వరకు సుమారు లక్ష మంది ప్రయాణించినట్లు మెట్రోవర్గాలు అంచనా వేశాయి. సాయంత్రం సమయంలో కూడా అదే రద్దీ ఉండటంతో ఉద్యోగులు, సాధారణ ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రద్దీ నేపథ్యంలో అమీర్‌పేట్ నుంచి రాయదుర్గం వరకు, సికింద్రాబాద్ ఈస్ట్ నుంచి అమీర్‌పేట్ వరకు ప్రత్యేక రైళ్లను నడిపించారు.



ఇండిగో విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో నిరీక్షిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు

శబరిమలకు మంత్రి పొంగులేటి బృందం

» వారు ప్రయాణిస్తున్న విమానంలో సాంకేతిక లోపం

ఖమ్మం/ శంషాబాద్, రూరల్ మే 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు పూర్తికావడంతో మంత్రి పొంగులేటి తన అనుచర ఎమ్మెల్యేలతో కలిసి శబరిమల అయ్యప్పస్వామి దర్శనానికి వెళ్లారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి మంగళవారం ఉదయం 9:50 గంటలకు వారు ప్రయాణించాల్సిన 6ఏ 6707 ఇండిగో విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. విమానం టేకాఫ్ అయ్యే ముందు పైలెట్లు విమానంలో సాంకేతిక లోపాన్ని గుర్తించి రన్‌వే నుంచి బేస్ బేపైకి తెచ్చి నిలిపారు. విమానంలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, జె.ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డితో పాటు 106 మంది ప్రయాణికులు ఉన్నారు. రెండు గంటల తరువాత ప్రత్యేక నిపుణులు వచ్చి విమానంలో సాంకేతిక లోపాన్ని సరిచేయడంతో ఉదయం 11.05 గంటలకు విమానం కొచ్చికి బయలుదేరి వెళ్లింది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయక పోవడంవల్లే తాము 2 గంటల పాటు ఎయిర్‌పోర్టులో పడిగాపులు కాయాల్సి వచ్చిందని ఎయిర్‌లైన్స్ అధికారుల తీరుపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

నీటిపారుదల ప్రాజెక్టుల సలహాదారుగా ఎన్.రంగారెడ్డి



హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): పూర్వ మహబూబ్‌నగర్ జిల్లా నీటిపారుదల ప్రాజెక్టుల సలహాదారుడిగా రిటైర్డ్ ఎస్ఈ ఎన్.రంగారెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో సీఎంగా ఉన్న కేసీఆర్‌కు ఓఎస్డీగా రంగారెడ్డి పని చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు వేగంగా జరగడంలో రంగారెడ్డి కీలక పాత్ర పోషించారు. ఈ నియామకంతో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో పాటు నెట్టెంపాడు, రాజీవ్ భీమా, కోయిల్‌కొండ ఎత్తిపోతల పథకంతో పాటు పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి వేగం పెరగనుంది. ఇటీవలే చేపట్టిన నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేయడానికి ఈయన సహకారం అందిస్తారని అధికారులు ప్రకటించారు.

కేంద్రంలో ఇండియా కూటమిదే అధికారం

» రాష్ట్రంలో 12 నుంచి 14 సీట్లు గెలుస్తాం

» ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

కాటారం, మే 14: సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం సాధించి, కేంద్రంలో అధికారం చేపట్టడం ఖాయమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. రాష్ట్రంలో 12 నుంచి 14 సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో ప్రజాస్వామ్యం నిలబడాలనే ఉద్దేశంతో ప్రజలు ఇండియా కూటమిని ఆదరించారన్నారు. భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్వగ్రామం ధన్వాడలో మంగళవారం జరిగిన దత్తాత్రేయస్వామి ఆలయ వార్షికోత్సవానికి భట్టి హాజరయ్యారు. అనంతరం శ్రీధర్‌బాబు నివాసంలో విలేకరులతో మాట్లాడారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి రాహుల్ గాంధీ పాటుపడుతున్నారన్నారు. బీజేపీతో దేశానికి పలు రకాలుగా పొంచి ఉన్న ప్రమాదంపై కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు రాహుల్ చేసిన భారత్ జోడో యాత్ర ఫలించబోతోందన్నారు. సమావేశంలో శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వరి కొయ్యలు తగలబెట్టొద్దు: మంత్రి తుమ్మల

హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): వరి కొయ్యలు తగలబెట్టడం వల్ల అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయని, వాటిని తగలబెట్టొద్దని రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు విజ్ఞప్తి చేశారు. వరి కొయ్యలు తగలబెడితే ఆస్తి, ప్రాణ నష్టాలతోపాటు పర్యావరణం, ఆరోగ్యం కూడా దెబ్బతింటోందని ఆయన చెప్పారు. వ్యవసాయశాఖ అధికారులు ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుని ఎవరైనా వరి కొయ్యలు తగలబెడితే తక్షణమే చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. తమ ఆదేశాలను పట్టించుకోని అధికారులపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అకాల వర్షాలతో జరుగుతున్న పంటనష్టంపై సర్వే చేసి నివేదిక పంపించాలని వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులను కోరారు.

ఉల్లంఘనలపై ఫిర్యాదుల్లో 90% పరిష్కారం: ఈసీ

న్యూఢిల్లీ, మే 14(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చినప్పటి నుంచి వివిధ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదుల్లో 90 శాతానికి పైగా పరిష్కరించామని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. కాంగ్రెస్, బీజేపీ నుంచి మినహా ఇతర పార్టీల నుంచి వచ్చిన ప్రధాన ఫిర్యాదులు పెండింగ్‌లో లేవని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. 425 ప్రధాన ఫిర్యాదులు వివిధ రాజకీయ పార్టీల నుంచి రాగా వాటిలో 400 ఫిర్యాదులను పరిష్కరించినట్లు తెలిపింది. టీడీపీ ఫిర్యాదు మేరకు వైసీపీ అధ్యక్షుడు జగన్ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినట్లు గుర్తించి మందలించామని తెలిపింది. కేసీఆర్‌పై 48 గంటల పాటు నిషేధం విధించామని పేర్కొంది. తెలంగాణ మంత్రి కొండా సురేఖను మందలించామని తెలిపింది.

వరి 66 లక్షలు.. పత్తి 60 లక్షల ఎకరాలు!

» 2024-25 వానాకాలం పంటల ప్రణాళిక సిద్ధం

హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): మరో పక్షం రోజుల్లో ప్రారంభం కానున్న 2024-25 వానాకాలం క్రాప్ (ఖరీఫ్) సీజన్‌కు పంటల ప్రణాళిక సిద్ధమైంది. రాష్ట్రంలో ప్రధాన పంటలైన వరి, పత్తి సాగు విస్తీర్ణమే గణనీయంగా ఉంటుందని వ్యవసాయశాఖ తన ప్రణాళికలో పేర్కొంది. రాష్ట్రంలో సుమారు కోటిన్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉంటే.. మొత్తం 1,34,35,175 (1 కోటి 34 లక్షల 35 వేల 175) ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశాలున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఇందులో 66 లక్షల ఎకరాల్లో వరి, 60 లక్షల ఎకరాల్లో పత్తి, 6 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 5.65 లక్షల ఎకరాల్లో కంది, 4.97 లక్షల ఎకరాల్లో సోయాబీన్ పంటలు సాగుచేయనున్నట్లు తెలిపారు. జొన్న, సజ్జ, రాగులు, వేరుశనగ, నువ్వులు, పొద్దుతిరుగుడు, ఆముదం, కుసుమలు, మినుములు, పెసర్లు.. తదితర పంటలు స్వల్ప విస్తీర్ణంలో సాగుకానున్నాయి. అన్ని పంటల్లో కెల్లా వరి, పత్తి సాగు విస్తీర్ణమే వానాకాలం సీజన్‌లో ఎక్కువ ఉండనుంది. మొక్కజొన్న, సోయాబీన్, కంది పంటలు ఓ మోస్తరు విస్తీర్ణంలో సాగయ్యే అవకాశాలున్నాయి. క్లస్టర్ల వారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఏఈవోలు, మండల వ్యవసాయాధికారుల నుంచి వివరాలు సేకరించి.. వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు ప్రణాళిక రూపొందించారు. కొద్దిరోజుల్లో నివేదికను అధికారికంగా విడుదలచేయనున్నారు.

యూపీ, మహారాష్ట్ర ప్రచారానికి రాష్ట్ర బీజేపీ నేతలు

తెలంగాణలో పోలింగ్ ముగిసిన నేపథ్యంలో రాష్ట్ర బీజేపీ ముఖ్యనేతలు ఇతర రాష్ట్రాల్లో జరుగనున్న ఎన్నికల ప్రచారానికి వెళ్లనున్నారు. వచ్చే నెల 1వ తేదీ వరకు ఇతర రాష్ట్రాల్లోని పార్టీ అభ్యర్థులకు మద్దతుగా వారు ప్రచారం నిర్వహించనున్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె.లక్ష్మణ్ నాలుగు రోజుల పాటు యూపీలో ప్రచారం నిర్వహించనున్నారు. వారణాసిలో ప్రచారం నిమిత్తం ఆయన బుధవారం ఉదయం బయలుదేరి వెళ్లనున్నారు. అనంతరం మహారాష్ట్ర, ఢిల్లీలో ఆయన పర్యటించనున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి ఈ నెల 16 నుంచి మూడు రోజుల పాటు యూపీలో ప్రచారం చేయనున్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ రెండు, మూడు రోజుల్లో వారాణసి వెళ్లనున్నారు.

రూ.1000 కోట్ల అప్పు తీసుకున్న రాష్ట్రం

రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం మరో రూ.1000 కోట్ల అప్పు తీసుకుంది. 17 ఏళ్ల కాల పరిమితి, 7.44% వార్షిక వడ్డీతో ఈ రుణాన్ని సేకరించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఈ-వేలం ద్వారా ఈ అప్పు తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా రూ.4000 కోట్ల అప్పు తీసుకుంది.

అభ్యర్థుల ఆటవిడుపు!

» పోలింగ్ ముగియడంతో ఉపశమనం

» ఫ్యామిలీతో సరదాగా గడిపిన నేతలు

హైదరాబాద్ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ ముగిసింది. ప్రచారం తర్వాత ఎన్నికల్లో అతి ప్రధాన ఘట్టానికి తెరపడింది. నామినేషన్ వేసినప్పటి నుంచి సోమవారం సాయంత్రం పోలింగ్ ముగిసేదాకా క్షణం తీరిక లేకుండా గడిపిన అభ్యర్థులు.. మంగళవారం రోజంతా సరదాగా గడిపారు. కుటుంబసభ్యులతో చాలాసేపు ముచ్చట్లు పెట్టారు. చిన్న పిల్లలతో ఆటలాడుతూ, పేపర్లు చదువుతూ ఒత్తిడి నుంచి ఉపశమనం పొందారు. అదే సమయంలో తమ వద్దకు వచ్చిన నాయకులు, కార్యకర్తలతో పోలింగ్‌పై సమీక్ష నిర్వహించారు. ఓటింగ్ సరళిపై ఆరా తీశారు. సికింద్రాబాద్ నుంచి పోటీచేసిన బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి ఉదయం 11 గంటల వరకు బర్కత్‌పురలోని తన నివాసంలోనే ఉన్నారు. కుటుంబసభ్యులతో ప్రశాంతంగా గడిపారు. తర్వాత నేరుగా నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లారు అక్కడ నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికపై బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డితో కలిసి సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ స్థానం నుంచి బీజేపీ తరఫున పోటీచేసిన మాధవీలత ఉదయం తొమ్మిది గంటలకే నాంపల్లిలోని తన కార్యాలయానికి వచ్చి.. సాయంత్రం ఐదింటిదాకా అక్కడే ఉన్నారు. ఈ సందర్భంగా పోలింగ్ సరళిపై సమీక్ష జరిపారు. మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ పార్టీ కార్యక్రమాల్లోనే ఎక్కువ పాల్గొన్నారు. మేడ్చల్‌లో జరిగిన శ్రీభగీరథ మహర్షి జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. తర్వాత నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశాలకు హాజరయ్యారు. బీఆర్ఎస్ అభ్యరులు తమ కుటుంబసభ్యులతో సరదాగా గడిపారు. సికింద్రాబాద్ అభ్యర్థి పద్మారావు టకారాబస్తీలోని తన నివాసంలో మనుమలు, మనుమరాళ్లతో ఆటలాడుతూ రిలాక్సయ్యారు. కాసేపు వివిధ దినపత్రికలు చదివి ఓటింగ్ శాతాన్ని తెలుసుకున్నారు. మల్కాజిగిరి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి హబ్సిగూడలోని తన ఇంట్లో కుమారుడు, మనవడితో కలిసి ట్రెడ్‌మిల్‌పై జాగింగ్ చేశారు. హైదరాబాద్ స్థానం నుంచి బీఆర్ఎస్ తరఫున పోటీచేసిన గడ్డం శ్రీనివాస్ యాదవ్ గౌలిగూడలోని తన నివాసంలో ఇద్దరు మనువళ్లతో కాలక్షేపం చేశారు. సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ కూడా బంజారాహిల్స్‌లోని తన నివాసంలో మనవళ్లతో సరదాగా గడిపారు.





కుటుంబసభ్యులతో.. బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు, చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి

రుణమాఫీకి కార్పొరేషన్

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నించారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, ధరణి తదితరాలన్నింటిపైనా శాసనసభలో చర్చిస్తామని, సభలో చర్చకు పెట్టకుండా ఏదీ చేయబోమని స్పష్టం చేశారు. అఖిలపక్షాలు, స్టేక్ హోల్డర్లతోనూ చర్చిస్తామన్నారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు.. కేంద్ర బడ్జెట్ సమావేశాల తర్వాతే ఉంటాయని, కేంద్రం నుంచి వచ్చే నిధుల వెసులుబాటును చూసుకునే రాష్ట్ర బడ్జెట్ ఉంటుందని వెల్లడించారు. అందుకే రైతు రుణమాఫీకి ఆగస్టు 15 గడువు పెట్టుకున్నట్లు చెప్పారు.

రేషన్ షాపుల ద్వారా పంటల పంపిణీ..

రైతులు పండించే వరి, ఇతర పంటలను పౌరసరఫరాల సంస్థ ద్వారా గిట్టుబాటు ధర ఇచ్చి సేకరిస్తామని, వాటిని ఉత్పత్తుల కింద మార్చి రేషన్ షాపుల ద్వారా పేదలకు పంపిణీ చేస్తామని సీఎం తెలిపారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం.. రేషన్ షాపుల ద్వారా బియ్యంతోపాటు తొమ్మిది రకాల వస్తువులను సరఫరా చేసిందని గుర్తు చేశారు. రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ.. రైతులు ఆ వడ్లు పండించేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. సన్న వడ్లు పండించే రైతులకు క్వింటాలుకు మద్దతు ధరపై రూ.500 బోనస్ ఇచ్చి సేకరిస్తామని చెబుతామన్నారు. అప్పుడు రైతులు కూడా సన్న వడ్లు పండించేందుకు ముందుకొస్తారని తెలిపారు. రేషన్ కార్డుల మంజూరు అనేది నిరంతర ప్రక్రియ అని సీఎం రేవంత్ అన్నారు. వీటితోపాటు అన్ని కార్యక్రమాలకు సంబంధించి గ్రామసభల్లో తీసుకున్న దరఖాస్తులను కంప్యూటరైజ్ చేసినట్లు చెప్పారు. రిటైర్ అయి కూడా వివిధ శాఖల్లో కొనసాగుతున్న అధికారులు వెయ్యి మందికి పైగా ఉన్నారని వెల్లడించారు. మంత్రివర్గ సమావేశం నిర్వహించి వారి విషయంలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. కర్ణాటకలో కరువు పరిస్థితులున్నా.. వారిని ఒప్పించి రాష్ట్రంలో తాగునీటి అవసరాల కోసం రెండున్నర టీఎంసీల కృష్ణా నీటిని ఆ రాష్ట్రం నుంచి తెచ్చామని గుర్తు చేశారు. 59 జీవోను



అబయన్స్‌లో పెట్టామని, ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత సమీక్షిస్తామని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ సంబంధిత అంశాలను అసెంబ్లీకే చెబుతామన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే వర్సిటీలకు కొత్త వీసీలను నియమిస్తామని చెప్పారు. కరెంటు విషయంలో హరీశ్‌రావు ఒక మెకానిజం ఏర్పాటు చేసి.. ఎన్నికల్లో ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలని చూశారని ఆరోపించారు. ఇందుకు సంబంధించి కొన్ని కేసులను గుర్తించి నమోదు చేశామన్నారు.

పదేళ్లు రాష్ట్రంలోనే..

రానున్న పదేళ్లూ తాను తెలంగాణ రాజకీయాల్లోనే ఉంటానని సీఎం రేవంత్ అన్నారు. రానున్న వందేళ్ల అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసి ప్రజలకు అందించడం తన బాధ్యత అని పేర్కొన్నారు. ఏపీలో ఎవరు ముఖ్యమంత్రి అయినా వారితో సత్సంబంధాలు పెట్టుకుంటామని, రెండు రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించుకుంటామని స్పష్టం చేశారు. ఇక మూసీ నదిని రాష్ట్రానికి ఆదాయాన్నందించే వనరుగా మారుస్తామని, కన్సల్టెన్సీ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కేసీఆర్ మాదిరిగా తాను మేధావిని కాకపోవడం వల్లనే కన్సల్టెన్సీ నివేదికలపై ఆధారపడుతున్నానని రేవంత్ ఎద్దేవా చేశారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వల్ల మెట్రోను అమ్ముకునే పరిస్థితి వస్తుందన్న యాజమాన్యం వ్యాఖ్యలపై సీఎం స్పందిస్తూ, "వాళ్ల ఆస్తిని వాళ్లు అమ్ముకుంటానంటే ఎవరు వద్దన్నారు?" అని ప్రశ్నించారు. హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతం చేస్తారని ఎవరైనా అంటే అంత తెలివిలేనివాడు ఇంకొకడు ఉండడన్నారు. యూటీ అనేది స్టాప్ గ్యాప్ మాత్రమేనని, అది విఫల ప్రయోగం అని కూడా అన్నారు. నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు.

ఆరేడు సీట్లలో బీఆర్ఎస్‌కు డిపాజిట్ రాదు..

రాష్ట్రంలోని 17 లోక్‌సభ సీట్లకుగాను ఆరేడు సీట్లలో బీఆర్ఎస్‌కు డిపాజిట్ కూడా రాదని సీఎం రేవంత్ అన్నారు. మెదక్‌లో మాత్రమే ఆ పార్టీ గట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్‌కు 13 సీట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీని తమకు ప్రత్యర్థిగా బీఆర్ఎస్ బలవంతంగా సృష్టించిందని ఆరోపించారు. దేశంలో, రాష్ట్రంలోనూ మోదీ వేవ్ లేదని, బీఆర్ఎస్ ఆ పార్టీ యంత్రాంగం మొత్తాన్ని బీజేపీకి అప్పగించిందని అన్నారు. రాజకీయాల్లో హత్యలు ఉండవని, ఆత్మహత్యలే ఉంటాయని వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా ఎన్డీయేకు పది శాతం అటు ఇటుగా 220 సీట్లు వస్తాయని తెలిపారు. కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలో తమ అభ్యర్థి 20 వేల మెజారిటీతో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. అక్కడ మాత్రం బీఆర్ఎస్ పోటీ ఇస్తుందని అన్నారు. రాష్ట్ర ఆర్థికస్థితిపై శ్వేతపత్రాన్ని ప్రకటించడాన్ని కేసీఆర్ తప్పుబట్టడంపై స్పందిస్తూ ఆయన చేసిన పాపాలన్నింటినీ మూసిపెట్టాలనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. రైతుబంధు కూడా పూర్తి చేయలేమంటూ మాట్లాడారని, చేశాక అది వాళ్ల గొప్పదనమంటున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రెండోసారి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అది కూడా వాళ్ల గొప్పతనమే అని చెప్పుకోవచ్చన్నారు.

9-13 సీట్లు పక్కా!

» ఆత్మవిశ్వాసంతో అధికార కాంగ్రెస్

» అసెంబ్లీతో పోలిస్తే మరో 4-5 శాతం.. ఓటింగ్ పెరుగుతుందని నేతల అంచనా

» ముఖ్యనేతలతో సీఎం రేవంత్ సమీక్ష

హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యధిక లోక్‌సభ స్థానాలు తమకే దక్కుతాయన్న ఆత్మవిశ్వాసం అధికార కాంగ్రెస్‌లో వ్యక్తమవుతోంది. అన్ని చోట్లా పోలింగ్ తమకు అనుకూలంగా జరిగిందని, ఓట ర్లు తమ ప్రజాపాలనను ఆశీర్వదించారని ఆ పార్టీ నేత లు భావిస్తున్నారు. ఇప్పటివరకు ఉన్న సర్వేల రిపోర్టు లు, పార్టీ నేతల అభిప్రాయాలు, వివిధ వర్గాల నుంచి అందిన సమాచారం ప్రకారం 9 నుంచి 13 స్థానాలు గెలుస్తామన్న అంచనాకు వచ్చారు. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి తన నివాసంలో పార్టీ ముఖ్యనేతలు, ఎమ్మెల్యేలు, అభ్యర్థులు, నియోజకవర్గాల ముఖ్యనేతలతో మాట్లాడారు. పోలింగ్ జరిగిన తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా.. అన్నిచోట్లా ఓటింగ్ కాంగ్రెస్‌కు అనుకూలంగా జరిగిందని, వందరోజుల కాంగ్రెస్ ప్రజా పాలనకు ఓటేసేందుకు ప్రజలు మొగ్గు చూపారని నేతలు అభిప్రాయపడ్డారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 39.40% ఓట్లు వచ్చాయి. అప్పటితో పోలిస్తే తాజాగా 4 నుంచి 5 శాతానికి మించి పార్టీ ఓటుబ్యాంకు పెరుగుతుందని విశ్లేషించుకున్నారు. వివిధ సర్వేల నుంచి అందిన ఫీడ్ బ్యాక్ ప్రకారం 9 నుంచి 13 సీట్లలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచే అవకాశాలున్నాయని, మిగతా నియోజకవర్గాల్లో ఫలితాలు అంచనా వేసేలా లేవని అభిప్రాయానికి వచ్చారు. కొన్ని నియోజకవర్గాల్లో బీజేపీ రెండో స్థానానికి పోటీ పడిందని, బీఆర్ఎస్ ఎక్కడా పోటీలో కనిపించలేదని భావిస్తున్నారు. కాంగ్రెస్ గెలిచే అవకాశం ఉన్న స్థానాల్లో నల్లగొండ, భువనగిరి, ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్, పెద్దపల్లి, నిజామాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, మెదక్, జహీరాబాద్, చేవెళ్ల, సికింద్రాబాద్ ఉంటాయని అంచనా వేస్తున్నారు. మిగతా నియోజకవర్గాల్లో సానుకూలత ఉన్నప్పటికీ ఓటర్ల నాడి అంచనాకు చిక్కలేదనే అభిప్రాయానికి వచ్చారు.

లక్ష్మణ్.. పొలిటికల్ చిప్ ఖరాబైంది

» తక్షణం రిపేర్ చేయించుకుంటే మంచిది

» కాంగ్రెస్‌కు సొంతంగా 64 సీట్లున్నయ్

» ఐదేళ్లూ మా సర్కారే ఉంటుంది: జగ్గారెడ్డి

హైదరాబాద్, మే 14(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ పొలిటికల్ చిప్ ఖరాబైందని, తక్షణమే దాన్ని రిపేర్ చేయించుకుంటే ఆయనకే మంచిదని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అన్నారు. రానున్న ఐదేళ్లూ కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంటుందని, ఆయన ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. గాంధీభవన్‌లో మంగళవారం జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయంటే ఆ క్రెడిట్ సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఆగస్టులో కాంగ్రెస్ సంక్షోభంలో పడుతుందంటూ లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలు విని ప్రజలు గందరగోళ పడొద్దన్నారు. ఆగస్టు సంక్షోభం అన్నది ఒట్టి మాట అంటూ కొట్టి పారేశారు. రాష్ట్రంలో 64 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపించి ప్రజలు అధికారం ఇచ్చారని, రేవంత్ ప్రభుత్వం ఐదేళ్లూ కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ డిస్ట్రబ్ చేయాలని చూపినా.. సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఒక్కతాటిపై నిలబడి ఐదేళ్లూ ప్రభుత్వాన్ని కాపాడుకుంటారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్ వంటి పథకాలూ అమలవుతున్నాయని చెప్పారు. ఆగస్టు 15 కల్లా రైతు రుణమాఫీని సీఎం రేవంత్ అమలు చేస్తారని అన్నారు. "కేంద్రంలోని మీ బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై



చర్చకు సిద్ధమా?" అంటూ లక్ష్మణ్‌కు సవాల్ విసిరారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న మోదీ.. ఇవ్వలేదని, దానిపైన ఆలోచన చేయాలని హితవు పలికారు. బట్టకాల్చి మీద వేయడం బీజేపీకి ఉన్న అలవాటైతే.. చెప్పింది చెయ్యడం గాంధీ కుటుంబానికి ఉన్న అలవాటని పేర్కొన్నారు. 2 కోట్ల ఉద్యోగాల హామీని పక్కన పెట్టి.. దేవుడిని ముందుకు తెచ్చి పెట్టారని తెలిపారు. "శివలింగంపై పాము ఉంటే మొక్కుతాం. అది దిగి.. పక్కకు చేరితే చంపుతాం. ప్రస్తుతం బీజేపీ వాళ్లు శివలింగంపై కూర్చుని ఉన్నారు. బీజేపీపై కోపం ఉన్నా.. శివలింగాన్ని చూసి ప్రజలు ఊరుకుంటున్నారు" అని జగ్గారెడ్డి అన్నారు.

బీఆర్ఎస్ విలీనం అంటే జనం నమ్మాలి కదా..?

"కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం అవుతుందంటూ లక్ష్మణ్ మాట్లాడుతున్నడు. కేసీఆర్.. పార్టీని ఎందుకు విలీనం చేస్తడు..? చెబితే జనం నమ్మాలి కదా?" అని జగ్గారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారితే మారొచ్చని, అలా మారాలనుకుంటే బీజేపీలోకి వెళ్లరు కదా..? అని అన్నారు. బీఆర్ఎస్ నుంచి 20 మంది వస్తే కాంగ్రెస్ బలం 84కు చేరుకుంటుందని, బీజేపీ ఎమ్మెల్యేల్లోనూ ఓ ఐదుగురు మనసు మార్చుకుని కాంగ్రెస్ పార్టీలోకి రావచ్చేమోనని చెప్పారు. ఈ మాత్రం ఆలోచన లక్ష్మణ్‌కు రాలేదా..? అని జగ్గారెడ్డి అన్నారు.

ఢిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ

తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ కలిసిపోయాయి

» బీజేపీ గెలుపునకు శ్రమించిన రేవంత్

» ఆరేడు చోట్ల కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థులు

» కేసీఆర్ బస్సుయాత్రతో రాజకీయాల్లో మలుపు

» దేశంలో ఏ కూటమికీ మెజారిటీ రాదు

» ప్రాంతీయ పార్టీలే కీలకం: కేటీఆర్

సిరిసిల్ల/హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ కలిసిపోయాయని, ఆ రెండు పార్టీల వ్యవహారం ఢిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ అన్నట్లుగా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో ఆరేడు పార్లమెంటు స్థానాల్లో కాంగ్రెస్ బలహీనమైన, డమ్మీ అభ్యర్థులను నిలబెట్టిందని అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడైన జీవన్‌రెడ్డి కరీంనగర్‌లో పోటీ చేయాలనుకుంటే.. ఆయనను బలవంతంగా నిజామాబాద్‌లో పోటీ చేయించారని తెలిపారు. కరీంనగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో కూడా ప్రజలకు తెలియదని ఎద్దేవా చేశారు. ఇక సికింద్రాబాద్ అభ్యర్థి చివరి పది రోజుల్లో ప్రచారం కూడా చేయలేదని, మల్కాజిగిరి అభ్యర్థి ఆ ప్రాంతానికి సుపరిచితులు కాదని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ తరఫున డమ్మీ అభ్యర్థులను పెట్టి బీజేపీని గెలిపించడానికి కిషన్‌రెడ్డి కంటే ఎక్కువ కష్టపడ్డారని అన్నారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కేటీఆర్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ, కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటముల్లో దేనికీ స్పష్టమైన మెజారిటీ వచ్చే పరిస్థితుల్లేవని, ప్రాంతీయ పార్టీలదే హవా అని పేర్కొన్నారు. ఏ కూటమిలోనూ లేని బీఆర్ఎస్, వైసీపీ, బిజూ జనతాదళ్ వంటి ప్రాంతీయ శక్తులు నిర్ణయాత్మక పాత్ర పోషించబోతున్నాయని చెప్పారు.



రాష్ట్రంలో 17 సీట్లలోనూ బీఆర్ఎస్ గట్టి పోటీ ఇచ్చిందని, రెండు నెలల కాలంలోనే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు గులాబీ సైనికులు ముచ్చెమటలు పట్టించారని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్ర రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పిందని, రెండు జాతీయ పార్టీల నాయకులు తెలంగాణ చుట్టూ గింగిరాలు కొట్టక తప్పని పరిస్థితిని కల్పించిందని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ మంచి ఫలితాలు సాధించబోతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ వంద రోజుల్లో అమలు చేస్తామన్న ఆరు గ్యారెంటీలను తుంగలో తొక్కడంతో ఆ పార్టీ పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కనిపించిందన్నారు. ఐదు నెలలుగా ప్రభుత్వాన్ని కాంగ్రెస్.. టైంపాస్‌గా నడిపిందని ఆరోపించారు. ఇక బీజేపీ తరఫున గత ఎన్నికల్లో నలుగురిని ఎంపీలుగా గెలిపించినా.. వారితో ఒరిగిందేమీ లేదనే విషయం ప్రజలకు అర్థమైందన్నారు. కాగా, నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేపథ్యంలో బీఆర్ఎస్ ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధులతో కేటీఆర్ బుధవారం తెలంగాణ భవన్‌లో భేటీ కానున్నారు.

ఓటింగ్‌లో హిందువులు ఐక్యత చాటారు

» జూన్ 4న కేసీఆర్.. డాక్టర్లను పక్కనబెట్టుకోవాలి

» గ్యారెంటీలపై సర్కారు దృష్టి పెట్టాలి: సంజయ్

భగత్‌నగర్, మే 14: కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో హిందువులు ఐక్యత చాటారని, హిందువులు ఏకమైతే ఫలితాలు ఎలా ఉంటాయో నిరూపించారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ అన్నారు. మంగళవారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కరీంనగర్‌లో బీజేపీని ఓడించేందుకు ముస్లింలంతా ఏకం కావాలంటూ కేసీఆర్ పిలుపునిచ్చారని, హిందువులంతా ఏకమైతే ఏ విధమైన ఫలితాలు వస్తాయో జూన్ 4న తేలుతుందన్నారు. ఫలితాలను చూసి తట్టుకునే శక్తి కేసీఆర్‌కు ఉండాలని కోరుకుంటున్నానని తెలిపారు. ఆ రోజు కేసీఆర్ ఇద్దరు డాక్టర్లను పక్కన పెట్టుకోవాలని సూచించారు. కాంగ్రెస్ నాయకులు ఎన్ని అడ్డదారులు తొక్కినా ప్రజలు బీజేపీ పక్షాన నిలిచారని చెప్పారు. ఉన్నతాధికారులు సక్రమంగా పనిచేసినా కొన్ని ప్రాంతాల్లో కింది స్థాయి పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారని అన్నారు. బీజేపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారని, లాఠీచార్జ్‌లు సైతం చేశారని మండిపడ్డారు. గతంలో బీఆర్ఎస్‌కు పోలీసులు ఎలా సహకరించారో అదే విధంగా కాంగ్రెస్‌కు కొంత మంది పోలీసులు సహకరించారని ఆరోపించారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ నేతలు ఇష్టం వచ్చినట్లు అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారని చెప్పారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేస్తే పూర్తి స్థాయిలో సహకరిస్తామని.. లేకపోతే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నాయకత్వంలో క్షేత్ర స్థాయిలో ఉద్యమాలు తప్పవని సంజయ్ హెచ్చరించారు.



కరీంనగర్‌లో మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్

కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం ఖాయం

(మొదటిపేజీ తరువాయి)



మాట్లాడారు. గ్యారెంటీలు, ఉచితాలపై రేవంత్‌రెడ్డి ప్రజల్లో భ్రమలు కల్పించారని.. వాటిని అమలు చేయకపోతే ప్రజలే కాదు.. సొంత పార్టీ నాయకులు కూడా తిరగబడతారని స్పష్టం చేశారు. అప్పు చేస్తేగానీ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దుస్థితి ఉందని తెలిసినా.. అత్యుత్సాహంతో హామీలు, గ్యారెంటీలు ఇచ్చారని లక్ష్మణ్ విమర్శించారు. సోమవారం నాటి పోలింగ్‌ను పరిశీలిస్తే, బీజేపీ అన్ని స్థానాల్లో గెలిచే పరిస్థితి కనిపిస్తోందన్నారు. తెలంగాణలో బీజేపీ 12 ఎంపీ సీట్లు కైవసం చేసుకోవడం పక్కా అని పార్టీ జాతీయ కార్యవర్గసభ్యులు, మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ధీమా వ్యక్తం చేశారు. సర్వే సంస్థలు కూడా ఊహించని విధంగా జూన్ 4న అద్భుతం జరగబోతోందని అన్నారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఈటల మీడియాతో మాట్లాడారు. పదేళ్ల కిందట కాంగ్రెస్ ఎలాంటి నీచమైన మాటలు చెప్పిందో.. సీఎం రేవంత్ అవే మాటలు చెబుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. పోలింగ్ తర్వాత సీఎం, కాంగ్రెస్ నేతల మాటల్లో మార్పు కనిపించిందన్నారు. బీజేపీ అత్యధిక స్థానాలు గెలుచుకోవడం ఖాయమని ఏలేటి ధీమా వ్యక్తం చేశారు.



మెడికోల్లో ప్రమాదకర మానసిక సమస్యలు



దేశవ్యాప్తంగా 37 వేల మందిలో ప్రాబ్లమ్

హాస్టళ్లలో ర్యాగింగ్, పని ఒత్తిడితోనే

ఢిల్లీ ఎయిమ్స్ సైకియాట్రిస్ట్ వెల్లడి

హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులు ప్రమాదకర మానసిక సమస్యలతో బాధపడుతున్నారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం వైద్య విద్యనభ్యసిస్తున్న 37 వేలమందిలో ఈ సమస్య నెలకొంది. ఈ విషయాన్ని ఢిల్లీలోని ఏయిమ్స్‌కు చెందిన ఓ సైకియాట్రిస్ట్ బయటపెట్టారు. కొద్ది రోజుల క్రితం జాతీయ వైద్య కమిషన్, వైద్యవిద్యార్థుల మానసిక స్థితిగతులపై ఆన్‌లైన్ సర్వే నిర్వహించింది. మెడికోలు తమకున్న మానసిక సంబంధిత సమస్యలను వెల్లడించాలని ఆన్‌లైన్‌లో ఎన్‌ఎంసీ ఒక గూగుల్ ఫామ్‌ను అన్ని మెడికల్ కాలేజీల్లో అందుబాటులోకి తీసుకొచ్చింది. దాని ద్వారా దేశవ్యాప్తంగా అయా ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థుల్లో 37 వేల మంది మెడికోలు ప్రమాదకర మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు వెల్లడైంది. ముఖ్యంగా ఎక్కువగా మంది హాస్టల్స్‌లో ర్యాగింగ్ లాంటి సమస్యలెదుర్కొంటున్నారు. గత ఐదేళ్లలో దేశవ్యాప్తంగా 130 మంది వైద్యవిద్యార్థులు బలవన్మరణానికి పాల్పడినట్లు ఎన్ఎంసీ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అయా కాలేజీల్లో ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల వివరాలను ఇవ్వాలని, వారు ఏ సమస్యతో సూసైడ్ చేసుకున్నారో తెలపాలని ఎన్ఎంసీ మెడికల్ కాలేజీలన్నింటిని కోరింది. ఆ వివరాలను అన్ని మెడికల్ కాలేజీలు ఎన్ఎంసీకి పంపా యి. ఆత్మహత్యలకు గల కారణాల్లో ప్రధానంగా మానసిక సమస్యలతో పాటు ర్యాగింగ్, తీవ్రమైన పనిఒత్తిడి ఉన్నట్లు తేలింది. ఆ నేపథ్యంలో విద్యార్థుల మానసిక సమస్యలపై 15 మంది సభ్యులతో ఎన్ఎంసీ ఒక కమిటీని ఏర్పాటు చేసింది. దీనిపై చర్చించి డ్రాఫ్ట్ రికమండేషన్ ఇవ్వాలని కోరింది. ఆ కమిటీ కొన్ని సిఫార్సులు చేసింది. అందులో గేట్ కీపర్ ప్రోగ్రామ్ ఒకటి. మెడికోల్లో ఆత్మహత్యల నివారణలో భాగంగా మానసిక ధృడత్వం లేని వారిని గుర్తించి, వారికి కౌన్సెలింగ్ ఇవ్వడమే ఈగేట్ కీపర్ ప్రోగ్రామ్ ఉద్దేశం. కేంద్ర ప్రభుత్వ టెలిమానస్ కార్యక్రమం ద్వారా కౌన్సెలింగ్ ఇచ్చేందుకు ప్రత్యేక నిపుణులను కూడా ఏర్పాటు చేశారు.

ఆహారనాళంలో మటన్ ఎముక ముక్క!

» ఎండోస్కొపీ ద్వారా తీసేసి ఓ వృద్ధుడి ప్రాణాలు కాపాడిన కామినేని వైద్యులు



బాధితుడు శ్రీరాములుతో వైద్యురాలు రాధిక

హైదరాబాద్ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): పెళ్లి విందులో నోట్లో వేసుకున్న చిన్న మటన్ ముక్క.. ఓ వృద్ధుడి ప్రాణాల మీదకు తెచ్చింది! ఆహారనాళంలో ఇన్ఫెక్షన్‌కు కారణమైన ఆ ఎముకను కామినేని వైద్యులు బయటకు తీసి అతడి ప్రాణాలు కాపాడారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం కక్కిరేణ్ గ్రామానికి చెందిన శ్రీరాములు(66)కు దవడ పళ్లు లేవు. దానివల్ల నమలలేరు. కానీ, ఒక పెళ్లికి వెళ్లి, అక్కడ మటన్ తినాలనుకున్నారు. నమలలేక ఒక చిన్న ముక్కను నేరుగా మింగేశారు. ఈ క్రమంలో 3.5 సెంటీమీటర్ల ఎముకముక్క కూడా లోపలికి వెళ్లిపోయింది. ఈ విషయం తొలుత ఆయనకూ తెలియలేదు. రెండు మూడు రోజుల తర్వాత ఛాతీలో నొప్పిగా అనిపించడంతో స్థానిక వైద్యుడి వద్దకు వెళ్లారు. ఆ వైద్యుడు గ్యాస్ట్రిక్ ట్రబుల్‌కు మందులు ఇచ్చారు. నొప్పి తగ్గకపోవడంతో నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి వెళ్లగా.. అక్కడ వైద్యులు ఆయనకు ఎండోస్కొపీ చేశారు. లోపల ఎముక ముక్క ఇరుక్కున్న విషయం గుర్తించి ఎల్బీనగర్‌లోని కామినేని ఆస్పత్రికి పంపారు. వారు అక్కడ మళ్లీ పరీక్షలు చేయగా.. ఆ ఎముక ముక్క వల్ల ఆహారనాళానికి రంధ్రం పడినట్లు తెలిసింది. ఆ భాగంలో ఇన్ఫెక్షన్ ఏర్పడి, పుండుపడింది. కొంత చీము చేరింది. ఇదంతా గుండెకు బాగా దగ్గరగా జరగడంతో.. చికిత్స చాలా జాగ్రత్తగా చేయాలని వైద్యులకు అర్థమైంది. ఆ ముక్కను బయటకు తీసే క్రమంలో ఏమాత్రం అటూఇటూ అయినా ఆహారనాళానికి పూర్తిగా రంధ్రం పడి గుండెకు ప్రమా దం. దీంతో ఎండోస్కొపీ ద్వారా దాన్ని అత్యం త జాగ్రత్తగా తొలగించామని మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ రాధిక వివరించారు. తమ సూచనలు పాటించడంతో.. ఆయనకు నొప్పి పూర్తిగా తగ్గిపోయిందని, ఇప్పుడిప్పుడే కొద్దిగా జొన్న అన్నం, పెరుగు అన్నం తినగలుగుతున్నారని ఆమె వివరించారు.

సీబీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో.. శ్రీ చైతన్య ప్రభంజనం

హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని శ్రీచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ సీమ తెలిపారు. శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థి 496 మార్కులతో ఆలిండియా నంబర్ వన్‌గా నిలిచారని చెప్పారు. అలాగే.. 495 మార్కులను ఇద్దరు విద్యార్థులు సాధించారని పేర్కొన్నారు. 8 మంది విద్యార్థులు 494 మార్కులను, 19 మంది విద్యార్థులు 493 మార్కులను, 61 మంది 490 మార్కులకు పైగా, 532 మంది విద్యార్థులు 480 మార్కులకు పైగా, 1259 మంది విద్యార్థులు 470కు పైగా మార్కులను సాధించారని వెల్లడించారు. మొత్తంగా తమ సంస్థలోని 92 శాతం బ్రాంచీలు 100 శాతం ఉత్తీర్ణతను సాధించినట్టు తెలిపారు.

సీబీఎస్ఈ, టెన్త్ ఇంటర్‌లో.. నేషనల్ టాపర్‌గా నారాయణ

హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ టెన్త్, ఇంటర్ ఫలితాల్లో తమ సంస్థ నేషనల్ టాపర్‌గా నిలిచిందని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు సింధూర, శరణిలు తెలిపారు. టెన్త్‌లో 500 మార్కులకు గాను 498 మార్కులతో ఆలిండియాలో అత్యుత్తమ మార్కులను సాధించామని వివరించారు. అలాగే 12వ తరగతి ఫలితాల్లో 500 మార్కులకు గాను 493, 492 మార్కులు సాధించినట్టు చెప్పారు. మొత్తం 138 బ్రాంచీల్లో 100 శాతం ఉత్తీర్ణతను సాధించామని తెలిపారు. ఇలాంటి ఫలితాలు నారాయణ 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ద్వారానే సాధ్యమయ్యాయని వెల్లడించారు. ఈ స్థాయి ఫలితాలు మరే ఇతర విద్యా సంస్థ సాధించలేదని తెలిపారు.

కేకేఆర్ గౌతమ్ విద్యార్థుల హవా

హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ 10వ తరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు అద్భుతమైన ఫలితాలను సాధించారని కేకేఆర్ గౌతమ్ స్కూల్ ప్రకటించింది. తమ విద్యార్థి బియస్త్‌నాగ్ గట్టు 500 మార్కులకు గాను 489 మార్కులను.. అర్జున్ జాగర్లమూడి, వై. చరిష్మాలు 487 మార్కులను సాధించారని తెలిపారు. 480 మార్కులకు పైగా 16 మంది విద్యార్థులు, 475 మార్కులకు పైగా 33 మంది విద్యార్థులు, 470 మార్కులకు పైగా 61 మంది విద్యార్థులు, 460 మార్కులకు పైగా 113 మంది, 450 మార్కులకుపైగా 205 మంది విద్యార్థులు సాధించారని వెల్లడించారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులు, వారి తల్లి దండ్రులు, సిబ్బందిని పాఠశాల యాజమాన్యం అభినందించింది.

అసెంబ్లీ జోరు లోక్‌సభకు ఏదీ?

శాసనసభ ఎన్నికలతో పోలిస్తే 8.56 శాతం తగ్గిన పోలింగ్

నాడు ఉత్సాహంగా ఎన్నికల పండగ.. నేడు నామమాత్రంగా ఇంటింటి ప్రచారం

హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం.. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే భారీగా తగ్గింది. సోమవారం పూర్తయిన లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ 65.67 శాతంగా నమోదు కాగా.. పోస్టల్ బ్యాలెట్‌తో కలిపి ఇది 66.30 శాతానికి చేరుకుంది. కాగా, ఆరు నెలల కిందట జరిగిన శాసనభ ఎన్నికల్లో 74.86% పోలింగ్ నమోదైంది. దీంతో పోలిస్తే ప్రస్తుత లోక్‌సభ పోలింగ్ 8.56% తగ్గింది. ఈ పరిస్థితి నియోజకవర్గాల వారీగా కూడా కనిపించింది. అసెంబ్లీ ఎన్నికల్లో భువనగిరి, నల్లగొండ, ఖమ్మం, మహబూబాబాద్, నాగర్‌కర్నూల్, జహీరాబాద్, ఆదిలాబాద్, మెదక్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో ఏకంగా 80 శాతానికి మించి పోలింగ్ నమోదైంది. తాజాగా లోక్‌సభకు వచ్చేసరికి భారీగా తగ్గిపోయింది. రాజధాని నగరంలోనూ భారీగా తేడా కనిపించింది. సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధికంగా, అసెంబ్లీ ఎన్నికల్లో కాస్త తక్కువగా, లోక్‌సభకు మరింత తక్కువగా పోలింగ్ శాతం నమోదవుతూ వస్తోంది. 2014లో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ఏకకాలంలో జరిగాయి. 2018లో అప్పటి సీఎం కేసీఆర్ ముందస్తు ఎన్నికలకు వెళ్లడంతో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల షెడ్యూలులో తేడా వచ్చింది. 2023 డిసెంబరులో అసెంబ్లీ ఎన్నికలు జరగగా, తాజాగా లోక్‌సభ ఎన్నికల పోలింగ్ పూర్తయ్యింది. అయితే, అసెంబ్లీ ఎన్నికల్లో కనిపించిన ఉత్సాహం.. లోక్‌సభ ఎన్నికల్లో కనిపించలేదు. పార్టీలు సభలు, సమావేశాలు, కూడలి సమావేశాలు, రోడ్‌షోలు నిర్వహించినా.. ఇంటింటి ప్రచారం చాలా తక్కువగా జరిగింది. ఎమ్మెల్యేలు నామమాత్రంగానే ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికి వచ్చి పోల్ చీటీలు పంచలేదు. ఎండ తీవ్రత, వేసవి సెలవుల కారణంగా ప్రజలు కూడా పెద్దఎత్తున విహారయాత్రలకు వెళ్లిపోయారు. ఏపీలో అసెంబ్లీ ఎన్నికల కారణంగానూ పలువురు అక్కడికి వెళ్లారు. అందుకే హైదరాబాద్ నగరంలో పోలింగ్ అంతంతమాత్రంగానే ఉంది.

2019తో పోలిస్తే మెరుగు

2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 62.77% పోలింగ్ నమోదైంది. దీంతో పోలిస్తే ప్రస్తుత ఎన్నికల్లో 3.53% పోలింగ్ పెరిగింది. నియోజకవర్గాల వారీగా చూస్తే ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, జహీరాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వరంగల్, భువనగిరి, ఖమ్మం స్థానాల్లో పోలింగ్ శాతం స్వల్పంగా పెరిగింది. నల్లగొండలో తగ్గింది.

2019 లోక్‌సభ, 2018 అసెంబ్లీ, 2024 లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం

లోక్‌సభ నియోజకవర్గం	2019 లోక్‌సభ	2023 అసెంబ్లీ	ప్రస్తుత ఎన్నికల్లో
ఆదిలాబాద్	71.42	80.43	74.03
పెద్దపల్లి	65.59	78.07	67.87
కరీంనగర్	69.52	78.75	72.54
నిజామాబాద్	68.44	75.11	71.92
జహీరాబాద్	69.7	81.52	74.63
మెదక్	71.75	81.6	75.09
మల్కాజ్‌గిరి	49.63	54.26	50.78
సికింద్రాబాద్	46.5	50.65	49.04
హైదరాబాద్	44.84	45.61	48.48
చేవెళ్ల	53.25	66.35	56.5
మహబూబ్‌నగర్	65.39	79.75	72.43
నాగర్‌కర్నూల్	62.33	81.53	69.46
నల్లగొండ	74.15	85.35	74.02
భువనగిరి	74.49	87.32	76.78
వరంగల్	63.7	78.35	68.86
మహబూబాబాద్	69.06	83.27	71.85
ఖమ్మం	75.3	84.86	76.09
సగటు	62.77	74.86	65.67

(ఈసారి లోక్‌సభ పోలింగ్ శాతం పోస్టల్ బ్యాలెట్‌తో కలిపితే 66.30 శాతానికి చేరుకుంది)

భారతీయ న్యాయ సంహితపై పోలీసు ఉన్నతాధికారుల సమీక్ష

హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్)-2023, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత(బీఎన్ఎస్ఎస్)-2023, భారతీయ సాక్ష్య చట్టం-2023పై తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులు మంగళవారం సమీక్షించారు. ఈ చట్టాలు ఈ ఏడాది జూలై 1 నుంచి అమల్లోకి వస్తాయని కేంద్రం ఫిబ్రవరిలో నోటిఫికేషన్ జారీ చేసింది. ఇంకా రెండు నెలల సమయం మాత్రమే ఉండడంతో.. అదనపు డీజీపీలు మహేశ్ భగవత్, సంజయ్‌కుమార్ జైన్, సీఐడీ చీఫ్ షికాగోయల్, ఇతర ఉన్నతాధికారులు మంగళవారం వీటిపై సమీక్ష నిర్వహించారు. ఈ మూడు చట్టాల్లో ఒక్కోదాని అమలు తీరుతెన్నుల పర్యవేక్షణకు ఒక్కో డీజీపీని ఇన్‌చార్జిగా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. జూలై 1 నాటికి అన్ని పోలీస్‌స్టేషన్లలో కొత్త చట్టాల మేరకు కేసుల నమోదుకు రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేయనున్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో సర్కారీ స్కూళ్ల సత్తా

హైదరాబాద్ సిటీ, మే14 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ టెన్త్, ఇంటర్ ఫలితాల్లో తెలంగాణలోని సర్కారీ స్కూళ్ల విద్యార్థులు సత్తా చాటారు. ఇంటర్ ఫలితాల్లో ప్రైవేటు స్కూళ్లకంటే మెరుగైన ఫలితాలను సాధించారు. మరీ ముఖ్యంగా జవహర్ నవోదయ స్కూళ్లలో చదివిన విద్యార్థులు టెన్త్, ఇంటర్‌లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్‌లో కేంద్రీయ విద్యాలయాలు 99.83శాతం ఉత్తీర్ణత సాధించగా, గవర్నమెంట్ స్కూళ్లలో 98.86శాతం ఉత్తీర్ణత నమోదైంది. ప్రైవేటు పాఠశాలలు 99.08శాతం ఉత్తీర్ణతతో చివరి స్థానంలో నిలిచాయి. సీబీఎస్ఈ టెన్త్ ఫలితాల విషయానికి వస్తే.. కేంద్రీయ విద్యాలయాల్లో 99.78శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, గవర్నమెంట్ ఎయిడెడ్ స్కూళ్లు 99.27శాతం ఉత్తీర్ణత సాధించాయి.

18న ఆర్మీ చేతికి దృష్టి-10 డ్రోన్

హైదరాబాద్‌లో అప్పగించనున్న అదానీ డిఫెన్స్ సిస్టమ్స్

న్యూఢిల్లీ, మే 14: పాకిస్థాన్ సరిహద్దు వెంబడి నిఘాను మరింత పెంచేందుకు భారత ఆర్మీ కొనుగోలు చేసిన రెండు దృష్టి-10 డ్రోన్లలో మొదటిది మరో మూడు రోజుల్లో సైన్యం చేతికి చేరనుంది. ఈ నెల 18న ఆర్మీ ఉన్నతాధికారుల సమక్షంలో హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో హెర్మెస్-900గా పిలిచే దృష్టి-10 డ్రోన్‌ను భారత సైన్యానికి అప్పగించనున్నారు. అదానీ డిఫెన్స్ సిస్టమ్స్ అత్యాధునిక టెక్నాలజీతో ఈ డ్రోన్‌ను రూపొందించింది. 'మేకిన్ ఇండియా'లో భాగంగా కనీసం 60 శాతం కంటే ఎక్కువ స్వదేశీ పరిజ్ఞానంతో వీటిని రూపొందించేలా జాగ్రత్తలు తీసుకున్నారు. భారత ఆర్మీ ఇప్పటికే ఇజ్రాయెల్‌కు చెందిన హెరాన్ మార్క్-1, మార్క్-2 డ్రోన్లను వినియోగిస్తోంది. కేంద్ర ప్రభుత్వం అత్యవసర కొనుగోళ్లకు ఆమోదించడంతో రెండు దృష్టి-10 డ్రోన్లను ఆర్డర్ చేసింది. దీనిలో భాగంగా తొలి డ్రోన్‌ను ఈ నెల 18న అందుకోనుంది.



మరో వారంలో నైరుతి !

» ఈ నెల 19కి అండమాన్‌కు : ఐఎండీ

» నేడు, రేపు రాష్ట్రంలో అక్కడక్కడ వర్షాలు

హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి) : దేశ ప్రజలకు చల్లని కబురు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే వచ్చేస్తున్నాయి. భారత వాతావరణ కేంద్రం(ఐఎండీ) అంచనాల ప్రకారం నైరుతి రుతుపవనాలు మే 19 నాటికి దక్షిణ అండమాన్, ఆగ్నేయ బంగాళాఖాతంలోని పలు ప్రాంతాలను తాకనున్నాయి. నైరుతి రుతుపవనాలు ఏటా మే 22న దక్షిణ అండమాన్ సముద్రంలోకి ప్రవేశిస్తుంటాయి. కానీ ఈసారి మూడు రోజులు ముందుగానే వస్తున్నాయి. రుతుపవనాలు గతేడాది కూడా మే 19 నాటికి అండమాన్ చేరుకున్నప్పటికీ ఆ తర్వాత వాటి కదలికలు మందగించాయి. ఈ ఏడాది పరిస్థితి ఎలా ఉంటుందో వేచి చూడాలి. ఇక, బుధ, గురువారాల్లో తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ ప్రాంతీయ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్- మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో బుధవారం వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. కాగా, జగిత్యాల జిల్లా జైనాలో మంగళవారం 42.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

అన్నదాతకు అకాల వర్షాల దెబ్బ!

» వరి కోతల సమయంలో వానలు, వడగండ్ల పీడ

» 'తడిసి' మోపెడవుతున్న ఖర్చులు

» ధాన్యాన్ని కాపాడుకోవటానికి రైతుల తంటాలు



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న భువనగిరి మండలం ఆకుతోట బావితండా రైతులు

హైదరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు, వడగండ్లు అన్నదాతను అదనుచూసి దెబ్బతీస్తున్నాయి. పంట చేతికి వచ్చే సమయంలో రైతులకు తీరని నష్టం కలిగిస్తున్నాయి. రాష్ట్రంలో అకాల వర్షాలు మార్చిలో మొదలయ్యాయి. ఏప్రిల్ లోనూ వెంటాడాయి. ఇప్పుడూ పలు జిల్లాల్లో కురుస్తున్నాయి. మార్చిలో నాలుగు రోజుల పాటు కురిసిన అకాల వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 16 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు లెక్క తేలింది. దీనికి నష్టపరిహారాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. జరిగిన పంట నష్టాన్ని కూడా అంచనా వేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. వరి ధాన్యం చాలావరకు కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో ఉంది. అక్కడ ఎలాంటి షెడ్లు, తాటిపత్రులు (టార్పాలిన్లు) లేవు. కొందరు రైతులకు మాత్రమే పరదాలు (ఎరువుల బస్తాలతో కుట్టించినవి) అందుబాటులో ఉన్నాయి. ఎక్కువ మంది రైతులు పొలాల దగ్గర, ఊరి బయట రోడ్లపై, పాఠశాల ప్రాంగణాలు, కొనుగోలు కేంద్రాల్లో ఆరుబయట ధాన్యం ఆరబోస్తున్నారు. అకాల వర్షాలకు ఆ ధాన్యం తడిసిపోతోంది. కోతలు పూర్తయిన తర్వాత తడిసిన ధాన్యాన్ని పంట నష్టం కింద పరిగణనలోకి తీసుకోకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. తడిసిన వరి ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని సీఎం రేవంత్ ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. ఒకవేళ ప్రభుత్వం కొనుగోలు చేసినప్పటికీ తేమ శాతాన్ని పరిగణనలోకి తీసుకుంటున్నారు. ప్రైవేటు ట్రేడర్లు, రైస్‌మిల్లర్లు అయితే మరీ ధర తగ్గించి ధాన్యం కొంటున్నారు.

పెరుగుతున్న ఖర్చులు

సాధారణంగా వరి కోతలకు హార్వెస్టర్లను వినియోగిస్తున్నారు. ఈ భారీ యంత్రం నేల తడిగా ఉంటే నడవదు. అకాల వర్షాల వల్ల రైతులు చైన్ మిషన్‌తో వరి కోయించాల్సి వస్తోంది. ఇది నేల కాస్త తడిగా ఉన్నా పనిచేస్తుంది. ఇది వాడితే గంటకు రూ.1,500 చొప్పున అద్దె ఎక్కువ చెల్లించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. పైగా వర్షాలకు వరి చేలు తడిస్తే మూడు, నాలుగు రోజులు కోతలు వాయిదా పడుతున్నాయి. దీంతో ధాన్యం గింజలు నాణ్యత కోల్పోతున్నాయి. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడానికి మూడు, నాలుగు రోజులు వేచి చూడాల్సి వస్తోంది. కూలీల ఖర్చులు కూడా రైతులకు భారంగా మారుతున్నాయి.

సబ్సిడీపై తాటిపత్రులు ఇవ్వాలి

గత ప్రభుత్వం సబ్సిడీ తాటిపత్రుల పంపిణీ నిలిపివేసింది. తెలంగాణ ఆగ్రోస్, మార్క్‌ఫెడ్, వ్యవసాయ శాఖ ద్వారా తాటిపత్రులు పంపిణీ చేసే విధానం గతంలో ఉండేది. ఇవి మండల వ్యవసాయాధికారి వద్ద అందుబాటులో ఉండేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. తాటిపత్రులు అందుబాటులో ఉంటే నష్ట నివారణ చర్యలు చేపట్టవచ్చని, ధాన్యపు రాశులను రక్షించుకోవచ్చని రైతులు అంటున్నారు. ప్రభుత్వం సబ్సిడీ తాటిపత్రుల పంపిణీ చేయాలని కోరుతున్నారు.

కలెక్టరేట్ వద్ద మొలకెత్తిన ధాన్యం పారబోసి నిరసన

భువనగిరి అర్బన్: ధాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టాలని యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం ఆకుతోట బావితండా రైతులు డిమాండ్ చేశారు. మొలకెత్తిన ధాన్యాన్ని మంగళవారం కలెక్టరేట్ ఎదుట పారబోసి నిరసన తెలిపారు. ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల శాఖ అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

తొలి తెలంగాణ ఉద్యమకారుడు కొలిశెట్టి రామదాసు కన్నుమూత

» సింగరేణిలో ఉన్నతోద్యోగిగా ప్రస్థానం.. నాన్-ముల్కీ గోబ్యాక్ ఉద్యమం ఆయనదే

» దొంగ ముల్కీలతో కొలువులు కొల్లగొట్టడంపై రుజువులతో సహా నిరూపణ

» తెలంగాణ ప్రాంతీయ పార్టీ స్థాపన.. బోయినపల్లి శ్మశానవాటికలో అంత్యక్రియలు



కొలిశెట్టి రామదాసు(ఫైల్)

బోయినపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): 'నాన్-ముల్కీ గోబ్యాక్..' అంటూ నినదించిన గొంతు మూగపోయింది. 1969 తొలి తెలంగాణ ఉద్యమకెరటం ఒరిగిపోయింది. పెద్ద మనుషుల ఒప్పందం ఉల్లంఘన, రీజినల్ కమిటీ ఏర్పాటు సహా.. తెలంగాణ ప్రాంతానికి ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు తుంగలో తొక్కడాన్ని నిరసిస్తూ.. ఖమ్మం నుంచి ఉవ్వెత్తున ఉద్యమాన్ని తీసుకెళ్లిన కొలిశెట్టి రామదాసు(84) ఇక లేరు. తొలితరం తెలంగాణ ఉద్యమానికి ఆద్యుడిగా గుర్తింపు పొందిన రామదాసు మంగళవారం తెల్లవారుజామున అనారోగ్యంతో హైదరాబాద్ బోయినపల్లిలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు ఇద్దరు కుమారులు మాధవ్, రఘువీర్, కుమార్తెలు శ్రీదేవి, మాధవి, శ్రీలత ఉన్నారు. బోయినపల్లిలోని ఎస్ఎంఆర్ ఇన్‌స్టైల్ అపార్ట్‌మెంట్‌లో ఆయన భౌతిక కాయాన్ని పలువురు ప్రముఖులు సందర్శించారు. మంగళవారం సాయంత్రం ఆరు గంటల సమయంలో బోయినపల్లిలోని హిందూ శ్మశానవాటికలో రామదాసు అంత్యక్రియలు నిర్వహించారు.

విశాలాంధ్ర వ్యతిరేకోద్యమంలో కీలకం

కొలిశెట్టి రామదాసు.. కొలిశెట్టి వీరయ్య, లక్ష్మీ నర్సమ్మ దంపతులకు నాలుగో సంతానంగా జన్మించారు. వీరి స్వస్థలం భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా ఇల్లెందు సమీపంలోని గేటుకారేపల్లి. చదువుకునే సమయంలోనే విద్యార్థి నాయకుడిగా పనిచేశారు. ఆ సమయంలో ఇల్లెందులో ప్రజాదరణ సంపాదించారు. చదువు పూర్తయ్యాక ఆయన సింగరేణిలో ఉన్నతోద్యోగిగా పనిచేశారు. 1954-56 మధ్యకాలంలో విశాలాంధ్ర వ్యతిరేక ఉద్యమంలో కీలకంగా వ్యవహరించారు. ఆంధ్రప్రదేశ్ అవతరించాక.. తమ ఉద్యమం ఫలించలేదని అసంతృప్తికి, అశాంతికి లోనయ్యారు. అప్పటి నుంచే ప్రత్యేక తెలంగాణ కోసం కృషి చేశారు. తన ఆలోచనలను అమలు చేయడానికి కష్టాలను ఎదుర్కొనేందుకు సిద్ధమై.. జిల్లాల్లో పర్యటనలు చేసి.. నాయకులు, కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థుల్లో చైతన్యాన్ని తీసుకువచ్చేందుకు కృషి చేశారు. తనతోపాటు చదువుకున్నవారంతా నిరుద్యోగులుగా ఉండడానికి కారణం.. నాన్-ముల్కీలేనని భావించేవారు. సింగరేణిలో అన్ని స్థాయుల్లో ఆంధ్రాప్రాంతానికి చెందిన ఉద్యోగులు నియమితులవ్వడం.. టీచర్ ట్రైనింగ్ స్కూల్(బీటీఎస్)లో అంతా ఆంధ్రా ఉద్యోగుల పెత్తనమే ఉండడం.. సర్వే ఆఫ్ ఇండియా ట్రైనింగ్ స్కూల్‌లోనూ అదే పరిస్థితి ఉండడం.. ఇల్లెందులో ఎక్కడ చూసినా హోటల్ వ్యాపారాలలో ఎక్కువగా ఆంధ్ర ప్రాంతం వారే కన్పించడం చూసి సహచరులతో చర్చించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వోద్యోగాల్లో తెలంగాణ ప్రజలకు దక్కాల్సిన కొలువులను ఆంధ్రాప్రాంతం వారికి ఇస్తుండడంతో రగిలిపోయారు. దొంగ ముల్కీలను సంపాదిస్తూ.. ఉద్యోగాలను కొల్లగొడుతున్న తీరును రుజువులతో సహా ఎండగట్టారు. పాల్వంచ కేటీపీఎస్‌లో నాన్-ముల్కీలకు ఇచ్చిన కొలువులకు వ్యతిరేకంగా.. 1969 జనవరిలో ఖమ్మంలో డిగ్రీ విద్యార్థి అన్నాబత్తుల రవీంద్రనాథ్‌తో రెండు వారాలపాటు నిరవధిక నిరాహార దీక్ష చేయించారు. ఆ దీక్షతో తెలంగాణ వ్యాప్తంగా ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడింది. 'నాన్-ముల్కీ గోబ్యాక్' అంటూ నినదించారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి ఒక దిశానిర్దేశాన్ని అందించారు. 'తెలంగాణ ప్రాంతీయ పార్టీ'ని స్థాపించారు. ఫలితంగా.. సింగరేణిలో అత్యున్నత పదోన్నతికి అర్హుడైన రామదాసు.. అణచివేతకు గురయ్యారు.

రామదాసును గుర్తించని బీఆర్ఎస్

తొలితరం తెలంగాణ ఉద్యమానికి ఆద్యుడైన రామదాసును బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్ గుర్తించలేదనే ఆరోపణలున్నాయి. టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన పలు పోటీ పరీక్షల్లో రామదాసుకు సంబంధించి, తెలంగాణ ప్రాంతీయ పార్టీపై ప్రశ్నలు వచ్చినా.. ప్రభుత్వం సముచిత గౌరవం ఇవ్వకపోవడం గమనార్హం.! ఓ దశలో మాజీ గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ ఆయన సేవలను గుర్తించారు. రామదాసు పెద్దకుమారుడిని పిలిపించి, ఘనంగా సత్కరించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి

దిక్సూచి

హైదరాబాద్ ● బుధవారం 15 మే 2024

diksuchi@andhrajyothy.com

అన్ని బోర్డులకు సంబంధించిన టెన్త్, ఇంటర్ ఫలితాలు వెలువడ్డాయి. నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా కెరీర్‌ను తీర్చిదిద్దుకునేందుకు సమయం ఇదే. నిజానికి ఇప్పుడు ఎన్నో కెరీర్లు ఉన్నాయి. సైన్స్, కామర్స్, ఆర్ట్స్ అలాగే మెడిసిన్, ఇంజనీరింగ్.... ఇలా ఎటువైపు మొగ్గుచూపినా అందమైన భవిష్యత్తును నిర్మించుకోవచ్చు. ఉదాహరణకు ఇంగ్లీష్ చదివితే ఏమి వస్తుందన్న ప్రశ్నకు లెక్చరర్, ట్రాన్స్‌లేటర్ కావచ్చన్నది ఒకప్పటి సమాధానం. కార్పొరేట్ ట్రైనర్ మొదలుకుని కంటెంట్ రైటింగ్ ఉనికిలోకి వచ్చిన తరవాత ఇంగ్లీష్ స్వరూప స్వభావమే మారింది. చివరాఖరుకు సినిమాలకు అడుగున ఆంగ్లంలోకి డైలాగ్స్‌ను అనువదించడం కూడా ఒక వృత్తిగా నేడు మారింది. ఏ సబ్జెక్టు తీసుకున్నా వృత్తిలో ఇమిడిపోగలిగే, నిలదొక్కుకోగలిగే విధమైన కెరీర్లు కుప్పలు తెప్పలుగా నేడు ఉన్నాయి. అలాగే కొన్ని వృత్తుల్లో చేరిన మొదటి నెలలోనే అధిక ఆదాయం ఉండదు. ఉదాహరణకు డాక్టర్ కాగానే, లాయర్ అవ్వగానే లక్షలు రావు. అనుభవం మాత్రమే అధిక ఆర్జనకు, ఆ వృత్తిలో నిలదొక్కుకునేందుకు వీలు కల్పిస్తాయి. ఏయే విభాగాల వారికి ఎలాంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయో అవగాహన ఏర్పడితే చాలు. ఈ రోజుల్లో వివరాలు తెలుసుకోవడం సులువు. అదనపు సమాచారం కోసం ఇంటర్నెట్‌లో వెతుక్కోవచ్చు. కోర్సుల ఎంపిక అనేది మున్ముందు జీవితాన్ని నిర్ణయించేది. అందుకే ఆచి తూచి అడుగు వేయాలి. ఎంపిక చేసిన కొన్ని కాలేజీలను మాత్రమే ఇక్కడ ప్రస్తావించాం.

సివిల్ ఏవియేషన్

భారతదేశంలో పౌరవిమానయాన మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ ఏవియేషన్స్ అత్యున్నతమైన సంస్థ. ఇది దేశంలోని ఎయిర్‌పోర్టులకు సంబంధించిన చాలా వ్యవహారాలను పర్యవేక్షిస్తుంది. ఏరోనాటికల్ ఇంజనీరింగ్ చేసిన వారు కూడా ఈ రంగంలోకి వెళ్లవచ్చు. ఇందులో ప్రధానంగా టెక్నికల్ అండ్ ఇంజనీరింగ్ డివిజన్, కమర్షియల్ డివిజన్ ఉంటాయి. ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్, ఫిట్టింగ్ మొదలు ఎగిరే ప్రక్రియ వరకు ఇంజనీరింగ్ విభాగం పనే. కమర్షియల్ విభాగంలో కార్గో, ప్యాసింజర్ విమానాల సేవలు ఉంటాయి. పైలెట్ ట్రెయినింగ్‌ను ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు నిర్వహిస్తున్నాయి. వీటికి ఫీజు లక్షల్లో ఉంటుంది. ఎంట్రెన్స్ టెస్టులు, మెరిట్ ఆధారంగా ఇందులో చేర్చుకుంటారు. కంటిచూపు, ఫిజికల్ ఫిట్‌నెస్ చక్కగా ఉండాలి.

కమర్షియల్ ఏవియేషన్, ఎయిర్‌పోర్ట్, టెక్నికల్ అండ్ ఇంజనీరింగ్ డివిజన్, ఎయిర్ క్రాఫ్ట్ మాన్యుఫ్యాక్చరింగ్, కమర్షియల్ ఆపరేషన్ డివిజన్‌లో ఉద్యోగాలు ఉంటాయి. హోదాను బట్టి వీటిల్లో వేల రూపాయల నుంచి లక్షల రూపాయల వరకు నెల వేతనాలు లభిస్తాయి.



ఏవియేషన్ ఇండస్ట్రీ

మేథమెటిక్స్, ఫిజిక్స్‌తో ఇంటర్ పూర్తి చేసినవారు ఏరోనాటికల్ ఇంజనీరింగ్, సంబంధిత ఉద్యోగాలు చేయవచ్చు. సైన్సేతర రంగాలకు చెందిన విద్యార్థులు కమర్షియల్ ఏవియేషన్‌లోని క్యాబిన్ క్రూ, గ్రౌండ్ డ్యూటీ ఉద్యోగాలు ఎంచుకోవచ్చు. క్యాబిన్ క్రూ విషయంలో కొంత ఎగ్జయిట్‌మెంట్ ఉంటుంది. వివిధ దేశాలు తిరగడం, భిన్నమైన వ్యక్తులను కలుసుకోవడం వీరి ఉద్యోగంలో భాగం.

ఏవియేషన్ కోర్సులను అందిస్తున్న కొన్ని సంస్థలు

- Central training establishment, Hyderabad.
- Global institute, B-1/637, 1st Flr, Janakpuri, Delhi - 110058
- Indian aviation academy, Office 7& 8, Rushabh Complex, Oshiwar Link Road, Andheri West, Mumbai - 400053.
- Aptima air hostess academy, Block-J, Rajouri garden, New Delhi- 110027

Colleges, Institutions and Universities

Some of the institutes offering aviation courses are as follows.

- Indian Institute of Aeronautics, Delhi.
- Bharat institute of aeronautics, Patna.
- institute of aeronautics & Engineering, Bhopal.
- Flytech Aviation, PlotNo:24, Arunodaya Building, Paigah Colony, S.P Road, Secunderabad, Hyderabad-500006, Telangana, INDIA. Tel: (91)-040-66200000
- Avalon aviation academy, aptech house, A/65, MIDC, Andheri (E), Mumbai- 400 093.
- There are multiple Aviation centres in Mumbai itself.
- Bombay university or Mumbai university now offers a 3 year B.Sc course in aviation. The course is being conducted by the institute of aviation and aviation safety (IAAS), an educational wing of the Mumbai based federation of Indian pilots. This course also trains students to be pilots and thus also offers commercial pilot's licenses (CPL) if one wishes to become a pilot.

సైన్స్ విద్యార్థుల కోసం

టెన్త్, ఇంటర్ తరవాత

What Next



సైన్స్ గ్రూపులు

మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బోటనీ, స్టాటిస్టిక్స్ మొదలైన సబ్జెక్టులతో అవకాశాలు

ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ (జనరల్)
- మర్చంట్ నేవీ (సైన్స్ వారికి మాత్రమే)
- నేషనల్ డిఫెన్స్ అకాడమీ
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ
- ఫ్యాషన్ డిజైన్
- బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ స్టడీస్
- లా (ఐదు సంవత్సరాల కోర్సు)
- ఫారిన్ లాంగ్వేజెస్ (ఐదు సంవత్సరాల కోర్సు)
- ఫిల్మ్, ఇంటీరియర్ డిజైనింగ్

బైపీసీ
- అగ్రికల్చర్ సైన్సెస్ (వెటర్నరీ/డైరీ సైన్స్/హ్యూమన్ బయాలజీ
- ఉపాధినిచ్చే కోర్సులు
- పోస్ట్‌గ్రాడ్యుయేషన్
- బయోటెక్, జెనెటిక్స్
- రీసెర్చ్/టీచింగ్

బైపీసీ

ఎంపీసీ
- ఇంజనీరింగ్: సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానికల్, కంప్యూటర్, మెటలర్జీ, ప్రొడక్షన్, మెరైన్, లెదర్, సిరామిక్, ప్లాస్టిక్, ప్యాకేజింగ్ టెక్నాలజీ
- టెక్నికల్ డిప్లొమాలు
- ఆర్కిటెక్చర్
- బీఫార్మసీ

మెడిసిన్
- బీడీఎస్, ఆయుర్వేద, ఎండీఎస్
- ఎంబీబీఎస్ (పోస్ట్ గ్రాడ్యుయేట్ స్పెషలైజేషన్) భారతదేశంలో 2, 3 సంవత్సరాలు, విదేశాల్లో అయితే 5 సంవత్సరాలు
- హోమియోపతి

పారా మెడికల్
- ఫిజియోథెరపీ,
- ఆక్యుపేషనల్ థెరపీ
- స్పీచ్ థెరపీ
- ల్యాబ్ టెక్నాలజీ
- నర్సింగ్

బీఎస్సీ
- హోమ్ సైన్స్, హోమ్ ఎకనామిక్స్, హ్యూమన్ బయాలజీ, ఎన్విరాన్‌మెంట్
- ఎమ్మెస్సీ: చైల్డ్ డెవలప్‌మెంట్, న్యూట్రిషన్

షిప్పింగ్ ఇండస్ట్రీ



కనీసం 60 శాతం మార్కులతో ఫిజిక్స్, మేథమెటిక్స్‌తో ఇంటర్ పూర్తిచేసిన వారు షిప్పింగ్, మర్చంట్ నేవీకి సంబంధించిన కోర్సుల్లో చేరవచ్చు. ఎంట్రెన్స్ టెస్టులు, మెరిట్ ఆధారంగా ఇందులో చేర్చుకుంటారు. ఇందులో డిగ్రీ, డిప్లొమా కోర్సులు ఉంటాయి. కంటి చూపు, ఫిజికల్ ఫిట్‌నెస్ చక్కగా ఉండాలి. ప్రధానంగా రెండు రకాల కోర్సులు ఉంటాయి.

- షిప్పింగ్
- మర్చంట్ నేవీ

కంప్యూటర్ & ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ

కంప్యూటర్ సంబంధిత కోర్సుల్లో చేరాలనుకుంటే డిగ్రీ స్థాయిలో బిసిఏ ఉండేది. అయితే ఇంజనీరింగ్, ఎంసిఏ కోర్సుల్లో సీట్లు పెరిగిన తరవాత బిసిఏకు తెలుగు రాష్ట్రాల్లో ఆదరణ తగ్గింది. అలాగే ఇంటర్‌లో మేథ్స్ చదివి, డిగ్రీ పూర్తిచేసినవారు మాత్రం ఎంసిఏ కోర్సుల్లో చేరవచ్చు. ఏ సబ్జెక్టులతోనైనా డిగ్రీ అర్హతతో పెద్ద సంస్థల్లో కంప్యూటర్ లాంగ్వేజెస్ నేర్చుకుని సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్‌గా, హార్డ్‌వేర్ ప్రొఫెషనల్స్‌గా స్థిరపడుతున్నారు. ఎంబిఏకు తోడు సాఫ్ట్‌వేర్‌పై మంచి అవగాహన ఉన్నవారు సాఫ్ట్‌వేర్ మార్కెటింగ్ కూడా చేస్తున్నారు. మొత్తం ఇంజనీరింగ్ కోర్సులకున్న అవకాశాలతో సమానంగా ఐటీ ఉద్యోగాలు లభిస్తున్నాయి. బీఈ/బీటెక్‌లో మొదట సీఎస్ఈ మాత్రమే ఉండేది. కాలక్రమంలో పలు ఆప్షన్స్ అందులోనూ వచ్చాయి. ఏఐ, మెషీన్ లెర్నింగ్, ఐఓటీ, క్లౌడ్, బ్లాక్‌చెయిన్.. ఇలా పలు విభాగాలు ఆవిర్భవించాయి. ఇవన్నీ కలిసి, వేర్వేరుగా ఒక కోర్సుగా రూపొందాయి.

ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ

మేథ్స్‌తో ఇంటర్ తరవాత ఇంజనీరింగ్‌లో చేరవచ్చు. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ సహా పలు ఇంజనీరింగ్ కోర్సులను అందిస్తున్నాయి. అవి చేసి ఇంజనీరింగ్ టెక్నీషియన్, ఎలక్ట్రానిక్ అండ్ టెలీకమ్యూనికేషన్ ఇంజనీర్, అగ్రికల్చరల్ ఇంజనీర్, మైనింగ్ అండ్ పెట్రోలియం ఇంజనీర్, ప్లాస్టిక్ అండ్ రబ్బర్ టెక్నాలజిస్ట్, సిరామిక్ టెక్నాలజిస్ట్, టెక్స్‌టైల్ టెక్నాలజిస్ట్, ప్యాకేజింగ్ టెక్నాలజిస్ట్, లెదర్ టెక్నాలజిస్ట్‌లు కావచ్చు.

మెరైన్ ఇంజనీరింగ్

ఇంజనీరింగ్ బ్రాంచ్‌ల్లో మెరైన్ ఇంజనీరింగ్ కూడా ప్రత్యేకమైనది. సైన్స్ సబ్జెక్టులతో ఇంటర్ పూర్తి చేసినవారు ఈ రంగంలోకి వెళ్లడానికి అర్హులు. ఐఐటీల్లో సీటు రావాలంటే జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకు తెచ్చుకోవాల్సిందే. ప్రైవేటు రంగం విస్తృతం అవుతున్న ఈ రోజుల్లో దీనికి మంచి భవిష్యత్తు ఉంటుందనడంలో ఎలాంటి అనుమానం లేదు.

ఐఐటీలు కాకుండా మెరైన్ ఇంజనీరింగ్‌ను అందిస్తున్న కాలేజీలు

List of marine engineering colleges

- T.S. Chanakya, karaus, New Mumbai - 400 706
- Haldia Institute of Maritime Studies And Research ICARE Complex, Marine Campus, P.O. Hatiberia, Haldia Dist. Purba Medinipur, PIN – 721657, West Bengal. Phone Nos: 03224 267501 / 267502
- RL Institute of Nautical Science, T.V.R Nagar Aruppukottai Road Elliyerpatti, Madurai, Tamil Nadu 6250224. Phone: 0452 391 8614
- Marine Engineering Research Institute, P-19, Taratolla Rd, Kolkata - 700088, Ph:033 2401 4675.
- Marine Engineering & Research Institute, Hay Bunder Road, Mumbai - 400033
- Lal Bahadur Shastri College of Advanced Maritime Studies & Research, Hay Bunder Road, Mumbai, Maharashtra 400033. Ph: 022 2371 9931



- The Calcutta Technical School, 110 SN Banerjee Road, Kolkatta - 700013
- Andhra University College of Engineering- Visakhapatnam, Andhra pradesh
- White Shark Marine Institute-New Delhi, Delhi
- Gujarat Technological University-Ahmedabad, Gujarat
- Praveenya Institute Of Marine Engineering - Vizianagaram, Andhra pradesh
- Institute Of Technology And Marine Engineering-24 Parganas (south), West Bengal
- Coimbatore Marine College - Coimbatore, TamilNadu - International Maritime Institute, Delhi
- Maharashtra Academy of Naval Education & Training, Pune
- Institute of Technology &Marine Engineering, Kolkata
- Indian Meritime University, Chennai
- Academy of Maritime Education & Training, Chennai
- BP Marine Academy, Navi Mumbai
- TS Rahaman, Mumbai
- Tolani Maritime Institute, Pune
- Samundra Institute if Maritime, Mumbai
- Karnatak University
- Annamalai University
- Mangalore University
- University of Chennai
- Berhampur University

(మిగిలిన వివరాలు రేపటి పేజీలో)

లిటిల్స్



అసూయ గాడిద

ఒక కుండలు చేసేవాడు ఉండేవాడు. పేరు రంగయ్య. కుండలు చేసేప్పుడు పాటలు పాడేవాడు. ఆ రాగాలు బావుండేవి. అతని దగ్గర కుక్క, గాడిద ఉండేది. రెండింటినీ ప్రేమతో చూసుకునేవాడు. అతని పాటలకు ఆ రెండు జంతువులూ తలలూపేవి. అంత బావుండేది అతని పాట.


కుండలు తయారవ్వగానే గాడిద మీద యజమాని దగ్గరలోని సంతకు తీసుకెళ్లేవాడు. అయితే వచ్చాక పట్టించుకునేవాడు కాదు. దీంతో గాడిదకు కోపం. పైగా తన యజమాని ముందునుంచి పక్షపాత ధోరణి అనుకుండేది. అనుకుండేది కాదు.. తన నిర్ణయం. తన కంటే కుక్కను బాగా చూసుకునేవాడు. దానికి పెరుగన్నం పెట్టేవాడు. దాని తల మీద నిమిరేవాడు. ఈ సంఘటన చూసినప్పుడల్లా గాడిద ఖుళ్లుకునేది. అసూయపడేది. నేను తక్కువ పనేమీ చేయలేదు కదా.. ఈ కష్టం ఎవరూ చేయలేరు. అలాంటిది నన్ను ఈ యజమాని చూసుకోవటం ఇబ్బందిగా ఉంటాడే? అనుకుంది.

గాడిద కొన్నాళ్లు కుక్క వాలకం అంటే.. కుక్క తోక తిప్పటం, చిన్నగా అరవటం చేసేది. యజమాని మీద ప్రేమ ఉన్నట్లు చేసేది. ఈ కుక్కకే ఇంత లౌక్యం ఉంటే ఇంత భారీ శరీరం ఉండే నాకు మెదడు లేదా? అనుకుంది గాడిద. ఒకసారి తన యజమాని పక్క ఊరుకు వెళ్లాడు. అక్కడ పనులు చూసుకుని ఆలస్యంగా వచ్చాడు. కుక్క కంటే ముందు గాడిద వెళ్లింది. తన రెండు కాళ్లు ఎత్తి యజమాని మీద పెట్టబోయింది. యజమాని భయపడిపోయాడు. ఈ గాడిద ఏంటీ? పిచ్చెక్కిందా? అనుకుంటూ పెద్ద కర్రతో గట్టిగా బాదాడు. దాని నడుము మీద దెబ్బలు పడటంతో గాడిద మంటతో అల్లాడిపోయింది.

ఇది నన్ను గట్టిగా తన్నాలనుకుంది. నా గుండెలమీద పడి ఉంటే ఈ పాటికి చచ్చేవాన్ని. దేన్ని ఎలా ఉంచాలో నాకు తెలుసు. ఈ గాడిదను ఇలా తిరగకుండా గొలుసుతో చెట్టుకు కట్టేయండి దూరంగా. ఎండయినా, చలి అయినా దానికి అదే గతి అన్నాడు. తన ప్రేమను పట్టించుకోని యజమాని కంటే.. కుక్క మీద ఆ యజమానికి గల ప్రేమను చూసి గాడిద కుళ్లకునేది. ఆ తర్వాత అలానే అసూయ ఉండిపోయింది.




సరైన నీడ ఏది?



6 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 307

						9		
5			7	6			8	4
			2		5		1	6
				5		4		
		7	3		6	5		
		8		2				
6	4		9		3			
8	3			4	2			7
		2						

సుడోకు - 306 సమాధానం

5	6	7	4	8	9	1	2	3
8	4	1	2	3	7	9	6	5
2	9	3	5	6	1	4	7	8
3	5	2	6	9	4	7	8	1
9	7	8	1	5	3	2	4	6
6	1	4	8	7	2	5	3	9
7	2	6	3	1	5	8	9	4
1	3	9	7	4	8	6	5	2
4	8	5	9	2	6	3	1	7

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.